అమరవీరులకు అరుణాంజలి
రూ॥ 220/-
పేజీలు: 230

నవచేతన పబ్లిషింగ్ హౌస్
ప్రతులకు:
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ(నాగోల్),
హైదరాబాద్-68, ఫోన్: 29884454/53
Email ID: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
అబిడ్స్, బండ్లగూడ,
హిమాయత్‌నగర్ (హైదరాబాద్)
హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★


ఆపరేషన్ సిందూర్‌పై భారత ప్రభుత్వ విఫల దౌత్యం

కమ్యూనిస్టు ఉద్యమానికి అంకితమైన కామ్రేడ్ సుగుణ

ఇరాన్ యురేనియం శుద్ధి యంత్రాలు, హెలికాప్టర్లు ధ్వంసం


సంపుటి 08, సంచిక: 199 | గురువారం | 19 -06-2025 | మహబూబ్‌నగర్ Published from: Mahabubnagar, Hyderabad, Khammam, Karimnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00




'ఎపి సిఎం చంద్రబాబు నాయుడుకు సూచన చేస్తున్నా... కేంద్రంలో పలుకుబడి ఉందని ప్రాజెక్టులు పూర్తవుతాయనుకుంటే మీ భ్రమ. తెలంగాణ రాష్ట్ర ప్రయోజ-నాలు కాపాడుకునేందుకు మా ప్రణాళిక మాకుంది. చంద్రబాబు, కెసిఆర్ చెప్పారని కాదు. గోదావరి బేసిన్‌లో 3వేల టిఎంసిలు మిగులు జలాలు ఉన్నాయని మీరు నమ్మితే 968 టిఎంసిలు వాడుకునేందుకు తెలంగాణకు సంపూర్ణ అనుమతులు ఇచ్చాకే మీరు మిగులు జలాలు తీసుకోండి'

– సిఎం రేవంత్‌రెడ్డి

# బనకచర్లకు కెసిఆరే కారణం

## వృథాగా 3వేల టిఎంసిలు గోదావరి నీరు సముద్రంలో కలుస్తాయ్ అన్నందునే ఆ ప్రాజెక్టు పుట్టుకొచ్చింది

- మోదీ అనుమతి తెచ్చుకున్నా చంద్రబాబు కట్టలేడు
- ప్రాజెక్టును అడ్డుకునేందుకు రాజకీయ, న్యాయ పోరాటం చేస్తాం
- పార్టీలకు అతీతంగా అందరూ కలిసి రావాలని విజ్ఞప్తి

ప్రజాపక్షం/ హైదరాబాద్

"2019 అక్టోబరులో అప్పటి తెలంగాణ సిఎం కెసిఆర్, ఎపి జగన్ కలిసి గోదావరి జలాలను రాయలసీమకు తరలించడంపై చర్చించుకున్నారు. తెలంగాణ ప్రయోజనాలకు వ్యతిరేకంగా గోదావరి బనకచర్ల ప్రాజెక్టుకు ఆనాడే అంకురార్పణ జరిగింది. తెలంగాణకు కృష్ణాలో 299 టిఎంసిలు సరిపోతాయని ఆనాడు కెసిఆర్ ఒప్పుకుని సంతకం చేశారు. ఆనాడు కెసిఆర్ చేసిన సంతకం నేడు తెలంగాణకు ప్రతిబంధకంగా మారింది. మాజీ సిఎం కెసిఆర్ తెలంగాణకు చేసిన తీరని ద్రోహం వల్లే ఎపికి నీళ్లు వెళుతున్నాయి. ఈ పాపానికి కారకుడు హరీష్‌రావు, అప్పటి సిఎం కెసిఆరే. పాపాల భైరవులు వారిద్దరే. కాంట్రాక్టర్ పెట్టిన సమావేశంలో కమీషన్లకు కక్కుర్తి పడి హరీష్‌రావు, కెసిఆర్ కుట్రలు చేశారు. ఇప్పుడు వారు అధికారంలో లేరని ఆ బురదను కాంగ్రెస్ పభుత్వంపై చల్లాలని చూస్తున్నారు. శిక్షించాల్సి వస్తే కెసిఆర్‌నే శిక్షించాలి. కెసిఆర్‌ను ఉరి తీయాలి" అని తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. గోదావరిబనకచర్ల ప్రాజెక్టు విషయంపై అఖిలపక్ష ఎంపిలతో సమావేశం అనంతరం సిఎం మీడియాతో మాట్లాడారు. బనకచర్లను అడ్డుకునేందుకు రాజకీయాలకు అతీతంగా కలిసిరావాలని అఖిలపక్ష నేతలకు విజ్ఞప్తి చేశారు. 'రాజకీయాలు ఎలా ఉన్నా రైతుల విషయంలో రాజీ పడేదిలేదు. బనకచర్ల వ్యవహారంపై ఏ విధంగా ముందుకెళ్లాలనే అంశంపై విపక్షాలతో చర్చించాం. తెలంగాణకు గోదావరి, కృష్ణా నదులే జీవనాధారం. ఈ ప్రభుత్వానికి రైతుల ప్రయోజనాలే ముఖ్యం. గోదావరి బనకచర్లను వ్యతిరేకిస్తూ తీర్మానం చేసి కేంద్రానికి పంపాలని నిర్ణయించాం. అన్ని పార్టీలను కలుపుకుని పోరాడుతాం. గోదావరి బనకచర్లపై అవసరమైతే తరువాయి 2లో

## 2016లోనే ఆ ఆలోచన పుట్టింది..

గోదావరికి సంబంధించి 3 వేల టిఎంసిల వరద జలాలు సముద్రంలో కలుస్తున్నాయంటూ ఆనాటి ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు కనిపెట్టారని, 2016 సెప్టెంబర్ 21లో జరిగిన అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో ప్రతిపాదించడంతోనే బనకచర్ల ప్రాజెక్టు అనే ఆలోచన పుట్టిందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. తమ స్వార్థ రాజకీయ ప్రయోజనాలకు కోసం తెలంగాణను పణంగా పెట్టిన కెసిఆర్, ఇప్పుడు బనక చర్ల ప్రాజెక్టు వల్ల రాష్ట్రానికీ అన్యాయం జరుగుతోందంటూ తమపై బురద జల్లుతున్నారని అఖిలపక్ష సమావేశానికి సిఎం వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి రైతుల ప్రయోజనాలే ముఖ్యం అని, సాగునీటి అంశంలో రాష్ట్రానికి ఎలాంటి నష్టం జరగనివ్వబోమన్నారు. బనకచర్లను అడ్డుకొని తీరుతామని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఇందుకు రాజకీయాలకు అతీతంగా అందరూ కలిసి రావాలని ఎంపిలకు సిఎం విజ్ఞప్తి చేశారు.

**రాజకీయ లబ్ధికి కాంగ్రెస్ యత్నం : రవిచంద్ర వాకౌట్**

ఇదేక్రమంలో బనక చర్ల ప్రాజెక్టు అంశానికీ సంబంధించి అప్పటి అపెక్స్ కమిటీ మినిట్స్‌ను సిఎం రేవంత్‌రెడ్డి వివరిస్తుండగా బిఆర్ఎస్ రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర జోక్యం చేసుకుని అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో సిఎం స్పందిస్తూ తాను ఎవరినీ కించపర్చేవిధంగా మాట్లాడడం లేదని, ఆనాటి అపెక్స్ కమిటీ సమావేశం మినిట్స్‌ను మాత్రమే ఉటంకిస్తున్నానని పేర్కొన్నారు. ఈ సమావేశాన్ని రాజకీయ లబ్ధి కోసం వాడుకుంటున్నారని రవిచంద్ర సమావేశం నుంచి వాకౌట్ చేశారు. వాస్తవాలు బయటికి రావడంతో రవిచంద్రకు ఇబ్బంది కలిగి ఉంటుందని, అందుకే ఆయన వెళ్లిపోయారని సిఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు.



భారత్–పాకిస్థాన్ మధ్య

## మధ్యవర్తి జోక్యం లేకుండా సైనికచర్య ఆపేశాం

- కశ్మీరు సమస్యపై మూడోపక్షం జోక్యం ఒప్పుకోం
- ఈ పరిణామాల్లో ఎక్కడా వాణిజ్య ప్రసక్తి రాలేదు
- ఫోన్ సంభాషణలో ట్రంప్‌కు స్పష్టం చేసిన ప్రధాని నరేంద్ర మోదీ
- ట్రంప్ మళ్లీ అదే పాట

**కననిస్కిస్ :** ఆపరేషన్ సింధూర్ తర్వాత భారత్–పాకిస్థాన్ దేశాలు నాలుగురోజులపాటు జరిగిన సైనిక చర్యలను మధ్యవర్తిజోక్యం లేకుండా ముఖాముఖీ సంప్రదింపుల ద్వారానే స్తంభింపజేశాయని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌కు భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీ స్పష్టం చేశారు. అదేవిధంగా కశ్మీర సమస్య విషయంలో భారత్–పాకిస్థాన్ మధ్య తృతీయపక్షం జోక్యాన్ని అంగీకరించబోమని ట్రంప్‌కు మోదీ స్పష్టం చేశారు. పాకిస్థాన్‌తో ఈ సమస్యను ద్వైపాక్షికంగా ముఖాముఖీగా పరిష్కరించుకోవడానికే భారత్ మొదటినుండీ కట్టుబడి ఉందని తెలియజేశారు. కెనడా ప్రధానమంత్రి మార్క్ కార్నీ ఆహ్వానం మేరకు జి–7 సదస్సులో పాల్గొనేందుకు వెళ్ళిన నరేంద్రమోదీ మంగళవారంనాడు ట్రంప్‌తో దాదాపు 35 నిమిషాలపాటు ఫోన్ సంభాసణ చేశారు. మధ్యప్రాచ్య పరిణామాల నేపథ్యంలో జాతీయ భద్రతామండలి సమావేశంలో పాల్గొనేందుకు ఒకరోజు ముందుగానే ట్రంప్ కననిస్కిస్ నుండి అమెరికాకు వెళ్ళిపోయారు. దీంతో మోదీ–ట్రంప్ ముఖాముఖీ కలుసుకుని చర్చించుకునే అవకాశం లేకపోయింది. ఈ కారణంగా తర్వాత మోదీ ఆయనతో ఫోన్ సంభాషణ చేశారని భారత విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రి బుధవారంనాడు ఒక ప్రకటనలో తెలియజేశారు. మే 7–10 తేదీలలో పాకిస్థాన్–భారత్ మధ్య జరిగిన పరిణామాలే వారిద్దరిమధ్య తరువాయి 12లో

# గోదావరి–బనకచర్లతో రాష్ట్రానికి పెద్ద దెబ్బ



- ఎపి ప్రభుత్వం రాష్ట్ర పునర్విభజన చట్టాన్ని ఉల్లంఘిస్తోంది
- బనకచర్లపై పూర్తిస్థాయి నివేదికను కేంద్ర ప్రభుత్వానికి సమర్పిస్తాం

**నేడు ఢిల్లీలో కేంద్ర జలశక్తి మంత్రిని ముఖ్యమంత్రి, నేను కలుస్తాం**

- అఖిలపక్ష సమావేశంలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి
- హాజరైన కాంగ్రెస్, బిజెపి, ఎంఐఎం, బిఆర్ఎస్ ఎంపిలు

బనకచర్ల ప్రాజెక్ట్‌కు సంబంధించి తెలంగాణ రాష్ట్రం తరపున పూర్తి స్థాయి నివేదికను కేంద్ర ప్రభుత్వానికి సమర్పిస్తున్నామని నీటి పారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్ రెడ్డి తెలిపారు. సిఎం, తాను గురువారం ఢిల్లీకి వెళ్లి, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరపున అభ్యంతరాలను వ్యక్తం చేస్తామన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్మించనున్న 'గోదావరి–బనకచర్ల ప్రాజెక్టు'పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో హైదరాబాద్‌లోని సచివాలయంలో బుధవారం అఖిలపక్ష ఎంపిలతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి గోదావరి–బనకచర్ల ప్రాజెక్ట్‌కు సంబంధించిన విషయంలో ప్రభుత్వ పరంగా తీసుకున్న చర్యలు, తాజా పరిస్థితులను ఎంపిలకు వివరించారు. ఈ సమావేశానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, బిజెపి ఎంపిలు డి.కె.అరుణ, రఘునందన్‌రావు, ఎంఐఎం ఎంపి అసదుద్దీన్ ఒవైసి, బిఆర్ఎస్ ఎంపి వద్దీరాజు రవిచంద్ర, కాంగ్రెస్ ఎంపిలు మల్లురవి, రేణుకాచౌదరి, రఘువీరారెడ్డి, బలరామ్‌నాయక్, రఘురాంరెడ్డి, కిరణ్‌రెడ్డి, అనిల్ కుమార్ యాదవ్, సురేష్ షట్కర్‌తో పాటు నీటిపారుదల శాఖ అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా గోదావరి నది ఎక్కడ ప్రారంభమైతుందని..?, ప్రాజెక్టులు, వాటి సమగ్ర వివరాలు తదితర అంశాలపైన గోదావరి రివర్ బేసిన్ డిప్యూటీ డైరక్టర్ సుబ్రమణ్య ప్రసాద్ తరువాయి 2లో

కెసిఆర్ దత్తత గ్రామ బాధితులకు

## ప్రభుత్వం అండగా నిలుస్తుంది

మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి



03

నీటి ప్రాజెక్టులపై

## త్వరలోనే బిఆర్ఎస్ కీలక సమావేశం

- బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్
- కాళేశ్వరంపై ప్రభుత్వం చూపుతున్న అలసత్వంతో రాష్ట్రానికి తీరని నష్టం
- ఉద్యమ కార్యాచరణకు ప్రణాళికను సిద్ధం చేస్తున్నామని వెల్లడి



ప్రజాపక్షం/హైదరాబాద్

సాగు నీటి ప్రాజెక్టుల నిర్మాణం, నిర్వహణ అంశంలో రాష్ట్ర ప్రభుత్వ నేరపూరిత నిర్లక్ష్యంపై చర్చించేందుకు బిఆర్ఎస్ అధ్యక్షులు కెసిఆర్ సారథ్యంలో త్వరలోనే కీలక సమావేశాన్ని ఏర్పాటు చేయబోతున్నామని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు తెలిపారు. బిఆర్ఎస్ ముఖ్య నాయకులు హాజరయ్యే ఈ ఉన్నతస్థాయి సమావేశంలో సాగునీటి ప్రాజెక్టుల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న అలసత్వం, రైతు వ్యతిరేక వైఖరిపై తదితర అంశాలపైన ప్రధానంగా చర్చిస్తామని కెటిఆర్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బిఆర్ఎస్ హయాంలో 90 శాతం పూర్తయిన పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని పక్కన బెట్టడంతో పాటు 2 పిల్లర్లు కృంగిన సాకుతో మొత్తం కాళేశ్వరం తరువాయి 2లో

# డిజిటల్ భద్రతే జిఎస్ఇసి లక్ష్యం

- గూగుల్ ఒక ఇన్నోవేటివ్ కంపెనీ, మా ప్రభుత్వం కూడా ఇన్నోవేటివ్‌గానే పనిచేస్తుంది
- పెట్టుబడులకు తెలంగాణ గమ్యస్థానం
- 2047 నాటికి రాష్ట్రాన్ని వన్ ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా చేస్తాం
- జిఎస్ఇసి ప్రారంభోత్సవ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



ప్రజాపక్షం/హైదరాబాద్

ప్రపంచం వేగంగా డిజిటల్ యుగం వైపు పయనిస్తోందని, ఈ నేపథ్యంలో డిజిటల్ సమాచార భద్రతను పెంపొందించే లక్ష్యంగా "గూగుల్ సేఫ్టీ ఇంజనీరింగ్ సెంటర్ (జిఎస్ఇసి)" హైదరాబాద్‌లో ఏర్పాటు కావడం సంతోషంగా ఉందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. హైదరాబాద్ నానక్ రామ్‌గూడలో గూగుల్ సంస్థ ఏర్పాటు చేసిన గూగుల్ సేఫ్టీ ఇంజనీరింగ్ సంస్థ (ప్రపంచంలోనే నాలుగవది)ను ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతో కలిసి బుధవారం రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ.. ప్రజల డిజిటల్ సమాచారం సురక్షితంగా ఉన్నప్పుడే వారు క్షేమంగా ఉన్నట్లు భావించాలని ఆయన అభిప్రాయపడ్డారు. 'గూగుల్ ఒక ఇన్నోవేటివ్ కంపెనీ, మా ప్రభుత్వం కూడా ఇన్నోవేటివ్‌గానే తరువాయి 2లో

రాష్ట్రాభివృద్ధికి

# విద్యుత్ సరఫరా కీలకం

- అన్నివర్గాలకు నిరంతరం విద్యుత్ అందించేందుకు పకడ్బందీ చర్యలు
- ప్రజాప్రభుత్వం ఏర్పడిన తర్వాత విద్యుత్ శాఖలో పారదర్శకత తీసుకువచ్చాం
- 20 వేల మెగావాట్ల పునరుత్పాదక విద్యుత్తు ఉత్పత్తే లక్ష్యంగా పెట్టుకున్నాం
- విద్యుత్ అంబులెన్స్, హెల్త్ క్యాంపును ప్రారంభించిన ఉప ముఖ్యమంత్రి భట్టి, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్

రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు నాణ్యమైన నిరంతరాయ విద్యుత్ సరఫరాకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ఇంధన శాఖ మంత్రి మల్లు భట్టివిక్రమార్క తెలిపారు. బుధవారం ఆయన ఖమ్మం ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, టిజిఎన్‌పిడిసిఎల్ సిఎండి కె. వరుణ్‌రెడ్డిలతో కలిసి విద్యుత్ అంబులెన్స్ లను ఆవిష్కరించారు. విద్యుత్ తరువాయి 2లో

# 3 నెలల్లో అమలు చేయకపోతే జైలుకే

## ఇద్దరు అధికారులపై హైకోర్టు తీర్పు


ప్రజాపక్షం/హైదరాబాద్



మూసీని సుందరీకరణ, అభివృద్ధి చేయాలనే ప్రయత్నంలో భాగంగా ప్రభుత్వం సేకరించిన భూమికి పరిహారంగా స్థలాన్ని కేటాయించి రిజిస్ట్రేషన్ చేయని ఇద్దరు అధికారులకు హైకోర్టు షరతులతో కూడిన జైలు శిక్ష విధించింది. సేకరించిన భూమికి ప్రత్యామ్నాయంగా యజమానికి మూడు నెలల్లో ప్లాటు రిజిస్ట్రేషన్ చేసి అప్పగించాలని తీర్పు చెప్పింది. ఈ ఉత్తర్వులను అమలు చేయకపోతే 2 వారాల జైలు శిక్షతో పాటు రూ.వెయ్యి జరిమానా చెల్లించాలంది. జరిమానా చెల్లించనిపక్షంలో మరో వారం జైలు శిక్ష గడపాలంది. ఈ మేరకు మున్సిపల్ శాఖ కార్యదర్శిగా, హెచ్ఎండీఏ కమిషనర్‌గా చేసిన అరవింద్ కుమార్, హెచ్ఎండీఏలో భూసేకరణ అధికారి ప్రసూనాంబలను ఆదేశిస్తూ జస్టిస్ సీవీ భాస్కర్ రెడ్డి తీర్పు చెప్పారు. 2016లో కేటాయించిన 666.67 చదరపు గజాల ప్లాటును రిజిస్ట్రేషన్ చేసి ఇస్తామని హామీ ఇచ్చి ఉల్లంఘించడంపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఉప్పల్‌భగాయత్‌లో మూసీ సుందరీకరణకు చేపట్టిన 99.13 ఎకరాల భూసేకరణలో భూమి కోల్పోయిన వారికి పరిహారంగా ఎకరానికి 1000 చదరపు గజాలు డెవలప్ చేసిన ప్లాటును కేటాయిస్తామని ప్రభుత్వం జీవో ఇచ్చిందని, దీని ప్రకారం భూమిని కోల్పోయిన పిటిషనర్‌కు రాంరెడ్డికి కేటాయించిన తరువాయి 2లో

# ఎపిలో ఎన్‌కౌంటర్

- ముగ్గురు మావోయిస్టులు మృతి
- ఎదురుకాల్పుల్లో మావోయిస్టు పార్టీ సెంట్రల్ జోన్ కమిటీ సభ్యుడు గాజర్ల రవి హతం



ప్రజాపక్షం/ఖమ్మం/జయశంకర్ భూపాలపల్లి


ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏలూరు రేంజ్ పరిధిలోని అల్లూరి జిల్లా మారేడు మిల్లి ప్రాంతంలో మంగళవారం పొద్దుపోయిన తర్వాత పోలీసులు, మావోయిస్టులకు మధ్య ఎదురు కాల్పులు జరిగాయి. ఈ కాల్పుల్లో ముగ్గురు మావోయిస్టులు మృతి చెందినట్లు పోలీసులు ధృవికరించారు. మావోయిస్టు పార్టీ స్పెషల్ జోన్ కమిటీ సభ్యులు గాజర్ల రవి, అరుణ మృతదేహాలను గుర్తించగా మరో మృతదేహాన్ని గుర్తించాల్సి ఉంది. గాజర్ల రవి అలియాస్ ఉదయ్, అలియాస్ గణేష్ తెలంగాణలోని భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం వెలిశాల గ్రామానికి చెందిన వాడు. ఇతను సెంట్రల్ కమిటీ సభ్యునిగా ఆంధ్రా, ఒడిశా బోర్డర్ (ఏవోబి) స్పెషల్ జోన్ సభ్యునిగా కొనసాగుతున్నాడు. ఇతనిపై రూ. 25 లక్షల రివార్డు ఉంది. మరో మృతురాలు లక్ష్మి చైతన్య అలియాస్ అరుణ తరువాయి 12లో

# లొంగిపోయే మనస్తత్వం కాదు

- ఇరాన్ సర్వాధినేత ఖమేనీ హెచ్చరిక
- ట్రంప్ బెదిరింపులకు భయపడబోనని స్పష్టీకరణ
- యుద్ధం మొదలైందని ప్రకటన




**జెనీవా :** ఇజ్రాయెల్ ప్రజలకు లొంగిపోయే బానిస మనస్తత్వం లేదని ఇరాన్ సర్వాధినేత ఆయెతుల్లా అలీ ఖమేనీ స్పష్టం చేశారు. లొంగిపోవాలని ట్రంప్ చేసిన డిమాండ్‌ను ఖమేనీ తిరస్కరించారు. యుద్ధం మొదలైందని ఖమేనీ బుధవారంనాడు ప్రకటించారు. శుక్రవారంనాడు ఇజ్రాయెల్ దాడులు చేయడానికి ముందుగా చివరిసారి ప్రపంచానికి కనిపించిన ఖమేనీ, ఆరు రోజుల యుద్ధం తర్వాత మొదటిసారి బుధవారంనాడు టెలివైజ్డ్ సందేశం ఇచ్చారు. ఖమేనీ సందేశాన్ని ప్రభుత్వ టీవీ యాంకర్ చదివి వినిపించారు. ఇరాన్ చరిత్ర తెలిసినవారెవరూ ఇలా లొంగిపొమ్మని అడగరు, ఎందుకంటే ఇలాంటి బెదిరింపు భాషలకు ఇరానీయులు లొంగేవారు కాదు అని ఖమేని ప్రకటించారు. బేషరతుగా లొంగిపోవాలని అమెరికా, ఇజ్రాయెల్ నాయకులు తీవ్ర హెచ్చరికలు చేస్తున్న తరుణంలో కొద్ది గంటల వ్యవధిలోనే ఖమేనీ టెలివిజన్ సందేశం వెలువడింది. అమెరికా, ఇజ్రాయెల్ రెండు దేశాలకూ ఖమేనీ టెలివిజన్ సందేశం ద్వారా తీవ్ర ప్రతి హెచ్చరిక జారీ చేశారు. ఇజ్రాయెల్‌తో చేతులు కలిపి తమపై, తమ అణుశుద్ధి కేంద్రాలపై సైనిక దాడులు చేస్తే ఇజ్రాయల్–అమెరికా రెండు దేశాలూ కోలుకోలేనంత దారుణంగా నష్టపోతాయని ఖమేనీ హెచ్చరించారు. ఇరాన్‌కు తరువాయి 12లో



# ప్రపంచం
WORLD NEWS

## మధ్యవర్తిత్వానికి పుతిన్ సంసిద్ధత



**మాస్కో :** ఇరాన్ –ఇజ్రాయెల్ మధ్య జరుగుతున్న యుద్ధాన్ని ఆపి ఒక పరిష్కారం సాధించేందుకు మధ్యవర్తిత్వం చేయడానికి రష్యా అధ్యక్షుడు వి.పుతిన్ సంసిద్ధత వ్యక్తం చేశారు. బుధవారంనాడు ఆయన ఈ విషయంపై యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ అధ్యక్షుడు మహ్మద్ బిన్ జాయేద్ అల్ నహ్యాన్‌తో టెలిఫోన్‌లో సంభాషించారు. రెండు దేశాలమధ్య జూన్ 13వ తేదీన యుద్ధం మొదలైంది. ఈ యుద్ధంలో అమెరికా మద్దతు కారణంగా ఇజ్రాయెల్ ఇప్పటివరకూ పైచేయి సాధిస్తూ వస్తోంది. ఇరాన్ కీలక అణుస్థావరాలపై ఉమ్మడి దాడులు చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్న తరుణంలో పుతిన్ తెర మీదకు వచ్చారు. ఈ విషయాన్ని అనేక దేశాల నాయకులకు ఫోన్ ద్వారా తెలియజేశారు. టెలిఫోన్ సంభాషణ సందర్భంగా అల్ నహ్యాన్, పుతిన్ ఇద్దరూ మధ్యప్రాచ్యంలో సంక్లిష్ట పరిణామాలపట్ల తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. దీనివల్ల యావత్ మధ్యప్రాచ్యంలో ప్రతికూల పరిణామాలు సంభవిస్తాయని, యుద్ధవాతావరణం విస్తరించి అభద్రత పెరుగుతుందని నాయకులిద్దరూ అభిప్రాయపడ్డారు.

## ఇరాన్ యురేనియం శుద్ధి యంత్రాలు,
# హెలికాప్టర్లు ధ్వంసం





### ఇజ్రాయెల్ దాడుల్లో 585 మంది మృతి
### 30 క్షిపణులతో ఇరాన్ దాడులు

**టెహ్రాన్ :** యుద్ధపరంగా, దౌత్యపరంగా మధ్యప్రాచ్యంలో పరిస్థితులు బుధవారంనాటికి సంక్లిష్టదశకు చేరుకున్నాయి. వరుసగా ఆరో రోజు కూడా ఇరాన్–ఇజ్రాయెల్ మధ్య దాడులు కొనసాగాయి. 30 క్షిపణులతో ఇజ్రాయెల్‌పై ఇరాన్ సైన్యం దాడులు చేసింది. టెహ్రాన్‌లో ఉన్న ఇరాన్ యురేనియం శుద్ధి యంత్రాంలపైనా, ఇరాన్ రీసెర్చ్ సెంటర్‌పైనా ఇజ్రాయెల్ దాడులు చేసిందని అంతర్జాతీయ అణుశక్తి సంస్థ (ఐఎఇఎ) ఒక ప్రకటన చేసింది. ఈ దాడులవల్ల ఇరాన్ అణుసామర్థ్యం తీవ్రంగా దెబ్బతిన్నదని ఐఎఇఎ తెలిపింది. బుధవారం తెల్లారుఝామునే భారీ బాంబుపేలుళ్ళతో టెహ్రాన్ దద్దరిల్లింది. అదేవిధంగా ఇరాన్‌కు చెందిన ఐదు యుద్ధ హెలికాప్టర్లను కూడా ఇజ్రాయెల్ ధ్వంసం చేసింది. ఎహెచ్–1 ఎటాక్ హెలికాప్టర్లను పశ్చిమ ఇరాన్‌లోని ఖెర్మన్‌షా ప్రాంతంలోని వైమానిక కేంద్రంలో ఉండగా ధ్వంసం చేసినట్లు పేర్కొంది. హెలికాప్టర్లనుధ్వంసం చేసిన బ్లాక్ అండ్ వైట్ వీడియోలను ఇజ్రాయెల్ ఐడిఎఫ్ విడుదల చేసింది. షా పరిపాలనాకాలంలో టెహ్రాన్ 200 బెల్ ఎహెచ్–1 సూపర్ కోబ్రా హెలికాప్టర్లను కొనుగోలు చేసింది. అప్పటి హెలికాప్టర్లు కొన్ని ఇంకా సర్వీసులో ఉన్నాయి. ఇరాన్‌పై అమెరికా ఆంక్షలు కొనసాగుతున్నందువల్ల ఇరాన్ ఎలాంటి ఆయుధాలను కొనుగోలు చేయలేని అశక్తతలో ఉంది. ఐతే దీనిపై ఇరాన్ వెంటనే ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదు. ఇదిలా ఉంటే, శాటిలైట్ ఇమేజస్‌ను క్షుణ్ణంగా పరిశీలించిన పాశ్చాత్య మీడియా బుధవారంనాడు ప్రకటించిన సమాచారం ప్రకారం, ఇజ్రాయెల్ దాడులలో తబ్రిజ్ క్షిపణి స్థావరం తీవ్రంగా ధ్వంసమైంది. ఈ స్థావరంలో ఉన్న తొమ్మిది భారీ భవంతులు నేలమట్టమయ్యాయి. రెండు సొరంగ మార్గాలు కూడా ప్రవేశించడానికి వీలులేనివిధంగా ధ్వంసమయ్యాయి. టెహ్రాన్‌కు 750 కి.మీ దూరంలో ఉన్న మెస్హాద్ విమానాశ్రయం కూడా ధ్వంసమైంది.

టెసా కరాజ్ వర్క్‌షాప్, టెహ్రాన్ రీసెర్చ్ సెంటర్‌లను ఇజ్రాయెల్ ధ్వంసం చేసింది. యురేనియం సెంట్రీఫ్యూగల్ కాంపొనెంట్స్‌ను తయారు చేసే రెండు భవంతులను ఇజ్రాయెల్ క్షిపణులు ధ్వంసం చేశాయి. ఫతా క్షిపణులతో ఇజ్రాయెల్‌పై ఇరాన్ ఎదురు దాడులు చేసింది. ఇరాన్ గగనతలాన్ని పూర్తిగా తన అధీనంలోకి తెచ్చుకున్న ఇజ్రాయెల్ తన దేశ గగనతలాన్ని కూడా పూర్తిస్థాయిలో పరిరక్షించుకునేందుకు చర్యలు తీసుకుంది. ఇరాన్ క్షిపణి వ్యవస్థల జాడ కనిపెట్టేందుకు ఇజ్రాయెల్ తన గగనతల రక్షణ వ్యవస్థను క్రియాశీలం చేసింది. ఇరాన్‌లోని కీలకమైన ఆయుధ ఉత్పత్తి కేంద్రాలపై, ఆయుధ సామాగ్రి తయారీ కేంద్రాలపైన దాడులు చేసి విధ్వంసం సృష్టించినట్లు ఇజ్రాయెల్ ప్రకటించింది. దాడులు చేసిన ఇజ్రాయెల్ సైన్యం విధ్వంసం సృష్టించింది. ఇజ్రాయెల్ చేసిన దాడుల్లో మొత్తం 585 మంది మరణించారనీ, వీరిలో 239 మంది పౌరులు ఉన్నారని వాషింగ్టన్ కేంద్రంగా పనిచేసే మానవహక్కుల కార్యకర్త చెప్పారు. 1300 మంది గాయపడ్డారని చెప్పారు. భూతలం నుండి దాడులు చేసిన ఇరాన్ గగనతలంలో తమ డ్రోన్లను కూల్చివేసిందని ఇజ్రాయెల్ ప్రకటించింది. ఇజ్రాయెల్‌కు చెందిన అనేక డ్రోన్లను తాము కూల్చివేసినట్లు ఇరాన్ ప్రకటించింది. మంగళవారంనాడు ఐదోరోజున రెండు దేశాల మధ్యా ఉద్ధృతస్థాయిలో పరస్పర సైనిక దాడులు కొనసాగిన నేపథ్యంలో ముందు ముందు కూడా పరిస్థితులు అదుపుతప్పి దారుణ మానవహింసకు దారితీస్తాయని అంచనావేస్తున్నారు.

ఇరాన్ మేజర్ రాడార్ వ్యవస్థకు నష్టం వాటిల్లిన విషయాన్ని ఆ దేశ అధికారులు అంగీకరించారు. ఐతే ప్రత్యామ్నాయ వ్యవస్థ వేరేచోట ఉందని మీడియా వెల్లడించింది. సొబాషి రాడార్ వ్యవస్థ కాబౌదరహంగ్ కౌంటీలోని హమెదన్ రాష్ట్రంలో చాలా ఎత్తైన ప్రాంతంలో ఉందని, ఇరాన్ రక్షణ వ్యవస్థను కాపాడటంలో ఇది కీలకపాత్ర వహిస్తోందన్నది మీడియా సమాచారం. ఈ హమెదన్ ప్రాంతంపై అనేకసార్లు ఇజ్రాయెల్ దాడులు చేసింది. ఐతే ఇరాన్‌కు చెందిన కీలక అణువ్యవస్థలు దెబ్బతిన్నాయని ఐఎఇఎ ప్రకటించింది.

### ఇరాన్‌కు ఆయుధ సాయం చెయ్యడంలేదు:పాకిస్థాన్

ఇరాన్‌కు ఎలాంటి ఆయుధ సహాయం చెయ్యడంలేదని పాకిస్థాన్ ప్రభుత్వం బుధవారంనాడు ప్రకటించింది. ఆయుధసాయం చేస్తున్నట్లు వచ్చిన ఆరోపణలను పాకిస్థాన్ ప్రభుత్వం తీవ్రంగా ఖండించింది. ఈ రెండు దేశాలు పక్కపక్కనే ఉంటాయి. విస్తారమైన సరిహద్దు ప్రాంతం రెండు దేశాలమధ్యా ఉంది. ఇజ్రాయెల్ దాడులు చేస్తూ ఉండటంతో రాజధానీ నగరం టెహ్రాన్ బుధవారంనాడు నిర్మానుష్యంగా మారిపోయింది. దుకాణాలన్నీ మూతపడ్డాయి. ఏదో అప్పుడప్పుడు ఒక వాహనం శరవేగంగా వెళుతూ కనిపిస్తున్నాయి. ఇరాన్‌లో ఉన్న వందలాదిమంది పాకిస్థానీ ప్రజలు దేశం వదిలిపారిపోయారు. ఇరాన్‌లో పరిస్థితులు దిగజారినందువల్ల దేశం వదిలివెళ్ళిపోవాలని టెలికాంశాఖ కార్మికుడు గులామ్ ముస్తాఫా ఐజాజ్‌ను పై అధికారులు కోరారు. ఈ విషయం ఆయనే చెప్పారు. కేవలం కొన్ని ఆహార వస్తువులు, దుస్తులు తప్ప అన్నీ ఇక్కడే వదిలేసి వెళ్ళిపోతున్నామని పాకిస్థానీ కార్మికుడు ముస్తాఫా ఐజాజ్ చెప్పారు. ఇరాన్–పాకిస్థాన్ మధ్య 900 కి.మీ సరిహద్దు ప్రాంతం ఉంది. అక్రమరవాణాదారులు, దొంగలు, ఉగ్రవాదులు చాలా స్వేచ్ఛగా ఈ సరిహద్దుల్లో తిరుగాడుతూ ఉంటారు.



## ఇరాన్ ఫోర్డో భూగర్భ అణుకేంద్రంపై
# దాడికి ట్రంప్ సన్నాహాలు?

ఇరాన్ బేషరతుగా లొంగిపోవాలని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ హెచ్చరిక చేశారు. అణ్వాయుధాలను పరిమితం చేసుకునేందుకు, అణ్వస్త్రరహిత మధ్యప్రాచ్య మనుగడ కొనసాగించేందుకు వీలుగా ఇరాన్ లొంగిపోవాలని ట్రంప్ అన్నారు. జూన్ 13వ తేదీన ఇరాన్‌పై ఇజ్రాయెల్ దాడులు చేశాక ఖమేనీ భూగర్భంలో దాక్కున్నారని వార్తలు వెలువడ్డాయి. ఖమేనీ ఎక్కడ ఉన్నాడో తమకు సమాచారం తెలుసుననీ, ప్రస్తుతానికి ఆయనను చంపకుండా వదిలేశామని కలిసి ఇరాన్‌పై దాడులు చేసే విషయాన్ని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఆలోచిస్తున్నారని బ్రిటన్ మీడియా ప్రకటించింది. వాషింగ్టన్ సిట్యుయేషన్ రూమ్‌లో జాతీయ భద్రతావిభాగం అధికారులతో ట్రంప్ మంగళవారం పొద్దుపోయాక సమావేశం నిర్వహించారు. ఏ విధంగా ముందుకెళ్ళాలనే విషయంపై చర్చలు జరిగాయి. ఇరాన్‌లోని ఫోర్డో భూగర్భ అణుకేంద్రాన్ని ధ్వంసం చేసేందుకు మంతనాలు జరిగాయి. ఇరాన్‌లోని మారుమూల పర్వతాలలో 90 మీటర్ల లోతున ఈ అణుకేంద్రం ఉంది. చాలా లోతైన ఈ భూగర్భంలోకి బాంబును విడిచిపెట్టేందుకు ప్రత్యేక నైపుణ్యం కావాలి. ఆ బాంబు అతిశక్తిమంతమైనదై ఉండాలి. ఈ అణుకేంద్రాన్ని ధ్వంసం చేసేందుకు జిబియు 57 ఎ/బి అనే అతిశక్తిమంతమైన పేలుడు పదార్థం కావాలి. ఈ పేలుడు పదార్థాన్ని మోసుకువెళ్ళేందుకు అమెరికా దగ్గర మాత్రమే ఉన్న బి–2 స్పిరిట్ స్టీల్త్ బాంబర్లు కావాలి. ఈ రెండూ ఇజ్రాయెల్ వద్ద లేవు. అందువల్ల తప్పనిసరిగా అమెరికా యుద్ధరంగంలోకి దిగాల్సి ఉంటుంది. ఈ అణుపదార్థాలను మోసుకువెళ్ళేందుకు అవసరమైన ఒక్కొక్క క్షిపణి ఖరీదూ దాదాపుగా 500 బిలియన్ డాలర్ల కంటే ఎక్కువే. ఇంత ఆర్థిక శక్తిసామర్థ్యాలు అమెరికా దగ్గరమాత్రమే ఉన్నాయి.

ఇరాన్‌లోని ఫోర్డో అణు శుద్ధి స్థావరం చాలా లోతైన భూగర్భం. ఈ భూగర్భప్రాంతంలో అణుశుద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఇక్కడ దాడులు చేయడం చాలా కష్టతరమైన పని. కానీ ఈ కేంద్రాలపై దాడులు చేసే విషయంపై ట్రంప్ యంత్రాంగం ఆలోచిస్తోంది. ఒకవేళ ఇజ్రాయెల్‌తో కలిసి దాడులు చేస్తే యావత్ యుద్ధరంగం, ప్రపంచ పరిస్థితులు పూర్తిగా మారిపోతాయి. ఈ విషయంపై రిపబ్లికన్లు రెండు వర్గాలుగా విడిపోయి భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. ఇరాన్‌కు భూగర్భంలో ఉన్న అణుకేంద్రాలపై ఉమ్మడి దాడులు చేసేందుకు అమెరికా మొగ్గు చూపిస్తున్నట్లు వార్తలు వెలువడుతున్నాయి. టెహ్రాన్ ప్రజలు నగరం వీడి వెళ్ళిపోవాలని కూడా నర్మగర్భంగా ట్రంప్ మంగళవారంనాడు ఒక హెచ్చరిక చేశారు. మరోవైపు ట్రంప్ ఇజ్రాయెల్‌తో కలిసి దాడుల్లోపాలు పంచుకునే విషయంపై అధికార రిపబ్లికన్‌పార్టీ వర్గాల్లో అనుకూల వ్యతిరేక భావాలు వ్యక్తం అవుతున్నాయి. రెండు వర్గాలుగా రిపబ్లికన్లు విడిపోయారు.

## స్టార్‌మర్ కోబ్రా కమిటీ అత్యవసర సమావేశం



**లండన్ :** మధ్యప్రాచ్యంలో సంభవిస్తున్న తీవ్ర పరిణామాలపై బ్రిటన్ ప్రధానమంత్రి కీర్ స్టార్‌మర్ బుధవారంనాడు అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ కోబ్రా కమిటీ సమావేశం స్టార్‌మర్ అధ్యక్షతన జరిగింది. ట్రంప్ జాతీయ భద్రతా మండలి సమావేశం కొత్త ఆలోచనలు చేస్తున్నది. ఇజ్రాయెల్–అమెరికా ఉమ్మడి దాడులు చేస్తే జరిగే పరిణామాలను ఆయన చర్చించారు. మధ్యప్రాచ్యంలో పరిణామాలు శరవేగంగా మారిపోతున్నాయనీ, బ్రిటన్ వైఖరి చాలా స్పష్టంగా ఉందని, మధ్యప్రాచ్యంలో ఎలాంటి ఉద్రిక్త పరిస్థితులైనా చర్చల ద్వారా పరిష్కరించాలని, ఉద్రిక్తతలు సడలిపోవాలని బ్రిటన్ కోరుకుంటున్నదని టెన్ డౌనింగ్ స్ట్రీట్‌లో ప్రధాని నివాసం అధికార ప్రతినిధి ఒకరు సమావేశానంతరం చెప్పారు. ''అక్కడ పరిస్థితులు ఊహించినదానికంటే వేగంగా మారిపోతున్నాయి, అందువల్ల దౌత్యమార్గాలను పునరుద్ధరించేందుకు దీనిపై పనిచేసేశక్తులు తిరిగి అనుసంధానం కావాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. అదేవిధంగా టెల్‌అవీవ్‌లో ఉన్న బ్రిటీష్ కాన్సులేట్ అధికారులు, వారి కుటుంబ సభ్యులను, జెరూసలెంలో ఉన్న బ్రిటిస్ దౌత్య సిబ్బంది, వారి కుటుంబాలను ముందు జాగ్రత్త చర్యగా వెనక్కు ఉపసంహరించుకుంటున్నట్లు బ్రిటన్ విదేశాంగమంత్రిత్వశాఖ ప్రకటించింది.

## ఇజ్రాయెల్ గూఢచారిని ఉరితీసిన ఇరాన్

**టెహ్రాన్ :** శక్తిమంతమైన ఇజ్రాయెల్ గూఢచారి సంస్థ ''మొస్సాద్'' కు చెందిన ఇస్మాయెల్ ఫక్రిని ఇరాన్ ప్రభుత్వం ఉరితీసింది. గడచిన నాలుగు రోజులుగా ఇరాన్–ఇజ్రాయెల్ మధ్య యుద్ధం జరుగుతున్న పరిస్థితుల్లో ఈ ఉరిశిక్షను ప్రభుత్వం అమలు చేసింది. తమదేశంలో రహస్యాలు కనిపెట్టేందుకు గూఢచర్యం చేశాడన్న ఆరోపణలపై ఇజ్రాయెల్‌కు చెందిన ఇస్మాయెల్ ఫక్రిని ఇరాన్ 2023లో అరెస్టు చేసింది. అణ్వస్త్ర ప్రమాదం ఇరాన్‌వల్ల పొంచిఉందన్న ఆరోపణలపై మెరుపుదాడులు చేసిన ఇజ్రాయెల్‌కు గుణపాఠం చెప్పేందుకు ఒకవైపు ప్రతీకార దాడులు చేస్తూనే మరోవైపు ఇజ్రాయెల్ గూఢచారికి అరెస్టుచేసిన రెండేళ్ళకు ఉరిశిక్ష అమలు చేశారు. భూమ్మీద అవినీతికి పాల్పడ్డాడనీ, దేవుడికి వ్యతిరేకంగా యుద్ధం చేశాడన్న ఆరోపణలపై ఫక్రికి ఉరిశిక్ష అమలు చేశారు. ఈ ఆరోపణలకింద ఇరాన్ న్యాయస్థాన చట్టాల ప్రకారం పూర్తిస్థాయిలో విచారణ జరిని నేరం నిర్ధారించిన తర్వాతే ఈ ఉరిశిక్ష అమలు చేసినట్లు ఇరాన్ జ్యుడీషియరీకి చెందిన 'మిజాన్' ఆన్‌లైన్ న్యూస్ ప్రకటించింది. ఈ తీర్పును సుప్రీంకోర్టు కూడా సమర్థించిన తర్వాతే ఉరిశిక్ష అమలు చేసినట్లు మిజాన్ పత్రిక పేర్కొంది. ఇదిలా ఉండగా ఇజ్రాయెల్‌కు సహకరిస్తున్నారన్న ఆరోపణలపై ఇరాన్‌లో అనేకచోట్ల అరెస్టైన వ్యక్తులపై న్యాయ విచారణను సత్వరం ఉద్ధృతం చేసి శిక్షలు అమలు చేస్తామని ఇరాన్ ప్రధాన న్యాయమూర్తి ఘోలామ్ హొస్సేన్ మొహ్సేనీ ఎజీ ప్రకటించారు. ఇజ్రాయెల్ గూఢచారిసంస్థ మొస్సాద్‌తో సంబంధాలన్న అనుమానంతో గడచిన ఆదివారంనాడు పశ్చిమ ఇరాన్ అల్‌బోర్జ్‌లో ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. అదేసమయంలో ఇజ్రాయెల్ కూడా ఒక ప్రకటన చేస్తూ ఇరాన్ తరపున గూఢచర్యం చేస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు పేర్కొంది.

## జిఎస్ఇసి లక్ష్యం
**(మొదటి పేజీ తరువాయి)**

పని చేస్తుంది. రాష్ట్రంలో యువత నైపుణ్యాలను పెంచేందుకు ప్రత్యేకంగా స్కిల్ యూనివర్సిటీని ఏర్పాటు చేశాం' అని ఆయన తెలిపారు. తెలంగాణ రాష్ట్రం పెట్టుబడులకు ఉత్తమ గమ్యస్థానంగా మారుతోందని, అందుకు తమ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలే కారణమని వివరించారు.రాష్ట్ర ఆర్థిక ప్రగతి లక్ష్యాలను కూడా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా ప్రస్తావించారు. '2035 నాటి కి తెలంగాణను 1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా,'తెలంగాణ రైజింగ్' కార్యక్రమంలో భాగంగా రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా మార్చే బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టామని వెల్లడించారు. 'ఇక్కడి మహిళలు కేవలం లబ్ధిదారులుగా మిగిలిపోకుండా, ధనిక పెట్టుబడిదారులకు దీటైన పోటీదారులుగా ఎదుగుతున్నారు. ప్రభుత్వంలో ఎప్పటికప్పుడు నూతన ఆవిష్కరణలు, వినూత్న విధానాలు తీసుకొస్తున్నాం' అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వివరించారు.హైటెక్ సిటీలో గూగుల్ సెక్యూరిటీ ఇంజినీరింగ్ సెంటర్ 2 ఎకరాల విస్తీర్ణంలో ఉండగా, దానికి సమీపంలోనే ఇందిరా మహిళా శక్తి సెంటర్ మూడున్నర ఎకరాల్లో ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. తెలంగాణ మహిళలు గూగుల్‌కు గట్టి పోటీ అని ఆయన సరదాగా వ్యాఖ్యానించారు.అధునాతన సైబర్ సెక్యూరిటీ , భద్రతా పరిష్కారాల కోసం గూగుల్ ఈ సైబర్‌సెక్యూరిటీ హబ్‌ను ఉపయోగిస్తున్నందుకు తాను గర్విస్తునాని చెప్పారు. 2007లో కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో గూగుల్ తన మొదటి కార్యాలయాన్ని ఇక్కడ ఏర్పాటు చేసిందని ఇది రెండో కార్యాలయం కూడా ఇక్కడే ప్రారంభించడం మన యువతకు మేలు చేకూరుస్తుందన్నారు.

### ఇతర రాష్ట్రాలకు తెలంగాణ దిశా నిర్దేశం..

తెలంగాణ 'ఎథికల్ ఇన్నోవేషన్'లో ఇతర రాష్ట్రాలకు టార్చ్ బేరర్‌గా దిశా నిర్దేశం చేస్తుంది. 'మాగ్నెట్ ఫర్ గ్లోబల్ కేపిటల్ గా' ఎదిగింది. 'మోడల్ ఆఫ్ ఇన్క్లూసివ్ డిజిటల్ గవర్నెన్స్' గా మార్గదర్శకంగా నిలుస్తుందని మంత్రి శ్రీధర్‌బాబు పేర్కొన్నారు.. భవిష్యత్తు కోసం ఎదురు చూడకూడదు. భావితరాల అవసరాలకు అనుగుణంగా భవిష్యత్తును నిర్మించాలి' అన్నదే సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం సంకల్పం. ఆ దిశగానే తమ ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా అడుగులు వేస్తోందన్నారు. 2024–25లో హైదరాబాద్ నుంచి రూ. 2.68 లక్షల విలువైన ఐటి, ఐటిఇఎస్ సేవలు ఎగుమతి అయ్యాయని, 40వేల మందికి కొత్తగా ఐటి ఉద్యోగాలు లభించాయని, అంతర్జాతీయ టాప్ 10 టెక్ దిగ్గజ కంపెనీల్లో 7 ఇక్కడ ఆపరేషన్స్ నిర్వహిస్తున్నాయన్నారు. అనంతరం గూగుల్ సిబ్బంది జిఎస్ఇసి పనితీరును సిఎం, మంత్రికి వివరించారు.

## చేయకపోతే జైలుకే (మొదటి పేజీ తరువాయి)

666 చదరపు గజాలున్న ప్లాటు నెం.181కు కేటాయించి రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వలేదంటూ కోర్టుకు వచ్చారు. కోర్టు ఆదేశించినా అమలు కాకపోవడంతో 2020లో మళ్లీ హైకోర్టుకు వస్తే, 2023 ప్రారంభంలో మధ్యంతర ఉత్తర్వులు వెలువడ్డాయి. మూడు నెలల్లో ప్లాటు రిజిస్టర్ చేయాలన్న ఆ ఉత్తర్వులు కూడా అమలు కాకపోవడంతో రాంరెడ్డి కోర్టు ధిక్కారణ పిటిషన్ వేశారు. ఇందులో మున్సిపల్ శాఖ కౌంటర్ వేసింది. పిటిషనర్‌కు కేటాయించి ప్లాటు 181 సర్వే నెం.454లో ఉందని, దీనికి సంబంధించి మరో వ్యక్తి హైకోర్టు నుంచి స్టే పొందారని చెప్పింది. దీంతో రిజిస్ట్రేషన్ చేయించలేకపోయామని, కావాలని కోర్టు ధిక్కరణకు పాల్పడలేదని తెలిపింది. వాదనలను విన్న న్యాయమూర్తి పిటిషనర్ రెండోసారి హైకోర్టును ఆశ్రయించినపుడు హైకోర్టు స్టే ఉత్తర్వుల తొలగింపునకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినా అమలుకు చర్యలు తీసుకోలేదన్నారు. కోర్టు ధిక్కరణ పిటిషన్ వేయగా అదే విధంగా 2024 జనవరిలో మరోసారి హామీ ఇచ్చి ఏడాది దాటినా స్టే ఎత్తివేయాలనిగానీ, అప్పీలువేయడంగానీ చేయలేదన్నారు. మూడు నెలల్లో ప్లాటును రిజిస్ట్రేషన్ చేసివ్వకపోతే ప్రతివాదులైన పురపాలకశాఖ ముఖ్యకార్యదర్శి, హెచ్ఎండీయే కమిషనర్‌గా పనిచేసిన అరవింద్‌కుమార్, భూసేకరణ అధికారి ప్రసూనాంబలకు రెండు వారాల జైలు శిక్ష అనుభవించాలని తీర్పు చెప్పారు. జరిమానా చెల్లించకపోతే మరో వారం జైలు శిక్ష అమలు అవుతుందన్నారు.

## విద్యుత్ సరఫరా కీలకం
**(మొదటి పేజీ తరువాయి)**

ఉద్యోగుల హెల్త్ క్యాంపును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క మాట్లాడుతూ వరదల సమయంలో ఎవరు ఊహించని వేగంతో విద్యుత్ సరఫరా పునరుద్ధరణ చేసిన సిబ్బందికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత విద్యుత్ శాఖలో పారదర్శకత తీసుకు వచ్చామని, విద్యుత్ కార్మికుల సమస్యల పరిష్కారానికి ఎప్పటికప్పుడు సమయం కేటాయిస్తున్నామ న్నారు. రాష్ట్ర అభివృద్ధికి విద్యుత్ సరఫరా చాలా కీలకమని మన రాష్ట్రంలో నిరంతరాయ విద్యుత్ సరఫరా అ న్ని వర్గాలకు అందించేందుకు పకడ్బందీగా చర్యలు చేపట్టామన్నారు. సాంకే తిక సమస్యలు, వాతావరణ పరిస్థితుల వల్ల విద్యుత్ సరఫరాలో అంత రా యం ఏర్పడినప్పుడు మరమ్మతు పనులు చేసే సమయంలో కార్మికులకు ప్ర మాదాలు జరగకుండా తప్పనిసరిగా భద్రతా చర్యలు పాటించాలన్నారు. దేశంలో ఎక్కడ లేనివిధంగా విద్యుత్ శాఖలో పనిచేసే లైన్‌మెన్ నుంచి సిఎం డి వరకు కోటి రూపాయల ప్రమాద బీమా కల్పించడం జరిగిందన్నారు. కెటిపిఎస్ స్టేజ్ 7 వరకు, హైడల్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు మొత్తం గత ఉ మ్మడి రాష్ట్రం హయాంలో ఏర్పాటు చేశామన్నారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నూతన విద్యుత్ పాలసీని తీసుకు వచ్చామని ఆయన తెలిపారు. 2023లో 15వేల మెగావాట్ల విద్యుత్ పీక్ డిమాండ్ ఏర్పడిందని, 2025 మార్చిలో ఇది 17,162 మెగా వాట్లకు చేరుకున్నప్పటికీ ఎక్కడ విద్యుత్ కో తలు లేకుండా చూసుకున్నామన్నారు. 2030 నాటికి 26వేల మెగావాట్లు, 2035 నాటికి 33,773 మెగావాట్ల విద్యుత్ డిమాండ్ ఏర్పడుతుందనే అంచనాతో ఉత్పత్తి పెంచేందుకు చర్యలు చేపట్టామన్నారు. పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తి రంగంలో 20వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తే లక్ష్యంగా చర్య లు తీసుకుంటున్నామన్నారు. లక్ష కోట్ల రూపాయల వరకు ఇప్పటికే సోలా ర్ విద్యుత్ కేంద్రాల ఏర్పాటుకు ఎంవోయు చేసుకున్నామన్నారు. బ్యాటరీ స్టోరేజ్ వంటి నూతన విద్యుత్ ఉత్పత్తి రంగాలను కూడా పరిశీలిస్తున్నా మ న్నారు. వ్యవసాయ పంపు సెట్లకు ఉచిత విద్యుత్‌ను అందించేందుకు ప్రభు త్వం ప్రతి ఏడాది రూ. 11,500 కోట్లు చెల్లిస్తుందన్నారు. గృహ అవసరాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ సరఫరా కోసం ప్రభుత్వం రూ. 2293 కోట్లను విద్యుత్ శాఖకు చెల్లించిందన్నారు. 1912 ఫోన్ నెంబర్‌కు ఫోన్ చేస్తే విద్యుత్ అంబులెన్స్ వచ్చి మరమ్మతు పనులు పూర్తి చేస్తుందని అంబులెన్స్‌లో అవసరమైన సామగ్రి ఇంజనీర్, ట్రాన్స్‌ఫార్మర్ అందు బాటు లో ఉంటాయన్నారు. రవాణా, బిసి సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాక ర్ మాట్లాడుతూ సామాన్యుల జీవన ప్రమాణాలు పెరిగేందుకు విద్యుత్ శాఖ పనితీరు కీలకమన్నారు. ప్రజా ప్రభుత్వం ఆకాంక్షలకు అనుగుణంగా విద్యు త్ శాఖ సిబ్బంది వినియోగదారులకు మెరుగైన సేవలను అందించాలన్నారు. ఆర్టిసి కార్మికులు ప్రమాదవశాత్తు చనిపోతే కోటి రూపాయల బీమా వస్తుందని విద్యుత్ శాఖలో కూడా ఈ పథకం అమలవుతుందన్నారు. మిగిలిన శాఖల్లోనూ ఉద్యోగులకు కూడా ఇది అమలు చేయాలన్నారు. సిఎండి కె. వరుణ్‌రెడ్డి మాట్లాడుతూ గత సంవత్సరం సెప్టెంబర్‌లో వచ్చిన వరదల సమ యంలో ఖమ్మం సర్కిల్ పరిధిలో రూ. 30 కోట్ల మేర నష్టం జరిగిందన్నారు. విద్యుత్ సిబ్బంది యుద్ధ ప్రాతిపదికన పని చేసి వారం రోజుల్లో ప్రతి గ్రా మంలో విద్యుత్ సరఫరాను పునరుద్ధరించినట్లు ఆయన తెలిపారు. అనంతరం ఎలక్ట్రికల్ సేఫ్టీ టూల్ కిట్ల ను సిబ్బందికి మంత్రి అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సం స్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, రాష్ట్ర కార్పోరేషన్ చైర్మన్ నాయుడు స త్యనారాయణ, మేయర్ పునుకొల్లు నీరజ, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి, విద్యుత్ శాఖ ఎస్ఇ ఇనుగుర్తి శ్రీనివాసచారి, డిఎంఅండ్‌హెచ్‌వో కళావతి బాయి, పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రానికి పెద్ద దెబ్బ (మొదటి పేజీ తరువాయి)

'పవర్‌పాయింట్ ప్రజంటేషన్' ఇచ్చారు. అనంతరం వివిధ రాజకీయ పార్టీలకు చెందిన ఎంపిలు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర రైతుల ప్రయోజనాలకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. పోలవరం–బనకచర్ల విషయంలో ఎపి ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టాన్నిఉల్లంఘిస్తోందని నీటి పారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఆరోపించారు. గోదావరి–బనకచర్లను పరిశీలించడం రాష్ట్ర హక్కులను కాలరాయడమేనని, పోలవరం–బనకచర్లను మేం పూర్తిగా వ్యతిరేకిస్తున్నామని, పోలవరం–బనకచర్లను తిరస్కరించాలని కేంద్రానికి స్పష్టంగా చెప్పామని ఉత్తమ్ వివరించారు. గోదావరి ట్రైబ్యునల్ అవార్డును బనకచర్ల ప్రాజెక్టు ఉల్లంఘిస్తోందని, తెలంగాణకు అనుకూలమైన ఇచ్ఛంపల్లిని ఎపి వ్యతిరేకించిందని, అత్యవసరంగా పోలవరం ప్రాజెక్టు అథారిటీ సమావేశం ఏర్పాటు చేయాలని కోరినట్టు ఆయన చెప్పారు. బనకచర్ల ప్రాజెక్ట్‌తో తెలంగాణ వాటా జలాలకు కూడా భవిష్యత్‌లో ఎదురు దెబ్బేనని ఉత్తమ్ తెలిపారు. ఇదిలా ఉండగా రాష్ట్రంలోకి గోదావరి రెంజల్ మండలం కందకుర్తి వద్ద ప్రవేశిస్తోందని, రాష్ట్రంలో గోదావరిపై తొలి ప్రాజెక్టు ఎస్ఆర్ఎస్‌పి అని, తుమ్మిడిహట్టి వద్ద 2007లో ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టు తలపెట్టారని, ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టులో భాగంగా నాలుగు రిజర్వా యర్లను డిజైన్ చేశారని, 4 లక్షల ఎకరాలకు సాగునీరు ఇచ్చే లక్ష్యంతో రూపొందించారని ఉత్తమ్ వివరించారు.

## కీలక సమావేశం (మొదటి పేజీ తరువాయి)

ప్రాజెక్టును ఎండబెడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వ కుట్రలను నాయకులకు కెసిఆర్ వివరిస్తారని కెటిఆర్ పేర్కొన్నారు. రాజకీయ దురుద్దేశంతోనే రైతులపైన కాంగ్రెస్ ప్రభుత్వం, సిఎం కక్ష కట్టినట్లు వ్యవహరిస్తున్నారని, అందుఏ కీలక సమావేశంలో తదుపరి కార్యాచరణపై చర్చిస్తామన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తి కాకుండా ప్రభుత్వం చూపుతున్న అలసత్వంతో తెలంగాణకు తీరని నష్టం కలుగుతుందని, ఈ అంశంలో ఉద్యమ కార్యాచరణకు బిఆర్ఎస్ ప్రణాళికలు సిద్ధం చేయనుందని కెటిఆర్ తెలిపారు. రైతులపక్షాన బిఆర్ఎస్ మరో పోరాటానికి సిద్ధమవుతున్నదని తెలిపారు.

**(మొదటి పేజీ తరువాయి)**

# కెసిఆరే కారణం



సుప్రీంకోర్టుకైనా వెళ్లాలని భావిస్తున్నాం. నీటి ఒప్పందాలపై నిపుణులైన న్యాయవాదులను నియమించుకుంటాం. రాష్ట్ర ప్రయోజనాలు కాపాడుకునేందకు అన్ని ప్రయత్నాలు చేస్తాం' అని చెప్పారు. ''కెసిఆర్, హరీష్‌రావు ఏనాడు తెలంగాణ ప్రయోజనాల కోసం పాటుపడలేదు. పాలమూరు జిల్లాల్లో మొదలైన ఏ ప్రాజెక్టును పూర్తిచేయలేదు. పదేళ్లలో పెండింగ్‌లో ఉన్న ఏ ఒక్క ప్రాజెక్టును పూర్తి చేయలేదు. తుమ్మిడిహెట్టి వద్ద ప్రాజెక్టుతో గ్రావిటీతో సాగునీరు అందేది. కమిషన్ల కక్కుర్తితో లక్షకోట్లు పెట్టి కట్టిన ప్రాజెక్టుతో లక్ష ఎకరాలకు కూడా సాగు నీరు అందివ్వలేదు. పదేళ్లు రూ.2 లక్షల కోట్లు ఖర్చు చేస్తే తక్కువ ఖర్చుతో పూర్తయ్యే ప్రాజెక్టులను గాలికి వదిలేశారు. వారి ఇల్లు నింపుకునేందుకు రాష్ట్రాన్ని దోచుకున్నారు'' అని సిఎం రేవంత్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వారి మాదిరిగా కాకుండా పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు ప్రయత్నం చేస్తున్నదని, కష్టపడి ఎస్ఎల్‌బిసి పనులు ప్రారంభిస్తే మనుషులు చనిపోతే వారు పైశాచిక ఆనందం పొందుతున్నారని, ఎక్కడ ఎవరు చనిపోయినా వారి ముఖాల్లో పైశాచిక ఆనందం కనిపిస్తోందన్నారు. హరీష్ రావు హుందాగా వ్యవహరించాలని, అబద్ధాలతో కాలం వెళ్లదీయొద్దని, నేడు కాంగ్రెస్ ప్రభుత్వం నిజాలు బయటపెట్టిందని, ఆయన తలకాయ ఎక్కడ పెట్టుకుంటారని ప్రశ్నించారు. ''రాయలసీమకు గోదావరి జలాల తరలింపులో సహకరిస్తామని ఎసిఆర్ ప్రకటించినట్లు నమస్తే తెలంగాణ పత్రికలో రాశారు. 2192016న కేంద్ర ప్రభుత్వం అపెక్స్ కౌన్సిల్ సమావేశం నిర్వహించింది. ఆనాటి సాగునీరు మంత్రి హరీష్ రావు, ఆనాటి ముఖ్యమంత్రి కెసిఆర్ పాల్గొన్నారు. ఏటా 3వేల టిఎంసిల గోదావరి నీరు వృథాగా సముద్రంలో కలుస్తోందని అపెక్స్ కౌన్సిల్ భేటీలో అప్పటి సిఎం కెసిఆర్ అన్నారు. మూడు వేల టిఎంసిలు వృథాగా పోతున్నాయని మొదట మాట్లాడింది కెసిఆరకే. అపెక్స్ కౌన్సిల్ భేటీలో ఎవరు ఏం మాట్లాడారో అంతా దస్త్రాల రూపంలో ఉంది. రాయలసీమకు గోదావరి జలాల తరలింపుపై చర్చించుకున్నామని ఆనాడు తెలంగాణ, ఎపి మంత్రులు మీడియాకు కూడా చెప్పారు. 2019 వరకు ఇది రకరకాల కారణాలతో వాయిదాపడుతూ వచ్చింది. 2019 లో ఆనాటి ఎపి సిఎం జగన్‌తో నాలుగుసార్లు సమావేశమై కెసిఆర్ రాయలసీమకు నీటి తరలిపునకు నిర్ణయం తీసుకున్నారు. ఆ సమావేశం వివరాలను ఆనాటి మంత్రులు ఈటల రాజేందర్, బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి చెప్పారు'' అని రేవంత్‌రెడ్డి వివరించారు. ఏ అంశం వచ్చినా, ఏ విషయం ప్రస్తావనకు వచ్చినా బిఆరెస్ నాయకులు రాజకీయ ప్రయోజనాల కోసం అబద్ధాలను ప్రచారం చేస్తున్నారని, తద్వారా వారు సెంటిమెంట్ తో మళ్లీ పార్టీని బ్రతికించుకునే ప్రయత్నం చేస్తున్నారని సిఎం విమర్శించారు. రైతాంగాన్ని కష్టాల నుంచి బయటపడేసేందుకు ఆనాడు కాంగ్రెస్ హయాంలో సాగునీటి ప్రాజెక్టులు నిర్మించామని, కెసిఆర్, హరీష్ సంపూర్ణ అవగాహనతో ప్రభుత్వానికి సహకరించినా, సూచనలు చేసినా స్వీకరిస్తామని, కానీ దురుద్దేశంతో రాజకీయ ప్రయోజనాల కోసం ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారన్నారు. రాయలసీమను రతనాల సీమగా మారుస్తామని ఆనాడు కెసిఆర్ మాట్లాడారని, బేసిన్లు లేవు, భేషజాలు లేవు అని కెసిఆర్ ఆనాడు మాట్లాడారని, గోదావరి బనకచర్ల విషయంలో 2016లో కెసిఆర్, చంద్రబాబు మాట్లాడుకున్న అంశాల సాకుతో ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ ముందుకు వెళుతోందన్నారు. ఎపి చేపట్టేది 200 టిఎంసిల ప్రాజెక్టు కాదని, 300 టీఎంసీల కోసమని, ఆనాడు కెసిఆర్ 400 టీఎంసీలు తీసుకోవచ్చని అంగీకరించారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వాదనలకు వెళ్లదలచుకోలేదని, తెలంగాణకు నష్టం జరగొద్దని జలశక్తి మంత్రిత్వశాఖకు ఫిర్యాదు చేశామని, ప్రభుత్వం ఎక్కడా నిర్లక్ష్యం వహించలేదన్నారు. మేడిగడ్డ గుండెకాయ లాంటిది.అది లేకపోతే ఆ ప్రాజెక్టు ఉన్నా ప్రయోజనం లేదన్నారు. పదేళ్లలో పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేసి ఉంటే తెలంగాణకు ఇవాళ ఈ పరిస్థితి వచ్చేది కాదన్నారు. కృష్ణానది జలాలు జూరాలలో తెలంగాణకు వస్తాయని, ఆ నీటిని వాడుకుంటే ఈ పరిస్థితి ఉండేది కాదని, దీనికి కారణం కెసిఆర్ కాదా? రాయలసీమ ప్రాజెక్టులకు వారే కదా ఒప్పుకున్నది అని సిఎం ప్రశ్నించారు.

### పలుకుబడి ఉందని ప్రాజెక్టులు పూర్తవుతాయనుకుంటే చంద్రబాబు భ్రమ

తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలే తమకు ముఖ్యమన్నారు. ఈ విషయంలో తమకు ఎలాంటి శషభిషలు లేవని, సామ,దాన, దండోపాయాల్లో మొదటి దశలో ఉన్నామని, అందరినీ కలిసి సమస్యలను వివరిస్తాం అయినా న్యా యం జరగకపోతే న్యాయస్థానాలను ఆశ్రయిస్తామన్నారు. తెలంగాణ ప్రభు త్వం అన్ని ప్రక్రియలను అనుసరిస్తూ కేంద్రానికి సమస్యలను వివరిస్తోందన్నారు. 'ఎపి సిఎం చంద్రబాబు నాయుడుకు సూచన చేస్తున్నా. కేంద్రంలో పలుకుబడి ఉందని ప్రాజెక్టులు పూర్తవుతాయనుకుంటే మీ భ్రమ. తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలు కాపాడుకునేందుకు మా ప్రణాళిక మాకుంది. చంద్రబాబు కెసిఆర్ చెప్పారని కాదు. గోదావరి బేసిన్‌లో 3వేల టీఎంసీలు మిగులు జలాలు ఉన్నాయని మీరు నమ్మితే 968 టిఎంసిలు వాడుకునేందుకు తెలంగాణకు సంపూర్ణ అనుమతులు ఇచ్చాక మీరు మిగులు జలాలు తీసుకోండి' అని సిఎం రేవంత్‌రెడ్డి అన్నారు.

### తెలంగాణ ప్రాజెక్టులకు ఎన్ఒసి ఇచ్చి మిగులు నీటిని వాడుకోండి

భగవంతుడికి భక్తుడికి అనుసంధానం అన్నట్టు ప్రధాని మోదీకి చంద్రబాబు అవసరం ఉందని, చంద్రబాబుకు గోదావరి జలాల అవసరం ఉందని, చంద్రబాబు దూరం పెంచుకుంటే సమస్య పరిష్కారం కాదని, మోదీ దగ్గర అనుమతులు తెచ్చుకున్నంత మాత్రాన వారి ప్రాజెక్టులు పూర్తికావని సిఎం రేవంత్‌రెడ్డి అన్నారు. కృష్ణా, గోదావరి బేసిన్‌లపై తెలంగాణ ప్రాజెక్టులకు ఎపి ఎన్ఓసి ఇచ్చి మిగిలిన నీటిని ఎపి ఎలాగైనా వాడుకున్నా అభ్యంతరం లేదన్నారు.

### నేడు కేంద్ర మంత్రితో భేటీ

కేంద్ర మంత్రి సిఆర్ పాటిల్‌ను గురువారం కలిసి బనకచర్లపై మా అభ్యంతరాలను వివరిస్తామని సిఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. ఇందుకోసం రాజకీయాలకు అతీతంగా తెలంగాణ ప్రయోజనాల కోసం అందరూ కలిసిరావాలని కోరారు. అఖిలపక్ష భేటీకి రాకుండా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కేంద్ర జలశక్తి మంత్రిని కలవడంలో ఆంతర్యం ఏమిటని సిఎం ప్రశ్నించారు. గురువారం తాము వెళ్లి కలుస్తామని తెలిసి ముందుగానే బుధవారం కిషన్‌రెడ్డి కేంద్ర మంత్రిని కలవడం వెనక రహస్యం ఏమిటని సిఎం ప్రశ్నించారు.

### నిధులిస్తామంటే ఫామ్ హౌస్‌కే వస్తాం

సాగునీటి ప్రాజెక్టులు, మెట్రో విస్తరణ, రీజనల్ రింగురోడ్డు, మూసీ ప్రక్షాళన అనుమతుల కోసం కేంద్ర ప్రభుత్వాన్ని కలవొద్దా అని సిఎం రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. 'బిఆర్ఎస్ నాయకులు నిధులు ఇస్తామంటే చెప్పండి. నేరుగా ఫామ్ హౌస్‌కే వస్తాం. రూ.50 వేల కోట్లు ఇవ్వండి. ప్రభుత్వం తరపున బాండ్లు రాసిస్తాం' అని వ్యాఖ్యానించారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## ఎసిబికి చిక్కిన విద్యుత్ సూపరింటెండెంట్ ఇంజనీర్



**ప్రజాపక్షం/మహబూబాబాద్ ప్రతినిధి:** మహబూబాబాద్ జిల్లా విద్యుత్ శాఖ సర్కిల్ సూపరింటెండెంట్ నరేష్ రూ.8వేలు లంచం తీసుకుంటూ బుధవారం ఏసిబికి చిక్కారు. ఓ కాంట్రాక్ట్ విషయంలో ఎక్సెస్ పనులకు సంబంధించి సదరు కాంట్రాక్టర్‌ను లంచం అడగడంతో ఆ కాంట్రాక్టర్ ఏసిబి అధికారులను ఆశ్రయించాడు.దీంతో బుధవారం ఉదయం ఆయన స్వగృహంలో రూ.80వేలు కాంట్రాక్టర్ నజీర్ నుండి లంచం తీసుకుంటుండగా విద్యుత్ ఎస్ఇని ఏసిబి అధికారులు పట్టుకుని కేసు నమోదు చేశారు. మహబూబాబాద్ ఎస్ఇ కార్యాలయం, హస్తినాపురం కాలనీలోని ఆయన ఇంటిలో ఏసిబి అధికారులు సాయంత్రం వరకూ సోదాలు నిర్వహించారు.



## బ్రహ్మోస్ ఏరోస్పేస్ విస్తరణకు సహాయం అందిస్తాం : సిఎం రేవంత్ రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** దేశంలో పెట్టుబడులకు పెట్టడానికి తెలంగాణ రాష్ట్రం అనుకూల ప్రదేశమని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అన్నారు. బ్రహ్మోస్ ఏరోస్పేస్ విస్తరణకు తెలంగాణ రాష్ట్రంలోని హైదరాబాద్‌ను ఎంచుకోవాలని, ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం తరపు నుంచి అన్ని విధాలుగా సహాయ, సహకారాలు అందిస్తామని హామీనిచ్చారు. హైదరాబాద్‌లోని, జూబ్లీహిల్స్ సిఎం నివాసంలో ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబుతో కలిసి బ్రహ్మోస్ ఏరోస్పేస్ ప్రతినిధి బృందం సిఎం రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మోస్ ఏరోస్పేస్ ఎండి, సిఇఒ జైతీర్థ్ ఆర్. జోషి, బ్రహ్మోస్ హైదరాబాద్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సూరంపూడి సాంబశివ ప్రసాద్, డిఆర్‌డిఎల్ డైరెక్టర్ జి.ఎ శ్రీనివాస మూర్తి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ హైదరాబాద్‌లో బ్రహ్మోస్ ఏరోస్పేస్ సంస్థను విస్తరించాలని, డిఫెన్స్ కారిడార్ ఏర్పాటుకు హైదరాబాద్, బెంగుళూరు ప్రాంతాలు అనుకూలమన్నారు. డిఫెన్స్‌కు సంబంధించిన కొన్ని సంస్థలు హైదరాబాద్‌లో ఉన్నాయన్నారు. కాగా సిఎం ఆహ్వానం మేరకు బ్రహ్మోస్ ఏరోస్పేస్ బృందం సానుకూలంగా స్పందించినట్లు అధికార వర్గాలు పేర్కొన్నాయి.

## కెసిఆర్ దత్తత గ్రామ బాధితులకు
# ప్రభుత్వం అండగా నిలుస్తుంది

### మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్:**భువనగిరి జిల్లాలోని వాసాల మర్రి గ్రామంలో ఇండ్ల నిర్మాణం పేరుతో మాజీ సిఎం కెసిఆర్ చేతిలో మోసపోయిన (కెసిఆర్ దత్తత గ్రామం) ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా నిలుస్తుందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ప్రకటించారు. అర్హులైన ఇందిరమ్మ లబ్ధిదారులకు మంజూరు పత్రాలను గురువారం తానే స్వయంగా అందజేస్తామని తెలిపారు. వాసాల మర్రి గ్రామాన్ని దత్తత తీసుకుంటున్నట్టుగా 2020 నవంబర్ 1న సిఎం హోదాలో కెసిఆర్ ప్రకటించారని, ఆ తర్వాత 2021 జూన్ 22న గ్రామసభ నిర్వహించి స్థానికులతో కెసిఆర్ సహపంక్తి భోజనం చేసి, వాసాలమర్రిని బంగారు వాసాలమర్రిగా అభివృద్ధి చేస్తానని కెసిఆర్ హామీ ఇచ్చిన విషయాన్ని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి గుర్తు చేశారు. ప్రతి కుటుంబానికి డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కట్టించి ఇస్తానని కెసిఆర్ హామీఇచ్చారని, కానీ బిఆర్ఎస్ అధికారాన్ని కోల్పోయే వరకు 2023 డిసెంబర్ 7వ తేదీ వరకు కెసిఆర్ వాసాలమర్రి వైపు కన్నెత్తి చూడలేదని మంత్రి పొంగులేటి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

కెసిఆర్ తన ఫామ్‌హౌస్‌కు వెళ్లడానికి రోడ్డు విస్తరణ కోసం రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఇండ్లను కూల్చివేసి, నిలువ నీడ లేకుండా చేశారని, ఆ బాధితులు ఇండ్లు కోల్పోయి, తాత్కాలికంగా గుడిసెలు, టెంట్లు వేసుకొని కాలం వెళ్లదీస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బంగారు వాసాలమర్రి దేవుడెరుగు, ఉన్న ఇండ్లను కోల్పోయామని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని, సిఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ఇందిరమ్మ ప్రభుత్వం అక్కున చేర్చుకుందని అన్నారు. వాసాలమర్రి గ్రామంలో సర్వే నిర్వహించి, ఇందిరమ్మ ఇండ్లకు అర్హులను గుర్తించి, 205 మందికి ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేశామని వివరించారు.

దేశానికి దశ దిశ చూపిస్తానని ప్రగల్బాలు పలికిన కెసిఆర్ తన దత్తత గ్రామ ప్రజలకు పంగనామాలు పెట్టారని, కొత్త ఇల్లు రాలేదు కదా, ఉనన ఇల్లు పోయిందని తెలిపారు. ప్రజల అవసరాలను, ఆశలను రాజకీయ అవసరాలకు మాత్రమే వాడుకున్నారని చెప్పడానికి వాసాల మర్రి గ్రామమే ఒక నిదర్శనమని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను పర్యవేక్షించేందుకు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి గురువారం యాదాద్రి భువనగిరి జిల్లా బండ సోమారం, సూర్యాపేట జిల్లా మోతే మండలంలోని విభలాపూర్‌లో ఇందిరమ్మ ఇండ్ల పనులను పరిశీలించనున్నట్టు పేర్కొన్నారు.



## బేగంపేట విమానాశ్రయానికి బాంబు బెదిరింపు

**ప్రజాపక్షం/హైదరాబాద్:**బేగంపేట్ విమానాశ్రయాని కి గుర్తు తెలియని వ్యక్తి నుంచి సిబ్బందికి బాంబు బెదిరింపు మెయిల్ వచ్చింది. బుధవారం ఉదయం 11.10 ప్రాంతంలో ఆగంతకుడు విమానాశ్రయంలో బాంబు ఉందంటూ మెయిల్ చేశాడు. దీంతో అప్రమత్తమైన బేగంపేట్ విమానాశ్రయ అధికారులు భద్రతా సిబ్బంది కి సమాచారం అందజేశారు. దీంతో తెలంగాణ స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్, సిఐఎస్ఎఫ్ బలగాలు రంగంలోకి దిగాయి. ముందుగా విమానాశ్రయంలో ఉన్న ఉద్యోగు లు, సిబ్బందిని బయటకు పంపించేశారు. విమానాశ్ర యం లోపల, పరిసర ప్రాంతాల్లో స్నిఫ్ఫర్ డాగ్స్, బాంబ్ డిటెక్షన్ స్క్వాడ్‌తో క్షుణ్ణంగా తనిఖీలు చేపడుతున్నారు. బేగంపేట్ ఎయిర్‌పోర్టుకు సిబ్బంది ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న సైబర్ క్రైమ్ పోలీసులు..మెయిల్ పంపింది ఎవరు..? ఎక్కడి నుంచి వచ్చింది అనే విషయాలపై ఆరా తీస్తున్నారు.



సోమాజిగూడ యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డిని మంత్రి శ్రీధర్ బాబు బుధవారం పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

## పాత ఫోన్ నా వద్ద లేదు
### ఎసిబి దర్యాప్తు అధికారికి కెటిఆర్ లేఖ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తన మొబైల్‌ఫోన్‌ను 2024 మొదటి త్రైమాసికంలో మార్చానని, తాను గతంలో ఉపయోగించిన ఆ పాత ఫోన్ ప్రస్తుతం తన వద్ద లేదని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు స్పష్టం చేశారు. తను ఫోన్ కాకుండా ఏ ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులను వాడలేదని ఎసిబి అధికారులకు వివరించారు. ఈ మేరకు కెటిఆర్ ఎసిబి దర్యాప్తు అధికారికి బుధవారం లేఖ సమర్పించారు. కాగా ఫార్ములా కార్ రేసు కేసులో 'నవం బర్ 1, 2021 నుంచి డిసెంబర్ 1,2023 వరకు ఉపయోగించిన మొబైల్ ఫోన్‌ను,ల్యాప్ ట్యాప్, ట్యాబ్, ఐపాడ్ వంటి ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను సమర్పించాలని కెటిఆర్‌కు ఎసిబి నోటీసులు జారీ చేసిన నేపథ్యంలో కెటిఆర్ లేఖ ద్వారా పైవిధంగా సమాధానాన్ని పంపించారు. బిఎన్ఎస్ఎస్‌లోని సెక్షన్ 94 కింద ఇచ్చిన నోటీసులో తాను నవంబర్ 2021 నుంచి డిసెంబర్ 2023 మధ్య కాలంలో వాడిన సెల్ ఫోన్, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులను ఎందుకు సమర్పించాలనే కారణం కానీ, ఉద్దేశం కానీ ఎసిబి తన నోటీసుల్లో పేర్కొనలేదని కెటిఆర్ వివరించారు. ఫార్ములా కేసు విచారణకు సంబంధించి అవసరమైన అన్నిరకాల అధికారిక సంప్రదింపుల రికార్డులన్నీ రాష్ట్ర ప్రభుత్వంలోని పురపాలక శాఖ వద్దనే ఉన్నాయని తెలిపారు. అవన్నీ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్ మెంట్ శాఖ మంత్రి హోదాలో తాను తీసుకున్న నిర్ణయాలన్నారు. తనపై చేసిన ఆరోపణల్లో గతంలో వాడిన ఎలక్ట్రానిక్ వస్తువుల ప్రస్తావన, సంబంధం లేనప్పటికీ, వాటిని సమర్పించాలని కోరడం, రాజ్యాంగం ఒక పౌరునిగా తనకు కల్పించిన ప్రాథమిక హక్కులకు భంగం కలిగించడమేనని అన్నారు. కేసు విచారణ కోసం తాను వాడిన ఎలక్ట్రానిక్ వస్తువులు అవసరమనే ప్రాతిపదికను ఎక్కడా కూడా ప్రస్తావించలేదని కెటిఆర్ తెలిపారు. విచా రణలో భాగంగా ఎలక్ట్రానిక్ వస్తువులను సేకరించాల్సి వస్తే సుప్రీం కోర్టు నియమ నిబంధనలను కచ్చితంగా పాటించాల్సి ఉంటుందని ఎసిబి లేఖలో కెటిఆర్ తెలిపారు. ఒకవేళ ప్రత్యేక పరిస్థితుల్లో సేకరించే ఎలక్ట్రానిక్ వస్తువులను విచారణ సంస్థల అధికారులు ట్యాంపర్ చేయకుండా ఉండేందుకు కఠిన నిబంధనలను పాటించాలని సుప్రీం కోర్టు పొందుపర్చిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు.

వ్యక్తిగత గోప్యతతో పాటు, విచారణ పేరుతో ఒక పౌరునడి నుంచి ఎందుకు తీసుకుంటున్నారో సరైన కారణం చెప్పకుండా, సేకరించిన సమాచారాన్ని ఆయనకే వ్యతిరేకంగా వాడడం సరైనది కాదన్నారు.

## నల్సార్ యూనివర్సిటీతో టిజిసిఎస్‌బి ఒప్పందం



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణలో సైబర్ చట్టాల అమలును బలోపేతం చేయడానికి తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టిజిసిఎస్‌బి), నల్సర్ యూనివర్సిటీతో అవగాహన ఒప్పందంపై సంతకం చేయడం ఒక మైలురాయని డిజిపి డాక్టర్ జితేందార్ అన్నారు. రాష్ట్రంలో సైబర్ నేరాల అమలు, చట్టపరమైన సామర్థ్యాన్ని బలోపేతం చేయడానికి ఒక ముఖ్యమైన చర్యగా, తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో, హైదరాబాద్‌లోని నల్సర్ విశ్వవిద్యాలయ న్యాయ విశ్వవిద్యాలయంతో ఒక అవగాహన ఒప్పందం (ఎంఒయు)పై సంతకం చేసింది. తెలంగాణ పోలీస్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ జితేందర్, సమక్షంలో టిజిసిఎస్‌బి డైరెక్టర్ శిఖా గోయల్, నల్సర్ వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ శ్రీకృష్ణ దేవరావు ఈ అవగాహన ఒప్పందంపై సంతకం చేశారు. సైబర్ నేరాలను ఎదుర్కోవడంలో టిజిసిఎస్‌బి యొక్క కార్యాచరణ నైపుణ్యంతో చట్టపరమైన విద్య, విధాన పరిశోధన మరియు ఫోరెన్సిక్ సామర్థ్యాలను ఏకీకృతం చేయడం, చట్టం, సాంకేతికతను మిళితం చేసే బహుళ విభాగ నమూనాను సృష్టించడం ఈ సహకారం లక్ష్యంగా పెట్టుకున్నారు.

### ఉచిత ఆటో పర్మిట్లను అడ్డుకుంటే
## ఆటో ఫైనాన్సియర్ల కార్యాలయాలు ముట్టడిస్తాం

### ఆటో రిక్షా డ్రైవర్ల సంఘాల జెఎసి హెచ్చరిక




**ప్రజాపక్షం/హైదరాబాద్:** జిహెచ్ఎంసి, ఒఆర్ఆర్ పరిధిలో రాష్ట్ర ప్రభుత్వం జారీచేసే ఉచిత ఆటో పర్మిట్లను ప్రైవేట్ ఆటో ఫైనాన్సియర్లు అడ్డుకుంటే తగిన గుణపాఠం చెబుతామని తెలంగాణ రాష్ట్ర ఆటో రిక్షా డ్రైవర్ల సంఘాల జెఎసి హెచ్చరించింది. ప్రైవేట్ ఆటో ఫైనాన్సియర్లు తమ అక్రమ వ్యాపారంతో ఆటో డ్రైవర్లను నిలువు దోపిడీ చేయడానికి ఉచిత ఆటో పర్మిట్లను అడ్డుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని జెఎసి నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్ బషీర్‌బాగ్‌లోని దేశోద్ధారక భవన్‌లో బుధవారం జరిగిన మీడియా సమావేశంలో తెలంగాణ రాష్ట్ర ఆటో రిక్షా డ్రైవర్ల సంఘాల జెఎసి కన్వీనర్ బి.వెంకటేశం, ఎస్.అశోక్ (ఎఐటియుసి), వి.మారయ్య, మహేష్ (బిఆర్‌టియు), అజయ్‌బాబు (సిఐటియు), వి.ప్రవీణ్, లింగం గౌడ్ (టియుసిఐ), ఎం.ఎ.సలీం, రఫీక్ (యుటిఎడిడబ్ల్యుఎ)లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బి.వెంకటేష్ మాట్లాడుతూ నిరుద్యోగాన్ని రూపుమాపాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ఉచిత ఆటో పర్మిట్ల జారీకి ఉత్తర్వులు (జిఓ) జారీ చేసిందని, దీంతో తమ అక్రమ వ్యాపారం జరగదని భావించిన ఆటో ఫైనాన్సియర్లు ఈ జిఓను అడ్డుకునేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నారన్నారు.

ఉచిత ఆటో పర్మిట్లను అడ్డుకుంటే ఆటో ఫైనాన్సియర్లు తీవ్ర పరిణామాలు ఎదుర్కోవలసి వస్తుందని, ఈ ప్రయత్నాలను ఆపకుంటే వేలాదిమంది ఆటో డ్రైవర్లతో ఆటో ఫైనాన్సియర్లు కార్యాలయాలను ముట్టడిస్తామని హెచ్చరించారు. గత 12 ఏళ్లుగా ప్రైవేట్ ఆటో ఫైనాన్సియర్ల అరాచకాలు కొనసాగుతూనే ఉన్నాయని, కాలం చెల్లిన పాత ఆటోలను తుక్కుగా మార్చి ఆ పర్మిట్లపై కొత్త ఆటో కొనుగోలు చేస్తూ ఆర్‌బిఐ నిబంధనలను ఉల్లంఘిస్తూ కోట్లాది రూపాయల అక్రమ వ్యాపారం చేస్తున్నారని తెలిపారు. నేటికీ సుమారు 80వేల ఆటో పర్మిట్లు ఆటో ఫైనాన్సియర్ల వద్ద ఉన్నాయన్నారు. ఆటో షోరూమ్ ధర రూ.2.70లక్షల ఉంటే ఆటో ఫైనాన్సియర్లు ఆటో డ్రైవర్‌కు రూ.5లక్షలకు అమ్మి మధ్యలో రూ.2.30 లక్షలను అదనంగా తీసుకుంటున్నారన్నారు. ఆటో డ్రైవర్లకు కొత్త ఆటో కోసం రూ.5లక్షలకు ఫైనాన్స్ ఇచ్చి వారికి శాశ్వత రుణగ్రస్తులుగా మార్చి వందల కోట్ల వ్యాపారాలు చేస్తున్నారని అన్నారు.

## కార్మికులకు అండగా ఉంటా

### రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి డాక్టర్ వివేక్ వెంకటస్వామి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలో ఇప్పటికే ఉన్న కార్మిక సంక్షేమ పథకాలు, చట్టాలను పటిష్టంగా అమలు చేసి కార్మికులకు అండగా ఉంటానని రాష్ట్ర కార్మిక, ఉపాధి, శిక్షణ, ఫ్యాక్టరీలు, మైనింగ్, జియాలజి శాఖ మంత్రి డాక్టర్ వివేక్ వెంకటస్వామి చెప్పారు. కార్మిక, మైనింగ్ శాఖల అభివృద్ధికి శాయశక్తుల కృషి చేస్తానని, ఇసుకను సామాన్యులకు అందుబాటులో తెస్తామని, ఇందు కోసం ఇసుకపై ఒక మంచి విధానాన్ని తీసుకువస్తామన్నారు. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ సచివాలయంలో బుధవారం మంత్రి వివేక్ బాధ్యతలు స్వీకరించారు. స్కిల్ డెవలప్‌మెంట్‌లో భాగంగా టాటా టెక్నాలజీస్‌తో కలసి ఐటిఐలలో 46 స్కిల్ డెవలప్‌మెంట్స్ సెంటర్ల ఏర్పాటుకు సంబంధించిన మొదటి ఫైల్‌పై మంత్రి తొలి సంతకం చేశారు. రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మాజీ మంత్రి జి.వినోద్‌తో పాటు పలువురు ప్రముఖులు, ప్రజా ప్రతినిధులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి వివేక్ మాట్లాడుతూ తాను ప్రాతినిధ్యం వహించే చెన్నూరు, పెద్దపల్లి నియోజకవర్గంలో కూడా సింగరేణి మైనింగ్‌తో పాటు వేలాదిమంది కార్మికులు ఉన్నారని, వీరితో పాటు రాష్ట్రంలో ఉన్న కార్మికుల సంక్షేమానికి సాధ్యమైనంత మేరకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో గిగ్ వర్కర్ల సంక్షేమానికి ప్రత్యేక పాలసీని రూపొందిస్తున్నామని, ఈ అంశంపై త్వరలో సదస్సు నిర్వహిస్తామన్నారు. ప్రభుత్వ గ్యారంటీ స్కీమ్స్ అమలుకు ఆదాయాన్ని మెరుగు పర్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సుమారు రూ.2076కోట్ల వ్యయంతో 46 అడ్వాన్స్‌డ్ కొత్త కోర్సులు ప్రారంభించనున్నట్లు మంత్రి వెల్లడించారు. వీటిని టాటా టెక్నాలజీస్, రాష్ట్ర ప్రభుత్వం సంయుక్తంగా ప్రారంభిస్తుందని, ఇవి దేశంలోనే రోల్ మోడల్‌గా ఉంటాయన్నారు. ఈ మంత్రి పదవి ద్వారా మరోసారి కార్మిక, బడుగు బలహీన వర్గాలకు సేవచేసే అవకాశం లభించిందన్నారు.

## ఎపి ఎఐఎస్‌ఎఫ్ నాయకులపై పోలీసుల దాడి గర్హనీయం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** శ్రీచైతన్య విద్యాసంస్థలు చేస్తున్న ఫీజుల దోపిడీకి వ్యతిరేకంగా విజయవాడలో శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమితి ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్రనాయకులపై పోలీసులు దాడి చేయడాన్ని ఎఐఎస్‌ఎఫ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శి మణికంత రెడ్డి, పుట్ట లక్ష్మ ణ్ తీవ్రంగా ఖండించారు. యాజమాన్యంతో కుమ్మక్కైన పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శిస్తూ విద్యార్థి నాయకులపై దాడి చేసి తీవ్రంగా గాయపర్చడం గర్హనీయమన్నారు. పోలీసులు దాడిలో రాష్ట్ర అధ్యక్షుడు వలరాజు, రాష్ట్ర కార్యదర్శి నాసర్జి, ఉపాధ్యక్షుడు సాయి మరియు రాష్ట్ర నాయకులు తీవ్రంగా గాయపడ్డారని, దాడిచేసిన ఎస్‌సి శంకర్, కానిస్టేబుల్ వీరు, ఇతర అధికారులపై చర్యలు తీసుకోవాలని ఎఐఎస్‌ఎఫ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శి మణికంత రెడ్డి, పుట్ట లక్ష్మ ణ్ డిమాండ్ చేశారు.

## కాలయాపన చేయొద్దు
### ఎమ్మెల్సీ కవిత

**ప్రజాపక్షం/హైదరాబాద్:** బనకచర్ల ప్రాజెక్టును అడ్డుకునే విషయంలో రాష్ట్ర ప్రభుత్వం పవర్‌పాయింట్ ప్రజంటేషన్‌తో కాలయాపన చేయడం కాదని, ఢిల్లీలో లొల్లి పెడితే, ప్రాజెక్ట్ ఆగుతుందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎంఎల్‌సి కల్వకుంట్ల కవిత సూచించారు. గోదావరి బనకచర్ల ప్రాజెక్టులో భాగంగా 150 టిఎంసి సామర్థ్యంతో బొల్లాపల్లి వద్ద ఎపి ప్రభుత్వం నిర్మించబోతున్న భారీ రిజర్వాయర్ కారణంగా నల్లమల అడవి మునిగిపోతుందని, దీనిపై న్యాయపోరాటం చేస్తామన్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ సిఎం రేవంత్ రెడ్డి బొల్లాపల్లి రిజర్వాయర్‌ను నిర్మించకుండా అడ్డుకోవాలని, లేదంటే పేపర్ పులిగా మిగిలిపోతారని ఎద్దేవా చేశారు. సిఎం రేవంత్ రెడ్డి, బిసి బిల్లు విషయం లో ప్రధాని మోదీతో చర్చించకపోవడం దారుణమన్నారు. తెలంగాణ ప్రాజెక్టులకు చంద్రబాబు వ్యతిరేకం కాదని ఎపి మంత్రి నిమ్మల చెప్పడం విడ్డూరమన్నారు. చంద్రబాబు సిఎంగా ఉన్నప్పుడు తెలంగాణ ప్రాజెక్టుల కు వ్యతిరేకంగా లేఖలు రాశారని, సుప్రీంకోర్టులో పిటిషన్లు వేయించారని గుర్తు చేశారు.


**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**

'e' NIT No. 05/J1IT/GHMC/2025-26/1st Recall ('ఇ' ప్రొక్యూర్‌మెంట్ టెండర్స్) తేది: 16.06.2025

**పని పేరు:** జూన్-2025 నుండి సెప్టెంబర్-2025 వరకు (అంటే, 01.06.2025 నుండి 30.09.2025) (4) నెలల వరకు 4G LTE (డేటా రేడియో) ఆధారిత వాకీ టాకీ వైర్‌లెస్ కమ్యూనికేషన్ సెట్లను GHMCకి నియామకం, **అంచనా విలువ / ఇసివి:** రూ.8,85,064/-, **బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేది / ఆఖరి తేదీ & సమయం:** ప్రారంభ తేది: 18.06.2025న ఉ.11.00గం.ల నుండి, ఆఖరి తేది: 20.06.2025న సా.04.00గం.ల వరకు, **అధికారి పేరు & చిరునామా:** ఓ/ఓ అడిషనల్ కమిషనర్ (ఐటి), 3వ అంతస్తు, సిసి కాంప్లెక్స్ బిల్డింగ్, జిహెచ్ఎంసి, లిబర్టీ సర్కిల్, హైదరాబాద్ - 500063. ఫోన్: 6309999458. deeitghmc@gov.in.

సం/- అడిషనల్ కమిషనర్ (ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ), జిహెచ్ఎంసి

DIPR R.O. No. : 3749-PP/CL/ADVT/1/2025-26, Date: 18-06-2025

**శ్రీ ఆంజనేయ స్వామి దేవస్థానము,**
వెలిమినేడు గ్రామం, చిట్యాల మండలము, నల్లగొండ జిల్లా

లేఖ నెం.యస్.యస్.టి/2025, (టెండర్ - కం - బహిరంగ వేలముల ప్రకటన) తేది: 18.06.2025

ఇందు మూలముగా సమస్త ప్రజలకు తెలియజేయునది ఏమనగా ! సదరు దేవస్థానమునకు సంబంధించిన బహిరంగ వేలము ది:21-06-2025 శనివారము రోజున మ. 2-00 గం.లకు దేవాలయ ప్రాంగణం నందు దేవాదాయ శాఖ అధికారుల సమక్షములో నిర్వహించబడును.

| క్ర.సం. | వేలము వివరము | డిపాజిట్ డి.డి/నగదు | కాలపరిమితి |
|---|---|---|---|
| 1 | కొబ్బరికాయలు, పూజాసామాగ్రి, లడ్డూ, పులిహోర ప్రసాదములు & కొబ్బరి చిప్పలు సేకరించుకొను హక్కు | 2,00,000/- | 04-07-2025 నుండి 03-07-2026 వరకు (1 సం॥) |

కావున పైన తెలిపిన టెండర్ - కం - బహిరంగ వేలం నిర్వహించుటకు ఒక గంట ముందు ఆసక్తిగలవారు డిపాజిట్ చెల్లించి వేలంపాటలో పాల్గొనగలరని కోరనైనది. ఇతర వివరములకు మొబైల్ నెంబర్ 9703662667 సంప్రదించగలరు.

ఇట్లు, సిరికొండ నవీన్ కార్యనిర్వహణాధికారి

DIPR R.O. No. : 3780-PP/CL/ADVT/1/2025-26, Date: 18-06-2025

**నేరేడుచర్ల మున్సిపాలిటీ కార్యాలయం, సూర్యాపేట - జిల్లా.**

ఇ-ప్రొక్యూర్‌మెంట్ షార్ట్ టెండర్ నోటీసు

టెండర్ నోటీసు నెం.E1/936/03/1-2/MCNDCL/2025-26 తేది: 18.06.2025

దిగువ టెండర్లు ఆహ్వానించబడ్డాయి

| క్ర.సం. | పని పేరు | అంచనా మొత్తం (లక్షల్లో) |
|---|---|---|
| 01. | 2025-26 గ్రీన్ బడ్జెట్ కింద నేరేడుచర్ల మునిసిపాలిటీలో వన మహోత్సవం కింద అవెన్యూ ప్లాంటేషన్ కోసం మొక్కల సేకరణ. | 4.00 |
| 02. | 15వ ఎఫ్‌సిజి/స్టేట్ మ్యాచింగ్ గ్రాంట్ / జనరల్ ఫండ్ కింద నేరేడుచర్ల మునిసిపాలిటీలోని వివిధ ప్రదేశాలలో లోతట్టు ప్రాంతాలు మరియు గుంతలను కంకరతో నింపడం. | 2.00 |
| | బిడ్ డౌన్‌లోడ్ | 19-06-2025 @ 11:00 AM నుండి 23-06-2025 @ 11:00 AM వరకు |
| | సాంకేతిక బిడ్ ప్రారంభం | 23-06-2025 @ 11:01 AM వరకు |

నేరేడుచర్ల మున్సిపాలిటీలో గ్రీన్ బడ్జెట్ & 15వ ఎఫ్‌సిజి / స్టేట్ మ్యాచింగ్ గ్రాంట్ / జనరల్ ఫండ్ . 2025-26 కింద ఇ-ప్రొక్యూర్‌మెంట్ గవర్నమెంట్ పోర్టల్ తెలంగాణ ద్వారా. మరిన్ని వివరాల కోసం దయచేసి https://tender.telangana.gov.in ని సందర్శించండి. పూర్తి వివరాల కోసం పనివేళల్లో మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగాన్ని సంప్రదించండి. సంప్రదింపు వివరాలు: 9492256688, 6303571223

సం/- కమిషనర్, నేరేడుచర్ల మున్సిపాలిటీ.

DIPR R.O. No. : 3747-PP/CL/ADVT/1/2025-26, Date: 18-06-2025


## గోదావరి–బనకచర్ల ప్రాజెక్టుపై కేంద్ర జలశక్తి మంత్రితో కిషన్‌రెడ్డి భేటీ



**న్యూఢిల్లీ:**గోదావరి–బనకచర్ల ప్రాజెక్టుపై కేంద్ర జలశక్తి మంత్రి సి.ఆర్. పాటిల్‌తో చర్చించినట్లు కేంద్ర గనుల శాఖ మంత్రి, బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్ రెడ్డి తెలిపారు. తాము ఇరువురం బుధవారం ఢిల్లీలోని శ్రమశక్తి భవన్‌లో భేటీ అయ్యామని ఆయన తన 'ఎక్స్' ఖాతాలో పోస్ట్ చేశారు. ఈ సందర్భంగా అనేక అంశాలతో పాటు ప్రత్యేకించి గోదావరి–బనకచర్ల ప్రాజెక్టు గురించి చర్చించామని తెలిపారు. ఈ ప్రాజెక్టును తమ మంత్రిత్వ శాఖలో కొనసాగుతున్న నిబంధనల ప్రకారం న్యాయబద్ధంగా పరిశీలిస్తామని, అనంతరం సంబంధిత భాగస్వామ్యపక్షాలతో సంప్రదింపులు జరుపుతామని జలశక్తి మంత్రి సి.ఆర్.పాటిల్ హామీ ఇచ్చినట్లు కిషన్‌రెడ్డి వెల్లడించారు. ఏ రాష్ట్రం కూడా అన్యాయానికి గురికాకుండా చూసేందుకు మోదీ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన అన్నారు. కాగా,గోదావరి – బనకచర్ల ప్రాజెక్టుపై బుధవారం సచివాలయంలో తెలంగాణ ప్రభుత్వం అన్ని పార్టీల ఎంపిలతో సమావేశాన్ని నిర్వహించింది. దీనికి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని కూడా ఆహ్వానించగా, బిజెపి ఎంపిలు హాజరయ్యారు. అదే సమయంలో ఆయన ఢిల్లీలో కేంద్ర జలశక్తి మంత్రితో భేటీ అయిన ఫోటోలను 'ఎక్స్' ఖాతాలో పోస్ట్ చేశారు.

## అవును..నా ఫోన్ ట్యాప్ చేశారు
### ఎపి పిసిసి ప్రెసిడెంట్ వై ఎస్. షర్మిల



**విశాఖపట్నం :** తన ఫోన్ ట్యాపింగ్ జరిగింది అనేది వాస్తవమని ఆంధ్రప్రదేశ్ పిసిసి అధ్యక్షులు వై.ఎస్. షర్మిల అన్నారు. నా ఫోన్, నా భర్త ఫోన్,నా దగ్గర వాళ్ళ ఫోన్‌లు ట్యాప్ చేశారనేది ముమ్మాటికి పచ్చి నిజమని చెప్పా రు. విశాఖపట్నంలో బుధవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ ఫోన్ ట్యాప్ జరిగినట్లు స్వయంగా వైసిపి ఎంపి వై.వి.సుబ్బారెడ్డి నిర్ధారించారని, అనాడు ట్యాపింగ్ జరిగిన నా ఆడియో ఒకటి నాకే వినిపించారని తెలిపారు. ఫోన్ ట్యాపింగ్ విషయంలో విచారణకు ఎక్కడికి రమ్మని చెప్పినా వస్తానని చెప్పారు. బైబిల్ మీద ప్రమాణం చేసి చెప్తున్న... ఫోన్ ట్యాపింగ్ పచ్చి నిజమని షర్మిల అన్నారు. తెలంగాణ, ఎపి ముఖ్యమంత్రులు రేవంత్‌రెడ్డి, చంద్రబాబు నాయుడు ఫోన్ ట్యాపింగ్ విషయంలో విచారణ వేగవంతం చేయాలని కోరారు. అనాడు జగన్, కెసిఆర్ మధ్య ఉన్న సంబంధం చూసి రక్త సంబంధం కూడా చిన్నబోయిందని, తెలంగాణలో తనను రాజకీయంగా, ఆర్థికంగా అణగదొక్కేందుకు ఇద్దరు కలిసి చేసిన జాయింట్ ఆపరేషన్ ఫోన్ ట్యాపింగ్ అని ఆమె ఆరోపించారు. వారిద్దరి అరాచకాలతో పోలిస్తే ఫోన్ ట్యాపింగ్ చాలా చిన్నదన్నారు. రెండు రాష్ట్రాల ప్రభుత్వాలు ఫోన్ ట్యాపింగ్ విషయంలో దర్యాప్తు ముమ్మరం చేయాలని విజ్ఞప్తి చేశారు.

ప్రజాపక్షం
గురువారం, 19 జూన్

# మళ్లీ హిందీ రభస

సమాఖ్య విధానాన్ని ధ్వంసం చేసి, ఏకీకృత పాలనే లక్ష్యంగా ఎంచుకున్న భారతీయ జనతా పార్టీ (బిజెపి), ఏక్షపక్షంగా ముందుకు వెళుతున్నది. దేశ వ్యాప్తంగా హిందీని అన్ని రాష్ట్రాలపై రుద్దడానికి శక్తివంచన లేకుండా ప్రయత్నిస్తునే ఉంది. మహారాష్ట్రలో 'మూడో భాష'గా హిందీని చేర్చడం ద్వారా, బిజెపి తన నైజాన్ని మరోసారి బయటపెట్టుకుంది. హిందీని విద్యా విధానంలో తప్పనిసరి చేయడం ప్రాంతీయ భాషలకు ముప్పుగా మారుతుందనేది నిజం. ప్రాంతీయ భాషల ప్రాధాన్యత తగ్గిపోతుందన్నది వాస్తవం. హిందీని బలవంతంగా విద్యా ప్రణాళికలో చేర్చడం సమాఖ్య వ్యవస్థకు విరుద్ధమేకాదు... రాష్ట్రాలకు వారి భాషా విధానాన్ని నిర్ణయించుకునే స్వాతంత్ర్యాన్ని హరించడం కూడా. తమిళనాడు వంటి రాష్ట్రాలు తమ మాతృభాష ప్రాధాన్యతను కాపాడేందుకు ద్విభాషా విధానాన్ని పాటిస్తున్నాయి. హిందీని మూడో భాషగా బలవంతంగా ప్రవేశపెట్టడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. ఎన్ని విమర్శలు ఉన్నప్పటికీ, అటు కేంద్రం, ఇటు బిజెపి పాలిత రాష్ట్రాలు హిందీపై మంకుపట్టు వీడడం లేదు. మహారాష్ట్ర ప్రభుత్వం హిందీని మూడో భాషగా తప్పనిసరి చేయాలన్న నిర్ణయాన్ని తీవ్ర ప్రతిఘటనల నేపథ్యంలో వెనక్కి తీసుకొని, 'సాధారణం' అనే పదాన్ని చేర్చి, మళ్లీ అదే తీర్మానాన్ని తెరపైకి తెచ్చింది. మొదటి తీర్మానంలో 'తప్పనిసరి' అనే పదాన్ని 'సాధారణం'గా మార్చడం మినహా ప్రజాభిప్రాయానికి ఏమాత్రం ప్రాధాన్యం ఇవ్వలేదు. హిందీని తప్పనిసరి చేయడం లేదని, రాష్ట్రాలు తమకు నచ్చిన భాషలను ఎంచుకునే స్వేచ్ఛ ఉందని సన్నాయి నొక్కులు నొక్కుతున్న కేంద్రం, రాజకీయ ప్రయోజనాల కోసం హిందీపై అనవసర రాద్ధాంతం చేస్తున్నారని ప్రతిపక్ష పార్టీలపై ఎదురుదాడికి దిగుతోంది. కానీ, వాస్తవ పరిస్థితులు మాత్రం భిన్నంగా ఉన్నాయి. ఏదో ఒక రూపంలో హిందీని జాతీయ విద్యావిధానంలో భాగం చేయడమే కేంద్రంలోని బిజెపి లక్ష్యంగా కనిపిస్తున్నది. ప్రాంతీయ భాషల ప్రాధాన్యం, భాషా స్వాతంత్ర్యం, సమాఖ్య వ్యవస్థపై ప్రభావం వంటి అంశాలను నిర్లక్ష్యం చేస్తున్నది. కేంద్ర ప్రభుత్వం హిందీని విద్యా, పరిపాలన, అధికారిక వ్యవహారాల్లో ప్రోత్సహించే నిర్ణయాలు తీసుకుంటే, ఇతర భాషలు మాట్లాడే రాష్ట్రాల్లో ఇది భాషా ఆధిపత్యంగా మారడం తథ్యం. తమిళనాడు, కర్ణాటక, కేరళ వంటి రాష్ట్రాలు తమ భాషా హక్కులను కాపాడేందుకు నిరసనలు, ఉద్యమాలు నిర్వహిస్తున్నాయి. మిగతా రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్నాయి. మహారాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయం, తిరిగి ఈ వివాదాన్ని మొదటికి తీసుకెళుతున్నది. కేంద్ర ప్రభుత్వం తీసుకునే హిందీ ప్రోత్సాహక లేదా అనుకూల నిర్ణయాలు ప్రాంతీయ అసంతృప్తిని, భాషా వివాదాలను రెచ్చగొడుతున్నాయి. హిందీని విద్యా విధానంలో ఏదో ఒక రకంగా జొప్పించడం దక్షిణాది, ఈశాన్య రాష్ట్రాల్లో తీవ్ర వ్యతిరేకతకు దారి తీస్తున్నది. తమిళనాడు, కేరళ, నాగాలాండ్, అరుణాచల్ ప్రదేశ్ వంటి రాష్ట్రాలు తమ ప్రాంతీయ భాషల ప్రాధాన్యతను కాపాడేందుకు కృషి చేస్తున్నాయి. మరో వైపు కేంద్రంలోని బిజెపి కుట్రపూరిత వ్యూహాలతో హిందీని తప్పనిసరి చేసే ప్రయత్నాలు కొనసాగిస్తున్నది. 2020 జాతీయ విద్యా విధానంలో త్రిభాషా సూత్రాన్ని అమలు చేయాలని కేంద్రం ఒత్తిడి చేయడం వల్ల తమిళనాడు వంటి రాష్ట్రాలకు కేంద్ర నిధులు నిలిపివేయడం వంటి పరిణామాలు చోటు చేసుకున్నాయి. ఇది కేంద్ర–రాష్ట్ర సంబంధాల్లో ఉద్రిక్తతకు దారి తీసింది. ఏదిఏమైనా, హిందీని ప్రోత్సహించడాన్ని ప్రాంతీయ భాషలపై ముప్పుగా భావిస్తూ, స్థానిక సంస్కృతి, భాషల మనుగడ రక్షణ కోసం ఆందోళనలు పెరుగుతున్నాయి. భాష ఆధారంగా ఉత్తర –దక్షిణ విభేదాలు, కేంద్ర–రాష్ట్ర విభేదాలు మరింత తీవ్రమయ్యాయి. ఇది రాజకీయాలను మరింత ఉద్రిక్తత పరిస్థితుల్లోకి నెడుతున్నది. బిజెపి వారి దృష్టిలో హిందీ జాతీయ భాష. హిందీ–హిందుస్థాన్‌లాంటి నినాదాలు అందులో భాగమే. బిజెపి తన మొండివైఖరిని మానుకోకపోతే, హిందీ మాట్లాడే రాష్ట్రాలు మినహా, దేశ వ్యాప్తంగా భాషా ఉద్యమాలు ఉధృతం కావడం ఖాయం.

# ఆపరేషన్ సిందూర్‌పై భారత ప్రభుత్వ విఫల దౌత్యం



పల్లభ్ సేన్ గుప్తా
సిపిఐ జాతీయ కార్యదర్శి

పెహల్గామ్‌లో జరిగిన దారుణ ఉగ్రవాద దాడి, అమాయక ప్రాణాలను బలిగొని, దేశ అంతరాత్మను దిగ్భ్రాంతికి గురిచేసింది. ఈ దాడి విస్తృత స్థాయిలో ఖండించబడడంతోపాటు, బాధలో ఉన్న భారత ప్రజలను విభజించకుండా ఏకం చేసింది. సీమాంతర ఉగ్రవాదాన్ని నిరంతరం ప్రోత్సహిస్తుందని పాకిస్తాన్‌ను ఎండగట్టే ప్రయత్నాలను దాడి జరిగిన తర్వాత భారత ప్రభుత్వం ముమ్మరం చేసింది. ఆపరేషన్ సింధూర్ ఊపందుకోవడంతో, ఇస్లామాబాద్‌ను అంతర్జాతీయంగా ఏకాకిని చేసే లక్ష్యంతో న్యూఢిల్లీ ఉన్నత స్థాయి దౌత్యపరమైన దాడిని ప్రారంభించింది. అంతర్జాతీయ అభిప్రాయాన్ని సమీకరించడానికి, భారత దేశ వైఖరికి మద్దతును కూడగట్టేందుకు కీలక ప్రపంచ దేశాల రాజధానులకు అఖిలపక్ష ప్రతినిధి బృందం పంపబడింది. పాకిస్తాన్ మీద స్పష్టమైన దౌత్యపరమైన అభిశంసనను కూడగట్టేందుకు, ఆ దేశానికి అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్, ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ (ఎడిబి) వంటి సంస్థల నుండి ఆర్థిక సహాయం లభించకుండా అడ్డుకోవడం అనే రెండు స్పష్టమన లక్ష్యాలతో ఈ చొరవ చేయబడింది.

భారతదేశం వైఖరిలో నైతిక స్పష్టత ఉన్నప్పటికీ, ఉగ్రవాదాన్ని పెంపొందించడంలో పాకిస్తాన్ ప్రమేయంపై బలమైన సాక్ష్యం ఉన్నప్పటికీ, దౌత్య ప్రచారం తీవ్ర సవాళ్లను ఎదుర్కొంది. భౌగోళిక రాజకీయ లెక్కలు, వ్యూహాత్మక ప్రయోజనాల ఆధారంగా నడిచే ప్రధాన శక్తులు భారతదేశ ప్రయత్నాలకు సంపూర్ణ మద్దతు ఇవ్వడంలో అనాక్తిగా ఉన్నాయి. అంతేకాకుండా, అఖిలపక్ష ప్రతినిధి బృందం ప్రయాణ ప్రణాళిక నుండి పొరుగు దేశాలను మినహాయించారు; వారు ఉగ్రవాద దాడులను ఖండించినప్పటికీ, పాకిస్తాన్‌పై భారత దేశ వైఖరికి మద్దతు ఇవ్వడంలో మౌనంగా ఉన్నారు.

ఈ మొత్తం కసరత్తును అధికార ప్రభుత్వ లోపభూయిష్ట , దిగజారుడు ప్రాధాన్యతలకు ప్రతిబింబంగా భారత కమ్యూనిస్టు పార్టీ నిరంతరం చూసింది. విదేశీ సానుభూతిని పొందటానికి ఉన్నత స్థాయి ప్రతినిధి బృందాన్ని పంపేందుకు ప్రభుత్వానికి సమయం దొరికినప్పటికీ, ఆపరేషన్ సింధూర్ పర్యవసానాలు, లక్ష్యాలు, పరిణామాలను చర్చించేందుకు దేశంలో అత్యున్నత ప్రజాస్వామిక వేదిక అయిన భారత పార్లమెంటును ఉద్దేశపూర్వకంగా సమావేశపరచకుండా నివారించింది. పార్లమెంటును ఉద్దేశపూర్వకంగా దాటవేయడం ఒక నిరంకుశ వైఖరిని, ప్రజాస్వామ్య జవాబుదారీతనం పట్ల తీవ్ర అమర్యాదను ప్రతిబింబిస్తుంది.

భారత ప్రజల ఎన్నికైన ప్రతినిధులకు తెలియజేయడం, వారిని భాగస్వామ్యం చేయడం కాకుండా, ప్రభుత్వం తన కథనాన్ని విదేశాలలో ప్రచారం చేయడానికి ఎంచుకుంది. అంతర్గత పారదర్శకత కంటే అంతర్జాతీయంగా ప్రచారం చేసుకోవడం కోసమే ఎక్కువ ప్రాధాన్యతను ఇచ్చింది.



**కీలకమైన వ్యూహాత్మక, రాజకీయ, ప్రాంతీయ చిక్కులను కలిగి ఉన్న ఏదైనా ఆపరేషన్ గురించి పార్లమెంటులో చర్చించబడాలని మేము విశ్వసించాము. ఒకవేళ పరిస్థితి ఇతర దేశాలకు బహుళ-పార్టీల ప్రతినిధి బృందాలను పంపడానికి అనుమతించినట్లయితే, ఒకవైపు అంతర్జాతీయ శ్రోతలకే ఎంపిక చేసిన వివరాలను ఇచ్చినప్పుడు, మన దేశంలోని ప్రజాస్వామ్య సంస్థలను ఎందుకు చీకటిలో ఉంచారు? ఈ ప్రశ్నలకు సమాధానం లేదు. తన స్వంత చట్టసభల కంటే విదేశీ రాజధానులను మరింత గౌరవంగా చూసే ప్రభుత్వ నిర్ణయం పార్లమెంటరీ ప్రజాస్వామ్య సూత్రాలకు అవమానం.**

అంతేకాకుండా, ప్రభుత్వం సైనిక కథనాలు, బాహ్య ప్రపంచానికి వెల్లడిపైనే అధికంగా ఆధారపడడం పట్ల సిపిఐ ఆందోళన వ్యక్తం చేస్తోంది. అయితే ఎటువంటి గణనీయమైన దౌత్య పరమైన ప్రయోజనాలను సాధించడంలో ప్రభుత్వం విఫలమైంది. 33 దేశాలకు పంపిన ప్రతినిధి బృందాలకు ఉచ్ఛ స్వర మీడియా వాక్చాతుర్యం, జాతీయవా దం, భారతదేశం 'పాకిస్తాన్‌ను దౌత్యపరంగా ఒంటరి చేయబోతోంది' అనే వాదనలు తోడయ్యాయి. అయితే, ఫలితాలు భిన్నమైన కథను చెబుతున్నాయి. జపాన్, దక్షిణ కొరియా, ఇండోనేషియా, మలేషియా, సింగపూర్ దేశాలను సందర్శించిన ప్రతినిధి బృందంలో సభ్యుడైన టిఎంసి ఎంపి అభిషేక్ బెనర్జీ 'ఎన్ని దేశాలు భారతదేశానికి స్పష్టమైన మద్దతును అందించాయి?' అని ప్రశ్నించారు.

మన ప్రతినిధి బృందాలు వివిధ దేశాలను సందర్శిస్తున్న సమయంలోనే పాకిస్తాన్ ప్రధాన శక్తులతో దౌత్యపరంగా నిమగ్నమై ఉంది. పాకిస్తాన్‌పై అంతర్జాతీయ సమాజం అర్థవంతమైన ఆంక్షలు విధించడానికి లేదా ఆర్థిక సహాయాన్ని నిలిపివేయడానికి ఎటువంటి సంసిద్ధతను ప్రదర్శించలేదు. భారతదేశ అభ్యంతరాలు వ్యక్తం చేసినప్పటికీ పాకిస్తాన్‌కు ఐఎంఎఫ్ బెయిల్ ఔట్(బైటపడేందుకు ఆర్థిక సహాయం)ను ఆమోదించింది. ఎడిబి సహాయాన్ని స్తంభింపజేయడానికి బదులుగా, అక్కడ అభివృద్ధి ప్రాజెక్టులకు సహకరించడాన్ని కొనసాగించింది. ఈ పరిణామాలు ప్రపంచ ఆర్థిక సంస్థలలో భారతదేశం కలిగి ఉన్న వాస్తవ పరిమిత ప్రభావాన్ని స్పష్టం చేశాయి. మరీ ముఖ్యంగా, శాశ్వతమైన, సమస్య ఆధారిత ప్రపంచ కూటములను నిర్మించడంలో ప్రభుత్వం వైఫల్యాన్ని ఎత్తిచూపాయి.

మరింత ఆందోళన కలిగించే విషయం ఏమిటంటే, భారతదేశం కథనాన్ని తన స్వంత వ్యూహాత్మక భాగస్వామి పట్టించుకోలేదు. భారతదేశం, పాకిస్తాన్ మధ్య 'సంఘర్షణను పరిష్కరించిన' ఘనత తనదేనని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ బహిరంగంగా చెప్పుకున్నారు. తద్వారా సంక్షోభాన్ని భారతదేశ చట్టబద్ధమైన రక్షణాత్మక ఆపరేషన్‌గా కాకుండా, వాషింగ్టన్ మధ్యవర్తిత్వం చేసి పరిష్కరించిన ద్వైపాక్షిక వివాదంగా చిత్రీకరించబడింది. భారతదేశం వ్యూహాత్మక స్వయంప్రతిపత్తిని ఎత్తిచూపడానికి బదులు, అలాంటి ప్రకటనలు భారతదేశం స్థాయిని బాహ్య శక్తుల ద్వారా నిర్వహించబడే ఒక లొంగిపోయే ప్రాంతీయ రాజ్యంగా తగ్గించాయి. ఈ దౌత్యపరమైన ఇబ్బందిని భారత ప్రభుత్వం పరిష్కరించకుండా వదిలివేసింది. జయప్రదమైన విదేశాంగ విధాన ప్రచారాన్ని నిర్వహించామనే వాదనను మరింత దెబ్బతీసింది.

ఈ సంఘటన ప్రస్తుత పాలనలో భారత దౌత్యంలో విస్తృత మార్పునకు ప్రతీక. ఇది విషయం కంటే దృశ్యానికి, ఏకాభిప్రాయం కంటే ఏకపక్షవాదానికి, అంతర్గత ప్రజాస్వామ్య ప్రక్రియల కంటే బాహ్య ధృవీకరణకు ప్రాధాన్యత ఇస్తుంది.

**ఉగ్రవాదానికి వ్యతిరేకంగా నిజమైన లేదా ఆశించిన పోరాటం అనేది సాహసోపేత చర్యలకు లేదా నిరంకుశత్వానికి సాకుగా మారకూడదనే తన దీర్ఘకాలిక వైఖరిని సిపిఐ పునరుద్ఘాటిస్తుంది. ప్రజాస్వామ్య చర్చ, ప్రాంతీయ దౌత్యం, శాంతి, న్యాయంలో వేళ్ళూనుకున్న స్వతంత్ర విదేశాంగ విధానానికి సైనికవాదం గానీ, ప్రపంచ లాబీయింగ్ గానీ ప్రత్యామ్నాయం కాదు.**

దేశీయ ప్రజాస్వామ్య సంస్థలను బలహీనపరుస్తూ, ప్రతీకాత్మక అంతర్జాతీయంగా చేరువవడం ద్వారా బలప్రదర్శనకు ప్రభుత్వం చేసిన ప్రయత్నం జాతీయ ఐక్యత, అంతర్జాతీయ విశ్వసనీయతలను రెండింటినీ దెబ్బతీసే ప్రమాదకరమైన మార్గం.

అంతేకాకుండా, అంతర్గతంగా అసమ్మతిని క్రియాశీలంగా అణచివేసినప్పుడు, విమర్శకులను దేశద్రోహులుగా ముద్రవేసినప్పుడు, పార్లమెంటు ఎదుట ఈ విషయాన్ని ఉంచడానికి నిరాకరించినప్పుడు, బాహ్య ప్రచారం కోసం అన్ని రాజకీయ పార్టీలను ఏకం చేశారనే ప్రభుత్వ వాదన డొల్లగా మారింది. నిజమైన ప్రజాస్వామ్య విదేశాంగ విధానం అంతర్గత ప్రజాస్వామ్య ఏకాభిప్రాయం నుండి ఉద్భవించాలి. పార్లమెంటును సమావేశపరచడంలో విఫలమవడం ద్వారా, శాంతి ప్రవచకులు, ప్రాంతీయ నిపుణులు, ప్రతిపక్ష నాయకులతో సహా ప్రత్యామ్నాయ గొంతుకలను భారతదేశ ప్రతిస్పందన రూపొందే ప్రక్రియ నుంచి వేరు చేశారు.

ఆపరేషన్ సిందూర్ అనంతర ఉన్నత స్థాయి ప్రతినిధి బృందాలతో దౌత్య ప్రయత్నం, మీడియా సంచలనాలు, పాకిస్తాన్‌ను ఒంటరి చేశామనే డొల్ల వాదనలు విఫలమైనట్లు బహిర్గతమైంది. ఇది సైనిక చర్యలను అర్థవంతమైన దౌత్య ఫలితాలుగా మార్చడంలో వర్తమాన ప్రభుత్వ అసమర్థతను బైటపెట్టింది.

మరింత ముఖ్యంగా, ఇది ప్రజాస్వామ్య ప్రక్రియలను దాటవేయడం, దేశంలో పారదర్శకతను నిరాకరిస్తూ విదేశాలలో చట్టబద్ధతను కోరడం వంటి చర్యలు కలవరపెట్టే విధానాలను ప్రతిబింబించింది. ఈ అప్రజాస్వామ్య విదేశాంగ విధాన విధానాన్ని తిరస్కరించి, ప్రజాస్వామ్య జవాబుదారీతనం, ప్రాంతీయ శాంతి, సూత్రప్రాయమైన దౌత్య విధానానికి తిరిగి రావాలని డిమాండ్ చేయాలని భారత ప్రజానీకానికి సిపిఐ పిలుపునిస్తోంది.

# కమ్యూనిస్టు ఉద్యమానికి అంకితమైన కామ్రేడ్ సుగుణ

స్వాతంత్ర్య పోరాట యోధురాలు, తెలంగాణ సాయుధ పోరాటంలో పాల్గొని, కీలక బాధ్యతలు నిర్వహించి, అనేక త్యాగాలు చేసిన పోరాట యోధురాలు కామ్రేడ్ సుగుణ 91 సంవత్సరాలపాటు జీవించి 2025 జూన్ 16న చంద్ర రాజేశ్వరరావు ఫౌండేషన్ వృద్ధాశ్రమంలో చివరి శ్వాస విడిచారు. కామ్రేడ్ సుగుణ మరణంతో వీరోచిత తెలంగాణ సాయుధ పోరాటంతో ప్రత్యక్ష సంబంధం ఉన్న తరమంతా దాదాపు ముగిసిందని భావించవచ్చు. మహత్తర తెలంగాణ సాయుధ పోరాటంలో కామ్రేడ్ సుగుణకి ఆమె కుటుంబానికీ ప్రత్యేక స్థానం ఉంటుందని ఎలాంటి సందేహం లేదు.

తెలంగాణ సాయుధ పోరాటానికి ప్రపంచ విప్లవాల చరిత్రలోనే ఒక ప్రత్యేకమైన స్థానం ఉంది. ఈ సాయుధ పోరాటం ఆరు సంవత్సరాల సుదీర్ఘకాలం పాటు కొనసాగింది. నిజాం రాచరికానికి వ్యతిరేకంగా, భూస్వాముల దోపిడీకి, వెట్టిచాకిరికి వ్యతిరేకంగా, 'దొర నీబాంచన్ కాళ్ళు మొక్కుతా' అనే సామాన్య ప్రజలే సాయుధులై రాచరికాన్ని, రాజ్యాధికారాన్ని కూల్చిన చరిత్ర ఈ పోరాటానికి ఉంది. ఆ మహత్తర పోరాట రహస్యకేంద్ర స్థావరానికి బాధ్యులుగా పనిచేసిన విప్లవకారిణి కామ్రేడ్ సుగుణ.

### కుటుంబ నేపథ్యం

కామ్రేడ్ సుగుణ 1934లో నల్లగొండ జిల్లా బీబీ నగర్ దగ్గర్లో ఉన్న బ్రాహ్మణపల్లిలో జన్మించారు. తండ్రి కొమ్మిడి రామచంద్రారెడ్డి, తల్లి లక్ష్మ మ్మ. వీరిది ధనిక రైతు కుటుంబం. సుగుణ గారికి ఒక అన్నయ్య ఇద్దరు తమ్ముళ్లు, ఇద్దరు అక్కలు. అన్నయ్య కోదండరామిరెడ్డి, తమ్ముళ్లు బుచ్చిరెడ్డి ,నరసింహారెడ్డి. అక్కలు అమృతమ్మ, శశిరేఖలు. చిన్నతనంలోనే అమృతమ్మ అనారోగ్యంతో, చిన్న తమ్ముడు బుచ్చిరెడ్డి యాక్సి డెంట్లో చనిపోయారు. సాయుధ పోరాటం కొనసాగే కాలంలో యుక్త వయసులో ఉన్న కోదండరామిరెడ్డి, శశిరేఖ, సుగుణమ్మ ఉద్యమమే వృత్తిగా స్వీకరించి ప్రాణాలకు తెగించి పోరాటంలో దూకారు. కోదండరామిరెడ్డి పోరాటంలో పోలీసుల కాల్పుల్లో వీరమరణం పొందాడు. శశిరేఖ భర్త కాల్వ నారాయణరెడ్డి తన దళంలో ఉన్న నలుగురు కామ్రేడ్స్ పోలీస్ కాల్పులలో చనిపోగా తాను తప్పించుకొనే క్రమంలో తీవ్రంగా గాయపడి పోలీసులకు చిక్కి సంవత్సరాల తరబడి జైలు పాలయ్యారు. మరో చోట అక్క శశిరేఖ అరెస్టు అయి సంవత్సరాల తరబడి జైల్లో ఉంది. అలాంటి త్యాగమూర్తుల కుటుంబం నుండి వచ్చినవారే కామ్రేడ్ సుగుణ.

సుగుణ అన్నయ్య కోదండరామిరెడ్డి, సుగుణ యుక్త వయసు వచ్చేనాటికే కమ్యూనిస్టు పార్టీలో చురుకుగా పని చేస్తున్నాడు. భీమిరెడ్డి నరసింహారెడ్డి, కోదండరామిరెడ్డి మంచి మిత్రులు. భీమిరెడ్డి నరసింహారెడ్డి నల్లగొండ జిల్లా బాధ్యతలు చూసేవారు. ఆ సమయాన కోదండరామిరెడ్డి హైదరాబాదు, పరిసర జిల్లాలను కలిపి పిలువబడే 'అత్రాఫ్ బల్దా' జిల్లా బాధ్యతలు చూసేవారు. సుగుణకి అన్నయ్య కోదండ రామిరెడ్డే గురువు. స్ఫూర్తి ప్రదాత.

### ఉద్యమ ప్రస్థానం

అన్నయ్య కోదండరామిరెడ్డి ద్వారానే కామ్రేడ్ సుగుణకు చిన్నతనం నుండే ఆర్య సమాజ్, ఆంధ్ర మహాసభ, కమ్యూనిస్టు పార్టీలతో అనుబంధం ఏర్పడింది. రావి నారాయణ రెడ్డి, భీమిరెడ్డి నరసింహ రెడ్డి, దేవులపల్లి వెంకటేశ్వరరావు తరచుగా సుగుణ ఇంటికి వచ్చేవారు. వారిని చూసే అవకాశం, కలిసే అవకాశం, చర్చించే అవకాశం ఆమెకు లభించింది. తన అన్నయ్య కోదండరామిరెడ్డి తన సోదరి శశిరేఖను, భీమిరెడ్డి గారి సోదరి మల్లు స్వరాజ్యమును విజయవాడలో జరిగే రాజకీయ ట్రైనింగ్ క్యాంపుకి పార్టీ పంపింది. తనని ఇంకా చిన్న పిల్లవేనని పంపకపోవటానికి సుగుణ చాలా బాధపడింది. మరింత పట్టుదలని పెంచుకున్నారు. తాను దళాల్లోకి వెళ్లాలని, తుపాకి పట్టుకోవాలనే ఆకాంక్షను ఎప్పుడు నాయకుల ముందు పెట్టేవారు. వారు నీకు ఇంకా సమయం ఉందిలే అనేవారు. తన అక్క శశిరేఖ, మల్లు స్వరాజ్యం ఆయుధాలతో, దళాలతో కనపడుతుంటే ఉడికి పోయేవారు.



పార్టీ నాయకులు కలిసినప్పుడల్లా తనకు ఎప్పుడు పార్టీ సభ్యత్వం ఇస్తారు అని అడిగేవారు. నీకు ఇంకా వయసు రాలేదు కనీసం 16 సంవత్సరాలు ఉంటేనే నీకు సభ్యత్వం ఇస్తారని నాయకులు చెప్పేవారు. కామ్రేడ్ సుగుణ పోరు భరించలేకనో, పార్టీ అవసరాల రీత్యానైతేనేమి 16 సంవత్సరాల లోపే స్వయంగా రావి నారాయణరెడ్డి గారి ద్వారానే ఆమె పార్టీ సభ్యత్వం పొందారు.

పార్టీ కేంద్ర రహస్య స్థావరంగా ఉండే 'డెన్' బాధ్యతలు అప్పచెప్పారు. కామ్రేడ్ సుగుణతోపాటు కామ్రేడ్ వెంకటాచారి (చారి), అనిరెడ్డి అనంతరెడ్డి (హైకోర్టు అడ్వకేట్‌గా పని చేశారు) కూడా ఉన్నారు. ఈ ముగ్గురితో 'డెన్' నిర్వహణకు కమిటీ ఉండేది. పార్టీ కేంద్రం చాలా రహస్యంగా ఉండేది. పరిమితమైన అతి ముఖ్య నాయకులు మాత్రమే జాగ్రత్తగా వచ్చి పోయేవారు. 'డెన్' (పార్టీ రహస్య కేంద్రం) నిర్వహించే ఆ ముగ్గురి ప్రధానమైన పని పార్టీ డాక్యుమెంట్‌ని కాపీలు చేయటము, సర్క్యూలర్స్ తయారుచేసి పంపడం, సమాచారాన్ని సేకరించటం, అవసరమైన కామ్రేడ్స్‌కి అందజేయడం. కామ్రేడ్ సుగుణ దృష్టి అంతా తుపాకీ పోరాటం చుట్టే ఉండేది. కాబట్టి తన అసంతృప్తిని కామ్రేడ్ రావి నారాయణరెడ్డి సమక్షాన వెలుబుచ్చారు. మీరు చేసే పని చిన్నదిగా తక్కువగా భావించవద్దు. ఇది చాలా కీలకమైనది. ఇది అందరూ చేయలేనిది. ఎంతో నమ్మకం, క్రమశిక్షణ కలిగిన వారు మాత్రమే చేయగలిగింది. వారికి ప్రత్యేకంగా నైపుణ్యం ఉండాలి. వారికి రాయగలిగే శక్తి, అర్థం చేసుకోగలిగే శక్తి అవసరం. అవన్నీ మీకు ఉన్నాయని భావించే పార్టీ మిమ్మల్ని ఇక్కడ ఉంచింది. ఇది మన విప్లవ కార్యక్రమంలో ఒక ప్రధా నమైన భాగంగా మీరు గుర్తించాలి. మేము ఏ దళంలో లేము కదా? అంటే మా పనికి ప్రాధాన్యత లేదా? ప్రశ్నించారట. అందరు నాయకులు చెప్పటంతో కొంత కుదుటబడ్డారు. ప్రత్యేకంగా కామ్రేడ్ సుందరయ్య, దేవులపల్లి వెంకటేశ్వరరావు కూడా రహస్య డెన్ యొక్క ప్రాధాన్యతని అర్థం చేయించారు.

ఆ కేంద్రానికి సుందరయ్య, బసవపున్నయ్య, చంద్ర రాజేశ్వరరావు, మగ్దుం మొయినుద్దీన్, రాజ్ బహదూర్ గౌర్, రావి నారాయణ రెడ్డి, భీమిరెడ్డి నరసింహారెడ్డి, దేవులపల్లి వెంకటేశ్వరరావు, మేజర్ జైపాల్‌సింగ్‌లాంటి కేంద్ర జాతీయ నాయకులు మాత్రమే వచ్చేవారు. ఆ కేంద్రం ప్రాధాన్యతేమిటో నెమ్మదినెమ్మదిగా ఆమె అర్థం చేసుకున్నారు.

### ఎస్‌వికె ప్రసాద్‌తో వివాహం

సాయుధ పోరాటం ప్రారంభమైన తర్వాత ఆంధ్ర కమ్యూనిస్టు పార్టీ తెలంగాణలో పార్టీని పటిష్ట పరచటానికి ఆంధ్ర నుండి ఎస్వీకే ప్రసాద్‌ని తెలంగాణకు పంపడం జరిగింది. ఆయన కూడా అప్పుడప్పుడు 'డెన్'కి వచ్చి పోయేవారు. పరిచయాలు పెరిగాయి. ఆ పరిచయం పెళ్ళి వరకు వచ్చింది. 1949 నవంబర్ 25వ తారీఖు నాడు వారి పెళ్లి జరిగింది. ఆ పెళ్లి నిర్వహించింది రావి నారాయణరెడ్డి, భీమిరెడ్డి నరసింహారెడ్డి, దేవులపల్లి వెంకటేశ్వరరావు గారలే. పెళ్లయిన కొంతకాలానికే ఎస్‌వికె ప్రసాద్ హైదరాబాదులో పోలీసుల చేతికి చిక్కాడు. దాదాపు నాలుగు సంవత్సరాల పాటు జైల్లో ఉండి 1954లో సుప్రీంకోర్టు జోక్యంతో విడుదలైనారు.

పార్టీలో కామ్రేడ్ సుగుణ కీలకపాత్ర వహించిన విషయం ప్రభుత్వం దృష్టికి వచ్చి ఆమెపై వారంట్ అయింది. ఆమె కోసం పోలీసులు తిరగటం ప్రారంభించారు. కొంతకాలం రహస్య జీవితం గడిపిన తర్వాత పోలీసులు అరెస్టు చేశారు. రెండు సంవత్సరాల పాటు జైల్లో ఉండి 1952లో విడుదల అయింది. తెలంగాణలోనే ఉండి ఇక్కడ కమ్యూనిస్టు ఉద్యమ అభివృద్ధికి భార్యాభర్తలిద్దరు జీవితాంతం కృషి చేస్తూ వచ్చారు. వరంగల్లు జిల్లా చెన్నూరు అసెంబ్లీ నియోజకవర్గం నుండి ప్రసాద్ కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలిచారు. 1994లో ప్రసాద్ చనిపోయారు. ఆ ఆదర్శ దంపతులకు ఒక కూతురు, ఇద్దరు కుమారులున్నారు. కూతురు డాక్టర్ శోభ, కుమారులు రవి, రమేష్‌లు ప్రస్తుతం అమెరికాలో ఉంటున్నారు. సుగుణ చివరి వరకు మహిళా ఉద్యమాల్లో చురుకైన పాత్ర వహించారు.

### కమ్యూనిస్టు ఉద్యమంలోనే కొనసాగుతూ వచ్చారు

వారు చివరి దశలో, ఆరోగ్యం క్షీణిస్తున్నా కూడా ప్రజల పరిస్థితి గురించే చర్చించేవారు. పెచ్చరిల్లుతున్న మూఢ నమ్మకాలు, అవినీతి, మతోన్మాదం తదితర అంశాల పట్ల ఆవేదన వ్యక్తపరిచేవారు. ప్రస్తుత పరిస్థితులలో కమ్యూనిస్టు ఉద్యమం ఐక్యం కావలసిన అవసరం ఉందని నొక్కి చెప్పేవారు. ఎన్నికలలో పాల్గొనే కమ్యూనిస్టు పార్టీలైనా, ఒక సంఘటనగా ఏర్పాటు కావాలని ఆకాంక్షించేవారు. 2001 నుండి ఈ అంశాలు గురించి నేను చెప్తూనే వస్తున్నాను అని తాను ఇంగువ మల్లికార్జున శర్మకి ఇంటర్వ్యూలో చెప్పిన విషయాలని ఎప్పుడూ జ్ఞాపకం చేస్తూ ఉండేవారు.

కామ్రేడ్ సుగుణ ఈ తరానికి పెద్దగా తెలువక పోవచ్చు కూడా. కానీ గత తరాల వారందరికీ ఆమె గొప్పతనం, ఆమె త్యాగం, ఆమె కుటుంబ నేపథ్యం ఏమిటో తెలుసు. ఆ కుటుంబం యొక్క ప్రత్యేకత ఏంటో తెలుసు. సుగుణ గారి ఆశయాలను నెరవేర్చటమే ఆమె గారికి మనం ఇచ్చే నిజమైన నివాళి.

— జి.రాములు
9490098006 (17-6-2025)

**కామ్రేడ్ సుగుణ అంత్యక్రియలు 19 జూన్ 2025న (నేడు) మధ్యాహ్నం 2 గంటలకు మహాప్రస్థానంలో..**

# ప్రపంచ వినాశనం తప్పదా?

ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య కొనసాగుతున్న సాయుధ పోరాటం ఎటువంటి మలుపులు తిరుగుతుందోనన్న ఆందోళన సర్వత్రా నెలకొంది. ఇరాన్ అణు కార్యక్రమం విస్తరణను ఆపాలనే లక్ష్యంతో ఇజ్రాయెల్ దాడులు ప్రారంభించింది. ఆపరేషన్ రైజింగ్ లయన్ అనే సంకేత నామంతో, ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్, మొసాద్ కీలకమైన అణు స్థావరాలు, సైనిక స్థావరాలు, పౌరులు నివసించే నివాస ప్రాంతాలపై దాడి చేశాయి. జూన్ 13 సాయంత్రం నుండి ప్రారంభమైన ఇరాన్ యొక్క ప్రతీకార ఆపరేషన్ ట్రూ ప్రామిస్ III బాలిస్టిక్ క్షిపణులు, డ్రోన్‌లతో సైనిక స్థావరాలు, నిఘా ప్రదేశాలు, నివాస ప్రాంతాలలో ప్రయోగించారు.

ఇరాన్ అణు కార్యక్రమంతో పాటు, ఇరాన్ బాలిస్టిక్ క్షిపణి కార్యక్రమాన్ని ఇజ్రాయెల్ ముప్పుగా భావిస్తోంది. ఇరాన్ ప్రతి నెలా 300 బాలిస్టిక్ క్షిపణులను ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుందని, ఇది ఇజ్రాయెల్ నగరాలకు ప్రత్యక్ష ముప్పుగా భావిస్తున్నారు ప్రధాన మంత్రి బెంజమిన్ నెతన్యాహు.

**ఎవరి సామర్థ్యమెంత.?**

ఇరాన్ భౌగోళికంగా ఇజ్రాయెల్ కంటే పెద్దది. అలాగే 9 కోట్ల జనాభా ఉంది. ఇది ఇజ్రాయెల్ జనాభా కంటే పదింతలు ఎక్కువ. ఈ లెక్కలను బట్టి ఇరాన్ గొప్ప సైనిక శక్తి అనుకోలేం. క్షిపణులు, డ్రోన్స్‌పై ఇరాన్ భారీగా ఖర్చు చేస్తోంది. దానికి విస్తారమైన ఆయుధ సంపత్తి ఉంది. అలాగే యెమెన్‌లోని హౌతీలకు, లెబనాన్‌లోని హిజ్బుల్లా గ్రూపులకు కూడా చెప్పుకోదగ్గ స్థాయిలో ఆయుధ సంపత్తిని సరఫరా చేస్తోంది. అయితే ఆధునిక రక్షణ వ్యవస్థ, యుద్ధ విమానాలు ఇరాన్‌కు కొరతగానే మిగిలాయి. యుక్రెయిన్‌తో యుద్ధంలో రష్యాకు టెహ్రాన్ ఇచ్చిన మద్దతుకు బదులుగా ఇరాన్ తన ఆయుధసంపత్తిని ఆధునీకరించేందుకు రష్యా సహకరిస్తుందని నమ్ముతున్నారు. ఇరాన్ రష్యాకు షాహీద్ డ్రోన్లను అందించింది. ప్రస్తుతం రష్యా వీటిని సొంతంగా తయారుచేసుకుంటోంది.

అయితే ఇజ్రాయెల్ వద్ద ప్రపంచంలోనే అధునాతన వైమానిక దళం ఉంది. ఇంటర్నేషనల్ ఇనిస్టిట్యూట్ ఫర్ స్ట్రాటిజిక్ స్టడీస్ (ఐఐఎస్ఎస్) నివేదిక ప్రకారం ఇజ్రాయిల్ వద్ద ఎఫ్15, ఎఫ్16 తోపాటు అధునాత ఎఫ్35 స్టెల్త్ ఎయిర్‌క్రాఫట్స్ సహా కనీసం 14 ఎయిర్‌క్రాఫ్ట్ స్క్వాడ్రన్స్ ఉన్నాయి. శత్రువుల భూభాగంలో దాడులు చేసిన అనుభవం కూడా ఇజ్రాయెల్‌కు ఉంది. ఇరాన్ నేరుగా ఇజ్రాయెల్ భూభాగంపై దాడికి దిగడంతో మధ్యప్రాచ్యంలో ఈ పాత శత్రుదేశాల మధ్య ఉద్రిక్తతలు తారస్థాయికి చేరాయి.

**యుద్ధంలో అమెరికా పాత్ర..**

ఇజ్రాయెల్–ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు తీవ్రమవుతున్న నేపథ్యంలో, అమెరికా ఈ యుద్ధంలో చేరే సూచనలు కనిపిస్తున్నాయి. అమెరికాకు చెందిన పదుల సంఖ్యలో యుద్ధవిమానాలు మధ్యప్రాచ్య ప్రాంతం (మిడిల్ ఈస్ట్) వైపుగా తరలిస్తున్నట్లు సామాజిక మాధ్యమాల్లో పలు పోస్టులు వైరల్ అవుతున్నాయి. యుద్ధానికి మద్దతుగా అమెరికా రంగంలోకి దిగుతుందని అనుమానాలు వ్యక్తమవుతున్న సందర్భంలో ఇది ఇజ్రాయెల్‌కు మరింత బలాన్నిచ్చే పరిణామం. ఈ నేపథ్యంలో అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలు యుద్ధంలో అమెరికా పాత్రపై మరింత ఆసక్తి రేపుతున్నాయి.

— జాజుల దినేష్
9666238266

# 'సికిల్ సెల్ రక్తహీనత' ప్రాణాంతకం!


తల్లితండ్రుల నుంచి సంక్రమించే జన్యులోప రుగ్మతగా సికిల్ సెల్ రక్తహీనత ప్రమాదకరంగా మారుతోంది. శరీర కణజాలానికి ప్రాణవాయువు, ఆక్సీజన్‌ను అందించే రక్తంలోని ఎర్ర రక్తకణాలతో కూడిన హీమోగ్లోబిన్ ఉపకరిస్తుంది. ఆక్సీజన్‌ను సరఫరా చేస్తున్న ఎర్ర రక్త కణాలు గుండ్రంగా, మృదువుగా, ఫ్లెగ్జిబుల్‌గా ఉంటూ రక్త నాళాల గుండా సులభంగా ప్రవహిస్తూ, మన ఆరోగ్యానికి పునాదులు వేస్తున్నాయి. సికిల్ సెల్ రుగ్మత బారిన పడిన వ్యక్తుల ఎర్ర రక్త కణాలు దృఢంగా, గట్టిగా, అంటుకునే గుణంతో, సిఆకారంలో కొడవలి లేదా సికిల్ ఆకారంలో ఉంటాయి. ఆ సికిల్ కణాలు రక్తనాళాల్లో సులభంగా ప్రవహించకుండా, త్వరగా చనిపోతూ ఉంటాయి. ఇలాంటి సికిల్ సెల్ రుగ్మత ఉన్న వారిలో దీర్ఘకాలిక రక్తహీనత, నొప్పులు, అవయవాలకు హాని, ఇతర తీవ్రమైన అనారోగ్యాలను కలిగిస్తుంది. దీనినే సికిల్ సెల్ రుగ్మతగా పిలవడం జరుగుతోంది.

సికిల్ సెల్ రక్త రుగ్మత పట్ల ప్రజల్లో అవగాహన కల్పించడం, ముందస్తు పరీక్షలతో గుర్తించడం, వ్యాధిగ్రస్తుల పట్ల జాగ్రత్తలు తీసుకోవడం, రోగుల కుటుంబాల్లో ఆత్మ విశ్వాసం పెంచడం లాంటి కార్యక్రమాలను నిర్వహించడానికి ఐక్యరాజ్యసమితి కృషి చేస్తున్నది.

భారత గిరిజన తెగల్లో అత్యధికంగా కనిపిస్తున్న సికిల్ సెల్ వ్యాధి ప్రమాదకరంగా మారుతోంది. 2011 వివరాల ప్రకారం 8.6 శాతం గిరిజన జనాభా లేదా 67.8 మిలియన్ల అభాగ్యులు సికిల్ సెల్ రుగ్మత బారిన పడ్డట్లు స్పష్టం అవుతున్నది. భారతదేశంలో యంపీ, ఛత్తీస్ఘడ్, ఝార్ఖండ్, ఒడిసా, గుజరాత్, మహారాష్ట్ర లాంటి 17 రాష్ట్రాలు/యూటీల్లో అధికంగా కనిపిస్తున్న సికిల్ సెల్ వ్యాధిగ్రస్థులు కనిపిస్తున్నారు. వ్యాధి తీవ్రతను గుర్తించిన భారత ప్రభుత్వం జాతీయ సికిల్ సెల్ రక్తహీనత నిర్మూలన మిషన్‌ను తీసుకోని 2047 నాటికి ఈ వ్యాధిని నిర్మూలించడానికి పథక రచన చేసి అమలు పరుస్తున్నారు. ఈ మిషన్‌లో భాగంగా 2026 నాటికి 7 కోట్ల గిరిజనులకు నిర్ధారణ పరీక్షలు నిర్వహించడానికి కృషి జరుగుతోంది.

జన్యువుల్లో మ్యుటేషన్ లేదా ఒకదానితో మరొకటి మార్పు చెందడం వల్ల హిమోగ్లోబిన్ ఉత్పత్తిలో లోపం జరుగుతుంది. తల్లిదండ్రులు ఇద్దరిలో ఇలాంటి జన్య లోపాలు ఉన్నట్లు అయితే వారి సంతానానికి కూడా సికిల్ సెల్ రుగ్మత సంక్రమిస్తుంది. తల్లిదండ్రుల్లో ఒక్కరికి మాత్రమే జన్య లోపం ఉన్నట్లైతే పిల్లల్లో జన్య లోపాలు కనిపించినప్పటికీ రోగ లక్షణాలు మాత్రం కనిపించకపోవచ్చని తెలుసుకోవాలి.

సికిల్ సెల్ వ్యాధులు (హీమోగ్లోబిన్ ఎస్ఎస్, ఎస్ఐ, ఎస్ బీటా తలసేమియా లాంటివి) పలు రకాలుగా ఉంటాయని, వీటిని త్వరగా గుర్తించడం వల్ల వ్యక్తుల జీవితాల్లో ఆరోగ్యాలను పెంచవచ్చని, ఆరోగ్య సురక్ష గొడుగు పట్టవచ్చని తెలుసుకోవాలి.



# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## ఇకపై 15 రోజుల్లోనే ఓటర్ ఐడి కార్డులు డెలివరీ

**న్యూఢిల్లీ :** ఓటర్లకు ఐడి కార్డులు త్వరితగతిన అందించేందుకు కొత్త విధానాన్ని ప్రారంభించినట్లు ఎన్నికల సంఘం బుధవారం ప్రకటించింది. ఎన్నికల రిజిస్టర్‌లో దరఖాస్తుకు సంబంధించిన మార్పులు జరిగిన 15 రోజుల్లోపే ఓటర్ ఐడి కార్డులు (ఇపిఐసి) ఓటర్లకు చేరేలా ఈ కొత్త విధానం తీసుకొచ్చినట్లు పేర్కొంది. కొత్తగా ఓటర్లుగా నమోదు చేసుకున్న వారితో సహా, ఇప్పటికే ఉన్న ఓటరు వివరాల్లో మార్పులు చేసిన వారికి కూడా 15 రోజుల్లోనే కార్డును డెలివరీ చేస్తామని వెల్లడించింది. ప్రస్తుతం ఓటర్లకు ఓటర్ ఐడి కార్డులు అందడానికి ఒక నెలకు పైగా సమయం పడుతోందని అధికారులు చెబుతున్నా రు. అయితే, ఈ కొత్త వ్యవస్థ ద్వారా ఈ ప్రక్రియను వేగవంతం చేయబోతున్నారు. ఈ కొత్త విధానంలో, ఓటర్ కార్డు తయారవడం నుంచి ఓటరుకు అందే వరకు ప్రతి దశలో పర్యవేక్షించడం కోసం రియల్ టైమ్ ట్రాకింగ్ వ్యవస్థను తీసుకొచ్చినట్లు ఇసి వివరించింది. ఈ ప్రక్రియను ఎన్నికల రిజిస్ట్రేషన్ ఆఫీసర్ పర్యవేక్షిస్తారు. అంతేకాక, ప్రతి దశలో ఓటర్లకు ఎస్ఎంఎస్ ద్వారా సమాచారం అందేలా ఏర్పాట్లు చేశారు. తద్వారా ఓటర్లు తమ ఓటర్ ఐడి కార్డు స్థితిని తెలుసుకోవడానికి వీలవుతుంది.

# ఉగ్రవాద సవాల్‌పై ఉదాసీన వైఖరి తగదు

జి7నేతలతో ప్రధానమంత్రి నరేంద్రమోదీ

పహల్గామ్ ఉగ్రదాడి ప్రతీ భారతీయుడి

'ఆత్మ, గుర్తింపు, గౌరవం'పై ప్రత్యక్షదాడి అని వ్యాఖ్య



**కననాస్కిస్ (కెనడా) :** భారతదేశ పొరుగు ప్రాంతం ఉగ్రవాదానికి నిలయంగా మారుతోన్న నేపథ్యంలో ఈ సవాల్‌పై నిర్లక్ష్యంగా వ్యవహరించడం ఉగ్రవాదం పట్ల 'మానవత్వానికి ద్రోహం' చేయడమే అవుతుందని, చూసీచూడనట్లు ప్రవర్తించడం తగదని ప్రధానమంత్రి నరేంద్రమోదీ జి7 నాయకులకు ఉద్బోధించారు. సరిహద్దు ఉగ్రవాద కార్యకలాపాలకు మద్దతు ఇస్తున్న పాకిస్థాన్‌పై చర్యలు తీసుకోవాలని ప్రధాని మోదీ వారిని కోరారు. ఆయన ఇక్కడ జరిగిన జి7 సభ్యుల సమావేశాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ ఏప్రిల్ 22న జరిగిన పహల్గామ్ దాడి ప్రతీ భారతీయుడి 'ఆత్మ, గుర్తింపు, గౌరవం'పై ప్రత్యక్ష దాడి అని పేర్కొన్నారు. ఉగ్రవాదాన్ని సమర్థించే ఏ దేశమైనా జవాబుదారీగా ఉండాలని, అంతేకాకుండా మూల్యాన్ని చెల్లించాల్సి ఉంటుందని అన్నారు. ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడంలో ద్వంద ప్రమాణాలకు తావు ఉండరాదన్నారు. 'ఉగ్రవాదం వ్యాప్తి చేసే వారిని, ఉగ్రవాదంతో బాధపడేవారిని ఒకే త్రాసులో తూకం వేయాలా' అని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రశ్నించారు. మంగళవారం ఇక్కడ 'ఇంధన భద్రతపై' జరిగిన ఔట్ రీచ్ సెషన్‌లో మోదీ ప్రసంగించారు.'ఉగ్రవాదం అనేది మానవత్వానికి శత్రువు. ప్రజాస్వామ్య విలువలను కాపాడే అన్ని దేశాలకు ఉగ్రవాదం వ్యతిరేకం. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా జరిగే పోరాటంలో ఐక్యత తప్పనిసరి' అని మోదీ చెప్పారు. 'కానీ దురదృష్టవశాత్తు మన పొరుగుప్రాంతం ఉగ్రవాదానికి నిలయంగా మారింది. ప్రపంచ శాంతి, శ్రేయస్సు కోసం మన ఆలోచనలు, మన విధానాలు చాలా స్పష్టంగా ఉండాలి. ఉగ్రవాదానికి మద్దతు ఇచ్చే ఏ దేశమైనా జవాబుదారీగా ఉండాలి. అంతేకాకుండా మూల్యం చెల్లించేలా చేయాలి' అని నరేంద్ర మోదీ అన్నారు. వాస్తవం దీనికి పూర్తి విరుద్ధంగా ఉందని ప్రధానమంత్రి మోదీ తెలియజేశారు.ఒక వైపు మన సొంత ప్రాధాన్యతలు, ఆసక్తుల ఆధారంగా వివిధ ఆంక్షలను విధించడానికి మేం తొందరపడుతున్నాం. మరోవైపు ఉగ్రవాదాన్ని బహిరంగంగా మద్దతు ఇస్తున్నదేశాలకు నిరవధికంగా ప్రతిఫలం లభిస్తోంది అని ఆయన విచారం వ్యక్తం చేశారు. ప్రధానమంత్రి ఈ సందర్భంగా కొన్ని ప్రశ్నలు సంధించారు. మనం నిజంగా ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడంలో సీరియస్‌గా ఉన్నామా? ఉగ్రవాదం మనపై దాడిచేసినప్పుడు మాత్రమే మనం దాని నిజమైన అర్థాన్ని అర్థం చేసుకుంటామా? అని అడిగారు. ఉగ్రవాదాన్ని వ్యాప్తి చేసేవారిని, ఉగ్రవాదంతో బాధపడేవారిని ఒకే త్రాసులో ఉంచవచ్చా? మన ప్రపంచ సంస్థలు వాటి విశ్వసనీయత కోల్పోయే ప్రమాదం ఉందా? అని అడిగారు.ఈ సందర్భంగా ఉగ్రవాదంపై నిర్ణయాత్మక ప్రపంచ చర్య'కు ప్రధానమంత్రి నరేంద్రమోదీ పిలుపునిచ్చారు'. ఇంధన పరివర్తన దిశగా అన్ని దేశాలు కలిసి ముందుకు సాగడం అత్యంత అవసరమని మోదీ నొక్కిచెప్పారు. గ్లోబల్ సౌత్ ఆందోళనలను ప్రపంచ వేదికగా తీసుకురావడాన్ని భారతదేశం తన బాధ్యతగా భావిస్తుంది.'ఏ రూపంలోనైనా ద్వంద ప్రమాణాలు కొనసాగితే, స్థిరమైన, మానవత్వానికి సంబంధించిన సమ్మిళిత అభివృద్ధిని కలుపుకోవడం అనేది అందుబాటులో ఉండదనేది మేం నమ్ముతున్నాం' అని మోదీ చెప్పారు. భారత దేశం ఎల్లప్పుడూ మానవత్వం కోసం పనిచేస్తుందని, తన స్వార్థానికి అతీతంగా పనిచేస్తుందని మోదీ నొక్కిచెప్పారు. భవిష్యత్తులోనూ జి7తో చర్చలు, సహకారంలో భారతదేశం పాల్గొంటుందన్న ఆకాంక్షను వ్యక్తం చేశారు.


**ట్రంప్‌నిష్క్రమణ తర్వాత...ఉమ్మడి ఒప్పందాలు కుదుర్చుకోవడంలో జి7నేతల విఫలం**

జి7దేశాల నేతలు ట్రంప్ నిష్క్రమణ తర్వాత ప్రతిష్టాత్మక ఉమ్మడి ఒప్పందాలు కుదుర్చుకోవడంలో విఫలమయ్యారు. ప్రస్తుతం అత్యంత కీలక సమస్యలైన ఉక్రేన్‌లో రష్యా యుద్ధం, ఇజ్రాయెల్‌ఇరాన్ సంఘర్షణలపై ఏడుగురు నేతలతో కూడిన ఆరుగురి గ్రూప్ ప్రధాన ఒప్పందాలు కుదుర్చుకోవడంలో వైఫల్యంచెందారు.అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ముందస్తుగా నిష్క్రమించినప్పటికీ, సంపన్నదేశాల క్లబ్ ఇప్పటికీ ప్రపంచ విధానాన్ని ఎలా రూపొందిస్తుందో చూపించడానికి ప్రయత్నించాల్సిన అవసరం ఏర్పడింది. మంగళవారం జరిగిన చివరి సమావేశంలో కెనడా ప్రధానమంత్రి మార్క్ కార్నీ సహా యుకె, ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ, జపాన్ నుంచి సహచర ప్రధానులు, ఉక్రేన్ అధ్యక్షుడు వ్లోదిమిర్ జెలెన్స్కీ, నాటో చీఫ్ మార్క్ రుట్టే పాల్గొన్నారు. 'మాకు మిత్రదేశాల నుంచి మద్దతు అవసరం. అందుకే నేను ఈ సమావేశంలో ఉన్నాను' అని జెలెన్స్కీ జోడించడానికి ముందు 'మేం శాంతి చర్చలు జరిపేందుకు సిద్ధంగా ఉన్నాం. షరతులు లేని కాల్పుల విరమణ ముఖ్యమైనదని నేను భావిస్తున్నాను. కానీ దీనికోసం మాకు ఒత్తిడి అవసరం ఉంది' అని జెలెన్స్కీ అన్నారు.రష్యాతో చర్చలను ప్రోత్సహించే ప్రయత్నంలో భాగంగా ఉక్రేన్‌పై సంయుక్త ప్రకటనను అమెరికా వ్యతిరేకించిందని కెనడాకు చెందిన ఒక సీనియర్ అధికారి విలేకరులకు వెల్లడించారు. సోమవారం శిఖరాగ్ర సమావేశం జరగకపోవడమే దీనికి కారణమని ఆయన చెప్పారు. ట్రంప్‌లేని సమయంలో మిగిలిన ఆరుగురు నేతలు ఉక్రేన్‌పై సమావేశం నిర్వహించారు.ఏకాభిప్రాయం లేకపోవడంతో నేతలు వ్యక్తిగతం గా జెలెన్స్కీ వద్దకు వెళ్లి తమ మద్దతు ఉంటుందని హామీ ఇచ్చారు.

# ట్రంప్‌తో ఏం మాట్లాడారు?

ప్రధాని మోదీ అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేసి వివరించాలి


దేశాన్ని విశ్వాసంలోకి తీసుకోవాలి : కాంగ్రెస్



**న్యూఢిల్లీ :** ప్రధాని నరేంద్ర మోదీ తన మూడు దేశాల పర్యటన నుండి తిరిగి వచ్చిన వెంటనే అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో ఫోన్‌లో మాట్లాడిన విషయాలను నాయకులకు వివరించాలని, దేశాన్ని విశ్వాసంలోకి తీసుకోవాలని సూచించింది. పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ జనరల్ అసిమ్ మునీర్ ట్రంప్‌తో భోజనం చేయడాన్ని ప్రతిపక్ష పార్టీ 'భారీ ఎదురుదెబ్బ'గా అభివర్ణించింది. ఈ విషయంపై భార అసంతృప్తిని ప్రధాని మోదీ అమెరికా అధ్యక్షుడికి ఫోన్‌లో చెప్పాల్సిందన్నారు. ఇం దిరా గాంధీ ప్రధానమంత్రి అయి ఉంటే అమెరికా అధ్యక్షులు ఎవరు ఉన్నా ఆమె కచ్చితంగా భారత దేశ అసంతృప్తిని తెలియజేసేసే వారని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేష్ పేర్కొన్నారు. కార్గిల్ యుద్ధం జరిగిన మూడు రోజుల తర్వాత కమిటీ ఏర్పాటు చేసిన మాదిరిగానే 'పహల్గామ్ సమీక్ష కమిటీ'ని ఏర్పాటు చేయాలని రమేష్ ప్రభుత్వాన్ని కోరారు. భారత్, పాక్ మధ్య కాల్పుల విరమణకు మధ్యవర్తిత్వం వహించడానికి వాణిజ్యాన్ని ఒక సాధనంగా ఉపయోగించుకుంటున్నారనే ట్రంప్ వాదనలను ప్రధానమంత్రి పార్లమెంటులో తిప్పికొట్టాలని సూచించారు. మోదీ ప్రభుత్వ దౌత్యం ఆప్టిక్స్‌పై తక్కువగా ఆధారపడి, సారాంశంపై ఎక్కువగా ఆధారపడి ఉండాలని కాంగ్రెస్ నాయకుడు అన్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తో మోడీ ఫోన్‌లో మాట్లాడిన తర్వాత జై రమేష్ స్పందించారు. మంగళవారం ట్రంప్‌తో 35 నిమిషాల పాటు ఫోన్‌లో సంభాషించిన మోదీ పాకిస్థాన్‌లోని ఉగ్రవాద స్థావరాలపై భారతదేశం ప్రారంభించిన ఆపరేషన్ సిందూర్ గురించి అమెరికా అధ్యక్షుడికి వివరించారు. ఎటువంటి మూడవ పక్ష మధ్యవర్తిత్వాన్ని అంగీకరించలేదని, భవిష్యత్తులోనూ దానిని ఎప్పటికీ అంగీకరించదని విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రి స్పష్టం చేశా రు. కాగా, మునీర్‌తో ట్రంప్ భోజనం గురించి రమేష్ మాట్లాడుతూ 'ఇది భారత దౌత్యానికి ముమ్మారు టిపుల్ ఝట్కా అని అన్నారు. పహల్గామ్ ఉగ్రవాద దాడికి నేపథ్యంగా మారిన రెచ్చగొట్టే, ఆమోదయో గ్యం కాని వ్యాఖ్యలకు కారణమైన ఫీల్డ్ మార్షల్ మునీర్ ట్రంప్‌తో భోజనం చేయబోతున్నారన్నారు. ప్రభుత్వ అధిపతి కాని వ్యక్తి అదే సైనికుడిని ట్రంప్‌తో ప్రత్యేకంగా లంచ్‌కు ఆహ్వానిస్తున్నారని, ఇది భారత్‌కు పెద్ద ఎదురుదెబ్బ అని అన్నారు. ట్రంప్ వాణిజ్యాన్ని ఒక సాధనంగా ఉపయోగించుకుని, భారత్, పాకిస్తాన్‌ను సమానంగా చేస్తున్నానని చెబుతున్నాడని, దీనిని 14 సార్లు చెప్పినా మే 10 నుండి ప్రధానమంత్రి ఏమీ మాట్లాడలేదు, ఇది మూడుసార్లు ఎదురుదెబ్బ అని కాంగ్రెస్ నాయకుడు అన్నారు. ప్రధాని తిరిగి వచ్చిన వెంటనే అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేసి, ట్రంప్‌తో 35 నిమిషాలు జరిగిన సంభాషణ చెప్పాలన్నారు. ట్రంప్ 14 సార్లు చేసిన వాదనలపై ప్రధాని మౌనం వీడటానికి 37 రోజులు పట్టిందని, మోదీ దేశాన్ని విశ్వాసంలోకి తీసుకోవాలని రమేష్ పునరుద్ఘాటించారు.

# రూ.3 వేలతో ఏడాదంతా ప్రయాణం..

కొత్త ఫాస్టాగ్ పాలసీని తీసుకొచ్చిన కేంద్రం




**న్యూఢిల్లీ :** వాహనదారులకు కేంద్రం గుడ్‌న్యూస్ చెప్పింది. ఫాస్టాగ్ విషయంలో కీలక నిర్ణయం తీసుకుంది. నేషనల్ హైవేలపై ప్రయాణాన్ని సులభతరం చేయడానికి కొత్త ఫాస్టాగ్ పాలసీని తీసుకొచ్చింది. అన్ని రహదారులపై ప్రతిసారీ టోల్‌ట్యాక్స్ చెల్లించాల్సిన పనిలేకుండా ఒకేసారి ఏడాదికి చెల్లించేలా ఫాస్టాగ్ ఆధారిత వార్షిక పాస్‌ను తీసుకొచ్చింది. ఈ పాస్ ద్వారా వాహనదారులు రూ.3 వేలు చెల్లించి ఏడాదంతా జాతీయ రహదారులు, ఎక్స్‌ప్రెస్‌వేలపై ప్రయాణించొచ్చు. ఇందు కు సంబంధించిన వివరాలను కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ బుధవారం ఎక్స్‌లో పంచుకున్నారు. స్వాతంత్ర్య దినోత్సవం రోజైన ఆగస్టు 15వ తేదీ నుంచి ఈ వార్షిక పాస్ అందుబాటులోకి వస్తుందని తెలిపారు. యాక్టివేట్ చేసిన పాస్‌లు ఏడాదిపాటు లేదా 200 ట్రిప్పులు (ఏది ముందైతే అది) చెల్లుబాటు అవుతాయని వెల్లడించారు. కార్లు, వ్యాన్లు వంటి నాన్ కమర్షియల్ వాహనాలకు మాత్రమే ఇది వర్తిస్తుందని స్పష్టం చేశారు. ఈ పాస్ యాక్టివేషన్ కోసం త్వరలోనే లింక్‌ను అందుబాటులోకి తీసుకురానున్నట్లు నితిన్ గడ్కరీ వెల్లడించారు. రాజ్‌మార్గ్ యాప్‌తో పాటు ఎన్‌హెచ్‌ఎఐ, ఎంఒఆర్‌టిహెచ్ వెబ్‌సైట్లలో ఈ లింగ్ అందుబాటులోకి వస్తుందన్నారు.

## 11 ఏళ్ల నాటి కేసులో..
## ఇద్దరు కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు జైలు శిక్ష

**జైపూర్:** సుమారు 11 ఏళ్ల నాటి కేసులో ఇద్దరు కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో సహా 9 మంది దోషులకు కోర్టు ఏడాది జైలు శిక్ష విధించింది. అయితే వారందరికీ బెయిల్ మంజూరు చేసింది. ఈ తీర్పును హైకోర్టులో అప్పీల్ చేసుకునేందుకు నెల గడువు ఇచ్చింది. 2014 ఆగస్టు 13న జైపూర్‌లోని రాజస్థాన్ యూనివర్సిటీ ప్రధాన ద్వారం బయట జెఎల్‌ఎన్ మార్గాన్ని సుమారు 20 నిమిషాలపాటు నిరసనకారులు దిగ్బంధించారు. ఈ నిరసన సందర్భంగా చట్టవిరుద్ధంగా సమావేశమై ప్రజా రహదారిని అడ్డుకున్నందుకు పోలీసులు కేసు నమోదు చేశారు. 2016 ఆగస్ట్ 11న ఛార్జిషీట్‌ను కోర్టులో దాఖలు చేశారు. కాగా, ఈ కేసుపై 11 ఏళ్లుగా కోర్టులో విచారణ కొనసాగింది. జైపూర్ జిల్లా కోర్టు బుధవారం తీర్పు ఇచ్చింది. ఇద్దరు కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో సహా తొమ్మిది మంది వ్యక్తులను దోషులుగా నిర్ధారించింది. ఒక్కొక్కరికి ఒక సంవత్సరం జైలు శిక్ష విధించింది. వారందరికీ కోర్టు బెయిల్ మంజూరు చేసింది. ఈ తీర్పు, శిక్ష నిలిపివేతపై హైకోర్టులో అప్పీల్ చేసుకునేందుకు నెల సమయం ఇచ్చింది. మరోవైపు జైలు శిక్ష పడిన 9 మందిలో లడ్నన్ కాంగ్రెస్ ఎమ్మెల్యే ముఖేష్ భాకర్, షాపురాకు కాంగ్రెస్ ఎమ్మెల్యే మనీష్ యాదవ్, జోత్వారా అసెంబ్లీ స్థానానికి చెందిన మాజీ కాంగ్రెస్ అభ్యర్థి అభిషేక్ చౌదరి ఉన్నారు. అయితే దోషిగా నిర్ధారించిన ఇద్దరు కాంగ్రెస్ నేతల అసెంబ్లీ సభ్యత్వంపై ఎలాంటి ప్రభావం ఉండదు.

# డిసెంబరు 4న ఐక్యరాజ్యసమితి 'ఏకపక్ష నిర్బంధచర్యల' వ్యతిరేక దినం



**న్యూయార్క్ :** ఇకమీదట ప్రతి సంవత్సరం డిసెంబరు నాలుగో తేదీని అంతర్జాతీయ 'ఏకపక్ష నిర్బంధ చర్యల' వ్యతిరేక దినోత్సవంగా ఐక్యరాజ్యసమితి పాటిస్తుంది. ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ ఈ మేరకు మంగళవారంనాడు ఒక తీర్మానం చేసింది. ఈ తీర్మానానికి అనుకూలంగా 116 దేశాలు ఓటు వేశాయి. 51 దేశాలు వ్యతరేకించాయి. మరో 6 దేశాలు తీర్మానానికి దూరంగా ఉండిపోయాయి. ఆస్ట్రేలియా, బ్రిటన్, కెనడా, జపాన్, అమెరికా, యూరోపియన్ యూనియన్ దేశాలు ఈ తీర్మానానికి వ్యతిరేకంగా ఓటు వేశాయి. అంతర్జాతీయ చట్టాలకు, ఐక్యరాజ్యసమితి ఛార్టర్‌కు విరుద్ధమైన ఏకపక్ష ఆర్థిక, వాణిజ్య చర్యలను అమలు చేయడం లేదా వాటిని స్వీకరించడం వంటి చర్యలు తీసుకోవద్దని ముఖ్యంగా అభివృద్ధి చెందుతున్నదేశాలు ఇలాంటి చర్యలకు పాల్పడవద్దని ఈ తీర్మానంలో జనరల్ అసెంబ్లీ కోరింది. అభివృద్ధి చెందుతున్న దేశాలలో సామాజిక అభివృద్ధికి ఆటకం కలిగించే ఎలాంటి ఏకపక్ష,నిర్బంధ, బలాత్కార చర్యలూ తీసుకోవద్దని తీర్మానం కోరింది. ఈ విధంగా తీసుకునే ఏకపక్ష బలవంతపు, నిర్బంధ చర్యలవల్ల కలిగే ప్రభావాల గురించి ప్రపంచ దేశాలలో ప్రచారం చేసేందుకు వీలుగా ప్రతి సంవత్సరం డిసెంబరు నాలుగో తేదీని అంతర్జాతీయ 'ఏకపక్ష నిర్బంధ చర్యల' వ్యతిరేక దినోత్సవంగా ఇక మీదట పాటించాలని కోరుతూ ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీలో ఎరిత్రియా దేశ దౌత్యవేత్త సోఫియా ఎహెన్నెస్ ఒక ముసాయిదా తీర్మానాన్ని ప్రతిపాదించారు. సభ్యదేశాలు, పరిశీలకులు, ఐక్యరాజ్యసమితి వ్యవస్థలకు చెందిన ప్రతినిధులు, పౌరసంఘాల ప్రతినిధులు, వ్యక్తులు ఈ తీర్మానాన్ని ఆహ్వానించారు. ఈ మేరకు తీర్మానం ఆమోదం పొందింది.

# దేశ ఆర్థికవృద్ధికి కార్పొరేట్ రంగమే కీలక స్తంభం

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

ఐసిఎల్ఎస్ 'ఆఫీసర్ ట్రైనీల'ను ఉద్దేశించి ప్రసంగం



**న్యూఢిల్లీ :** దేశ ఆర్థికవృద్ధికి, అభివృద్ధికి 'కార్పొరేట్ రంగమే కీలక స్తంభం' అని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఉద్ఘాటించారు. బుధవారం ఇక్కడ జరిగిన ఇండియన్ కార్పొరేట్ లా సర్వీస్ (ఐసిఎల్ఎస్) ఆఫీసర్ ట్రైనీలను ఉద్దేశించి ఆమె ప్రసంగించారు. మీ నిర్ణయాలు కేవలం పాలసీలు, నిబంధనలనే ప్రభావితం చేయకుండా పౌరులు, పెట్టుబడిదారులు నమ్మకం కలిగి ఉన్న దేశంలోని సంస్థలన్నింటినీ ప్రభావితం చేస్తాయని రాష్ట్రపతి ముర్ము నొక్కిచెప్పారు. కార్పొరేట్ చట్టాల అమలు, అమలుకు అప్పగించబడిన అధికారిగా నవీకరణ, వ్యవస్థాపతకు జవాబుదారీగా ప్రయోజనకరంగా ఉండే వ్యాపార వాతావరణాన్ని పెంపొందించడంలో మీ పాత్ర కేంద్రంగా ఉంటుందని ఆఫీసర్ ట్రైనీలకు విశదీకరించారు. మనదేశ ఆర్థికవృద్ధి, అభివృద్ధికి కార్పొరేట్ సెక్టారే కీలక స్తంభమని ఆమె రాష్ట్రపతి భవన్‌లో ఏర్పాటుచేసిన శిక్షణార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి 2013నాటి కంపెనీల చట్టాన్ని ప్రస్తావించారు. ఆమె వారి బాధ్యతను ప్రధానంగా గుర్తు చేశారు. చట్టం కేవలం అమలుచేయడం కోసమే కాదని, ఆ చట్టాన్ని అర్థంచేసుకుని గౌరవించడం, అందరికీ న్యాయం, అవకాశాన్ని ప్రోత్సహించే విధంగా వర్తింపచేయడం అనే బాధ్యతను రాష్ట్రపతి ప్రత్యేకంగా ప్రస్తావించారు. డిఫెన్స్ ఏరోనాటికల్ క్వాలిటీ అస్యూరెన్స్ సర్వీస్, సెంట్రల్ లేబర్ సర్వీస్ ఆఫీసర్ ట్రైనీలు రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కలిసిన వారిలో ఉన్నారు. ట్రైనీలను ఉద్దేశించి రాష్ట్రపతి ప్రసంగిస్తూ నాణ్యమైన విమానయానం అంటే కార్యాచరణ భద్రత, మిషన్ సంసిద్ధత, విశ్వసనీయత, ఆధిపత్యాన్ని నిర్ధారించే సాంకేతిక వివరణలను పాటించడం మాత్రమే కాదని ఆమె నొక్కిచెప్పారు. 'స్వదేశీయంగా ఉత్పత్తి చేయబడిన లేదా దిగుమతి చేసుకున్న విమానయాన స్టోర్స్‌లు ప్రపంచ ప్రమాణాలకు అనుగుణంగా నాణ్యత, యోగ్యత, అవసరాలను తీర్చేలా చూసుకోవడం మీ ప్రధానబాధ్యత' అని ముర్ము చెప్పారు.ప్రభుత్వ రంగాన్ని బలోపేతం చేయడమే కాకుండా సామర్థ్యాలను పెంపొందించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని సూచించారు.

## విమాన ప్రమాదం నుంచి బతికిన రమేష్ డిశ్చార్జ్..

సోదరుడి అంత్యక్రియలకు హాజరు




**అహ్మదాబాద్ :** గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో ఈనెల 12న జరిగిన ఎయిర్ ఇండియా విమాన ప్రమాదం నుంచి ప్రాణాలతో బయటపడిన ఒకే ఒక్క ప్రయాణికుడు విశ్వాస్ కుమార్ రమేష్ గాయాల నుంచి కోలుకున్నాడు. దీంతో అహ్మదాబాద్ సివిల్ హాస్పిటల్ నుంచి అతడ్ని డిశ్చార్జ్ చేశారు. అదే విమాన ప్రమాదంలో మరణించిన రమేష్ సోదరుడు అజయ్ మృతదేహాన్ని డిఎన్ఎ టెస్ట్ ద్వారా గుర్తించారు. లండన్ నుంచి గుజరాత్ చేరుకున్న రమేష్ కుటుంబానికి అప్పగించారు. బుధవారం డయ్యూలో అతడి సోదరుడి మృతదేహానికి అంత్యక్రియలు జరిగాయి. గాయాల నుంచి కోలుకున్న రమేష్ ఇందులో పాల్గొన్నాడు. సోదరుడి పాడే కూడా మోశాడు. కాగా, బ్రిటన్ పౌరసత్వం ఉన్న విశ్వాస్ కుమార్ రమేష్, జూన్ 12న లండన్ వెళ్లేందుకు సోదరుడు అజయ్‌తో కలిసి ఎయిర్ ఇండియా విమానంలో ప్రయాణించాడు. అయితే అహ్మదాబాద్ ఎయిర్‌పోర్ట్ నుంచి ్ధంచి అయిన ఆ విమానం కొన్ని క్షణాల్లోనే మెడికల్ కాలేజీ హా స్టల్ భవనంపై కూలి పేలిపోయింది. మరోవైపు ఎమర్జెన్సీ డోర్‌కు దగ్గరగా 11ఎ సీటులో ఉన్న విశ్వాస్ కుమార్ రమేష్ ఒక్కడే అదృష్టవశాత్తు ప్రాణాలతో బయటపడ్డాడు. అతడి సోదరుడు అజయ్‌తోపాటు ఆ విమానంలోని మిగతా 229 మంది ప్రయాణికులు, 12 మంది సిబ్బందితోపాటు కొందరు మెడికల్ స్టూ డెంట్స్, ఇతరులతో సహా 270 మంది మరణించగా పలువురు గాయపడ్డారు.

# 190 బాధితుల గుర్తింపు



**అహ్మదాబాద్ :** గత వారం అహ్మదాబాద్‌లో జరిగిన ఎయిర్ ఇండియా విమాన ప్రమాదంలో ఇప్పటివరకు కనీసం 190 మంది బాధితులను డిఎన్ఎ పరీక్షల ద్వారా గుర్తించామని, 32 మంది విదేశీయులు సహా 159 మృతదేహాలను వారి కుటుంబాలకు అప్పగించామని అధికారులు బుధవారం తెలిపారు. జూన్ 12న 242 మంది ప్రయాణికులు, సిబ్బందితో లండన్‌కు వెళ్తున్న ఎయిర్ ఇండియా విమానం ఎఐ 171 అహ్మదాబాద్‌లో కూలిపోయింది. ఒకరు తప్ప అందరూ మరణించారు. విమానం వైద్య సముదాయంలోకి దూసుకెళ్లడంతో అక్కడ కూడా మరో 28 మంది ప్రాణాలు కోల్పోయారు. దీంతో అనేక మృతదేహాలు గుర్తుపట్టలేనంతగా కాలిపోయాయి. ఈ నేపథ్యంలో బాధితుల గుర్తింపును నిర్ధారించడానికి అధికారులు డిఎన్ఎ పరీక్షలు నిర్వహిస్తున్నారు. బుధవారం ఉదయం వరకు, 190 డిఎన్ఎ నమూనాలు సరిపోలాయి. 159 మృతదేహాలను ఇప్పటికే సంబంధిత కుటుంబాలకు అప్పగించారు. ఇతర మృతదేహాల డిఎనె గుర్తింపు ప్రక్రియ ఇంకా కొనసాగుతోంది అని అహ్మదాబాద్ సివిల్ హాస్పిటల్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రాకేష్ జోషి విలేకరులకు తెలిపారు. 159 మంది బాధితుల మృతదేహాలను వారి బంధువులకు అప్పగించినట్లు ఆయన తెలిపారు. వారి బంధువులకు అప్పగించిన 127 మంది భారతీయుల మృతదేహాలలో నలుగురు ఆసుపత్రిలో మృతి చెందిన వారు కాగా, 123 మంది విమానంలో ఉన్నారని జోషి చెప్పారు. ప్రమాదం తరువాత, 71 మంది గాయపడిన వారిని ఆసుపత్రులలో చేర్చినట్లు ఆయన చెప్పారు. వారిలో, ప్రస్తుతం ఏడుగురు మాత్రమే సివిల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని, మరో 12 మంది రోగులు అహ్మదాబాద్, దాహోద్‌లోని ప్రైవేట్ ఆసుపత్రులలో చేరారన్నారు. ఇక్క డ (సివిల్ ఆసుపత్రి) చికిత్స సమయంలో ముగ్గురు రోగులు ప్రాణాలు కోల్పోయారని చెప్పారు.

# శుభాంశు శుక్లా అంతరిక్షయాత్ర మరోసారి వాయిదా



**న్యూఢిల్లీ :** అమెరికాకు చెందిన వాణిజ్య అంతరిక్ష సంస్థ యాక్సియం స్పేస్ చేపట్టిన రోదసి యాత్ర మరోసారి వాయిదా పడింది. స్పేస్ ఎక్స్ సంస్థకు చెందిన డ్రాగన్ వ్యోమనౌకలో భారత వ్యోమగామి శుభాంశు శుక్లా రోదసిలోకి వెళ్లాల్సి ఉంది. జూన్ 19న యాత్ర ఉంటుందని ముందుగా ఇస్రో ప్రకటించగా, ఇప్పుడు 22కు వాయిదా వేశారు. ఇప్పటికే సాంకేతిక కారణాలతో యాక్సియం–4 ప్రయోగం పలుమార్లు వాయిదా పడింది. అయితే యాక్సియం–4 మిషన్ కోసం ఉపయోగిస్తున్న ఫాల్కన్–9 రాకెట్‌లో ద్రవ ఆక్సిజన్ లీక్ అవుతున్నట్లు కొద్ది రోజుల క్రితం అధికారులు గుర్తించారు. దీంతో 11వ తేదీన జరగాల్సిన ప్రయోగాన్ని వాయిదా వేశారు. ఆ తర్వాత సమస్యను పరిష్కారమైనట్లు గుర్తించి 19న రోదసి యాత్ర ఉంటుందని తెలిపారు. కానీ ఇప్పుడు మళ్లీ వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. 'యాక్సియం–4 ప్రయోగ తేదీపై ఇస్రో బృందం సుదీర్ఘ చర్చలు జరిపింది. ప్రయోగ సంసిద్ధతపై నాసా, స్పేస్‌ఎక్స్‌తో యాక్సియం స్పేస్ సంప్రదింపులు జరిపింది. ఇటీవల చేపట్టిన మరమ్మతులు, వాతావరణ పరిస్థితులు, సిబ్బంది ఆరోగ్య పరిస్థితిని పరిగణనలోకి తీసుకున్నాక జూన్ 22ను తదుపరి ప్రయోగ తేదీగా యాక్సియం స్పేస్ వెల్లడించింది' అని ఇస్రో తెలిపింది. ఆ తర్వాత కేంద్రమంత్రి జితేందర్ సింగ్ కూడా అదే చెప్పారు. కాగా, యాక్సియం–4 కింద మరో ముగ్గురు ఆస్ట్రోనాట్లతో కలిసి శుభాంశు రోదసియాత్ర చేపట్టనున్నారు. అమెరికాకు చెందిన వాణిజ్య అంతరిక్ష సంస్థ యాక్సియం స్పేస్ మిషన్‌ను నిర్వహిస్తోంది. ఇస్రో, అమెరికా అంతరిక్ష సంస్థ (నాసా), ఐరోపా అంతరిక్ష సంస్థ (ఇఎస్ఎ)లు ఇందులో భాగస్వామ్యం వహిస్తున్నాయి. స్పేస్ క్యాప్సూల్‌ను ఫాల్కన్9 రాకెట్ నింగిలోకి మోసుకెళుతోంది. ఇందులో శుభాంశు మిషన్ పైలట్ బాధ్యతలు నిర్వహిస్తారు. భూమి నుంచి బయల్దేరిన 28 గంటల తర్వాత శుభాంశు పైలట్‌గా బాధ్యతలు వహించే వ్యోమనౌక అంతర్జాతీయ అంతరిక్ష కేం ద్రం (ఐఎస్ఎస్)తో అనుసంధానమవుతుంది. ఆ తర్వాత అతడి బృందం అక్కడే 14 రోజుల పాటు ఉంటుంది. భారరహిత స్థితిలో పలు ప్రయోగాలు నిర్వహించడంతో పాటు ప్రధాని మోదీ, పాఠశాల విద్యార్థులు, ఇతరులతో ముచ్చటించనుంది.

## స్కూళ్లల్లో' హిందీ 3వ భాష 'కంపల్సరీ' కాదు



వెనక్కి తగ్గిన మహారాష్ట్ర ప్రభుత్వం

ఏ భారతీయ భాషనైనా మూడోభాషగా ఎంచుకోవచ్చు

**ముంబయి / పుణే :** మహారాష్ట్రలోని ఇంగ్లీష్, మరాఠీ మీడియం స్కూళ్లలో 1వ తరగతి నుంచి 5వరకు చదివే విద్యార్థులకు విధిగా హిందీని బోధించాలని ఇటీవల హిందీని 'సాధారణంగా' మూడవ భాషగా చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిన మహారాష్ట్ర ప్రభుత్వం కాస్త వెనక్కు తగ్గింది. గత ప్రభుత్వ తీసుకున్న నిర్ణయంపై ఆందోళనలు ప్రారంభమయ్యాయి. కాంగ్రెస్ పార్టీ, ఎంఎన్ఎస్ ప్రెసిడెంట్ రాజ్ థాకరే నుంచి తీవ్ర విమర్శలు వచ్చాయి. దీంతో మహారాష్ట్ర సర్కారు తన నిర్ణయాన్ని మార్చుకుంది. సాధారణంగా 3వ భాష తప్పనిసరికాదు' అని స్పష్టంచేసింది. బుధవారం మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ మాట్లాడుతూ హిందీని నేర్చుకోవడం 'కంపల్సరీ(తప్పనిసరి)' అనే పదాన్ని తొలగిస్తున్నామని, ఏ భారతీయ భాషనైనా మూడవ భాషగా ఎంచుకోవచ్చని స్పష్టం చేశారు. హిందీని మూడవ భాషగా చేస్తూ జారీచేసిన ఉత్తర్వులపై వివాదం తీవ్రస్థాయిలో రాజుకోవడంతో మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఈ నిర్ణయాన్ని తీసుకున్నారు. హిందీని సాధారణంగా మూడవ భాషగా మారుస్తూ మంగళవారం నాడు మహారాష్ట్ర ప్రభుత్వం తీర్మానం చేసి ఉత్తర్వులు జారీ చేసింది. హిందీ లేదా ఏదైనా మరో ఇతర భాషను ఎంచుకోవాలంటే తరగతిలో ఆ భాషను ఎంచుకునేవారు కనీసం 20మంది విద్యార్థులు ఉండాలని స్పష్టంచేసింది. కాంగ్రెస్ పార్టీ దీనిపై స్పం దిస్తూ 'మరాఠీ ప్రజల ఛాతీపై సిఎం ఫడ్నవీస్ కత్తిదించారు' అని ఆరోపించింది. జాతీయ విద్యా విధానం పాలసీ (ఎన్ఇపి)2020తో అనుసంధానిస్తూ 'స్టేట్ కర్రిక్యులమ్ ఫ్రేమ్ వర్క్ ఫర్ స్కూల్ ఎడ్యుకేషన్ 2024'అమలు చేయడంలో భాగంగా ప్రభుత్వ తీర్మానం ఉత్తర్వులను పాఠశాల విద్య విభాగం జారీచేసింది.



# జనరల్
STATE & REGIONAL NEWS

## సిఎం రేవంత్ రెడ్డికి ఎమ్మెల్యే రాజా సింగ్ ధన్యవాదాలు

ప్రజాపక్షం/హైదరాబాద్ : కొత్త గోశాల నిర్మించాలనే నిర్ణయం, తల్లి ఆవు గురించి ఆలోచించినందుకు, విధివిధానాలపై కమిటీని వేసినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బిజెపి ఎమ్మెల్యే రాజాసింగ్ ధన్యవాదాలు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడారు. వేల సంఖ్యలో ఆవులు, దూడలు, ఎద్దులను అక్రమంగా వధశాలలకు తరలించి, చంపుతున్నారని అన్నారు. దాని గురించి సిఎం ప్లాన్ ఆఫ్ యాక్షన్ గురించి చెప్పాలని కోరారు. మోడల్ గోశాలలు కడుతున్నారని, చాలా మంచిదని తెలిపారు. గో రక్షణ గురించి ఒక స్పెషల్ పోలీస్ ఫోర్స్ తయారు చేయాలని, అందులో ఒక మెంబర్‌గా తనను కూడా చేర్చాలని రాజాసింగ్ సిఎం రేవంత్ రెడ్డిని కోరారు. దేశంలోని ముఖ్యమంత్రులందరిలో గోవులకు సేవ చేసే నిజమైన ముఖ్యమంత్రి ఎవరని అడిగితే, గుర్తుకు వచ్చే రెండవ పేరు రేవంత్ రెడ్డిదేనని అన్నారు. మొదటి పేరు యుపి సిఎం యోగి అని చెప్పారు. ఈ పనులన్నీ ముఖ్యమంత్రి చేస్తే భారత దేశంలో ఒక మంచి గుర్తింపు లభిస్తుందని రాజాసింగ్ అన్నారు.



### ఆపరేషన్ కగార్‌కు నిరసనగా..
## ఈనెల 23న చలో రాజ్‌భవన్
ఎఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర

ప్రజాపక్షం/హైదరాబాద్ : మావోయిస్టులతో శాంతి చర్చలు జరపకుండా ఆపరేషన్ కగార్ పేరుతో అమాయక గిరిజనులను, మావోయిస్టులను హతమారుస్తున్న కేంద్ర ప్రభుత్వ విధానాలను పౌర సమాజం తీవ్రంగా ఖండించాలని ఎఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర కోరారు. హైదరాబాద్ హిమాయత్‌నగర్‌లోని సత్యనారాయణరెడ్డి భవన్‌లో బుధవారం ఎఐవైఎఫ్ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో 'చలో రాజ్ భవన్ ముట్టడి' కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ధర్మేంద్ర మాట్లాడుతూ ఒకవైపు ప్రజలు, ప్రజా సంఘాలు, హక్కుల సంఘాలు, మావోయిస్టులు చర్చలకు సిద్ధమని, శాంతియుతంగా సమస్యను పరిష్కరిద్దాం, ఆయుధాల విషయాన్ని కూడా చర్చిద్దామంటూ కేంద్ర ప్రభుత్వానికి అనేకసార్లు విజ్ఞప్తి చేశారని గుర్తు చేశారు. అయినా కేంద్ర ప్రభుత్వం మూర్ఖంగా మావోయిస్టులను, గిరిజనులను కాల్చి చంపే నరహంతక చర్యలకు పాల్పడుతున్నదని విమర్శించారు. ఛత్తీస్‌ఘడ్ అడవుల్లో కార్పొరేట్ సంస్థలకు అక్కడి ఖనిజ సంపదనంతా ధారాదత్తం చేయడానికే కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్ చేపట్టిందని ధర్మేంద్ర మండిపడ్డారు. విప్లవోద్యమం అణిచివేతే లక్ష్యంగా సాగుతున్న ఆపరేషన్ కగార్ ఆదివాసీ హననానికి కారణం అవుతున్నదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా మావోయిస్టులతో చర్చలు జరిపి, శాంతియుత వాతావరణం తీసుకురావాలని ధర్మేంద్ర డిమాండ్ చేశారు. ఎఐవైఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నెర్లకంటి శ్రీకాంత్ మాట్లాడుతూ ఎఐవైఎఫ్ తెలంగాణ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో జూన్ 23న ఆపరేషన్ కగార్‌ను తక్షణం నిలిపేయాలని చేపట్టిన చలో రాజ్ భవన్ ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మర్రి శ్రీమాన్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆర్.బాలకృష్ణ, సల్మాన్ బేగ్, రాష్ట్ర సమితి సభ్యులు షేక్ మహమూద్, మాజీద్ అలీ ఖాన్, మోసిన్ ఖాన్ పాల్గొన్నారు.

## తక్షణమే ఇజ్రాయిల్ యుద్ధం ఆపాలి
సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్యపద్మ

ప్రజాపక్షం/హైదరాబాద్ : మధ్య ప్రాశ్చ్యంలో ఇజ్రాయిల్ సాగిస్తున్న మారణహోమాన్ని పౌరసమాజం తీవ్రంగా ఖండించాలని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్యపద్మ అన్నారు. సిపిఐ, సిపిఐ(ఎం), సిపిఐ(ఎం.ఎల్) న్యూడెమోక్రసీ, సిపిఐ(ఎంఎల్) మాస్‌లైన్, ఎంసిపిఐ(యు), సిపిఐ(ఎంఎల్)లిబరేషన్, ఎస్‌యుసిఐ(సి) రివల్యూషనరీ సోషలిస్టు పార్టీ, ఫార్వర్డ్ బ్లాక్, సిపిఐ(ఎంఎల్) వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో ఈనెల 19న ఉదయం 11.00 గంటలకు హైదరాబాద్ నానక్‌రామ్‌గూడ ఫైనాన్షియల్ డిస్ట్రిక్, యు.ఎస్. కన్సలేట్ కార్యాలయం ముందు ఇజ్రాయిల్ మారణహోమం తక్షణమే ఆపాలని డిమాండ్ చేస్తూ నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పశ్య తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ప్రజలు, ప్రజాసంఘాలు విజయవంతం చేయాలని కోరారు.

## సుగుణమ్మకు తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం సంతాపం

ప్రజాపక్షం/హైదరాబాద్ : భూమికోసం, భుక్తి కోసం వెట్టి చాకిరి విముక్తి కోసం, భూస్వామ్య, ఫ్యూడల్ వ్యవస్థలకు, జమీందారీ జాగీర్థారీ దౌర్జన్యాలకు వ్యతిరేకంగా, నిజాం నిరంకుశ పాలనను అంతమొందించటానికి సాగిన తెలంగాణ సాయుధ పోరాటంలో ప్రత్యక్షంగా పాల్గొన్న సమరాంగణ సుగుణమ్మకు తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు భాగం హేమంతరావు, పశ్యపద్మ సంతాపం తెలిపారు. సుగుణమ్మ 1986వ సంవత్సరంలో గోదావరిఖనిలో జరిగిన మహిళా సమాఖ్య ఏడవ మహాసభలలో రాష్ట్ర సహాయ కార్యదర్శిగా ఎన్నికయ్యారన్నారు. తరువాత జరిగిన మహాసభలలో మహిళా సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఎన్నికయ్యారని, 2004వ సంవత్సరం వరకు కొనసాగారని చెప్పారు. తుది శ్వాస విడిచేంత వరకు నిరుపేద ప్రజల పక్షపాతిగా సుగుణమ్మ నిలిచారని కొనియాడారు. సుగుణమ్మ కుటుంబ సభ్యులకు వారు తమ సానుభూతిని తెలిపారు.

## వివిఐపి అతిథి గృహం నిర్మాణంపై నిపుణుల కమిటీ

ప్రజాపక్షం/హైదరాబాద్ : ప్రభుత్వ, ప్రైవేట్ రంగాలకు చెందిన ఉన్నత స్థాయి ప్రతినిధులతో సమావేశాలు, వారి వసతి కోసం డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ (ఎంసిహెచ్‌ఆర్‌డిఐ) ప్రాంగణంలో చేపడుతున్న వివిఐపి గెస్ట్‌హౌస్ నిర్మాణంలో భాగంగా చేపడుతున్న నిర్మాణాలపై నిపుణుల కమిటీ నియమించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుకు ముఖ్యమంత్రి కార్యాలయం (సిఎంఒ) సూచించింది. వివిఐపి గెస్ట్‌హౌస్ నిర్మాణంలో భాగంగా చేపడుతున్న నిర్మాణాల అవసరం, వాటికి చేస్తున్న వ్యయంపై మదింపునకు నిర్మాణ రంగ నిపుణులతో కమిటీ నియమించాలని సిఎంఒ స్పష్టం చేసింది. నిపుణుల కమిటీ ఆ నిర్మాణాలను పరిశీలించి తమ సిఫార్సులతో నివేదిక సమర్పించాలని సిఎంఒ కోరింది.

### హైడ్రాను అడ్డంపెట్టుకుని బ్లాక్‌మెయిల్
## దందాలు చేస్తున్న రేవంత్‌రెడ్డి అండ్ కో
బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు

ప్రజాపక్షం/హైదరాబాద్ : హైడ్రాను అడ్డం పెట్టుకుని రేవంత్ రెడ్డితో పాటు కాంగ్రెస్ నాయకులంతా బ్లాక్‌మెయిల్ దందాలు చేస్తున్నారని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.టి.రామారావు ఆరోపించారు. రేవంత్ రెడ్డితో పాటు ఆయన కుటుంబసభ్యులు, కాంగ్రెస్ నేతలు అక్రమంగా కట్టుకున్న ఏ ఒక్క ఇంటి జోలికి వెళ్లడానికి సాహసించని హైడ్రా, పేదల ఇళ్ల మీద మాత్రం ప్రతాపం చూపిస్తున్నదని కెటిఆర్ విమర్శించారు. ఇటీవల ఆత్మహత్య చేసుకున్న బిఆర్‌ఎస్ బోరబండ డివిజన్ మైనార్టీ నాయకుడు మహ్మద్ సర్దార్ కుటుంబాన్ని కెటిఆర్ పరామర్శించారు. ఆయన కుటుంబసభ్యులను ఓదార్చారు. సర్దార్ ఇద్దరు చిన్నపిల్లలను చూసి కెటిఆర్ ఉద్వేగానికి లోనయ్యారు. తన ప్రాణం ఉన్నంత వరకు సర్దార్ కుటుంబానికి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ యుపిలో బుల్డోజర్ రాజ్యం నడుస్తుందని గొంతుచించుకుంటున్న రాహుల్ గాంధీకి, తెలంగాణలో రేవంత్‌రెడ్డి చేస్తున్న అరాచకాలు కనిపించడం లేదా? అని ప్రశ్నించారు. రాహుల్ గాంధీ మొహబ్బత్ కా దుకాణ్ అంటుంటే, తెలంగాణను రేవంత్ రెడ్డి నఫ్రత్ కా మకాన్ లాగా మార్చేశాడని విమర్శించారు. అధికారం కోల్పోయాక కూడా కెసిఆర్ సైనికుడిగా బిఆర్‌ఎస్‌లోనే ఉన్న సర్దార్‌ను కాంగ్రెస్‌లోకి రావాలని స్థానిక కార్పొరేటర్ అధికారమత్తులో వేధించాడని విమర్శించారు. పార్టీ మారడానికి ఒప్పుకోకపోవడంతో కక్ష కట్టి సర్దార్ ఇంటిని, షాప్‌ను కూల్చివేయించాడని ఆరోపించారు.

### రెవెన్యూ, నీటిపారుదల శాఖల..
## ఎన్‌ఒసిలతోనే భవన నిర్మాణ అనుమతులు

ఖాజాగూడలో చెరువు, ప్రభుత్వ భూమి అంటూ.. హైకోర్టులో కాంగ్రెస్ ఎమ్మెల్యేల ప్రజాహిత వ్యాజ్యం



ప్రజాపక్షం/హైదరాబాద్ : జిహెచ్‌ఎంసి పరిధిలోని ఖాజాగూడ గ్రామంలోని ప్రభుత్వ భూమి, చెరువు ప్రాంతంలో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని ఆరోపిస్తూ కాంగ్రెస్ పార్టీకి చెందిన నలుగురు ఎమ్మెల్యేలు సోమవారం హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టులో ఎమ్మెల్యులు జనంపల్లి అనిరుద్ధ్ రెడ్డి, యెన్నం శ్రీనివాస్ రెడ్డి, భూక్య మురళీ నాయక్, కుచుకుల్ల రాజేష్ రెడ్డిలు ప్రజాహిత వ్యాజ్యం దాఖలు చేశారు. ఈ నిర్మాణాలు ఖాజాగూడ గ్రామంలో ప్రభుత్వ భూమిని, చెరువును ఆక్రమించుకొని నిర్మిస్తున్నారనే అభియోగాలపై న్యాయస్థానాన్ని ఆశ్రయించారు.

**ఎన్‌ఒసిలతోనే నిర్మాణ అనుమతులు..**
అయితే రెవెన్యూ, నీటిపారుదల శాఖల నిరంభ్యతర ధృవీకరణ పత్రం (ఎన్‌ఒసి)లతోనే ప్రభుత్వ భూమి అని ఎమ్మెల్యేలు ఆరోపిస్తున్న స్థలంలో సదరు నిర్మాణ సంస్థకు భవన నిర్మాణ అనుమతులు ఇచ్చామని జిహెచ్‌ఎంసి అధికారులు చెప్పుతున్నారు. ఈ విషయాన్ని జిహెచ్‌ఎంసి సంబంధిత అధికారులను 'ప్రజాపక్షం' వాకబు చేయగా, రంగారెడ్డి జిల్లా కలెక్టర్, సిసిఎల్‌ఎ నుంచి స్థలానికి సంబంధించిన ఎన్‌ఒసిలను దరఖాస్తులకు జతపర్చారని తెలిపారు. అలాగే నీటిపారుదల శాఖ సైతం సదరు నిర్మాణ సంస్థకు ఎన్‌ఒసి ఇచ్చిందని చెప్పారు. రెవెన్యూ, నీటిపారుదల శాఖల నుంచి జారీ అయిన ఎన్‌ఒసిల ఆధారంగానే భవన నిర్మాణ అనుమతులు మంజూరు చేశామని సంబంధిత అధికారులుస్పష్టం చేశారు.

**మార్పులు కోరుతూ రివైజ్డ్ ప్లాన్‌లకు నిర్మాణ సంస్థ దరఖాస్తు..**
అయితే ఇటీవల నిర్మాణ సంస్థ భవనాల నిర్మాణంలో మార్పులు, చేర్పులు కోరుతూ రివైజ్డ్ ప్లాన్‌లకు అనుమతులు మంజూరు చేయాలని జిహెచ్‌ఎంసికి దరఖాస్తు చేసినట్లు తెలిసింది. రెవెన్యూ, ఎఫ్‌టిఎల్ లాంటి వివాదస్పద ఆరోపణలు రావడంతో రివైజ్డ్ ప్లాన్‌లకు అనుమతులు ఇచ్చే విషయంలో అచితూచి నిర్ణయం తీసుకోవాలనే ధోరణిలో ఉన్నట్లు సమాచారం. దీంతో జిహెచ్‌ఎంసి అధికారులు సదరు ఫైలను పెడింగ్‌లో పెట్టినట్లు తెలిసింది.

**గూగుల్ ఎర్త్ శాటిలైట్ చిత్రాల్లో నీటి జాడలు..**
గూగుల్ ఎర్త్ శాటిలైట్ చిత్రాల ప్రకారం 2008 నుంచి 2022 వరకు చెరువు నీటిమట్టం 50 శాతం కన్నా తక్కువగా ఉన్నా, చాలా ప్రాంతాల్లో నీటి జాడలు కనిపిస్తున్నాయి. 2022 అక్టోబర్‌లో తీసిన చిత్రం ప్రకారం, ఎఫ్‌టిఎల్ సరిహద్దులకు బయట కూడా నీటి జాడలు ఉన్నట్టు తెలుస్తోంది. మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ క్యాంపస్, ఈ చెరువుకి పరరీవాహక ప్రాంతంగా కనిపిస్తోంది. పరిసర ప్రాంతాల్లోని భూములు కూడా భగీరథమ్మ చెరువు, ఖాజాగూడ పెద్ద చెరువు, ఎల్లమ్మ చెరువు వంటి అనేక చెరువులకు జీవనాధారంగా ఉన్నాయి.

**అక్కడ అకాశాన్ని తాకే ధరలు..**
ఈ ప్రాజెక్టు జిహెచ్‌ఎంసి అనుమతితో పాటు, రియల్‌ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ (రేరా) లోనూ నమోదు అయిందని తెలిసింది. ఒక ప్రముఖ ఆన్‌లైన్ రియల్ ఎస్టేట్ పోర్టల్ ప్రకారం, ఇక్కడ అపార్ట్‌మెంట్‌ల ధరలు రూ.6.5కోట్ల నుంచి రూ.19కోట్ల వరకు ఉంటాయని పేర్కొంది. విశేషంగా, నిర్మాణ సంస్థ వెబ్‌సైట్‌లోని చిత్రాల్లో పరిసర చెరువులు భగీరథమ్మ చెరువు, ఖాజాగూడ పెద్ద చెరువు, ఎల్లమ్మ చెరువు వంటివి కనిపిస్తున్నా, నిర్మాణం జరుగుతున్న సరస్సును మాత్రం ప్రస్తావించకపోవడం గమనార్హం.

**ఎఫ్‌టిఎల్‌ను చదును చేసి రోడ్డుగా..**
పేరుగాంచిన నిర్మాణ సంస్థ ఒక ఖరీదైన గృహ సముదాయాన్ని అక్కడ నిర్మిస్తోందని అభియోగాల్లో ఎమ్మెల్యేలు పేర్కొన్నారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో తీసిన శాటిలైట్ చిత్రాల్లో చెరువు ఎఫ్‌టిఎల్ ప్రాంతంలో భారీగా భూమిని సమాంతరం చేసి, అక్కడ కట్టడాలు కోసం భారీ వాహనాలు వెళ్లే దారిని ఏర్పాటు చేసినట్టు స్పష్టంగా కనిపిస్తోందని పిటిషన్‌లో పేర్కొన్నారు.
అంతేకాదు, జలవనరుల శాఖ మ్యాపులలో పేర్కొన్న బఫర్ జోన్‌లోనూ నిర్మాణాలు జరుగుతున్నాయని ఆరోపించారు. నానక్‌రామ్‌కుంట రంగారెడ్డి జిల్లాలోని నానక్‌రామ్‌గూడ గ్రామానికి చెందినదిగా హెచ్‌ఎండిఎ రికార్డుల్లో ఉంది. చెరువునకు గుర్తింపు సంఖ్య 3712గా ఉంది. దీనికి తుది నోటిఫికేషన్ మే 2016లో విడుదలైంది.

**గూగుల్ శాటిలైట్ చిత్రాల్లో మార్పులు..**
హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్, అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ చీఫ్ ఎవి. రంగనాథ్ ఆధ్వర్యంలో చెరువు సంరక్షణ కమిటీ పరిధిలోకి ఔటర్ రింగ్ రోడ్‌లో ఉన్న అన్ని చెరువులు వస్తాయని తెలిపారు. ఈ విషయాన్ని అనిరుద్ధ్ రెడ్డి మార్చిలోనే రంగనాథ్ దృష్టికి కూడా తీసుకెళ్లినట్టు చెప్పారు. రెవెన్యూ శాఖ సర్వే నెంబర్‌లలో మార్పులు చేసి అక్రమలావాదేవీలకు అవకాశమిచ్చిందని ఆరోపించారు. హెచ్‌ఎండిఎ వెబ్‌సైట్‌లోని చెరువునకు పూర్తి సర్వే మ్యాప్ తొలగించారు. అందులో వివరంగా కనిపించాల్సిన చెరువు ప్రాంతాల్లో ఉన్న సర్వే నెంబర్లు కేవలం ఒక డాక్యుమెంట్ రూపంలో మాత్రమే చూపుతున్నారని చెప్పారు. ఈ మేరకు, చెరువు ప్రాంతంలోని ప్రభుత్వ భూమిని 6 ఎకరాలు 17 గుంటలు, బఫర్ జోన్‌లోని ప్రభుత్వ భూమిని 34 గుంటలుగా చూపుతున్నట్టు తెలిపారు.

## ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం
### డిజిపి జితేందర్, ఐపిఎస్ అధికారి అనిల్‌కుమార్‌ను 'సిట్' విచారణ



ప్రజాపక్షం/హైదరాబాద్ : ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. రాష్ట్ర డిజిపి డాక్టర్ జితేందర్‌తో పాటు ఐపిఎస్ అధికారి అనిల్ కుమార్‌లను సిట్ దర్యాప్తు బృందం ప్రశ్నించింది. జితేందర్ అప్పటి హోమ్ ప్రిన్సిపల్ సెక్రటరీగా ఉండగా అనిల్‌కుమార్ అప్పటి ఇంటిలిజెన్స్ చీఫ్‌గా పనిచేశారు. ఆ సమయంలోనే ఎస్‌ఐబి చీఫ్‌గా ఉన్న టి.ప్రభాకర్‌రావు ఫోన్ ట్యాపింగ్‌కు శ్రీకారం చుట్టారు. దీంతో జితేందర్, అనిల్‌కుమార్‌లు ఫోన్ ట్యాపింగ్ రివ్యూ కమిటీలో కీలక సభ్యులుగా ఉన్నారు. దీంతో వారి స్టేట్మెంట్ ఇప్పుడు కీలకంగా మారనుంది. ఇదిలా ఉంటే రాష్ట్రంలో ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న ప్రభాకర్‌రావు తన విచారణలో వెల్లడించిన అంశాలను రూఢీ చేసుకునేందుకే వీరిద్దరిని విచారించారు. ఎస్‌ఐబి అధికారులు ఫోన్ ట్యాపింగ్ చేయాలంటే ''ఫోన్ ట్యాపింగ్ రివ్యూ కమిటి'' అనుమతి తీసుకోవాలి. అయితే ప్రభాకర్‌రావు ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడిన సమయంలో రివ్యూ కమిటీకి దరఖాస్తు చేసుకున్నాడా లేదా అనే విషయంపై సందిగ్ధంగా మారింది. అయితే నక్సల్స్ ఫోన్ ట్యాపింగ్ పేరుతో కాంగ్రెస్ నేతలు, జర్నలిస్టులు, జడ్జిలు, సినీ ప్రముఖుల ఫోన్‌లు ట్యాపింగ్‌కు పాల్పడిన విషయం తెలిసిందే. నక్సల్స్‌ని అడ్డం పెట్టుకుని ప్రభాకర్‌రావు రివ్యూ కమిటీని పక్కదారి పట్టించారా అనే అంశాలు కూడా వెలుగు చూడాల్సి ఉంది. ఈ విషయంపై డిజిపి జితేందర్ స్పందిస్తూ సిట్ అధికారులకు తన వాంగ్మూలం ఇచ్చానని తెలిపారు. తన స్టేట్‌మెంట్‌ను సిట్ అధికారులు రికార్డు చేసుకున్నారని స్పష్టం చేశారు. ఫోన్ ట్యాపింగ్ రివ్యూ కమిటీలో జితేందర్ ఉన్న సమయంలో ప్రభాకర్‌రావు నుంచి ఎలాంటి సిఫారసు రాలేదని తెలుస్తుంది.

**ఎస్‌ఐబి సస్పెండెడ్ డిఎస్‌పి ప్రణీత్‌రావును విచారించిన 'సిట్'**

ఫోన్ ట్యాపింగ్ కేసులో బెయిల్‌పై ఉన్న ఎస్‌ఐబి సస్పెండ్ డిఎస్‌పి ప్రణీత్ రావును సిట్ అధికారులు బుధవారం విచారించారు. బాధితుల నుంచి వాంగ్మూలాలు స్వీకరించిన సిట్ అధికారులు వాటిని బేరీజు వేసుకుని ప్రణీత్‌రావును ప్రశ్నించారు. ఎస్‌ఐబి మాజీ చీఫ్ టి.ప్రభాకర్‌రావు చెబితేనే తాము ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడినట్లు మరోసారి ప్రణీత్‌రావు సిట్ అధికారుల ముందు వివరించారు. ఫోన్ ట్యాపింగ్ డేటా మరెక్కడైన భద్రపరిచారా అనే విషయంపై కూడా ఆరా తీశారు. ఇదిలావుండగా టిపిసిసి అధికార ప్రతినిధి జైపాల్‌రెడ్డి జూబ్లీహిల్స్ ఎసిపి కార్యాలయంలో సిట్ విచారణ అధికారులను కలిసి ఫోన్ ట్యాపింగ్‌పై ఫిర్యాదు చేశారు.

### మూడో రోజు 4 ఎకరాల వరకు
## రైతు భరోసా నిధులు విడుదల



ప్రజాపక్షం/హైదరాబాద్ : రైతు భరోసాలో భాగంగా బుధవారం 4ఎకరాలకు వరకు రైతుల ఖాతాలో నిధులు జమ చేసినట్టు వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఇందు కోసం రాష్ట్ర ప్రభుత్వం మరో చేసినట్టు తెలిపారు. దీంతో 6.33 లక్షల మంది రైతులకు సంబంధించి 21.89లక్షల ఎకరాలకు గాను రూ.1313.53 కోట్లు రైతుల ఖాతాల్లో జమా చేశామన్నారు. రైతు భరోసా కింద ఇప్పటి వరకు మొత్తం 58.04 మంది రైతులకు గాను రూ. 5215.26 కోట్లు సహాయం అందించినట్లు మంత్రి తెలిపారు. 9 రోజుల్లో రూ.9 వేల కోట్లను రైతుల ఖాతాలలో జమ చేస్తానని ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ మేరకు వరుసగా మూడో రోజు రైతు భరోసా నిధులు విడుదల చేశామన్నారు.

**రైతు భరోసాపై బిఆర్‌ఎస్ నాయకులకు ప్రశ్నించే హక్కు లేదు : మంత్రి తుమ్మల**

రైతుభరోసా విషయంలో బిఆర్‌ఎస్ నాయకులకు తమ ప్రభుత్వాన్ని ప్రశ్నించే నైతిక హక్కు లేదని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. గతంలో బిఆర్‌ఎస్ ప్రభుత్వం ఒక సందర్భంలో మినహా, వానాకాలం రైతుబంధు సహాయం ఎప్పుడు సాగు కాలానికి ముందుగా ఇవ్వలేకపోయిందన్నారు. ప్రతిసారి ఆలస్యంగానే రైతుబంధు నిధులు రైతుల ఖాతాలలోకి జమ చేసారని, అదికూడా 10వ నెల వరకు కొనసాగించారన్నారు. ఏ ఒక్క సందర్భంలో కూడా 3 రోజుల్లోనే రూ.5వేల కోట్లకు పైగా రైతుబంధు కోసం ఖర్చు పెట్టిన దాఖలాలు లేవని మంత్రి పేర్కొన్నారు. ఇప్పటికైనా బిఆర్‌ఎస్ నాయకులు ఆత్మ విమర్శ చేసుకొని మా ప్రభుత్వంపై విమర్శలు మానుకోవాలని, లేదంటే తెలంగాణ రైతాంగం ఎప్పటికి క్షమించరని హెచ్చరించారు.

## కెసిఆర్ చెప్పినవాటిని వక్రీకరించారు : హరీశ్‌రావు

ప్రజాపక్షం/హైదరాబాద్ : బోడగుండుకు, మోకాలుకు లంకె పెట్టి మాట్లాడటంలో సిఎం రేవంత్ రెడ్డి సిద్ధహస్తుడని మరోసారి రుజువైందని బిఆర్‌ఎస్ నీటిపారుదల శాఖ మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. అపెక్స్ కౌన్సిల్ మీటింగ్‌లో కెసిఆర్ చెప్పిన వాటిని దురుద్దేశపూర్వకంగా సిఎం వక్రీకరించారని ఆరోపించారు. రాజకీయ లబ్ధి పొందాలనే వక్ర బుద్ధే తప్ప, తెలంగాణ నీటి ప్రయోజనాలు కాపాడాలనే తపన లేదని హరీశ్‌రావు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజలను తప్పుదారి పట్టించేందుకు ఉద్దేశపూర్వకంగా అపెక్స్ కౌన్సిల్ మీటింగ్‌లోని అజెండా 5లోని అంశాలు దాచిపెట్టి, అజెండా నం.1 అంశాలను మాత్రమే సిఎం ప్రస్తావించారని చెప్పారు. గోదావరి, కృష్ణ నదుల అనుసంధానం ప్రాజెక్టుల విషయంలో తెలంగాణను సంప్రదించకుండా ఎట్టి పరిస్థితుల్లోనూ ముందుకు పోకూడదని, ఒకవేళ వెళ్తే అందుకు తెలంగాణ అంగీకరించబోదని, అపెక్స్ కౌన్సిల్ మీటింగ్ అజెండా 5లో స్పష్టం చేసినట్టు హరీశ్ రావు వివరించారు. ఈ విషయాన్ని కావాలని దాచిపెట్టి, స్వార్థపూరిత రాజకీయ లక్ష్యాల కోసం సిఎం అసత్యాలను చెబుతున్నారని, అబద్దాల పునాదులపైన జరిగిన సిఎం రేవంత్ తతంగాన్ని ప్రజలు విశ్వసించబోరని హరీశ్‌రావు తెలిపారు.



## డ్రగ్స్, గంజాయి కేసులో 8 మంది అరెస్టు

ప్రజాపక్షం/హైదరాబాద్: బెంగుళూరు నుంచి హైదరాబాద్‌కు డ్రగ్స్ సరఫరా చేస్తున్న ఓ ముఠా గుట్టును ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులు రట్టు చేశారు. ఈ క్రమంలోనే ఇద్దరు ప్రధాన నిందితులతో పాటు మరో ముగ్గురిని అరెస్టు చేశారు. మరో ఘటనలో దూల్‌పేట్‌లో గంజాయి విక్రయిస్తుండగా ముగ్గురిని అరెస్టు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. హైదరాబాద్‌కు చెందిన డ్రగ్స్‌ను కొనుగోలు చేయడానికి వచ్చిన బాషాపాగ ప్రవీణ్ రాజ్, ఎండి అస్లామ్ హుస్సేన్, సంగ ప్రేమ్‌సాయిలు కొనుగోలు సమయంలో పట్టుకున్నారు. హైదరాబాద్‌కు చెందిన వరాల దీక్షిత్, కొండబోయిన వరుణ్ తేజ్‌లు బెంగుళూరు నుంచి తక్కువ ధరకు డ్రగ్స్‌ను తీసుకువచ్చి హైదరాబాద్‌లో ఎక్కువ ధరలకు అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. దీంతో విశ్వసనీయ సమాచారం మేరకు ఎస్‌టిఎఫ్‌బి టీం సిఐ భిక్షారెడ్డి, ఎస్‌ఐలు బాలరాజు, సంధ్యలు బుధవారం వారిద్దరినీ డ్రగ్స్ విక్రయిస్తుండగా పట్టుకున్నారు. వీరితో పాటు డ్రగ్స్ ఖరీదు చేసేందుకు వచ్చిన మరో ముగ్గురిని అరెస్టు చేశారు. వీరి నుంచి సి 6.34 గ్రాముల ఎండిఎంఎ డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు.

**1.248 కేజీల గంజాయి పట్టివేత..** ధూళిపేట్ బలరామ్‌గల్లీలో గంజాయి అమ్మకాలు జరుపుతున్నారనే సమాచారం మేరనకు ఎస్‌టిఎఫ్ ఏ టీమ్ సిబ్బంది 1.248 కేజీల గంజాయిని పట్టుకున్నారు. ధూల్‌పేట్‌కు చెందిన నలుగురుపై కేసు నమోదు చేసినట్లు టీమ్ నంద్యాల అంజి రెడ్డి తెలిపారు. దుర్గేష్ సింగ్, గూలాబ్‌సింగ్, కాళీబాయిలను అరెస్టు చేశారు. రాజు సింగ్ అనే వ్యక్తి పరారీలో ఉన్నట్లు తెలిపారు.

# భారత్–కెనడా ద్వైపాక్షిక సంబంధాల పునరుద్ధరణ

దౌత్యవేత్తల నియామకం
చర్చల్లో మోదీ– కార్నీ అంగీకారం

న్యూఢిల్లీ/కననస్కిస్ : భారత్–కెనడా దేశాల సంబంధాలలో స్థిరత్వాన్ని, ద్వైపాక్షిక సంబంధాలను పునరుద్ధరించాలని అంగీకారం కుదిరింది. జి–7 సదస్సులో పాల్గొనేందుకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ కెనడా వెళ్ళిన సందర్భంగా ఆ దేశప్రధానమంత్రి మార్క్ కార్నీతో మంగళవారంనాడు ద్వైపాక్షిక చర్చలు జరిపారు. రెండు దేశాలమధ్యా పరస్పర విశ్వాసాన్ని పునర్నిర్మించేందుకు, సంబంధాలను తిరిగి ఉద్ధృతంగా కొనసాగించేందుకు అన్నిస్థాయిలలోనూ ఆచరణాత్మక కార్యకలాపాలు తిరిగి ప్రారంభించాల్సిన అవసరాన్ని ఇద్దరు ప్రధానమంత్రులు గట్టిగా చెప్పారు. 2023లో జస్టిన్ ట్రూడో ప్రధానమంత్రిగా ఉండగా భారత్ సార్వభౌమాధికారానికి వ్యతిరేకంగా ఖలిస్థాన్ శక్తులను ప్రోత్సహించిన దుందుడుకు వైఖరి కారణంగా మనదేశంతో కెనడా సంబంధాలు దెబ్బతిన్నాయి.
మోదీ–కార్నీ మధ్య తాజాగా జరిగిన చర్చల మేరకు రెండు దేశాలూ పర్యస్పరం దౌత్యవేత్తలను నియమించుకోవాలని నిర్ణయించారు. ఈ మేరకు కెనడా రాజధాని ఒట్టావాలో భారత దౌత్యవేత్తల నియామకం జరుగుతుంది. భారత రాజధాని ఢిల్లీలో కెనడా దౌత్యవేత్తల నియామకం జరుగుతుంది. భారత విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ ఈ మేరకు బుధవారంనాడు ఒక ప్రకటన విడుదల చేసింది. భారత్–కెనడా దేశాలమధ్య ప్రజాస్వామ్య విలువల భాగస్వామ్యంపై ఆధారపడిన సంబంధాల ప్రాముఖ్యతను నాయకులిద్దరూ పునరుద్ఘాటించారు. ప్రజాస్వామ్యబద్ధమైన చట్టాలు, నిబంధనలకు కట్టుబడి, సార్వభౌమాధికార, ప్రాదేశిక సమగ్రత సూత్రాలను గౌరవిస్తూ అందుకు అనుగుణంగా వంమహరించాలని నాయకులు ఇద్దరూ ఉద్ఘాటించారు. భారత్ వ్యతిరేక కార్యకలాపాలు కొనసాగించేందుకు ఖలిస్థాన్ అనుకూల శక్తులను అనుమతించవద్దని కెనడాపై ఒత్తిడి తీసుకురావడం ప్రధానాంశంగా ప్రకటన పేర్కొంది. ఇపిటిఎ (సత్వర వాణిజ్య ఒప్పంద పురోగతి)పై స్తంభించిన సంప్రదింపులను పునఃప్రారంభించేందుకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరాన్ని నాయకులు ఇద్దరూ ఉద్ఘాటించారు. సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందం (సిఇపిఎ) చేసుకోవడానికి మార్గం సుగమం చేసేందుకు వీలుగా ఇపిటిఎ సంప్రదింపులు పునఃప్రారంభించాలని మోదీ–మార్క్ కార్నీ నిర్ణయించారు.
సోషల్ మీడియాలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఒక పోస్టింగ్ పెడుతూ, ''భారత్–కెనడా దేశాలూ రెండు ప్రజాస్వామ్యం,స్వాతంత్ర్యం, చట్టనిబంధనలపట్ల బలమైన విశ్వాసంతో అనుసంధానమయ్యాయి'' అని పేర్కొన్నారు. భారత్–కెనడా మైత్రిని తిరిగి వైభవం తీసుకువచ్చేందుకు సన్నిహిత సంబంధాలు కొనసాగించేందు కలిసి పనిచేయాలని కోరుకుంటున్నాం అని పేర్కొన్నారు. పరస్పర గౌరవం పునాదులపై నిర్మాణాత్మకమైన, సమతుల్యమైన భాగస్వామ్యంకోసం, రెండు దేశాలమధ్య సంబంధాలను, ఆర్థికపరమైన సంబంధాలను వృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఉందని ప్రధానమంత్రులు ఇద్దరూ అభిప్రాయపడినట్లు విదేశీమంత్రిత్వశాఖ తన ప్రకటనలో తెలిపింది.
చాలా నిష్పక్షపాతంగా, ముందుచూపుతో రెండు దేశాల మధ్య సంబంధాలను కొనసాగించేందుకు చర్చలు కొనసాగించడానికి ఈ సమావేశం ఒక సదావకాశంగా లభించిందని పేర్కొన్నారు. మార్క్ కార్నీ ప్రధానమంత్రిగా పదవీబాధ్యతలు చేపట్టిన తర్వాత రెండు దేశాల ప్రధానమంత్రులూ ముఖాముఖీ కలుసుకుని సంభాషణలు చేయడం ఇదే మొదటిసారి. ఖలిస్థాన్ అనుకల వేర్పాటువాది హర్‌దీప్ సింగ్ నిజ్జార్ హత్య తర్వాత 2023లో భారత్–కెనడా దేశాలమధ్య సంబంధాలు పునాదిస్థాయిలో పూర్తిగా దెబ్బతిన్నాయి. నిజ్జార్ హత్యలో భారత్‌కు ప్రమేయం ఉందని ఆనాటి ప్రధానమంత్రి జస్టిన్ ట్రూడో ఆరోపించారు. నిజ్జార్ హత్యకేసులో భారత్‌ను ఇరికించేందుకు కెనడా ప్రభుత్వ ప్రయత్నం చేయడంతో గత ఏడాది అక్టోబరునెలలో మనదేశం అక్కడ ఉన్న ఐదుగురు దౌత్యవేత్తలను, హైకమిషనర్‌ను వెనక్కు పిలిపించింది.
భారత్ కూడా అంతేసంఖ్యలో కెనడా దౌత్యవేత్తలను బహిష్కరించింది. ఐతే గడచిన ఏప్రిల్ నెలలో లిబరల్‌పార్టీకి చెందిన మార్క్ కార్నీ ఎన్నికల్లో విజయం సాధించి ప్రధానమంత్రిగా పదవీబాధ్యతలు తీసుకున్నారు. దీంతో కెనడా–భారత్ మధ్య సంబంధాల పునరుద్ధరణ జరుగుతుందన్న ఆశాభావం ఏర్పడింది. అందుకు అనుగుణంగా ఈ చర్చలలో సత్ఫలితాలు వచ్చాయి. కాలుష్యరహిత ఇంధనం, డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేసన్, కృత్రిమ మేధ, ఆహార భద్రత, కీలకమైన ఖనిజ వనరులు, ఉన్నతవిద్య, సరఫరా వ్యవస్థల పటిష్టత వంటి రంగాలలో సంయుక్త భాగస్వామ్యాన్ని భవిష్యత్‌లో ముందుకు తీసుకువెళ్ళే అవకాశాలపై కూడా ఇద్దరు ప్రధానమంత్రులూ చర్చించారు.

## సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత



ప్రజాపక్షం/దుండిగల్ : కుత్బుల్లాపూర్ నియోజ వర్గం బిఆర్ఎస్వి సీనియర్ నాయకులు కొర్ర ప్రవీణ్ నాయక్ దుండిగల్ తండా 2లో నివసించే జాటోత్ రాణి భాయ్ ఆరోగ్య సమస్యతో హాస్పిటల్‌లో చికిత్స పొందారు, బిఆర్ఎస్ పార్టీ మేడ్చల్ జిల్లా అధ్యక్షులు ఎమ్మెల్సీ శంభీపూర్ రాజుకు తెలియచేస్తే వెంటనే సిఎం రిలీఫ్ ఫండ్ ద్వారా రూ.26000/– చెక్కుని మంజూరు చేయించారు. మంజూరు చేసిన చెక్కుని మాజీ కౌన్సిలర్ శంభీపూర్ కృష్ణ బాధితులకు అందజేశారు.

## డాక్టర్ కారులో 65గ్రాముల గంజాయి స్వాధీనం



ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి : వికారాబాద్ జిల్లా కేంద్రంలో పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తున్న సందర్భంగా కారులో అనుమానాస్పదంగా ఒక బ్లాక్ కవర్ కనిపించడంతో దాన్ని ఎస్ఐ పరిశీలించగా అందులో గంజాయి ఉన్నట్లు తెలిసింది. వికారాబాద్ మున్సిపల్‌లోని అతిర ప్రైవేట్ ఆసుపత్రి నడుతున్న డాక్టర్ ప్రదీప్‌గౌడ్ కారులో 65గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకొని కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ భీంకుమార్ తెలిపారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ డాక్టర్‌కు గంజాయి ఎక్కడి నుండి వచ్చింది, దీని వెనుక ఎంతమంది డాక్టర్లు ఉన్నారు. ఎవరికి సప్లైయి చేస్తున్నారు అనే కోణంలో దరాప్తు చేస్తున్నామని తెలిపారు. ఎంతటివరైనా మత్తు పదార్థాలు వాడినా, స్వీకరించినా కేసులు నమోదు చేయడం జరుగుతుంది అని తెలిపారు.



## చలాన్‌ల పేరిట ఇబ్బందులు పెట్టొద్దు

ప్రజాపక్షం/కాప్రా : స్కూల్ వ్యాన్‌లు, ఆటోల ద్వారా విద్యార్థులను పాఠశాలలకు తీసుకొని వెళ్లే స్కూల్ వ్యాన్‌లు, ఆటోలపై ఆర్‌టిఓ అధికారులు చలాన్‌ల పేరిట ఇబ్బందులు కలిగించకుండా సహకరించాలంటూ ఉప్పల్ ప్రాంత డ్రైవర్లు కోరారు. బుధవారం స్థానిక ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని కల్సి గత అనేక ఏళ్లుగా తాము విద్యార్థులను పాఠశాలలకు తీసుకొని వెళుతూ కుటుంబాలను పోషించుకొంటున్నామని, గత కొద్ది రోజుల నుండి చలాన్‌ల పేరిట ఆర్‌టిఓ అధికారులు మధ్యలో నిలిపేస్తుండటం వల్ల విద్యార్థులకు సైతం ఇబ్బందులు కలుగుతున్నాయన్నారు. ఎమ్మెల్యే తాను ఆర్‌టిఓ అధికారులతో సంప్రదించి సమస్య లేకుండా చేస్తానని హామీ ఇచ్చారు.



## యోగాపై అవగాహన కల్పించాలి

ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి : జిల్లా వ్యాప్తంగా అన్ని ఆరోగ్య కేంద్రాల్లో అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమాలను నిర్వహించాలని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డా.ఉమాగౌరి ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ లోని తమ ఛాంబర్‌లో అంతర్జాతీయ యోగా దినోత్సవానికి సంబంధించి పోస్టర్లను ఆమె ఆవిష్కరించారు. యోగా ప్రయోజనాలను ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆయుష్ కార్యక్రమ పర్యవేక్షకులు డా.శ్రీవల్లి, ఆయుర్వేద సీనియర్ వైద్యాధికారి డా.జంగయ్య, ఆయుర్వేద ఫార్మసిస్ట్ భిక్షపతి, తదితరులు పాల్గొన్నారు.

## స్మశాన వాటిక స్థలాన్ని కాపాడాలని వినతి

ప్రజాపక్షం/దుండిగల్ : కబ్జాదారుల నుండి స్మశాన వాటిక స్థలాన్ని కాపాడాలని దుండిగల్ మత్స్యకారుల సహకార సంఘం అధ్యక్షులు పిట్ల సత్యనారాయణ అన్నారు. బుధవారం దుండిగల్ గ్రామ ప్రజలతో కలిసి స్మశాన వాటిక స్థలం కాపాడాలని దుండిగల్ మండల డిప్యూటీ తహసిల్దార్ అవినాష్‌కు వినతి పత్రం అందజేశారు. వందల ఏండ్ల నాటి స్మశాన వాటికను నేడు కొందరు సిమెంట్ పలకలు వేసి స్థలాన్ని కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని అధికారులు చొరవ తీసుకొని అన్యాక్రాంతకు కాకుండా కాపాడాలని తెలిపారు. మల్లేష్ వెంకటేష్, ప్రసాద్ అర్జున్ వీరస్వామి, సత్యనారాయణ, శంకర్ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



## కార్మికశాఖ మంత్రి వివేక్‌కు లక్ష్మి శుభాకాంక్షలు

ప్రజాపక్షం/నిజాంపేట్ : తెలంగాణ రాష్ట్ర మైన్స్ అండ్ కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామిని రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అదనపు ప్రధాన కార్యదర్శి నల్లమల్లి సామ్రాజ్యలక్ష్మి కలిశారు. మంత్రిగా నూతనంగా పదవీ బాధ్యతలను చేపట్టిన సందర్భంగా సామ్రాజ్యలక్ష్మి వివేక్ వెంకట స్వామికి పుష్పగుచ్ఛాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. బడుగు, బలహీన వర్గాల సమస్యలను పరిష్కరించాలని సామ్రాజ్యలక్ష్మి మంత్రిని కోరారు.

## వెంకటస్వామిని సన్మానించిన జైపాల్‌రెడ్డి



ప్రజాపక్షం/శామీర్‌పేట : నూతన మంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టిన భూగర్భ గనుల శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామిని మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా రీజినల్ ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ మెంబర్, తూంకుంట మున్సిపల్ అధ్యక్షుడు బీమిడి జైపాల్‌రెడ్డి బుధవారం మంత్రి చాంబర్‌లో కలిసి శాలువా తో ఘనంగా సన్మానించారు. ఇటీవల కార్మిక, ఉపాధి, శిక్షణ, కార్మాగారా లు, భూగర్భ గనుల శాఖమంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టిన సందర్భంగా తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో రెండవ అంతస్తులో తనకు కేటాయించిన ఛాంబర్‌లో పూజల అనంతరం బీమిడి జైపాల్‌రెడ్డి గడ్డం వివేక్‌ను మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.




## అక్షరాభ్యాసం కార్యక్రమంలో కార్పొరేటర్ జగన్

ప్రజాపక్షం/కుత్బుల్లాపూర్: జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలోని రింగుబస్తీ ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన బడిబాట అక్షర అభ్యాసం కార్యక్రమంలో డివిజన్ కార్పొరేటర్ కొలుకుల జగన్ ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులతో అక్షరాభ్యాసం చేయించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, నూతనంగా పాఠశాలలో చేరిన విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఉత్తమ ఫలితాలను సాధించాలన్నారు. పాఠశాలలో మౌలిక వసతుల కల్పన కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కమల, ఉపాధ్యాయులు రేఖ, సుష్మ, జితేందర్, షణ్ముఖ నాయకులు పాపయ్య గౌడ్, మల్లారెడ్డి, సిహెచ్.మహేందర్ రెడ్డి, హనుమంతు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలపై విద్యాశాఖ నిర్లక్ష్యం

### మరోసారి ప్రతిపాదనలు పంపాలంటూ తాజాగా నూతన కలెక్టర్ మనుచౌదరి

ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి : ప్రయివేట్ విద్యా సంస్థలకు పోటీగా ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని రకాల మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయటంతో పాటు ఉన్నత ప్రమాణాలతో విద్యా బోధన అందించాలన్న ప్రభుత్వ ఆదేశాలను మేడ్చల్ జిల్లా యంత్రాంగం ఏ మాత్రం ఖాతరు చేయటం లేదు. జిల్లా విద్యా శాఖ అధికారులు ప్రభుత్వ పాఠశాలల్లో ఎలాంటి పరిస్థితులు ఉన్నాయన్న విషయంలో కన్నెత్తైనా చూడక పోగా పలు పాఠశాలల్లో అదనపు తరగతి గదుల ఏర్పాటు, గదులు, టాయిలెట్ల మరమ్మత్తుల్లాంటి పలు విషయాల్లో ఆయా ప్రధానోపాధ్యాయులు పంపిస్తున్న ప్రతిపాదనలను బుట్టదాఖలు చేస్తున్నారు. ఆకస్మిక తనిఖీల పేరిట అడపా దడపా జిల్లా కలెక్టర్లు విద్యా శాఖాధికారులను వెంటేసుకొని హడావిడి చేయటం, ఆ సమయంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఏవైనా సమస్యలు చెబితే ప్రతిపాదనలు పంపితే సత్వరమే పరిష్కరిస్తామంటూ చెప్పి వెళ్లటం మినహా ఫలితం మాత్రం కనపడటం లేదు. ఇటీవలే జిల్లా నూతన కలెక్టర్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన మిక్కిలినేని మనుచౌదరి ఆకస్మిక తనిఖీ అంటూ బుధవారం బౌరంపేట, బాచుపల్లి ప్రాంతాల్లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు వెళ్లిన సందర్భంలో అక్కడి విద్యార్థులు, ప్రధానోపాధ్యాయులు సమస్యలను గతంలో పలుసార్లు విన్నవించినా నేటికీ ఫలితం లేదని చెప్పటంతో అవాక్కై మరోసారి ప్రతిపాదనలు పంపాలని నింపాదిగా చెప్పారు.

లక్ష్యాలను నిర్దేశించుకొని ఉన్నత ప్రమాణాలతో ఉత్తీర్ణులు కావాలని ఆయన విద్యార్థులకు ఉద్బోధించారు.

**సమస్యలివీ...** తమ పాఠశాలలో క్రీడలను ప్రోత్సహించే విధంగా స్పోర్ట్స్ సంబంధించిన ఏర్పాట్లు చేయాలని, ఎగుడు దిగుడుగా ఉన్న క్రీడా మైదానాన్ని చదును చేయించాలని, టాయిలెట్లను మెరుగు పరచాలని పాఠశాల విద్యార్థులు కలెక్టర్ మను చౌదరిని కోరుతూ ఈ విషయంలో గతంలో ఇక్కడికి వచ్చిన కలెక్టర్ గౌతంకు విన్నవించినా సరే అనటం మినహా నేటికి అమలుకు నోచుకోలేక పోయిందని వాపోయారు. పాఠశాలలో విద్యార్థులకు తరగతి గదుల ఇబ్బందులు ఉన్నాయని, అదనపు గదులు అవసరమని ప్రధానోపాధ్యాయులు కలెక్టర్‌ను కోరుతూ ఈ విషయమై తాము గతంలో విద్యాశాఖకు పలుసార్లు ప్రతిపాదనలు పంపామని చెప్పటంతో మరోసారి ప్రతిపాదనలు పంపిస్తే తప్పని సరిగా అవసరమైన అన్ని వసతులు కల్పిస్తామని తెలిపారు. నూతన కలెక్టర్ మనుచౌదరి తాజా ఆకస్మిక తనిఖీలో ఇచ్చిన హామీ మేరకు పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తారా లేదా అని వేచి చూడాల్సిందే...



**నూతన కలెక్టర్‌ను స్వాగతించిన తెలంగాణా నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ యూనియన్**

మేడ్చల్ జిల్లా కలెక్టర్‌గా నూతనంగా నియమితు లై పదవీ బాధ్యతలు స్వీకరించిన మనుచౌదరిని బుధవారం తెలంగాణా నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ యూనియన్ జిల్లా ప్రతినిధులు కల్సి సాదరంగా స్వాగతించి సన్మానించారు.

యూనియన్ జిల్లా అధ్యక్షుడు రవిప్రకాష్, జిల్లా కార్యదర్శి భరత్‌కుమార్, జిల్లా కోశాధికారి శేషసాయి గిరికాంత్ కార్యవర్గ సభ్యులు అశ్విని, నాగరాజు, వినయ్ కాంత్, కలెక్టరేట్ యూనిట్ అధ్యక్షుడు కార్తిక్, కార్యదర్శి కిషోర్, కోశాధికారి లింగాల అక్షయ కుమార్, పబ్లిసిటీ సెక్రటరి ఉమాకాంత్, జాయింట్ సెక్రటరీ చంద్రకాంత్, ఆర్గనైజింగ్ సెక్రటరీ లక్ష్మి ప్రసన్న, ప్రకాష్ తదితరులు కలెక్టర్‌ను కలిసిన వారిలో ఉన్నారు.



**రైతన్నలకు ఆసరాగా రైతు భరోసా**

వ్యవసాయానికి పెట్టుబడి భారం పడకుండా వ్యవసాయ ఉత్పాదకతను పెంపొందించేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు భరోసా పథకం ఎంతగానో ఉపయోగకరంగా ఉంటుందని జిల్లా కలెక్టర్ మనుచౌదరి తెలిపారు.

బుధవారం రైతు భరోసా పథకం కింద జిల్లాలోని 4291 మంది రైతుల ఖాతాల్లో రూ 2.57 కోట్లు జమ అయిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాసంగి సీజన్ కంటె ముందుగానే రైతుల ఖాతాల్లోకి నేరుగా నిధులందించటం మంచి భవితకు మార్గంగా మారుతుందన్నారు.

**కృషి, పట్టుదల, క్రమశిక్షణ ఉంటేనే విజయం**

దుండిగల్ : మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి ఆకస్మికంగా జిల్లాలోని బాచుపల్లి, బౌరంపేట్‌లలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేసారు. భవిష్యత్తులో ఏమి చదువుతారని, ఏ గ్రూపు తీసుకుంటారని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కష్టపడి చదివి మంచి మార్కులు సాధించాలని, విద్యతోనే భవిష్యత్తు బాగుంటుందని తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టరు నేరుగా పదవ తరగతి విద్యార్థులతో మాట్లాడుతూ స్కూల్‌లో అన్ని సౌకర్యాలు ఉన్నాయా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. స్పోర్ట్స్ ఏర్పాటు చేయాలని విద్యార్థులు తెలపడంతో అడిగిన అంశాలను తప్పకుండా పూర్తి చేస్తామని తెలిపారు. స్కూలుకు అవసరమైన అంశాలతో నివేదిక తయారుచేసి అందించాలని స్కూలు ప్రధానోపాధ్యాయుడిని ఆదేశించారు.

## వెంచర్లు సందర్శించిన హైడ్రా కమిషనర్

ప్రజాపక్షం/ఘట్‌కేసర్: పోచారం మున్సిపాలిటీ ఏకశిలా వెంచర్ 739నుండి 749సర్వే నంబర్లతో ఏర్పడ్డ ప్రైవేట్ వెంచర్‌లో ప్లాట్‌లు కొన్న యజమానుల ప్లాట్‌ను కబ్జాకోరులు కబ్జాకి గురిచేస్తున్నారని హైడ్రా కమిషనర్‌కి ప్లాట్ ఓనర్స్ అసోసియేషన్ ఫిర్యాదు చేశారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదులపై బుధవారం హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఏకశిలా వెంచర్లను సందర్శించారు. అనంతరం ఏకశిలా వెంచర్ అసోసియేషన్ కమిటి సభ్యులతో రంగనాథ్ మాట్లాడుతూ మళ్లీ ఏకశిలా వెంచర్ బాధితులతో, కన్స్ట్రక్షన్ యజమానితో సమావేశం ఏర్పాటు చేసి ఆ తర్వాత ఏమి చర్యలు తీసుకోవాలో తీసుకుంటామని హైడ్రా కమిషనర్ రంగనాథ్ తెలిపారు. హైడ్రా అధికారులు, బాధితులు ఉన్నారు.

## బోనాల పండుగకు ఘనంగా ఏర్పాట్లు

### ఎమ్మెల్యే కెపి వివేకానంద

ప్రజాపక్షం/ నిజాంపేట్ : బోనాల పండుగను భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకోవాలని బిఆర్ఎస్ పార్టీ శాసనసభ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి వివేకానంద అన్నారు. తెలంగాణలో విశేషమైన ఆధ్యాత్మిక ఉత్సవంగా బోనాల పండుగను ప్రతి ఏటా ప్రజలు జరుపుకుంటారని, ఈ ఉత్సవాల నిర్వహణ కోసం రాష్ట్ర ప్రభుత్వం అమ్మవారి ఆలయాలకు నిధులను మంజూరు చేస్తుందని వివేక్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వివేక్ మాట్లాడుతూ నియోజకవర్గంలోని అమ్మవారి ఆలయాలకు నిధుల మంజూరుకై రిజిస్ట్రేషన్ కలిగిన ఆలయ కమిటీలు ధరఖాస్తు చేసుకోవాలని కోరారు. చింతల్‌లోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఆలయ కమిటీ లెటర్ ప్యాడ్, బ్యాంక్ ఖాతా వివరాలు, సభ్యుల ఆధార్ కార్డు ప్రతులు, ఆలయానికి సంబంధించిన మూడు ఫోటోలు, ప్రతి కాపీపై కమిటీ స్టాంపు ముద్రించి జతపరచాలని వివేక్ సూచించారు. ఈ నెల 25వ తేదీలోపు చింతల్‌లో దరఖాస్తులను ఇవ్వాలని తెలిపారు.

## రెవెన్యూ సదస్సులో భూ సమస్యలు పరిష్కారం

### చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య

ప్రజాపక్షం/నవాబ్ పేట్ : రైతుల సమస్యల పరిష్కారం కోసమే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను ఏర్పాటు చేసిందని స్థానిక ఎమ్మెల్యే చేవెళ్ల యాదయ్య పేర్కొన్నారు. మంగళవారం నవాబు పేట మండలం ఆయన స్వగ్రామం చించల్ పేట్ గ్రామంలో జరిగిన భూ భారతి రెవెన్యూ సదస్సుకు హాజరైనారు.ఈ సందర్భంగా జరిగిన సభలో ఎమ్మెల్యే యాదయ్య మాట్లాడుతూ రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలు పరిష్కారం కోసం గ్రామాల వారీగా రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

రైతులు సందేహాలను సదస్సు ల ద్వారా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచన లు, సలహాలను చేసారు. డాక్యుమెంట్లు లేనివారు, పూర్వం తప్పులు పడిన వాటికి సంబంధించినవి సరిచేయాలని ఎమ్మార్వో బుచ్చయ్యకు తెలిపారు. రైతుల నుండి స్వీకరించిన దరఖాస్తుల ను క్షుణ్ణంగా పరిశీలించి గడువులోపుగా పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. భూ సమస్యలపై వచ్చిన పిటిషన్లు కూడా మానవతా దృక్పథంతో పరిష్కరించాలని అన్నారు. ప్రభుత్వం చేపట్టిన రెవెన్యూ సదస్సులు ఉపయోగించుకొని పట్టాదారు, భూ సమస్యలు పరిష్కరించుకోవాలని రైతులకు సూచించారు. అనంతరం నవాబ్ పేట్ మండలానికి చెందిన లబ్ధిదారులకు మంజూరైన కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఆ తర్వాత గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు యూనిఫార్మ్, టెక్స్ట్ బుక్స్, నోట్ బుక్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కార్యక్రమంలో ఎమ్మార్వో బుచ్చయ్య, పిఎసిఎస్ చేర్మెన్ పోలీస్ రాం రెడ్డి, ఎఎంసి చైర్మన్ రాథోడ్ గీత సింగ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాండు, నాయకులు రవీందర్ రెడ్డి, మాజీ ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు రైతులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.







## పేదల ఇళ్లను కూల్చే యత్నాలను అడ్డుకొంటాం : విఎస్ బోస్

ప్రజాపక్షం/కాప్రా:పేదల ఇళ్లను కూల్చే యత్నాలను అడ్డుకొంటామని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు విఎస్ బోస్, సిపిఐ మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఉమామహేష్‌లు హెచ్చరించారు. కాప్రా మండల తహసీల్దార్ కార్యాలయం వద్ద బుధవారం సిపిఐ జవహర్‌నగర్ శ్రేణులు నిర్వహించిన ధర్నాలో పాల్గొన్న వారు మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2003–04లో పేద ప్రజల కోసం గుడిసెలు వేసుకొని 25 ఏళ్లుగా ఉంటున్న పేద కుటుంబాల జోలికి వెళ్లవద్దన్నారు. గిరిప్రసాద్‌నగర్‌లో 58జిఓ కింద పట్టాలు పొంది నివాసాలుంటున్న వారి ఇళ్లను రెవెన్యూ యంత్రాంగం కూల్చివేయటం సిగ్గుచేటన్నారు. పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు నిమ్మల నర్సింలు, సీనియర్ నేత సిహెచ్ దశరథ్, జిల్లా కౌన్సిల్ సభ్యుడు సహదేవ్,రైతు జిల్లా అధ్యక్షుడు జంగయ్య, గిరిజన సమైక్య జిల్లా ప్రధాన కార్యదర్శి వి.స్వరూపనాయక్, సిపిఐ కాప్రా మండల సహాయ కార్యదర్శులు లక్ష్మి నారాయణ,ఎం.రాజేశ్వరి, గిరిప్రసాద్‌నగర్ సహాయ కార్యదర్శి కొండ సత్యం, మహిళా సమైక్య మండల అధ్యక్ష కార్యదర్శులు జయమ్మ, కవిత, వై.వెంకటేష్, లక్ష్మణ్, సూర్యం, ఎల్లయ్య, మాధవి, మల్లిక తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## రైతు భరోసాతో అన్నదాతకు ఆదరవు

### కలెక్టర్ ప్రతీక్‌జైన్

ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి : రైతుల ఖాతలో వానాకాలం పంట పెట్టుబడి నిదులు జమ, రైతు భరోసాతో అన్నదాతకు ఆదరువు కల్పించిన ప్రభుత్వం అని జిల్లా కలెక్టర్ అన్నారు.



వ్యవసాయాన్ని పండుగలా మారుస్తూ రైతులకు రైతు భరోసా పథకం వ్యవసాయ అదారిత ప్రాంతమైన వికారాబాద్ జిల్లాలోని అందరు రైతులకు ఎంతో ప్రయోజనం చేకురుస్తోందని జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ తెలిపారు. వానాకాలం 2025 సీజన్‌కు సంబంధించిన పంట పెట్టుబడి సాయం క్రింద జిల్లాలోని 3,18, 447 మంది రైతులకు రూ.384.4 కోట్ల నిధులు నేరుగా వరి బ్యాంక్ ఖాతలలో జమ చేస్తోందని అన్నారు. రైతులు బ్యాంకు ఖాతా వివరాలను వ్యవసాయవిస్తరణ అధికారులు ఇప్పటికే రైతు భరోసా పోర్టల్‌లో నమోదు చేశారని అన్నారు. జిల్లాలోని 205361 మంది రైతుల ఖాతాలలో రూ.163.6కోట్ల నిధులు ఇప్పటికే జమ అయ్యాయని కలెక్టర్ వివరించారు. పెట్టుబడి సాయం ప్రారంభించి ఈ రోజు వరకు మూడు ఎకరాలలోపు వ్యవసాయ భూమి కలిగిన జిల్లాలోని రైతుల ఖాతాలలో జామ చయడం జరిగింది అన్నారు. మిగతా రైతులకు పంట పెట్టుబడి సాయం కింద ప్రభుత్వం రైతు భరోసా కింద ప్రభుత్వం నిదులు జామ చేయడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వ రైతు భరోసా నిధులు అందించడం పట్ల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు.




## బస్‌పాస్ చార్జీలు తగ్గించాలి

### ఎస్ఎఫ్ఐ అధ్యక్షుడు చింతల అనిల్

ప్రజాపక్షం/ఘట్‌కేసర్: పేద విద్యార్థులకు విద్యను దూరం చెయ్యాలనే దురుద్దేశ్యంతో బస్‌పాస్‌ల ధరలను తెలంగాణ ప్రభుత్వం పెంచారని ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షులు చింతల అనిల్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ విద్యార్థుల బస్సుపాస్ ఛార్జీలు వెంటనే తగ్గించాలంటూ బుధవారం భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు జెండాలు పట్టుకొని పెద్దఎత్తున నిరసనలు చేపట్టారు. ఈ సందర్భంగా చింతల అనిల్ మాట్లాడుతూ పేద, బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు విద్యను దూరం చెయ్యాలనే దురుద్దేశ్యంతో నేడు తెలంగాణ ప్రభుత్వం విద్యార్థులపై భారాలు మోపుతోందన్నారు. సగటు విద్యార్థిపై రూ.230 ఔ ఉన్న బస్‌పాస్ ధరను నేడు కాంగ్రెస్ ప్రభుత్వం ఆరువందలు పెంచిందని పేద, బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు మరింత భారంగా మార్చిందని మహాలక్ష్మి ఉచిత బస్సుల పేరిట మహిళలకు బస్ సౌకర్యాన్ని కల్పించి ఆ భారాన్ని విద్యార్థులపై మోపడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటి సభ్యులు నీరజ్, మండల నాయకులు యశ్వంత్, శివ, శ్రీరామ్, తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ నుంచి బిఆర్ఎస్‌లోకి చేరికలు

ప్రజాపక్షం/కొడంగల్ : కాంగ్రెస్ పార్టీపై ప్రజలలో తీవ్ర వ్యతిరేకత ప్రారంభమైందని స్థానిక ఎన్నికల కోసమే రైతు భరోసా డ్రామా చేస్తున్నారని కొడంగల్ మాజీ ఎంఎల్‌ఏ పట్నం నరేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం నియోజకవర్గంలోని దుద్యాల మండల పరిధిలోని కుదురుమళ్ల గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ యువనాయకుడు మడిగే శ్రీనివాస్ సమక్షంలో దాదాపు 60 మంది, దౌల్తాబాద్ మండల పరిధిలోని గోఖఫసల్‌వాద్ గ్రామానికి చెందిన మరో 10 మంది కాంగ్రెస్ పార్టీని వీడి మాజీ ఎంఎల్‌ఏ పట్నం నరేందర్‌రెడ్డి సమక్షంలో బిఆర్ఎస్ పార్టీలోకి చేరడంతో వారికి పార్టీ కండువాలు వేసి స్వాగతించారు. ఈ సందర్భంగా గౌరారం గ్రామంలోని సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు చాంద్‌పాషా నివాసంలో ఏర్పాటుచేసిన కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడుతు కాంగ్రెస్ పార్టీ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై రాష్ట్రంలోనే కాకుండా తన సొంత నియోజకవర్గంలో కూడా ప్రజలలో మార్పు వచ్చిందని అన్నారు. సమావేశంలో కోట్ల యాదగిరి. మధుసూదన్‌యాదవ్, మాజీ జెడ్పీటీసీ కోట్ల మైపాల్, రమేష్‌బాబులతో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నో పర్మిషన్.. ఓన్లీ పవర్

* ఇసుకపై రాజకీయ పలుకుబడే శాసనం
* కొడంగల్‌లో సాగుతున్న వైనం

ప్రజాపక్షం / కొడంగల్ : ఇక్కడ పర్మిషన్‌లు ఉండవు... ఓన్లీ రాజకీయ నాయకుల పలుకుబడే అధికార శాసనంగా, అక్రమాలకు అనుమతిగా చలామణి అవుతుంది. ఓ వైపు నియోజకవర్గంలోని మండలాల్లో అభివృద్ధి పనులతో అధికార పార్టీ ప్రజల్లో సిఎం పనులు నాటుకుపోతుంటే.. బోంరాస్‌పేట మండలంలో మాత్రం అధికార పార్టీకి మాయని మచ్చలు తెచ్చిపెడుతున్నాయి.

అందు కు ప్రధాన ఉదాహరణ ప్రధాన అక్రమ ఇసుక మాఫియానే కారణం. కొడంగల్ నియోజకవర్గంలోని బోంరాస్‌పేట మండల పరిధిలోని దుప్‌చర్ల, మహంతిపూర్ పరిధిలో ఉన్న కాగ్నా వాగుల నుంచి కొంతమంది రాజకీయ నాయకుల అండదండలతో ఎలాంటి అనుమతులు లేకున్న దర్జాగా పట్టపగలే ఇసుకను అక్రమంగా రవాణా సాగిస్తున్నారు. దీనిపై సమాచారం అందుకున్న పోలీసు లు ఇసుక వాహనాలను అడ్డుకునే ప్రయత్నాలు చేస్తే.. అధికార పార్టీకి చెందిన ప్రముఖ నాయకుల నుంచి అధికారుల పై ఒత్తిడి తీసుకు వస్తున్నట్లు సమాచారం. సార్ మనోడే... ఇందిరమ్మ ఇండ్లకు, లేదా.. ప్రభుత్వ బిల్డింగ్‌కు అర్జెంటుగా తీసుకువెళ్తున్నామంటు చూసి చూడనట్లు వదిలేయండి సార్ అంటు ఫోన్‌లు చేస్తున్నారని విశ్వసనీయ సమాచారం. నాయకుల మాట వినని అధికారులపై ఒత్తిడి తీసుకువస్తున్నట్లు కూడా పలువురు ఆరోపిస్తున్నారు. కొడంగల్, బోంరాస్ పేట, దుద్యాల్, పక్క నియో జకవర్గం అయిన ధారూర్ మండలాలకు కూడా ఇక్కడి నుంచే ఇసుక తరలిపోవడంతో అధికారులు ఏమి చేయలేని స్థితిలో దిష్టిబొమ్మల మాదిరిగా ఉండాల్సిన పరిస్థితి నెలకొందని పలువురు బహిరంగంగా చర్చించుకుంటున్నారు. ఇటీవలే ఓ బడా లీడర్ ఒకటి రెండు అధికారికంగా ట్రాక్టర్‌లకు అనుమతులు తీసుకుని వాగులో నుంచి బయటకు ట్రాక్టర్‌ల ద్వారా రవాణా చేసి ఓ పొలంలో డంపింగ్ చేసుకుని అక్కడి నుంచి టిప్పర్‌ల ద్వారా విచ్చలవిడిగా దందా చేసినా పట్టించుకునే నాథుడే కరువయ్యారు.



నియోజకవర్గంలో సాగుతున్న అభివృద్ధి పనులకు జిల్లా కలెక్టర్ అధికారికంగా అనుమతులు ఇస్తున్నప్పటికీ కొంతమంది అక్రమార్కులు ఇట్టి అవకాశాన్ని దుర్వినియోగం చేస్తు అడ్డదారిలో అధికారులను సైతం మోసం చేస్తు ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకువస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.

పట్టపగలే పోలీసుల పేర్లు చెప్పుకుంటు మీడియాపై కొంతమంది దౌర్జన్యానికి పాల్పడుతున్న ఘటనలు కూడా కోకోల్లలుగా ఉన్నాయి. ఇప్పటికైన అక్రమ ఇసుక రవాణాకు అధికారులు అడ్డుకట్ట వేస్తారా... లేదా అధికార పార్టీ నాయకులకు సలాం కొట్టి వదిలేస్తారా.. అనేది వేచి చూడాల్సిన పరిస్థితి.

# భూ సమస్యలను పరిష్కరించేందుకే రెవెన్యూ సదస్సులు

### షాద్‌నగర్ మార్కెట్ కమిటి వైస్ చైర్మెన్ బాబర్‌ఖాన్

**ప్రజాపక్షం/షాద్‌నగర్:** రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలను పరిష్క రించేందుకే రెవిన్యూ సదస్సులను నిర్వహిస్తున్నామని షాద్‌నగర్ వ్యవసాయ మార్కెట్ కమిటి వైస్‌చైర్మెన్ బాబర్‌ఖాన్ తెలిపారు. బుధవారం ఫరూఖ్‌నగ ర్‌లో తహశీల్దార్ పార్థసారధి ఆధ్వర్యంలో నిర్వహించిన రెవిన్యూ సదస్సుకు మార్కెట్ కమిటి వైస్ చైర్మెన్ హాజరై రైతుల సమస్యలను స్వీకరించారు. ఈ సందర్భంగా బాబర్‌ఖాన్ మాట్లాడుతూ ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలను పరిష్కరించేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా రెవిన్యూ సదస్సులను నిర్వహించడం జరుగుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మైనార్టీ నేత మహ్మద్ ఇబ్రహీం, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు బాల్‌రాజ్ గౌడ్, మాజీ కౌన్సిలర్ సర్వర్‌పాషా, కాంగ్రెస్ సీనియర్ నేత గంగనమోని సత్తయ్య, శ్రీనివాస్‌రెడ్డిలు పాల్గొన్నారు.

# అధిక పన్నుల విధింపు సమస్యను తొలగించండి

**ప్రజాపక్షం/ఎల్‌బినగర్ :** జీవో 118 బాధిత కాలనీల ఇళ్లను మూడింతల ఇంటి పన్ను విధింపును తొలగించి ప్రజలకు ఆర్థిక భారాన్ని తీర్చాలని జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్‌వి.కర్ణన్‌ను టిపిసిసి ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కీ గౌడ్ కోరారు. గురువారం బిఎన్‌రెడ్డి నగర్ డివిజన్‌లో జీవో 118పై కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఇళ్లకు టాక్స్ విధించటంతో పాటు వెకెట్ ల్యాండ్ టాక్స్(వీఎల్‌టి)ను కూడా విధిస్తున్నారని కాలనీ సంక్షేమ ప్రతినిధులు తమ ఆవేదనను వ్యక్తం చేశారు. సందర్భంగా స్పందించిన మధుయాష్కీ గౌడ్, రోడ్డు డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రామ్‌రెడ్డి, కార్పొరేటర్లు ధర్పల్లి రాజశేఖర్‌రెడ్డి, రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి, బానోతు సుజాత నాయక్‌తో కలిసి కమిషనర్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. మేరకు కమిషనర్ త్వరలోనే సంబంధిత అధికారులను పిలిపించి సమస్య పరిష్కరించేలా చూస్తామని, వారం పది రోజుల్లో అధిక ట్యాక్స్‌ల మినహాయింపుపై తగిన ఉత్తర్వులు జారీ చేస్తామని పేర్కొన్నారు.

## లోతట్టు ప్రాంతాల్లో వరద ముంపు నివారణకు తక్షణ చర్యలు



జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** లోతట్టు ప్రాంతాల్లో వరద ముంపు లేకుండా తక్షణ తాత్కాలిక చర్యలు చేపట్టాలని జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్ అధికారులను ఆదేశించారు. ఇటీవల కురిసిన వర్షాలకు చార్మినార్ జోన్ సంతోష్‌నగర్ సర్కిల్‌లో ముంపు ప్రాంతాలను బుధవారం కమిషనర్ యాకుత్‌పుర ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ లోతట్టు ప్రాంతాల్లో వరద నీటిని పంపింగ్ చేసి, లోతట్టు ప్రాంతాల్లో వరద ముంపు నివారణకు సత్వర చర్యలు తీసుకోవాలని కమిషనర్ చీఫ్ ఇంజనీర్ (నిర్వహణ)ని ఆదేశించారు. వరద నీటి ప్రవాహాన్ని నియంత్రించడానికి శాశ్వత చర్యల కోసం సమగ్ర ప్రణాళిక సిద్ధం చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ సందర్శనలో కమిషనర్ వెంట జోనల్ కమిషనర్ వెంకన్న, జోనల్ ఎస్.ఈ మహేశ్వర్ రెడ్డి, డిప్యూటి కమిషనర్ మంగతాయారు, చీంజనీర్ (నిర్వహణ) సహదేవ్ రత్నాకర్, ప్రాజెక్టు ఈఈ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## కుక్కను అప్పగించండి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పోలీసుల సూచన మేరకు స్వాధీనంలోకి తీసుకున్న కుక్కను యజమానికి అప్పగించాలని జిహెచ్‌ఎంసీకి హైకోర్టు ఆదేశించింది. వ్యక్తులపై దాడి చేస్తోందన్న ఫిర్యాదు మేరకు పోలీసుల ఆదేశాలతో కుక్కను జీహెచ్‌ఎంసీ అధికారులు ఎలాంటి నోటీసు ఇవ్వకుండా పట్టుకెళ్లడంపై చిక్కడపల్లికి చెందిన ఇ.బి.దక్షిణామూర్తి పిటిషన్ వేశారు. నోటీసు ఇవ్వకుండా కుక్కను తీసుకెళ్లారని, కుక్క పెంపకానికి లైసెన్స్ కూడా ఉందని, దానికి వైద్యం చేయాల్సి వుందని, దాన్ని కోతుల బోనులో ఉంచారని పిటిషనర్ వాదన. దీనిపై ప్రభుత్వం, డ్యాగో అర్జెంటీనా అనే కుక్క బ్రీడ్‌పై నిషేధం ఉందని, పిటిషనర్ సోదరుడు నరసింహమూర్తి ఫిర్యాదుతోనే జీహెచ్‌ఎంసీకి లేఖ రాసిన తర్వాత దానిని తీసుకువెళ్లారని చెప్పింది. కుక్కను యజమానికి అప్పగించాలంటూ జీహెచ్‌ఎంసీకి ఆదేశించిన హైకోర్టు విచారణను వచ్చే నెల 9కి వాయిదా వేసింది. కుక్కను మనుషులు ఉన్న చోట వదిలిపెట్టరాదని పిటిషనర్‌ను ఆదేశించింది.

## ఫిలింనగర్ మహాప్రస్థానంలో శాఖమూరి సుగుణ అంత్యక్రియలు

**ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి:** తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు,భారత కమ్యూనిస్టు పార్టీ, మహిళా సమాఖ్య నాయకురాలు శాఖమూరి సుగుణ అంత్యక్రియలు ఫిలింనగర్ మహాప్రస్థానంలో గురువారం నిర్వహించనున్నారు. ప్రజల సందర్శనార్థం సుగుణ పార్థివదేహం 19వ తేదీ ఉదయం 08:30 గంటల నుంచి 11.00 గంటల వరకు హైదరాబాద్ కొండాపూర్‌లోని సిఆర్ ఫౌండేషన్‌లో ఉంచుతారు. తదుపరి 12 గంటల నుంచి 02 గంటల వరకు మియాపూర్‌లోని శాఖమూరి సుగుణ స్వగృహమందు ఉంచుతారు.సాయంత్రం 4 గంటలకు ఫిలింనగర్‌లోని మహాప్రస్థానంలో అంత్యక్రియలు నిర్వహించబడతాయని సిఆర్ ఫౌండేషన్ వర్గాలు పేర్కొన్నాయి.

## వైద్యులు దేవుడితో సమానం



ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి

**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్:** వైద్యులను దేవుడితో సమానంగా కొలుస్తారని.. కనిపించని దేవుడి కంటే కనిపించే దేవుళ్ళే డాక్టర్లు అన్న విషయాన్ని ప్రతి ఒక్కరు గ్రహించాలని ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి సూచించారు. బుధవారం షాద్‌నగర్ పట్టణానికి చెందిన మిరియాల వెంకట రమణకు ఉత్తమ డాక్టరేట్ వచ్చిన నేపథ్యంలో ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి ప్రత్యేకంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ వైద్య రంగం ఎంతో విలువైందని, మనిషి ప్రాణాలను కాపాడుతుందంటే ఆ వైద్యరంగమేనన్న విషయాన్ని గ్రహించాలని అన్నారు. విద్యార్థులు, యువకులు చిన్నతనం నుండే క్రమశిక్షణతో విద్యను అభ్యసిస్తే భవిష్యత్ బంగారుమయంగా ఉంటుందని, ఆశించిన స్థాయికి చేరుకునే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. కష్టపడి చదివించిన తల్లిదండ్రులను పేరు ప్రతిష్టలు తీసుకురావడమే కాకుండా ఉన్న శిఖరాలను చేరుకునే అవకాశం సైతం ఉంటుందని తెలిపారు. పట్టణ ప్రజలకు మంచివైద్య సేవలు అందించి పేరుప్రతిష్టలు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నేతలు బిఎస్ సుధీర్, వ్యాపారస్తులు పలబట్ల శివకుమార్, పలబట్ల బాల్‌రాజ్, డాక్టర్ తులసి, అన్వారీ రాజు, కాటా సుధీర్‌లు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి భూ భారతి

### జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి




**ప్రజాపక్షం/షాబాద్:** శాశ్వత భూ సమస్యల పరిష్కారం కోసమే భూ భారతి చట్టం తీసుకువచ్చినట్లు రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ ఎలగంటి మధుసూదన్‌రెడ్డి వివరించారు. బుధవారం షాబాద్ మండల పరిధిలోని తాళ్లపల్లి గ్రామంలో నిర్వహించిన రెవిన్యూ సదస్సులో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ ఎలగంటి మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైర్మన్ మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ భూ సమస్యలను పరిష్కరించేందుకు అన్ని విధాల ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని వివరించారు. ఈ కార్యక్రమంలో గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటి వైస్ చైర్మెన్ కావలి చంద్రశేఖర్, సర్ధానగర్ మార్కెట్ కమిటి డైరెక్టర్ సంజీవరెడ్డి, మాజీ ఎంపిటిసి సభ్యులు కుమ్మరి చెన్నయ్య, గుండాల అశోక్, మాజీ సర్పంచులు పెంటయ్య, కాంగ్రెస్ నేతలు శ్రీనివాస్‌రెడ్డి, సుభాష్‌రెడ్డి, గౌరీశ్వర్, ప్రభాకర్ రెడ్డి, కృష్ణారెడ్డి, , చాగంటి శ్రీనివాస్, తాళ్ల మాణిక్యం గౌడ్, చేవెళ్ల స్వామి, రాజేందర్‌రెడ్డి, విఠల్, దండు రాహుల్, కిషోర్ నాయక్, రమేష్, ప్రశాంత్, రఫీక్, దయాకర్, ప్రభాకర్‌రెడ్డితోపాటు రెవిన్యూ అధికారులు పాల్గొన్నారు.

# జీవో 118 పేరుతో ప్రజలను మోసగించిన ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

### మీడియా సమావేశంలో ఎమ్మెల్యేపై ఘాటు వ్యాఖ్యలు చేసిన మాజీ ఎంపి మధుయాష్కీ గౌడ్



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** జీవో 118 పేరుతో బిఎన్‌రెడ్డి 6 కాలనీల ప్రజలను మోసం చేసి వారిని ఓట్ల రూపంలో వాడుకున్న కబ్జా కోర్, అబద్ధాల చీటర్, లోఫర్ సుధీర్‌రెడ్డి అని కాంగ్రెస్ పార్టీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ ఎల్‌బి నగర్ నియోజకవర్గ ఇంచార్జి మధుయాష్కీ గౌడ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. జీవో 118పై ఇటీవల సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ మధుయాష్కీపై తప్పుడు ఆరోపణలు చేసిన నేపథ్యంలో జీవో 118 బాధిత కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులతో కలిసి సాగర్ కాంప్లెక్స్‌లోని కాంగ్రెస్ నేత గణేష్‌రెడ్డి నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా కాలనీ సంక్షేమ సంఘాలు ప్రతినిధులు మాట్లాడుతూ జీవో 118 వల్ల మమ్మల్ని అక్రమణదారులుగా ముద్ర వేశారని ఆవేదన వ్యక్తం చేశారు. కట్టుకున్న భవనాలకు మూడు రేట్లుగా టాక్స్‌లు విధిస్తున్నారని ఆవేదన తెలియపర్చారు. అనంతరం మధుయాష్కీ గౌడ్ మాట్లాడుతూ ఎంఎల్‌ఎ సుధీర్‌రెడ్డి గత ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో 118 ఓ లోట్టపీసు జీవో అని పేర్కొన్నారు. ప్రజలు తమ రక్తం ధార పోసి, చెమట చుక్కలతో కష్టపడి సంపాదించుకున్న ప్లాట్లను, నిర్మించుకున్న ఇళ్లను అక్రమణదారులుగా పేర్కొంటూ జీవో 118 తీసుకురావడం దుర్మార్గమన్నారు. జీవో 118 వల్ల తమ ఇబ్బందులు తొలగిపోలేదని, తప్పులు తడకగా తీసుకువచ్చిన జీవో మాకు వద్దు అని ప్రజలు కోరుకుంటే.. ఇంకా ఆదే జీవో 118 ద్వారా కన్వీనియన్స్ డీడ్‌లు ఇప్పిస్తామంటూ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మోసపు మాటలు మాట్లాడుతున్నాడని విమర్శించారు. హూడా అనుమతి పొందిన లే అవుట్ స్థలాలను కొనుగోలు చేసిన ప్రజలను జీవో 118తో భూ అక్రమణదారులుగా చిత్రీకరించడం సిగ్గుగా అనిపించటం లేదా సుధీర్‌రెడ్డి అని పేర్కొన్నారు. జిహెచ్‌ఎంసిలో 44 కాలనీల సమస్యను 9 కాలనీలకు సంబంధం ఏమని పేర్కొన్నారు. రిజిస్ట్రేషన్ బాధిత కాలనీ ప్రజల సమస్యను ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి, మంత్రి శ్రీధర్‌బాబు దృష్టికి తీసుకెళ్లానని తెలిపారు. ఈ నెల 25 తర్వాత సీఎం రేవంతరెడ్డితో సమావేశం ఉంటుందని.. శాశ్వత పరిష్కారం దిశగా పని చేస్తానని మధుయాష్కీ గౌడ్ తెలిపారు. ఎన్నికల దృష్టిలో ఉంచుకొని రాజకీయ జిమ్మిక్కులు చేసే వ్యక్తులం కాదని, ఒక న్యాయవాదిగా సమస్య శాశ్వత పరిష్కారం దిశగా ప్రభుత్వంతో మాట్లాడతానన్నారు. రోడ్డు డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రామ్‌రెడ్డి మాట్లాడుతూ స్వార్థ రాజకీయాల కారణంగా రిజిస్ట్రేషన్ల సమస్య పరిష్కారం కాలేదని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలు కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు మాట్లాడుతూ భూ అక్రమదారులుగా మమ్మల్ని చిత్రీకరించిన జీవో 118 మాకు వద్దు అని ముక్తకంఠంతో పేర్కొన్నారు. నిషేధిత జాబితాలోని 22ఏ నుంచి తమ కాలనీల సర్వే నెంబర్లను తొలగింపజేసేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు ధర్పల్లి రాజశేఖర్‌రెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి, బానోత్ సుజాత నాయక్, పార్టీ స్టేట్ జనరల్ సెక్రటరీ ఆంగోత్ వెంకటేష్, డివిజన్ అధ్యక్షులు మకుటం సదాశివుడు, కుట్ల నరసింహ యాదవ్, శ్రీపాల్‌రెడ్డి, వేణుగోపాల్, సురేందర్‌రెడ్డి, మార్కెట్ డైరెక్టర్లు బుడ్డ సత్యనారాయణ, నేలపాటి రామారావు, పాశం అశోక్ గౌడ్, నాయకులు గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, గణేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# తండ్రిని అతికిరాతకంగా హత్య చేసిన కొడుకు

### కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్న కందుకూరు సిఐ సీతారాం



**ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి:** పిల్లలు ఉన్నారురా భూమి అమ్మవద్దని అడ్డుకుంటున్నందుకు కన్న తండ్రినే బండ రాయితో తల పగలగొట్టి అతి కిరాతకంగా హత్య చేసిన హృదయ విదారకరమైన సంఘటన రంగారెడ్డి జిల్లా కందుకూరులో చోటు చేసుకుంది. సంఘటనకు సంబంధించి రంగారెడ్డి జిల్లా కందుకూరు పోలీస్ స్టేషన్ సిఐ సీతారం తెలిపిన వివరాల ప్రకారం మండలం పులిమామిడి గ్రామానికి చెందిన గొర్రెల కాపారి పసుపుల చిన్న జంగయ్య(65)అను అతడికి ముగ్గురు కూతుర్లు, ఒక కొడుకు ఉన్నారు. జంగయ్య పేరు మీద అదే ఊరిలో కేవలం 20 గుంటల భూమి కలదు. అయితే అట్టి భూమిని అమ్ముదామని గత కొంత కాలంగా తన కొడుకు పసుపుల శేఖర్ తండ్రి జంగయ్యను వాళ్ళ తల్లి పద్మను తరచూ భూమి అమ్ముదామని వేధిస్తూ, వారితో గొడవ పడుతున్నాడు. అయితే ఈ మధ్య వారు కొత్త ఇల్లు నిర్మాణం చేస్తుండగా, మరలా శేఖర్ తన తండ్రిని భూమి అమ్మి ఇల్లు కడుదామని తనతో గొడవ పడుతున్నాడు. ఇట్టి విషయములో పెద్ద మనుషుల సమక్షములో పంచాయతీ పెట్టించినారు. అయిన శేఖర్ ప్రవర్తనలో మార్పు రాలేదు. ప్రస్తుతం శేఖర్ తన భార్య పిల్లలతో కలిసి వేరే ఇంటిలో అద్దెకు ఉంటున్నాడు. తండ్రి జంగయ్య, తన భార్య కలిసి నిర్మాణంలో ఉన్న ఇంటి స్లాబ్ కిందనే నివాసం ఉంటున్నారు. రోజు మాదిరిగానే మంగళవారం నాడు రాత్రి జంగయ్య, తన భార్య పద్మమ్మ తన కొడుకు శేఖర్ ముగ్గురు కలిసి భోజనం చేసిన తర్వాత, పద్మమ్మ అదే ఊరిలో ఉండే తన రెండవ కూతురు ఇంటికి వెళ్ళి పడుకుంది. జంగయ్య ఇంటి స్లాబ్ కింద పడుకున్నాడు. మరుసటి రోజు బుధవారం నాడు ఉదయం 5:45 గంటలకు పద్మమ్మ వాళ్ళ కొత్త ఇంటికి వచ్చి జంగయ్యను నిద్ర లేపడానికి దుప్పటి తీసి చూడగా జంగయ్య తలకు తీవ్ర రక్త గాయమై రక్తపు మడుగులో చనిపోయి కనిపించాడు. అయితే జంగయ్య తన పేరు మీద ఉన్న భూమిని అమ్మనివ్వడం లేదని మనసులో పెట్టుకుని తన కొడుకు శేఖర్, జంగయ్యను చంపవచ్చని మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు కందుకూర్ సిఐ సీతారాం పేర్కొన్నారు.

# ఆపరేషన్ కగార్‌ను ఆపాలి

### సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషనర్ సభ్యులు పుస్తకాల నర్సింగ్ రావు

**ప్రజాపక్షం/గండిపేట:** సిపిఐ రాజేంద్రనగర్ మండలంలోని మైలర్ దేవుపల్లి, లక్ష్మిగూడా, ఊడింగడ్డ, 10వ మహాసభ బుధవారం ఆ పార్టీ సీనియర్ నాయకులు ఆనంద్ గౌడ్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా సిపిఐ తెలంగాణ రాష్ట్ర కంట్రోల్ కమిషనర్ సభ్యులు కామ్రేడ్ పుస్తకాల నర్సింగ్ రావు, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కామ్రేడ్ పానుగంటి పర్వతాలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పుస్తకాల నర్సింగ్ రావు మాట్లాడుతూ దేశంలో మావోయిస్టులను ఏరివేత పేరుతో చంపుతాం అని బహిరంగంగా ప్రకటించడం రాజ్యాంగం కల్పించిన మనిషి జీవించే హక్కును కాలరాయడమేనని, చర్చలు జరపడానికి సిద్ధం అని ప్రకటించినప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమని ఆయన అన్నారు. ఇతర దేశాలతో చర్చలు జరపడానికి సిద్దమైన ప్రభుత్వం, స్వంత దేశ పౌరులతో చర్చలు జరపకపోవడం బిజెపి దుర్నీతిని తెలియచేస్తుందన్నారు. ఆపరేషన్ కగార్ పేరిట మావోయిస్టులను అంతం చేయడానికి పూనుకుంది అని ఖనిజాలను అడవులను కార్పొరేట్ సంస్థలకు ధారాదత్తం చేయడానికి పర్యావరణంను కాపాడుకోవాలంటే ఆపరేషన్ కాగార్‌ను ఆపాల్సిందేనని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు పానుగంటి పర్వతాలు మాట్లాడుతూ సిపిఐ రాజేంద్రనగర్ మండలంలో అర్హులైనటువంటి నిరుపేదలకు తెల్లరేషన్ కార్డులు, డబుల్ బెడ్ రూమ్ ఇల్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎండి రియాజ్, రాజేంద్రనగర్ మండల కార్యదర్శి కన్యగారి నర్సింహ్మారెడ్డి, సిపిఐ మండల సహాయ కార్యదర్శులు జె.విజయ్ ఆనంద్ గౌడ్, మహ్మద్ షఫీ సిపిఐ మండల ఆఫీస్ కార్యదర్శి సత్యం, మన్నన్ బాయ్, వాహిద్, సత్తార్, భాష భాయ్, జాంగిర్, కాజా భాయ్, శ్రీకాంత్, రిత్విక్ గౌడ్ సాయికుమార్ గౌడ్,తదితరులు పాల్గొన్నారు.

**నూతన కమిటీల ఎన్నిక**

మైలర్ దేవుపల్లి కార్యదర్శిగా మమ్మద్ కాజా, సహాయ కార్యదర్శిగా సయ్యద్ సర్వర్ష తోపాటు ముగ్గురు కమిటీ నెంబర్లను ఎన్నుకున్నారు. అదే విధంగా లక్ష్మీగూడా కార్యదర్శి జి.సదానంద గౌడ్, సహాయ కార్యదర్శిలుగా కే.మధు, మమ్మద్, కాజా మొహీనుద్దీన్,కమిటీ నెంబర్లుగా ముగ్గురిని ఎన్నుకున్నారు.ఊడింగడ్డ శాఖ కార్యదర్శిగా పి.ఉషన్ ను సహాయ కార్యదర్శిగా ఆర్. రాములుని,ముగ్గురు కమిటీ నెంబర్లను ఎన్నుకున్నారు.

# 25 లోపు ప్రారంభించని ఇండ్ల జాబితా రద్దు

### కలెక్టర్ సి.నారాయణరెడ్డి



**ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి:** జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల పనులను వేగంగా గ్రౌండింగ్, బేస్మెంట్ లెవెల్ నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తి చేయాలని, బేస్మెంట్ లెవెల్ పూర్తయిన వాటికి బిల్లులు చెల్లించడం తోపాటు జూన్ 25 లోపు ప్రారంభించని ఇండ్ల జాబితాను రద్దు చేసి కొత్త వారికి అవకాశం కల్పించాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి నారాయణ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో ఇందిరమ్మ ఇండ్లు గ్రామ, మున్సిపల్ పరిధిలో పారిశుధ్యం పై, వనమహోత్సవం కార్యక్రమం పై జిల్లా కలెక్టర్ సి నారాయణ రెడ్డి సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటివరకు 56.33 శాతం ఇండ్ల గ్రౌండింగ్ అయ్యాయని, 43 శాతం ఇంకా కావలసి ఉందని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఈ పథకానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. జూన్ 25 వరకు ఎలాంటి ఇండ్లు పెండింగ్ లేకుండా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు చేపట్టాలని అన్నారు.

**మొక్కలు అందుబాటులో ఉండేలా చూడాలి**

అనంతరం వన మహోత్సవంపై జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి మాట్లాడుతూ జిల్లాలో నిర్దేశించిన లక్ష్యాలను అధికారులు పని చేయాలని సూచించారు. మొక్కలు నాటేందుకు అనువైన స్థలాలను గుర్తించాలని, గుంతలు ఏర్పాటు చేయాలని, అవసరమైన మొక్కలు నర్సీలలో అందుబాటులో ఉండే విధంగా చూడాలని కలెక్టర్ అన్నారు. ఈ సమావేశంలో డిఆర్‌ఓ సంగీత, జెడ్పీ సీఈవో కృష్ణారెడ్డి, సోషల్ వెల్ఫేర్ అధికారి రామారావు,డిపిఓ సురేష్ మోహన్, మైనార్టీ వెల్ఫేర్ అధికారి నవీన్ కుమార్ రెడ్డి,బిసి సంక్షేమ అధికారి కేషురామ్,పిడి హౌసింగ్ హనుమంతు నాయక్, గ్రామీణ అభివృద్ధి శాఖ పిడి శ్రీలత,మెప్మా పిడి మల్లీశ్వరి,డిఈఓ సుశీంద్రరావు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## బరువు తగ్గితే మధుమేహం దూరం



**ప్రజాపక్షం/సరూర్‌నగర్ :** బరువు తగ్గితే మధుమేహం దానంతట అదే తగ్గుతుందని కామినేని ఆస్పత్రి మధుమేహ, ఎండోక్రినాలజిస్ట్ డాక్టర్ సందీప్‌రెడ్డి, కన్సల్టెంట్ డయాబెటాలజిస్ట్ డాక్టర్ భవాని తెలిపారు. బుధవారం ఆసుపత్రిలో మధుమేహ అవగాహన కార్యక్రమంలో వారు విలేకరులతో మాట్లాడుతూ బరువు తగ్గడానికి, మధుమేహ నియంత్రతణకు మన దేశంలో ప్రధానంగా మూడు నాలుగు రకాల మందులు అందుభాటులు ఉన్నాయని, వాటిలో కొన్ని ఇంజక్షన్‌లు, మరి కొన్ని మాత్రల రూపంలో ఉన్నట్లు వెల్లడించారు. అవి వాడితే 10 నుండి 15 కిలోల వరకు బరువు తగ్గుతారన్నారు. అ మందులు వాడినప్పుడు కడుపునిండా ఉన్నట్లు తినాలనే కోరిక తగ్గుతుందన్నారు. వీటికి యూఎస్‌ఎఫ్‌డిఏ సహా అన్ని రకాల అనుమతులు ఉన్నట్లు తెలిపారు. మహిళలకు గర్భం దాల్చినప్పుడు వచ్చే మధుమేహం విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలని, దాదాపు 90 శాతం మహిళల్లో ఆ తర్వాత రెండు మూడేళ్ల నుంచి ఐదేళ్ల తరువాత వాళ్లు టైప్ 2 మధుమేహంతోడ భాదపడే వారిలో 90శాతం ఉంటున్నారు. ఆహారపు అలవాట్లు మార్చుకోవడం, జీవన శైలి మార్చుకోవడం, తగినంత వ్యాయామం చేయడం ఊబకాయాన్ని అదుపులో ఉంచుకోవడం లాంటి మార్గాల ద్వారానే గర్భంతో వచ్చే మధుమేహం తర్వాత కొనసాగకుండా నియంత్రించుకోవచ్చు అన్నారు. తల్లిదండ్రులకు 50 లలో వస్తే వీరికి 20లలో వచ్చే అవకాశం ఎక్కువ అన్నారు. అమెరికన్ డయాబెటిస్ అసోసియేషన్ వారి కాలిక్యులేటర్ ఉంటుందన్నారు. అందులో చూసుకుంటే దాదాపు మనకు మధుమేహం వచ్చే అవకాశం ఉందా లేదాఅనేది అర్థమవుతుందన్నారు. ముందుగానే వైద్యుల వద్దకు వస్తే అప్పుడు వారు ప్రీడయాబెటిక్ స్థాయిలో ఉంటే వారికి రాకుండా జాగ్రత్త పడవచ్చని, ప్రస్తుతం నిరంతర గ్లూకోజ్ మానిటర్లు కూడా వస్తున్నాయని వివరించారు.




## దేశాన్ని మతోన్మాద శక్తుల చెర నుంచి విముక్తికి పోరాటం చేయాలి

### సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్‌రెడ్డి

**ప్రజాపక్షం/అబ్దుల్లాపూర్‌మెట్ :** దేశంలో మతోన్మాద దాడులకు వ్యతిరేకంగా ప్రజలను చైతన్యం చేయాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉన్నదని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు, మాజీ శాసనసభ్యులు చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. అబ్దులాపూర్‌మెట్ మండల సిపిఐ కమిటీ 4వ మహాసభ సమావేశం బుధవారం తట్టిఅన్నారంలో నిర్వహించారు. సమావేశానికి ఆయన హాజరై సిపిఐ పార్టీ జెండా ఆవిష్కరణ చేసిన అనంతరం మాట్లాడుతూ.. దేశంలో బిజెపి ప్రభుత్వం 3వసారి అధికారంలోకి వచ్చిన తరువాత కులం పేరుతో, మతం పేరుతో సామాన్య ప్రజలపై దాడులు పెరిగాయని ఆరోపించారు. గుజరాత్‌లో నేర చరిత్రతో రాజకీయం చేసిన మెదీ, అమిత్‌షా దేశంలో అదే పాలన కొనసాగిస్తున్నారని విమర్శించారు. దేశంలో అన్ని కమ్యూనిస్టు పార్టీలకు సిపిఐ తల్లి పార్టీ అని గుర్తు చేశారు. భారతదేశంపై ఇతర దేశాలు దాడులు చేస్తే ఎదుర్కోవలసిన ఆర్మీని ఈ దేశ పౌరులైన ఆదివాసీల పక్షాన ప్రజల కోసం పోరాటం చేస్తున్న మావోయిస్టులపై ఆర్మీతో దాడులు చేస్తున్నా తీరు దారుణం అన్నారు. పేద ప్రజల పక్షాన పోరాటం చేస్తున్న సిపిఐ బలోపేతం కోసం ప్రజ సంఘాలు పార్టీ నాయకులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. అబ్దుల్లాపూర్ మెట్ మండల కమిటీ ఆధ్యర్యంలో రావినారాయణరెడ్డి నగర్ పేరుతో పేదలతో గుడిసెలు వేయించి భూ పోరాటం చేస్తున్న నాయకులను ఆయన అభినందిచారు. మండల మహాసభలలో రంగారెడ్డి జిల్లా సిపిఐ ప్రధాన కార్యదర్శి పాలమాకుల జంగయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్రా చారి, రాష్ట్ర కమిటీ సభ్యులు ముత్యాల యాదిరెడ్డిలు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షులు పల్లె నర్సింహ పాడిన గేయాలు అలరించాయి. ఎఐటియుసి రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు అజ్మీర్ హరిసింగ్ నాయక్, మాజీ కౌన్సిలర్ పబ్బతి లక్ష్మణ్, కోంతం మాదవరెడ్డి, కేతరాజు నర్సింహ్మా, నవనీత, అరుణ, వేణు, ప్రసాద్, మధు శేఖర్ పాల్గొన్నారు.

## అమ్మాయి కోసం స్నేహితుడి ప్రాణాలు తీసిన యువకులు



**ప్రజాపక్షం/శేరిలింగంపల్లి:** శేరిలింగంపల్లి చందానగర్ పీఎస్ పరిధిలో దారుణ ఘటన చోటుచేసుకుంది. ఓ అమ్మాయి విషయంలో స్నేహితుల మధ్య తలెత్తిన గొడవ నేపథ్యంలో స్నేహితులు దాడి చేయడంతో ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనకు సంబంధించి ప్రాథమిక సమాచారం మేరకు. చందానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో నివసించే వికారాబాద్ జిల్లాకు చెందిన అమరేష్(28) మేడ్చల్ జిల్లాలోని శామీర్‌పేట్‌లోని ఒక పెట్రోల్ బంక్‌లో పనిచేస్తున్నాడు. ఓ అమ్మాయి విషయంలో స్నేహితుల మధ్య గత కొంతకాలంగా వివాదం కొనసాగుతుంది. మంగళవారం రాత్రి సమయంలో కల్లు తాగేందుకు స్నేహితులు నలుగురు కలిసి చందానగర్‌లోని కల్లు కాంపౌండ్‌కు వెళ్లారు. మళ్లీ ఈ విషయంలో స్నేహితుల మధ్య మరోసారి వివాదం చోటు చేసుకుంది. ఆగ్రహానికి గురైన మిత్రులు అమరేష్(28)పై పిడిగుద్దులు గుద్దడంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## విద్యార్థులపై భారం మోపేందుకే బస్‌చార్జీల పెంపు



ఎఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు పవర్‌చౌహాన్

**ప్రజాపక్షం/షాద్‌నగర్:** విద్యార్థులపై భారం మోపేందుకే ప్రభుత్వం బస్‌చార్జిలను పెంచిందని ఏఐఎస్‌ఎఫ్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు పవన్‌చౌహాన్ ఆరోపించారు. బుధవారం షాద్‌నగర్ ఆర్‌టిసి డిపో అసిస్టెంట్ మేనేజర్‌కు ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పవన్‌చౌహాన్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థులు చదువు నిమిత్తం ఆర్‌టిసి బస్సుల ద్వారా పట్టణ ప్రాంతాలకు విద్యను అభ్యసించేందుకు వస్తుంటారని, ఉన్నఫలంగా బస్‌చార్జిలు పెంచడంతో వారు విద్యకు దూరమయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పేద, బడుగు, మధ్య తరగతి విద్యార్థులు విద్యను అభ్యసించలేక అనేక అవస్థలు పడుతున్నారని, ప్రభుత్వం బస్‌చార్జిలను పెంచి తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తుందని వివరించారు. ఇప్పటికైన ప్రభుత్వం స్పంధించి విద్యార్థులపై అధిక భారం మోపకుండా తగిన చర్యలు తీసుకొని పెంచిన బస్‌పాస్ చార్జీలను తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఆకాష్‌నాయక్, రాహుల్, శ్రీనులు పాల్గొన్నారు.

## శంకర్‌రెడ్డికి రాంబాబుగౌడ్ శుభాకాంక్షలు



**ప్రజాపక్షం/సరూర్‌నగర్ :** బిజేపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, మాజీ సింగిల్ విండో చైర్మన్ కొలన్ శంకర్‌రెడ్డి జన్మదిన వేడుకలను కార్యకర్తలు, నాయకులు ఘనంగా నిర్వహించారు. బుధవారం బాలాపూర్‌లోని ఆయన నివాసంలో జరిగిన వేడుకల్లో బడంగ్‌పేట మున్సిపల్ కార్పోరేషన్ బిజేపి నాయకులు చెకూరి రాంబాబు గౌడ్ పలువురు నాయకులతో కలిసి శంకర్‌రెడ్డికి పూలమాలవేసి శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

# క్రీడ

## ఇంగ్లాండ్‌కు సూర్యకుమార్..

### స్పోర్ట్స్ హెర్నియాకు ట్రీట్‌మెంట్



టీమిండియా టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్.. ఇంగ్లాండ్‌కు పయనమయ్యాడు. అతను అక్కడ శస్త్ర చికిత్స చేయించుకోనున్నాడు. గజ్జల్లో గాయానికి అతను ట్రీట్మెంట్ తీసుకోనున్నాడు. ఒకవేళ అవసరం అయితే స్పోర్ట్స్ హెర్నియాకు శస్త్ర చికిత్స తీసుకునే అవకాశాలు ఉన్నట్లు ప్రాథమికంగా తెలుస్తోంది. ఇటీవల ముగిసిన ఐపిఎల్‌లో.. సూర్యకుమార్ అద్భుతమైన ప్రదర్శన ఇచ్చాడు. ఆ టోర్నీలో అతను ముంబై ఇండియన్స్ తరపున 700 పైగా రన్స్ స్కోర్ చేశాడు. ఆ తర్వాత ఈ మధ్యే ముంబై ప్రీమియర్ లీగ్ టీ20 కూడా ఆడాడతను. అయితే ముంబై టీ20 టోర్నీ ఆడుతున్న సమయంలో.. అతని గజ్జల్లో నొప్పి మరింత తీవ్రమైనట్లు తెలుస్తోంది. వరుసగా బ్రేక్ లేకుండా క్రికెట్ ఆడడం వల్ల కూడా సమస్య అధికంగా అయినట్లు అనుమానిస్తున్నారు. స్పోర్ట్స్ హెర్నియా చికిత్స కోసం యూకేకు సూర్య వెళ్లినట్లు బిసిసిఐ అధికారి ద్వారా తెలిసింది. అయితే మళ్లీ ఆగస్టు నెల వరకు టీ20 మ్యాచ్‌లు లేకపోవడంతో.. ఈ సమయంలో ట్రీట్మెంట్ తీసుకోవాలని సూర్య భావించాడు. చికిత్స ముగిసిన తర్వాత బెంగుళూరులోని ఎక్సలెన్సీ సెంటర్‌లో కోలుకునే అవకాశాలు ఉన్నట్లు బిసిసిఐ అధికారి ఒకరు వెల్లడించారు.

## రెడిట్ బ్రాండ్ అంబాసిడర్‌గా సచిన్ తెండూల్కర్

రెడిట్ సోషల్ మీడియా సంస్థకు.. భారత లెజెండరీ క్రికెటర్ సచిన్ తెండూల్కర్ బ్రాండ్ అంబాసిడర్ అయ్యారు. క్రీడా వర్గాల్లో, క్రీడా అభిమానుల్లో తమ ఫ్లాట్‌ఫామ్‌ను విస్తరించాలన్న ఉద్దేశంతో సచిన్‌ను అంబాసిడర్‌గా నియమించినట్లు తెలుస్తోంది. తన అఫీషియల్ రెడిట్ అకౌంట్ ద్వారా సచిన్ అభిమానులకు అందుబాటులో ఉండాడు. ఆ ఫ్లాట్‌ఫామ్‌లో యూజర్స్‌తో యాక్టివ్‌గా ఎంగేజ్ అవుతాడు. సబ్‌రెడిట్స్‌తో చర్చల్లో సచిన్ పాల్గొననున్నాడు. పర్సనల్ స్టోరీలు, మ్యాచ్ విశ్లేషణలు, విశిష్టమైన కాంటెంట్‌ను తన ఫ్యాన్స్ సచిన్ షేర్ చేసుకోనున్నారు. భారత క్రికెట్, భారతీయ క్రీడల గురించి రెడిటర్స్‌తో చర్చించేందుకు ఆసక్తిగా ఉన్నట్లు సచిన్ పేర్కొన్నారు. ఫ్యాన్స్‌తో కొత్త రీతిలో తమ అనుభవాల్ని పంచుకునే అవకాశం వచ్చిందన్నారు.




## ఇంగ్లాండ్-భారత్ సిరీస్..

# సమరానికి సిద్ధం

**భారత్ తుది జట్టును ఎంపిక చేసిన మాజీ బ్యాటర్.. నితీశ్, అర్ష్‌దీప్‌లకు నో ఛాన్స్**




ఇంగ్లాండ్ భారత్ మధ్య ఐదు టెస్టుల సమరానికి సమయం ఆసన్నమవుతోంది. జూన్ 20న ప్రారంభంకానున్న ఈ సిరీస్ తోనే ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ 2025–2027 ప్రారంభంకానుంది. లీడ్స్ వేదికగా జరగనున్న మొదటి టెస్టుకు కోసం ఇరుజట్లు నెట్స్‌లో సాధన చేస్తున్నాయి. సీనియర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ టెస్టులకు రిటైర్మెంట్ ప్రకటించడంతో తుది జట్టు ఎలా ఉండనుంది అనే దానిపై అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. ఈ నేపథ్యంలో భారత మాజీ బ్యాటర్ వసీమ్ జాఫర్ తన అంచనా ప్రకారం తొలి టెస్టు కోసం టీమ్‌ఇండియా తుది జట్టును ఎంపిక చేస్తూ ఎక్స్ (ట్విటర్)లో పోస్టు చేశాడు. భారత్ ప్లేయింగ్ ఎలెవన్‌లో నితీశ్ రెడ్డి, అర్ష్‌దీప్ సింగ్‌కు వసీమ్ అవకాశం కల్పించలేదు. భారత ఓపెనర్లుగా యశస్వి జైస్వాల్, కేఎల్ రాహుల్‌లను జాఫర్ ఎంపిక చేశాడు. మూడో స్థానంలో అభిమన్యు ఈశ్వరన్ లేదా సాయి సుదర్శన్‌కు అవకాశం దక్కొచ్చని అంచనా వేశాడు. దేశవాళీ క్రికెట్‌లో అభిమన్యు, ఐపీఎల్ 2025లో అదరగొట్టిన సాయి సుదర్శన్ అదరగొట్టిన సంగతి తెలిసిందే. జాఫర్ ఎంపిక చేసిన భారత్ తుది జట్టులో నాలుగో స్థానంలో శుభ్‌మన్ గిల్, ఐదో స్థానంలో రిషభ్ పంత్ ఉన్నారు. వసీమ్ తర్వాతి రెండు స్థానాల్లో కరుణ్ నాయర్, రవీంద్ర జడేజాలను తీసుకున్నాడు. ఎనిమిదో స్థానంలో పేసర్ శార్దూల్ ఠాకూర్, స్పిన్నర్ కుల్‌దీప్ యాదవ్‌లలో ఒకరు చోటు దక్కించుకుంటారని అభిప్రాయపడ్డాడు. వసీమ్ చివరి మూడు స్థానాలకు ప్రసిద్ధ్ కృష్ణ, జస్‌ప్రీత్ బుమ్రా, మహ్మద్ సిరాజ్‌లను ఎంపిక చేశాడు. దీనికి నెటిజన్ల నుంచి మిశ్రమ స్పందన లభిస్తోంది. కొంత మంది జట్టు ఎంపిక బాగుందని పేర్కొంటుండగా.. మరికొందరు బాగోలేదని కామెంట్లు చేస్తున్నారు. శార్దూల్‌కు బదులు అంశుల్ కాంబోజ్, ప్రసిద్ధ్ స్థానంలో అర్ష్‌దీప్ సింగ్‌ను ఎంపిక చేయాల్సిందని అభిప్రాయపడుతున్నారు.

### భారత జట్టులోకి హర్షిత్ రాణా

ఇంగ్లాండ్‌తో తొలి టెస్టు కోసం హర్షిత్ రాణాను టీమ్‌ఇండియాలోకి తీసుకున్నారు. ఈ మేరకు బిసిసిఐ అధికారికంగా ప్రకటన చేసింది. భారత్ ఎ జట్టులో ఉన్న పేసర్ హర్షిత్ రాణా టీమ్‌ఇండియాతో కలిశాడు. దీంతో జట్టులో ప్రధాన బౌలర్ల సంఖ్య 6కి చేరింది.

## మొదటి టెస్ట్ మ్యాచ్ పిచ్



ఇంగ్లాండ్, టీమ్‌ఇండియా మధ్య జూన్ 20 నుంచి అయిదు టెస్ట్ మ్యాచ్‌ల సిరీస్ ప్రారంభం కానుంది. తొలిపోరు లీడ్స్‌లోని హెడింగ్లీ వేదికగా జరగనుంది. ఈ నేపథ్యంలో అక్కడ పిచ్ ఎలా ఉండనుందో.. లీడ్స్ గ్రౌండ్స్ హెడ్ రిచర్డ్ రాబిన్సన్ వివరించే ప్రయత్నం చేశాడు. 'ఇక్కడ అసాధారణంగా పొడి వాతావరణం వల్ల మంచి సర్ఫేస్ ఉన్న పిచ్ ఉండొచ్చు. ఇంగ్లాండ్ టీమ్ కూడా ఇలాంటి ఉపరితలం ఉండే పిచ్‌నే కోరుకుంటోంది. తొలి రోజున పిచ్ ఫాస్ట్ బౌలర్లకు సహాయపడుతుంది. ఈ తర్వాత వేడి కారణంగా క్రమంగా ఫ్లాట్‌గా మారొచ్చు. ఇంగ్లాండ్ బజ్‌బాల్ క్రికెట్‌కు సరిపోవడమే కాకుండా.. అంతగా అనుభవం లేని టీమ్‌ఇండియా బ్యాటింగ్ లైనప్‌కు పరీక్ష పెట్టొచ్చు' అని పేర్కొన్నాడు. గతంలో ఎప్పుడైనా సరే ఈ మైదానంలో టెస్ట్ సిరీస్ మధ్యలోని మ్యాచ్‌లను నిర్వహించేవారు. కానీ ఈ సారి మొదటి మ్యాచ్‌తో సిరీస్ ఇక్కడే ప్రారంభం కాబోతోంది. దీంతో ఈ అంశం క్రికెట్ అభిమానులు, విశ్లేషకుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది.

# ఫోకస్ కళారంగం




## సకల కళా కేంద్రం.. సంగీతం

**21న ప్రపంచ సంగీత దినోత్సవం**



అన్ని కళల్లోకీ సంగీతానిది అగ్రస్థానం. అందుకే 'శిశుర్వేత్తి పశుర్వేత్తి... వేత్తి గానరసం ఫణిః' అంటారు. మనుషులేకాదు.. పశుపక్షాదులు సైతం సంగీతాన్ని ఆస్వాదిస్తాయి. తల్లి గర్భంలోని శిశువును సైతం సంగీతం ప్రేరేపిస్తుందని పరిశోధనల్లో తేలింది. సంగీతం మూలాలు కొన్ని వేల సంవత్సరాలనాటివి. అప్పటి నుంచి అధునాతన కంప్యూటర్ యుగం వరకూ సంగీతం అజరామరంగా విరాజిల్లుతునే ఉంది. గానం, వాద్యం వేరువేరుగా ఉన్నా... ఒకటిగా కలిసినా.. రెండూ సంగీత పార్శ్వాలే. పురాతన కాలం నుంచి సంగీత ఝరి ఎన్నో ఎత్తుపల్లాలు చవిచూసింది. అడ్డంకులు ఎదురైన ప్రతిసారీ దారి మార్చుకుందేగానీ, ప్రస్థానాన్ని ఆపలేదు. అందుకే, సాంప్రదాయమైనా... ఆధునికమైనా.. సంగీతం ప్రజలను పరవశింప చేస్తునే ఉంది.

జనపదాల్లో పాడుకునే పాటల నుంచి జాజ్.. ర్యాప్ మ్యూజిక్ వరకూ సంగీతం ప్రజల జీవితాలతో మమేకమైంది. ఇంతటి ప్రాధాన్యతను కలిగి ఉన్నది కాబట్టే, సంగీతానికి ప్రత్యేక గుర్తింపునిస్తూ, అంతర్జాతీయ స్థాయిలో, ఏటా 21న ప్రపంచ సంగీత దినోత్సవాన్ని నిర్వహించుకుంటున్నాం. 1982లో ఫ్రాన్స్‌లో మొదలైన ఈ ఉత్సవానికి మూలకర్త అప్పటి ఫ్రాన్స్ సంస్కృతి శాఖ మంత్రి జాక్ లాంగ్. 'ఫెటే డె లా మ్యూసికె' (సంగీతాన్ని జరుపుకుందాం) పేరుతో, లాంగ్‌తో పాటు సంగీతశాస్త్రవేత్త మారిస్ ఫ్లూరెట్ సంగీతాన్ని ప్రజల జీవితాల్లో భాగం చేయాలనే సంకల్పంతో ఈ దినోత్సవాన్ని ప్రారంభించారు. క్రమంగా ఈ దినోత్సవానికి ఆదరణ పెరిగింది. ఫ్రాన్స్‌లో మొదలైన సంబరాన్ని ఇప్పుడు 120కి పైగా దేశాల్లో జరుపుకుంటున్నారు. సంగీతం అందరికీ ఉచితంగా అందాలనీ, అది ప్రతి ఒక్కరి హక్కు అనే భావలను ప్రోత్సహించడమే ఈ దినోత్సవ ప్రధాన లక్ష్యం. ప్రపంచవ్యాప్తంగా వివిధ రకాల సంగీత శైలులకు గుర్తింపు ఇవ్వడం, యువ సంగీత కళాకారులను ప్రోత్సహించడం, స్థానిక కళాకారులకు తమ తమ ప్రతిభను ప్రదర్శించే అవకాశాలు కల్పించడం తదితర అంశాలను ప్రధానంగా ముందుకు తీసుకెళ్లే అంతర్జాతీయ దినోత్సవమిది. ఇందులో భాగంగా, బహిరంగ సంగీత ప్రదర్శనలు, కళాశాలలు, స్కూల్‌లు, సంగీత సంస్థల్లో ప్రత్యేక కార్యక్రమాలు ఉంటాయి. ప్రజలు రోడ్లపై లేదా పార్కుల్లో స్వయంగా వాయిద్యాలు వాయించడం ద్వారా తమలో దాగివున్న సంగీత కళను ప్రదర్శిస్తారు. రేడియో, టీవీ ఛానళ్ల ద్వారా ప్రత్యేక సంగీత కార్యక్రమాల ప్రసారం ఉంటుంది. సంగీతాన్ని విశ్వజనీనం చేయడం ఈ ఉద్యమ ధ్యేయం. సంగీతానికి భాషా తేడాలు లేవు. ఇది మానవ హృదయాలను కలుపుతుంది. సంగీతం వల్ల మనలో భావోద్వేగాలు, సృజనాత్మకత, ఆనందం, శాంతి పెరుగుతాయి. సంగీతం కేవలం వినోదం మాత్రమే కాదు, ఒక జీవన శైలి కూడా. సంగీతం అనేది మనసుకు అందే అమృతం. దీనితో జీవితం రాగరంజితమవుతుంది. సంగీతం అనేది ప్రపంచవ్యాప్తంగా మాట్లాడే ఏకైక భాష. అర్థం తెలిసికూడా వినిపించే ధ్వనులు భావోద్వేగాలను ఉత్పత్తి చేస్తాయి. సున్నితమైన సంగీతం వినడం వల్ల హృదయ స్పందన మెల్లగా మారుతుంది, రక్తపోటు తగ్గుతుంది. మానసికంగా ఇష్టమైన సంగీతాన్ని వినడం వల్ల మెదడులో డోపమిన్ అనే ఆనంద హార్మోన్ ఉత్పత్తి అవుతుంది. చిన్నప్పటి నుంచి సంగీతాభ్యాసం చేసిన పిల్లల్లో గణిత, భాషా నేర్పు మెరుగ్గా కనిపిస్తుంది. సంగీతాన్ని థెరపీగా ఉపయోగించి అనేక మానసిక రుగ్మతలకు చికిత్స చేస్తున్నారు. దీనిని 'మ్యూజిక్ థెరపీ' అంటున్నారు. మన మెదడు ఒకసారి విన్న పాటను పదాలకంటే ముందు దాని ధ్వనిని గుర్తు పట్టగలదు. కొన్ని అధ్యయనాల ప్రకారం, మృదువైన సంగీతం మొక్కల వృద్ధికి సహాయపడుతుందని చెబుతారు. గర్భస్థ శిశువులు 25 వ వారం తర్వాత సంగీతానికి స్పందించగలవని పరిశోధనలు స్పష్టం చేస్తున్నాయి. కొన్ని పక్షులు నిర్దిష్ట రాగాల సైకిల్‌తో మానవ గీతాల మాదిరిగా గానం చేస్తాయి. జాన్ కేజ్ అనే సంగీతకారుడు 4 నిమిషాల 33 సెకన్ల పాటలో ఏ ధ్వనికూడా వాడలేదు...కానీ అది సంగీతంగా గుర్తింపు పొందింది. భారతీయ శాస్త్రీయ సంగీతంలో ప్రతీ రాగం ఒక ప్రత్యేక సమయానికి చెందుతుంది. ఉదాహరణకు భూపాలి రాగం ఉదయాన్నే వినాలి అంటారు. కొన్ని అధ్యయనాల ప్రకారం, మ్యూజిక్ మెమరీ శక్తిని, మనోవికారాలను మెరుగుపరచి మానసిక వృద్ధిని నిరోధించగలదు. పశువులకు సంగీతం వినిపించడమే కాదు.. అది పాల ఉత్పత్తిని పెంచుతుందని చెప్తారు. బీట్స్ పరిమాణం మన పాదాల వేగాన్ని ప్రభావితం చేస్తుంది. మ్యూజిక్ వింటూ నడిచేవారు మెల్లగా లేదా త్వరగా నడుస్తారు. సంగీతంతో భాష కూడా నేర్చుకోవచ్చు. చిన్నారులకు గీతాల ద్వారా కొత్త పదాలు నేర్పటం అత్యంత ప్రభావవంతమైన పద్ధతి. సంగీత రహిత సినిమాల్లో కూడా నేపథ్య సంగీతం ఉంటుంది. నదుల ప్రవాహం, గాలిలో చెట్ల రేగుడు.. ఇవే సంగీత స్వరాలకు ప్రేరణగా మారాయి. వినే మనసు ఉండాలేగానీ, ప్రపంచమంతా సంగీతమయమే.



## సిపిఐ జిల్లా మహాసభలకు సర్వం సిద్ధం



**ప్రజాపక్షం/ నస్పూర్ :** మంచిర్యాల జిల్లాలో కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా (సిపిఐ) నాలుగో జిల్లా మహాసభలకు ఏర్పాట్లు పూర్తయ్యాయని, జూన్ 21, 22 తేదీల్లో జరిగే ఈ కీలక సమావేశాలను జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ తెలిపారు. బుధవారం నస్పూర్ మండలంలో సిపిఐ మహాసభల వాల్‌పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న లక్ష్మణ్, మహాసభల వివరాలను వెల్లడించారు. జిల్లా భవిష్యత్తు, ప్రజల సమస్యలపై చర్చించడమే ప్రధాన లక్ష్యమని, సిపిఐ జిల్లా మహాసభలకు రాష్ట్ర స్థాయి నాయకత్వం హాజరుకానున్నారన్నారు. జూన్ 21న మధ్యాహ్నం 3 గంటలకు ఐబి చౌరస్తా నుండి బాయ్స్ హైస్కూల్ వరకు భారీ ప్రదర్శన ర్యాలీ నిర్వహించబడుతుందని, ఈ ప్రదర్శనలో కార్మికులు, కర్షకులు, పార్టీ శ్రేణులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ సంఘీభావాన్ని తెలియజేయాలని కోరారు. జూన్ 22న సుమారు 300 మంది ప్రతినిధులతో ప్రత్యేక సభ జరుగుతుందని. సభలో జిల్లా సమగ్ర అభివృద్ధి, భవిష్యత్తు కార్యాచరణపై కీలక తీర్మానాలు చేయబడతాయని పేర్కొన్నారు. అంతేకాకుండా, స్థానిక నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు నూతన బొగ్గు బావులను తీసుకురావాలని, ఓపెన్‌కాస్ట్ (ఓసి) గనులలో స్థానికులకే ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. జిల్లాకు సంబంధించిన పలు కీలక అంశాలపై ఈ మహాసభల్లో చర్చించి, వాటి పరిష్కారం కోసం తీర్మానాలు చేయబడతాయని ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో నస్పూర్ మండల కార్యదర్శి జోగుల మల్లయ్య, రాష్ట్ర సమితి సభ్యులు రేగుంట్ల చంద్రశేఖర్, జిల్లా కార్యవర్గ సభ్యులు కారుకూరు నగేష్, జిల్లా సమితి సభ్యులు దొడ్డిపట్ల రవీందర్, పౌలు, సింగపూర్ కార్యదర్శి పూజారి రామన్న తదితరులు పాల్గొన్నారు.

## అనుమతులు లేని ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలపై చర్యలు : ఎఐఎస్‌ఎఫ్

**ప్రజాపక్షం/ పెద్దపల్లి ప్రతినిధి :** రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో అనుమతులు లేని, నియమ నిబంధనలు పాటించని ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని రామగుండం మండల విద్యాధికారి గద్దం చంద్రయ్యకి వినతి పత్రం ఇవ్వడం జరిగిందని ఎఐఎస్‌ఎఫ్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం అన్నారు. ఈ సందర్భంగా ఎఐఎస్‌ఎఫ్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం మాట్లాడుతూ రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో కొన్ని ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలకు అనుమతులు లేకున్నా, రంగురంగుల కరపత్రాలతో, హంగు ఆర్భాటాలతో, ఆకర్షించే విధంగా, లేనివి ఉన్నట్టుగా చూపిస్తూ, మా పాఠశాలలో చేరితే ఫీజులో రాయితీ కల్పిస్తామని, మాయ మాటలు చెప్పి, చేరిన తర్వాత మొత్తం ఫీజు కట్టాలంటూ విద్యార్థులను, వారి తల్లిదండ్రులను ఇబ్బందులకు గురి చేస్తూ, మోసం చేస్తున్నారని ఆయన అన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు కూడా పాఠశాలలకు ప్రభుత్వం నుండి అనుమతులు ఉన్నాయా! లేవా! అని తెలుసుకొని చేర్పించాలని ఆయన అన్నారు. ధనార్జనే ధ్యేయం గా పెట్టుకొని అనుమతులు లేకున్నా ఇష్టానుసారంగా నడుపుతున్న, ప్రైవేట్ , కార్పొరేట్ పాఠశాలల గుర్తింపును రద్దు చేయాలని, అధిక రేట్లకు పాఠ్యపుస్తకాలను విక్రయిస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. లేని పక్షంలో విద్యార్థులతో వారి తల్లిదండ్రులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేస్తామని ఆయన హెచ్చరించారు. ఇంకా ఈ కార్యక్రమంలో ఎఐఎస్‌ఎఫ్ పెద్దపల్లి జిల్లా కోశాధికారి ఎల్కపల్లి సురేష్, రామగుండం మండలం అధ్యక్షులు మాతంగి సాగర్ తదితరులు పాల్గొన్నారు.




## కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై పోరుబాట

**సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కలవేన శంకర్**



**ప్రజాపక్షం / ఆసిఫాబాద్ :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యువతను మోసం చేస్తున్నాయని, వాటి విధానాలపై ఉద్యమిద్దామని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవేన శంకర్ పిలుపునిచ్చారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో జరిగిన జిల్లా మహాసభల్లో పాల్గొని ఆయన మాట్లాడారు. రాజీవ్ యువ వికాస్ పథకం లబ్ధిదారులకు అందకపోతే రాష్ట్రవ్యాప్తంగా పోరాటాలకు పిలుపునిస్తామని, కేంద్రం అనుసరిస్తున్న విధానాలు దేశానికి ప్రమాదకరమని తెలిపారు. అధికారంలో లేనప్పటికీ, కార్మికులు, కర్షకులు, రైతులు, వ్యవసాయ కూలీల పక్షాన సిపిఐ నిలబడి పోరాటాలు కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. 100 సంవత్సరాల సుదీర్ఘ పోరాట చరిత్ర కలిగిన పార్టీ ఎర్ర జెండా సిపిఐ ఒక్కటే అన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కమ్యూనిస్టు పార్టీకి అండగా నిలిచి, వారిని గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. దేశ పౌరులకు అందించాల్సిన సంక్షేమ ఫలాలు, ఉపాధి, ఉద్యోగ అవకాశాలు ఇవ్వకుండా ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని విమర్శించారు. ఆపరేషన్ కగార్ పేరుతో మావోయిస్టులను, అమాయక గిరిజనులను హతమారుస్తున్న కేంద్ర ప్రభుత్వ విధానాలను తక్షణమే నిలిపివేయాలని, కేంద్ర ప్రభుత్వం మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని, తక్షణం కాల్పుల విరమణ (సీజ్ ఫైర్) ప్రకటించాలని డిమాండ్ చేశారు.

అనంతరం జిల్లా కార్యదర్శి బద్రి సత్యనారాయణ మాట్లాడుతూ, పాలకులు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలు నిర్వహిస్తామని, తెలంగాణ ప్రభుత్వం నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్ టౌ న్ అధ్యక్షుడు ఆత్మకూరి చిరంజీవి, సత్యనారాయణ, రామగిరి డోన్నాజీ, సప్తే జయరాం, తోట రామచందర్, బద్రి సాయి, అజయ్, మురళి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు ఎర్ర జెండానే భరోసా

**సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె. షాబీర్ పాషా**




**ప్రజాపక్షం/బూర్గంపాడు:** ప్రశ్నించే కమ్యూనిస్టులపై నరేంద్ర మోదీ, అమిత్ షా కక్ష కట్టి బూటకపు ఎన్కౌంటర్లు చేస్తున్నారని సిపిఐ జిల్లా కార్యద ర్శి ఎస్‌కే షాబీర్ పాషా విమర్శించారు. బుధవా రం మండల పరిధిలోని సారపాక కపర్తి భవనం కామ్రేడ్ ఆళ్లగురు ప్రసాద్ ప్రాంగణంలో బూర్గంపాడు మండల 18వ మహాసభ ఎండి సాజిద్ అ ధ్యక్షతన నిర్వహించారు. ఈ మహాసభలో ఆయన మాట్లాడుతూ మావోయిస్టుపార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు పలువురు మావోయిస్టుల ఎన్‌కౌంటర్లపై సుప్రీం కోర్టు సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని కేంద్ర ప్రభుత్వా న్ని డిమాండ్ చేశారు. ఒక వేళ కేంద్ర ప్రభుత్వం ముందుకు రాకపోతే సుప్రీం కోర్టు ఈ కేసును సు మోటోగా స్వీకరించి న్యాయ విచారణకు ఆదేశించాలన్నారు. ఘటనపై ప్రధాని మోడీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా శత్రుదేశంపై విజయం సాధించిన రీతిలో స్పందించడం విచారకరమని తెలిపా రు. పేద ప్రజలకు ఎర్ర జెండానే భరోసా అని, పేద ప్రజలు, కష్టజీవులు, కర్షకులు, కార్మికుల పార్టీ సిపిఐ అని అన్నారు.రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు కార్యకర్తలకు సిద్ధంగా ఉండాలని, ప్ర తి పంచాయితీలో సిపిఐ ప్రాతినిధ్యం ఉండే విధం గా ఇప్పటి నుంచే ప్రణాళికలు సిద్ధంగా చేసుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొల్లోజు అయోధ్య మాట్లాడుతూ దోపిడీ, అణచివేతకు గురవుతూ దుర్భరజీవితం గడుపుతున్న ఏజెన్సీ పల్లె ప్రజల జీవన ప్రమాణాల మార్పుకు నంది పలికి ఆధునికతవైపు నడిపించింది ఎర్ర జెండానేనని, అసమానతలు లేని సమాజ నిర్మాణమే కమ్యూనిస్టుల అంతిమ లక్ష్యమన్నారు. ఈకార్యక్రమంలో పినపాక నియోజకవర్గ కార్యదర్శి సారెడ్డి పుల్లారెడ్డి, మహిళా సమైక్య జిల్లా అధ్యక్షురాలు మున్నా లక్ష్మీ కుమారి, సిపిఐ మండల కార్యదర్శి మువ్వా వెంకటేశ్వర్లు(లడ్డా), నాయకులు పేరాల శ్రీనివాసరావు, అలవాల సీతారాంరెడ్డి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## అధిక ఫీజులు వసూలు చేసే విద్యాసంస్థలను సీజ్ చేయాలి

**ఎఐఎస్‌ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మచ్చ రమేష్**

**ప్రజాపక్షం/చొప్పదండి :** అధిక ఫీజులు వసూలు చేసే ప్రైవేట్ విద్యాసంస్థలను వెంటనే సీజ్ చేయాలని ఎఐఎస్‌ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మచ్చ రమేష్ డిమాండ్ చేశారు. బుధవారం అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఎఐఎస్‌ఎఫ్) ఆధ్వర్యంలో చొప్పదండి మండలంలో ముఖ్య కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన మచ్చ రమేష్ మాట్లాడారు. ప్రభుత్వ గురుకులాలు, బెస్ట్ అవెలేబుల్ స్కీమ్ పాఠశాలలు మూతపడుతున్నా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను విడుదల చేయకపోతే మంత్రులను అడ్డుకుంటామని హెచ్చరించారు. విద్యాసంవత్సరం ప్రారంభమైన నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి విద్యారంగంపై సమీక్షించి ప్రభుత్వ విద్యాలయాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. విద్యారంగం గాడి తప్పిందని, ప్రభుత్వ విద్యాసంస్థల్లో సరైన సౌకర్యాలు లేవన్నారు. విద్యార్థులు లేరనే సాకుతో ప్రభుత్వం 12 ఎస్‌సి గురుకుల ఇంటర్ కళాశాలలను మూసివేసే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలన్నారు. రాష్ట్రంలో ప్రైవేట్,కార్పోరేట్ విద్యాసంస్థలు అదిక ఫీజులు వసూలు చేస్తే ఆ పాఠశాల, కళాశాల గుర్తింపు రద్దు చేసే విధంగా కఠిన చట్టం తేవాలని, ప్రతి ప్రైవేట్ విద్యాసంస్థ నిబంధనలు పాటించాలని, లేని పక్షంలో ఆ విద్యాసంస్థల ముందు ధర్నాలు చేస్తామన్నారు. అన్ని రకాల బకాయిలను విడుదల చేస్తున్న ప్రభుత్వం విద్యార్థుల చదువులకు నిధులు విడుదల చేయకుండా జాప్యం చేయడం సరికాదన్నారు. విద్యారంగ సమస్యలను పరిష్కరించకపోతే ఆందోళనలను ఉధృతం చేస్తామన్నారు. ఎఐఎస్‌ఎఫ్ మండల నాయకులు పవన్ కళ్యాణ్, రామ్, రేవంత్, ప్రశాంత్, శ్రీకాంత్, కృష్ణ, రఘు, మనోజ్ తదితరులున్నారు.



## విద్యను వ్యాపారంగా మార్చిన విద్యాసంస్థలు

**అధిక ఫీజులు వసూలు చేసే వాటిపై దాడులు : మణికంఠ రెడ్డి**



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల ప్రతినిధి :** రాష్ట్రంలో ప్రైవేట్ విద్యాసంస్థలు విద్యను వ్యాపారంగా మార్చి అక్షరాలతో లక్షల రూపాయల వ్యాపారం చేస్తున్నారని ప్రభుత్వం ఫీజులను నియంత్రించకుండా ప్రైవేట్ విద్యాసంస్థలకు వత్తాసు పలుకుతుందని ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి విమర్శించారు. మంగళవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో నిర్వహించిన ఎఐఎస్‌ఎఫ్ సమావేశంలో మణికంఠ రెడ్డి మాట్లాడారు. ప్రైవేట్ విద్యాసంస్థల్లో అధిక ఫీజులు వసూలు చేస్తే ఆ విద్యాసంస్థలపై దాడులు తప్పవని అన్నారు. ప్రభుత్వ గురుకులాలు బెస్ట్ అవలేబుల్ స్కీమ్ పాఠశాలలు మూతపడుతున్న ప్రభుత్వాన్ని నిర్లక్ష్యం చేస్తుందని మండిపడ్డారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ స్కాలర్షిప్ బకాయిలను విడుదల చేయకపోతే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రభుత్వానికి విద్యార్థుల సత్తా ఏంటో చూపిస్తారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల ఆర్‌టిసి బస్ పాస్ చార్జీలను పెంచడం సరికాదని విద్యార్థులకు ఆర్‌టిసి బస్సుల్లో ఉచిత రవాణా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో విద్యా సంవత్సరం ప్రారంభం అయిన నేపథ్యంలో సిఎం రేవంత్ రెడ్డి విద్యారంగంపై సమీక్ష చేసి ప్రభుత్వ విద్యాలయాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఫీజు రియింబర్స్‌మెంట్ వెంటనే చెల్లించాలన్నారు. పాఠశాల కళాశాలలో యూనివర్సిటీలలో టీచింగ్ నాన్ టీచింగ్ సిబ్బంది పోస్టులు ఖాళీగా ఉన్నాయని, గురుకులాలు మోడల్ స్కూల్లో కేజీబీవీ లలో నాణ్యమైన ఆహారం అందించేందుకు కృషి చేయాలన్నారు.రాష్ట్రంలో ప్రైవేట్ కార్పొరేట్ విద్యా సంస్థలు అధిక ఫీజులు వసూలు చేస్తే ఆ పాఠశాల,కళాశాలల గుర్తింపు రద్దు చేసే విధంగా కఠిన చట్టం తేవాలని, ప్రతి ప్రవేట్ విద్యాసంస్థ నిబంధనలు పాటించాలని లేని పక్షంలో ఆ విద్యాసంస్థల ముందు ధర్నాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రాకేష్,మంద అనిల్ కుమార్, సహాయ కార్యదర్శి సొల్లు సాయి, రజనీకాంత్,మెతుకు అజయ్ పాల్గొన్నారు.

## ప్రైవేట్ పాఠశాలలో ఫీజుల దోపిడీని అరికట్టాలి

**ఎఐఎస్‌ఎఫ్ డిమాండ్**



**ప్రజాపక్షం/ జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి:** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ప్రైవేట్ పాఠశాలల్లో అధిక ఫీజులను వసూలు చేస్తున్న పాఠశాలలపై చర్యలు తీ సుకోవాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఎఐఎస్‌ఎ ఫ్) ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సోతుకు ప్రవీణ్ కు మార్, ఎఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి నేరెళ్ల జోసఫ్‌లు డి మాండ్ చేశారు. బుధవారం ఎఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో జి ల్లా విద్యాశాఖ సూపర్డెంట్ రాజన్నకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రవీణ్ కుమార్, జోసఫ్‌లు మా ట్లాడుతూ, జయశంకర్ భూపాలపల్లి జిల్లా వ్యాప్తంగా ఉ న్న ప్రైవేటు, కార్పొరేట్ స్కూల్‌లో అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని, పాఠశాలలోనే పుస్తకాలు, యూనిఫామ్ అ మ్ముతూ అక్రమంగా లక్షల రూపాయలను దోచుకుంటున్నారన్నారు. విద్యా అర్హత లేని వారితో విద్య బోధన చేయిస్తున్న విద్యాశాఖ అధికారులు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలో పేదలకు 25 శాతం ఉచిత విద్యను అమలు చేయాలన్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రైవేటు పాఠశాలలపై తనిఖీలు నిర్వహించి నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న పాఠశాలలను గు ర్తింపును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం జిల్లా విద్యాశాఖ అధికారులు కార్పొరేట్ ప్రవేట్ విద్యాసంస్థల దోపిడిని అరికట్టకపోతే అఖిల భారత విద్యా ర్థి సమా ఖ్య ఎఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు.



# స్థానికం
REGIONAL NEWS
మహబూబ్‌నగర్, నారాయణపేట, వనపర్తి, నాగర్‌కర్నూల్

## పిడిఎస్ రైస్ పట్టివేత



**ప్రజాపక్షం/ నారాయణపేట్ :** ధన్వాడ పోలీస్ స్టేషన్ పరిధిలోని గోటూరు గ్రామంలో దాసరి కృష్ణయ్య అనే వ్యక్తి చుట్టుపక్కల ఇండ్ల నుండి పిడిఎస్ రైస్ సేకరించిన తన ఇంట్లో అక్రమంగా పిడిఎస్ రైస్ నిల్వంచనందున టాస్కోపోర్స్ ధన్వాడ పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించి 12.80 క్వింటాళ్ల పిడిఎస్ రైసు పట్టుకుని పోలీస్ స్టేషన్‌కి తరలించి డిటిజి భాస్కర్ పంచానామా అనంతరం దాసరి కృష్ణయ్యపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తు న్నామని ఎస్ఐ తెలిపారు. ధన్వాడ పోలీస్ స్టేషన్ పరిధిలో ఎవరైనా అక్రమంగా పిడిఎస్ రైస్ విలువ ఉంచి న అమ్మిన అట్టి వ్యక్తులపై చట్ట ప్రకారం కఠిన చర్య లు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.

## ఈ నెల 26న జాబ్ మేలా

**ప్రజాపక్షం/ మహబూబ్ నగర్ ప్రతినిధి :** మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వం ఒకేషనల్ జూనియర్ కళాశాల ప్రాంగణంలో ఈనెల 26 వ తేదీన నిర్వహించనున్న అప్రెంటిస్, జాబ్ మేలా కార్యక్రమానికి మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా ఆహ్వానిస్తూ ఒకేషనల్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ భగవేణి నర్సింహులు, సిబ్బంది ఆహ్వాన పత్రికను ఎమ్మెల్యేకి అందజేశారు. గత మూడు సంవత్సరాలుగా ఒకేషనల్ కోర్సుల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు ఈ అప్రెంటిస్, జాబ్ మేలా నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే కి వివరించారు. ఉమ్మడి జిల్లాలోని అభ్యర్థులకు ఈ అప్రెంటిస్, జాబ్ మేలా లో పాల్గొనేందుకు అవకాశం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎస్‌పి వెంకటేష్, మారేపల్లి సురేందర్ రెడ్డి, కళాశాల సిబ్బంది కొండయ్య, హెచ్. శ్రీనివాస్, ఇస్మాయిల్, శంకర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఆస్పత్రి పనులు పర్యవేక్షించిన మంత్రి వాకిటి



**ప్రజాపక్షం/మక్తల్ :** మక్తల్ నియోజకవర్గ కేంద్రంలో 150 పడకల ఆసుపత్రి పనులను పర్యవేక్షించిన తెలంగాణ రాష్ట్ర పశుసంవర్ధక పాడి పరిశ్రమ మత్స్యక్రీడలు, యువజనుల శాఖ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి మక్తల్ నియోజకవర్గ అభివృద్ధిలో భాగంగా సుమారు రూ.55 కోట్లతో నిర్మిస్తున్న నూతన 150 పడకల ఆసుపత్రి పనుల్లో లోపాలు లేకుండా శరవేగంగా జరగాలని సంబంధిత అధికారులను కాంట్రాక్టర్‌ను మంత్రి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మంత్రితో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు రవికుమార్, లక్ష్యారెడ్డి, కోళ్ల వెంకటేష్, గడ్డంపల్లి, హనుమంతు, ఆనంద్ గౌడ్, రాయ్ కోడ్ ఆనంద్, లక్ష్మణ్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఆదర్శ పాఠశాల, జూనియర్ కళాశాలలో సమస్యల పరిష్కారానికి చర్యలు



**ప్రజాపక్షం/ధన్వాడ :** ధన్వాడ మండల కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాల జూనియర్ కళాశాలను బుధవారం భీష్మరాజ్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ కె.రాజ్ కుమార్ రెడ్డి ఫౌండేషన్ సభ్యులతో కలిసి సందర్శించారు. విద్యాలయంలో నెలకొన్న సమస్యలను విద్యాలయ ప్రిన్సిపల్ ఉమాయ్ అస్ర రాజ్ కుమార్ రెడ్డి దృష్టికి తీసుకురాగా సమస్యలను దశలవారీగా పరిష్కరించేందుకు కృషి చేస్తానని రాజ్ కుమార్ రెడ్డి హామీనిచ్చారు. అంతకుముందు ప్రిన్సిపల్ అధ్యాపకులు రాజ్ కుమార్ రెడ్డిని శాలువతో సత్కరించి జ్ఞాపికను బహుకరించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు మఠిమాల, రమేష్ గౌడ్, రామాంజనేయులు, ప్రసాద్, చంద్రశేఖర్, రామన్ గౌడ్, రాజ్ కుమార్, అఖిల, సంతోష్, నరేష్, కురుమూర్తి, రామకృష్ణ సవిత, సీమ, ఫౌండేషర్ సభ్యులు గడ్డం తిమ్మన్న, హన్మంతు ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## నూతన న్యాయస్థాన భవన నిర్మాణానికి సత్వర చర్యలు

జిల్లా ప్రిన్సిపల్, జిల్లా సెషన్స్ కోర్టు జడ్జి ఎంఆర్. సునీత



**ప్రజాపక్షం/వనపర్తి ప్రతినిధి :** వనపర్తి జిల్లాలో నూతన న్యాయస్థాన భవనం నిర్మాణానికి సత్వర చర్యలు తీసుకోవాలని వనపర్తి జిల్లా ప్రిన్సిపల్ జిల్లా సెషన్స్ కోర్టు జడ్జి ఎంఆర్. సునీత జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభిను కోరారు. బుధవారం ఉదయం జిల్లా న్యాయస్థానం కాంప్లెక్స్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన మూడు కార్ పార్కింగ్ షెడ్లు , రెండవ అదనపు కోర్టు హాల్ , వైద్య చికిత్సా కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, బార్ కౌన్సిల్ అధ్యక్షుడు డి. కిరణ్ కుమార్ , ఇతర ప్రధాన న్యాయమూర్తులతో కలిసి జిల్లా సెషన్స్ జడ్జి ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా జిల్లా సెషన్స్ జడ్జి మాట్లాడుతూ న్యాయ స్థానం ప్రాం గణంలో వైద్య చికిత్సా కేంద్రం ఉండటం చాలా అవసరమని, కోర్టుకు వచ్చే కక్షిదారులు, న్యాయవాదులు, ఇతర సిబ్బందికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. అడిగిన వెంటనే వైద్యచికిత్స కేంద్రం, కార్ షెడ్లు ఏర్పాటు చేసేందుకు నిధులు మంజూరు చేసినందుకు జిల్లా కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ ఆరోగ్యాన్ని సంరక్షించుకోవడానికి ముందస్తు వైద్య పరీక్షలు ఎంతో అవసరం అవుతాయని, సకాలంలో వైద్య పరీక్షలు చేయించుకోవడం వల్ల రోగాల బారిన పడకుండా చేసుకోవచ్చన న్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు డి.కిరణ్ కుమార్ మాట్లాడుతూ కోర్టు ప్రాంగణంలో కార్ పార్కింగ్ షెడ్లు నిర్మించుకునేందుకు అడిగిన వెంటనే రూ.5 లక్షలు మంజూరు చేయడం , వైద్య చికిత్స కేంద్రం ఏర్పాటు చేసి మంచి సీనియర్ వైద్యులు, సిబ్బందిని నియమించినందుకు జిల్లా కలెక్టర్ కు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో లీగల్ సర్వీసెస్ అథారిటి సెల్ న్యాయమూర్తి రజనీ, ఇతర ప్రధాన న్యాయమూర్తులు కలార్చన , కవిత, శ్రీలత, బార్ కౌన్సిల్ సభ్యులు, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

## పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులు ఆపాలి

**ప్రజాపక్షం /వీపనగండ్ల :** పాలస్తినపై ఇజ్రాయిల్ దాడులను ఆపాలని కోరుతూ వీపనగండ్ల మండల కేంద్రంలోని సిపిఎం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సిపిఎం మండల కార్యదర్శి బాల్ రెడ్డి మాట్లాడుతూ 1948కి ముందు ప్రపంచపటంలో అసలు ఇజ్రాయిల్ అనే దేశం లేదని, తలదాచుకోవడానికి స్థలం అంటూ ప్రవేశించి క్రమంగా ఆదేశాన్ని అక్రమించి దాడులకు పూనుకోవడం దారుణమన్నారు. చిన్న కారణాలు చూపి యుద్ధం మొదలు పెట్టి అక్కడి మహిళలు, పిల్లలు, వృద్ధులు అనే తేడా లేకుండా విచక్షణ మరిచి , పాఠశాలలు, ఆసుపత్రులు, ఆలయాన్నింటిపైనా యుద్ధం చేయడాన్ని వ్యతిరేకించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎం. ఆది సిపిఎం, మండల నాయకులు మాజీ ఉప సర్పంచ్ సిహెచ్ వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.



# వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల మంజూరులో జాప్యం తగదు

మంత్రి జూపల్లి కృష్ణారావు



**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** రైతును రాజునుచేయాలనే ప్రభుత్వ ఆలోచనకు అనుగుణంగా విద్యుత్‌శాఖ అధికారులు పనిచేయాలని, దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికి విద్యుత్‌లైన్, ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటుచేయాలని అధికారులను పర్యాటక సాంస్కృతిక, ఎక్సైజ్‌శాఖమంత్రి జూపల్లికృష్ణారావు అధికారులను ఆదేశించారు. హైదరాబాద్‌లోని డాక్టర్‌బిఆర్ అంబేద్కర్ సచివాలయంలో మంత్రి జూపల్లికృష్ణారావు విద్యుత్‌శాఖ ఉన్నతాధికారులతో కొల్లాపూర్ నియోజకవర్గంలో నెలకొన్న విద్యుత్ సమస్యలు, విద్యుత్ అభివృద్ధి పనులపై సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు, లైన్ల నిర్మాణం, పవర్‌ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం పెంచడం, విద్యుత్ ఉపకేంద్రాల్లో అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటుచేయడం, పాతట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం పెంచడం, పలు విద్యుత్ ఉపకేంద్రాల్లో సామర్థ్యం పెంచడం, కొత్తగా విద్యుత్ ఉపకేంద్రాల ఏర్పాటు తదితర అంశాలపై మంత్రి అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈసందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడుతూ నియోజకవర్గంలో వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు, స్తంభాలు, వైర్లు, ట్రాన్స్‌ఫార్మర్లకోసం రైతులు ఇబ్బందిపడుతున్నట్లు తనదృష్టికి వచ్చిందన్నారు. దరఖాస్తు చేసిన రైతులందరికి విద్యుత్ లైన్, వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు యుద్ధ ప్రాతిపదికన ఏర్పాటుచేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నియంత్రికలను ఏర్పాటుచేసి హైవోల్టేజ్ సమస్యలు లేకుండా రైతులకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయాలని అన్నారు. అదేవిధంగా కొల్లాపూర్ పట్టణంలో వందపడకల ఆస్పత్రిలో విద్యుత్ సరఫరాలో తరుచు సమస్యలు తలెత్తుతున్నాయని, కరెంటుకోతలు ఉన్నాయని దీనివల్ల రోగులు ముఖ్యంగా డయాలసిస్‌పేషెంట్లు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఈసమస్యను అధిగమించేందుకు కొత్త విద్యుత్‌లైన్‌ను ఏర్పాటుచేయాలని అధికారులకు సూచించారు. మల్లేశ్వరంలో కొత్త విద్యుత్‌లైన్ ఏర్పాటుచేయాలన్నారు. ఈ సమీక్షలో కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డినారాయణరెడ్డి, తెలంగాణవిద్యుత్ పంపిణీసంస్థ సిఎండి ముషారఫ్‌ఫరూఖిఆలీ, ఎస్ఇడిఇలు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ మంజూరీ పత్రాలు అందజేత

కాంగ్రెస్ పార్టీ ప్రవేశ పెట్టిన ప్రతిష్టాత్మకమైన పథకం



**ప్రజాపక్షం/ జడ్చర్ల :** ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను అందజేసిన కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి జనంపల్లి దుష్యంత్ రెడ్డి , చైర్మన్ పుష్పలత, కమిషనర్ లక్ష్మారెడ్డి, హౌసింగ్ ఎఈ ఖాజా మైనొద్దీన్ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా బుధవారం జడ్చర్ల ఎంఎల్ఎ క్యాంప్ ఆఫీస్‌లో 14 వ వార్డుకు సంబంధించి సంజీవయ్య కాలనీ త్రిషుల్ నగర్, బక్కరావు కౌంపౌండ్‌లో 5మంది, సోమవారం 9 మంది మొత్తం 15 మంది లబ్ధిదారులకు ఇండ్ల ప్రొసీడింగ్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు మల్లిఖార్జున్, లక్ష్మమ్మ , సత్య నారాయణ తైసిన్, జడ్చర్ల కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు మణిక్యాల స్వప్న, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# భూ సమస్యలు పరిష్కరించేందుకే భూ భారతి రెవెన్యూ సదస్సులు

జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి



**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి :** రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూ భారతి చట్టం ద్వారా భూ సమస్యలను పరిష్కరించుకునేందుకు గ్రామాలలో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ విజయేందిరబోయి తెలిపారు. జూన్ 20 వరకు నిర్వహించే రెవెన్యూ సదస్సుల్లో గ్రామాలకు రెవెన్యూ అధికారులు వస్తారని పెండింగులో ఉన్న భూ సమస్యలు పరిష్కరించేందుకు అన్ని ఆధారాలతో రెవెన్యూ సదస్సులలో రైతులు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ తెలిపారు. బుధవారం నవాబ్‌పేట మండలం కొల్లూరు గ్రామంలో దేవరకద్ర మండల కేంద్రంలో జరుగుతున్న రెవెన్యూ సదస్సులో కలెక్టర్ విజయేందిరబోయి పాల్గొని ప్రజలను అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన భూ భారతి చట్టం రైతులకి ఎంతగానో మేలు జరుగుతుందని, రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రెవెన్యూ సదస్సులలో రైతుల నుండి భూ సమస్యలపై వచ్చిన దరఖాస్తులు క్షేత్రస్థాయిలో విచారించి నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు.

### పాఠశాల తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

దేవరకద్ర మండల కేంద్రంలో రైతు సదస్సు లో పాల్గొన్న అనంతరం సమీపంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడారు. మధ్యాహ్న భోజనం చేశారా? ఈరోజు ఏమి పెట్టారు? గుడ్డు పెట్టారా? భోజనం ఎలా ఉందని కలెక్టర్ విద్యార్థులను అడిగారు భోజనం బాగుంది గుడ్డు కూడా పెట్టారని విద్యార్థులు కలెక్టర్‌కు తెలిపారు. పుస్తకాలు వచ్చాయా అని విద్యార్థులను అడిగారు వచ్చాయి మేడం అని విద్యార్థులు చెప్పారు. పాఠ్యపుస్తకాలు తీసుకురమ్మని చెప్పి 4వ తరగతి విద్యార్థినిలచే తెలుగు, ఇంగ్లీష్ పాఠ్యాంశాలు చదివించి పఠనా నైపుణ్యాలు పరీక్షించారు. పాఠశాలలు ప్రారంభం కాగానే మూడువారాల పాటు సంసిద్ధతలో భాగంగా విద్యార్థులకు చదవడం, రాయడం, ప్రాథమిక గణితభావనలు బోధించాలని సూచించారు. ప్ర తి విద్యార్థిలో ఉన్న నైపుణ్యాలు వెలికితీయాలన్నారు. ప్రైమరీ తరగతి నుండి విద్యార్థులు బాగా చదివేలా శ్రద్ధ వహించాలని అన్నారు. యూనిఫాంలు వచ్చాయా అని అ డిగారు. యూనిఫాం చేరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమం లో తాహసీల్దార్‌లు రెవెన్యూ అధికారులు, మండల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా కలెక్టర్ కార్యాలయం త్వరగా పూర్తి చేయాలి

**ప్రజాపక్షం/నారాయణపేట్ :** సమీకృత జిల్లా కలెక్టర్ కార్యాలయం పనులు త్వరిత గతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అధికారులను ఆదేశించారు. బుధవారం సింగారం దగ్గర నిర్మిస్తున్న ఐడిఓసి(సమీకృత జిల్లా కలెక్టర్ కార్యాలయం) పనులను జిల్లా కలెక్టర్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వివిధ గదులు, వాటిలో కొనసాగుతున్న పనులు ఎప్పటిలోగా పూర్తవుతాయని అధికారులను అడిగి తెలుసుకున్నారు.



# రైతుల ఖాతాలలో పెట్టుబడి నిధులు జమ

కలెక్టర్ బదావత్ సంతోష్



**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** వ్యవసాయాన్ని పండుగలా మారుస్తూ, రైతులకు బాసటగా నిలవాలనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న రైతుభరోసా పథకం వ్యవసాయ ఆధారిత ప్రాంతమైన జిల్లాలోని చిన్న, సన్నకారు రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరుస్తుందని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న రైతు భరోసా సాయంతో జిల్లా రైతాంగానికి వ్యవసాయ సాగుకు అవసరమైన ఏర్పాట్లను పూర్తి చేసుకోవడానికి ఎంతో మేలు జరుగుతుందన్నారు. చిన్న, సన్నకారు రైతులకు పెట్టుబడిభారం తగ్గించి, వ్యవసాయ ఉత్పాదకతను మెరుగుపర్చేందుకు ప్రభుత్వం రైతుభరోసా పథకంలో భాగంగా పెట్టుబడి సాయం అందిస్తున్నదని, జిల్లా వ్యాప్తంగా ఉన్న 3లక్షల 34వేల835మంది రైతులకు రాష్ట్రప్రభుత్వం నుంచి జిల్లాలో 429 కోట్ల రూపాయలను నేరుగా రైతుల ఖాతాలో డబ్బులు చెల్లించడం జరుగుతుందన్నారు. వానాకాలంకి సంబంధించి పంటపెట్టుబడిసాయం కింద జిల్లాలో బుధవారం సాయంత్రం వరకు జిల్లాలోని 2,14,347మంది రైతుల ఖాతాలలో రూ. 175,93,75,635 కోట్ల నిధులు ఇప్పటికే జమ అయ్యాయని కలెక్టర్ వివరించారు.

### బోగస్ ధృవపత్రాలతో ఆస్పత్రులు నడిపితే క్రిమినల్‌కేసులు నమోదు

ప్రభుత్వ నిబంధనలమేరకు ప్రైవేట్ ఆస్పత్రులు అనుమతులు కలిగి ఉండటంతోపాటు ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్ అన్నారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్ వీడియోకాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్ అధ్యక్షతన వైద్యాధికారులు, ఆస్పత్రి పర్యవేక్షకులు, ప్రోగ్రామ్ అధికారులు నూతన ప్రైవేట్ ఆస్పత్రుల అనుమతుల నిర్వహణపై జిల్లాస్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. నూతన అనుమతులకోసం వచ్చిన ప్రతిపాదనలో ప్రైవేట్ ఆస్పత్రులు సరైన అనుమతులు, ధృవపత్రాలు కలిగి ఉన్నాయని కలెక్టర్ డిఎంహెచ్ఒను అడిగి తెలుసుకున్నారు. నూతనంగా ప్రైవేట్ ఆస్పత్రుల అనుమతులకై వచ్చిన ప్రతిపాదనల వారిగా క్షేత్రస్థాయిలో పరిశీలన వివరాలను అడిగి తెలుసుకున్నారు. కొత్తగా మంజూరుపై వచ్చిన 21 ఆస్పత్రులవారి ధృవపత్రాలను పరిశీలించడం జరిగిందా అని కలెక్టర్ ప్రశ్నించారు. ప్రభుత్వ నిబంధనలు పాటించని ప్రైవేట్ ఆస్పత్రులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలో 39 ఉన్న స్కానింగ్ కేంద్రాలు రిజిస్ట్రేషన్ అయ్యాయా లేదా అని వీటిలో ప్రతి నెల అన్ని కేంద్రాలు తనిఖీలు చేపట్టాలన్నారు. రిజిస్ట్రేషన్ లేకుండా స్కానింగ్ మిషన్ కలిగి ఉండటం నేరమని, రిజిస్ట్రేషన్‌లేని స్కానింగ్‌మిషన్ ఉన్న ఆస్పత్రులు ఏమైనా ఉంటే వాటిపై కేసులు నమోదు చేయమని కలెక్టర్ ఆదేశించారు. నిబంధనలు పాటించకుండా లింగనిర్ధారణ పరీక్షలు చేస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఆదేశించారు. ఈసమావేశంలో ప్రైవేట్ ఆస్పత్రుల అనుమతుల జిల్లా కమిటీ సభ్యులు అదనపు కలెక్టర్ దేవసహాయం, అదనపు ఎస్‌పి రామేశ్వర్, డిఎంహెచ్ఓ స్వరాజ్యలక్ష్మి , ప్రైవేట్ ఆస్పత్రుల జిల్లా అధ్యక్షులు డాక్టర్ చెన్నయ్య, జిల్లా ఇమినైజేషన్ అధికారి తదితరులు పాల్గొన్నారు.

## 'ఉపాధి' పనుల్లో వేగం పెంచాలి

నారాయణపేట్ కలెక్టర్ సిక్తా పట్నాయక్

**ప్రజాపక్షం/నారాయణపేట్ :** జిల్లాలో కొనసాగుతున్న ఉపాధి హామీ పథకం పనుల్లో వేగం పెంచాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ సూచించారు. బుధవారం కలెక్టరేట్ లోని వీసీ హాల్‌లో అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వర్‌తో కలిసి ఉపాధి హామీ పనులు, ఇందిరా మహిళ శక్తి భవన నిర్మాణం, ఇందిరమ్మ, ఇండ్లు, ఇందిరమ్మ భరోసా తదితర పనులపై అధికారులదో సమీక్షించారు. మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పనులపై జిల్లా కలెక్టర్ దిశా నిర్దేశం చేశారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేసుకునేలా క్షేత్రస్థాయిలో లబ్ధిదారులకు అవగాహన కల్పించాలన్నారు. వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా జిల్లాకు ఇచ్చిన టార్గెట్ ప్రకారం వంద శాతం మొక్కలు నాటేలా ప్రణాళిక రూపొందించాలన్నారు. స్వయం సహాయక సంఘాలకు ఇచ్చిన టార్గెట్ లను పూర్తి చేసేలా ఎపిఎం పర్యవేక్షణ చేయాలన్నారు. పాఠశాలలో బీచ్లింగ్ పౌడర్‌ను చల్లించి పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకువాలన్నారు. గ్రామాలలో పంచాయతీ కార్యదర్శులు పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఎంపిడిఒలు నిరంతరం పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేయాలని, వంటకు పామాయిల్ వినియోగించకుండా చూడాలని, ఎల్‌పిజి గ్యాస్ కనెక్షన్ ద్వారానే మధ్యాహ్న భోజనం పండేలా ఏజెన్సీ నిర్వాహకులను ఆదేశించాలన్నారు. పాఠశాలల్లో విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత చేతులు శుభ్రంగా కడగటంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకునేలా అవగాహన కల్పించాలని ఆమె సూచించారు. ఈ సమీక్షలో జెడ్‌పి సిఇఒ శైలేష్ కుమార్, డిఆర్‌డిఒ మొగులప్ప అన్ని మండలాల ఎంపిడిఒలు, ఎపిఒలు తదితులు పాల్గొన్నారు.




## ఆడపిల్లలను వేధిస్తే కఠిన చర్యలు

'షీటీమ్' పోలీసులు




**ప్రజాపక్షం/ నారాయణపేట్ :** జిల్లా ఎస్‌పి యోగేష్ గౌతమ్ ఐపిఎస్ ఆదేశాల మేరకు కోస్గిలోని జిల్లా పరిషత్ (బాలికల) ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు షీటీం పోలీసులు మహిళలపై జరుగుతున్న నేరాలు, ఈవ్‌టీజింగ్, మహిళలపై వేధింపులు మొదలగు సమస్యలపై విద్యార్థులకు షీటీమ్ పోలీసులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా షీటీం పోలీసులు బాలరాజు మాట్లాడుతూ. మహిళలకు విద్యార్థులకు షీటీమ్ పోలీసులను నేరుగా సంప్రదించవచ్చు. లేదంటే షీటీం నెం:8712670398కి కాల్ చేసి సమస్యని చెప్పవచ్చు అని కంప్లైంట్ ఇచ్చిన వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచడం షీటీం యొక్క ప్రదాన ఉద్ధేశం అని తెలిపారు. అలాగే ఎహెచ్‌టియు మానవ అక్రమ రవాణా జరగకుండా నివారించుటకు పనిచేస్తుంది. అలాగే జిల్లా కేంద్రంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో భరోసా సెంటర్ ఏర్పాటు చేయడం జరిగిందని ఒంటరి మహిళలకు, వేధింపులకు గురైన వారికి, చైల్డ్ మార్యేజెస్ సంబంధించిన మహిళలకు విద్యార్థులకు భరోసా సెంటర్లో కౌన్సిలింగ్ నిర్వహించడం జరుగుతుందని బాధిత మహిళలు భరోసా సెంటర్ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అలాగే అమ్మాయిలకి, అడవారికి ఏ ఇబ్బంది ఎదురైనా నిర్భయంగా షీటీమ్‌ని సంప్రదించవచ్చు అని షీ టీమ్ పోలీసులు తెలిపారు. ఈ కార్యక్రమానికి షీటీమ్ పోలీసులు బాలరాజు, జ్యోతి, కవిత, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయ వృత్తి దేశ నిర్మాణానికి దోహదం

ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి :** ఉపాధ్యాయ వృత్తి దేశ నిర్మాణానికి తోడ్పడుతుందని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఏనుగొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న సాంఘీక శాస్త్రం స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయురాలు ఎ.అజిత పదవి విరమణ మహోత్సవం మహబూబ్‌నగర్ పట్టణంలోని జేజేఆర్ ఫంక్షన్ హాలులో జరిగింది. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై అజితకి పదవివిరమణ మహోత్సవం మహబూబ్‌నగర్ పట్టణంలోని జేజేఆర్ ఫంక్షన్ హాలులో జరిగింది. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హజరై అజితకి పదవివిరమణ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 37 సంవత్సరాల పాటు అజిత ఉపాధ్యాయ వృత్తిలో పనిచేసి, ఆ వృత్తికే వన్నె తెచ్చారని ఆయన అన్నారు. బాల బాలికలను భావిపౌరులుగా తీర్చిదిద్దే బృహత్తర బాధ్యత సమాజంలో టీచర్ల పైన మాత్రమే ఉంటుందన్నారు. కాంపిటీటివ్ ఎగ్జామ్‌లో రాణించాలంటే సోషల్ స్టడీస్ సబ్జెక్టు పాత్ర చాలా కీలకమని అలాంటి సబ్జెక్టును వారు ఎంచుకుని ఎంతోమంది విద్యార్థులకు మార్గ నిర్దేశం చేసే అవకాశం వారికి లభించడం అదృష్టం అని అన్నారు.ఈ కార్యక్రమంలో టిపిసిసి అధికార ప్రతినిధి హర్షవర్ధన్‌రెడ్డి, సిఎంఓ బాలు యాదవ్ , ప్రధానోపాధ్యాయులు అరుణ కుమారి, రఘురామిరెడ్డి, వామన్‌కుమార్, శ్రీనివాసులు, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.



## కార్మిక వ్యతిరేక విధానాలు నిరసిస్తూ జులై 9న సార్వత్రిక సమ్మె

కార్మిక సంఘాల నేతల పిలుపు



**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి :** కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక ఉద్యోగ ప్రజా వ్యతిరేక విధానాల నిరసిస్తూ జులై 9న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకి కార్మిక సంఘాలు పిలుపు ఇవ్వడం జరిగిందని వామపక్ష కార్మిక సంఘాల నేతలు అన్నారు. జులై 9న జరిగే సార్వత్రిక సమ్మె విజయవంతనికై బుధవారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఎఐటియుసి జిల్లా కార్యాలయంలో వామపక్ష కార్మిక సంఘాలైన సిఐటియు, టియుసిఐ, ఎఐటియుసి, టిఎన్‌టియుసి సంఘాల ఆధ్వర్యంలో సన్నాహక సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి పి.సురేష్, సిఐటియు జిల్లా కార్యదర్శి కురుమూర్తి, టియుసిఐ జిల్లా కార్యదర్శి దేవదానం మాట్లాడుతూ దేశంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మిక వర్గ హక్కులు కాలరాస్తున్నారని విమర్శించారు. లాభాల బాటలో పయనిస్తున్న ప్రభుత్వ రంగ సంస్థలను దివాలా తీస్తూ కార్పోరేట్ శక్తులకు ధారదత్తం చేస్తున్నారని మండిపడ్డారు. జులై 9న జరిగే సార్వత్రిక సమ్మెకు మద్దతుగా జిల్లాలో ఈ నెల 25న భారీ కార్మిక సదస్సు నిర్వహిస్తున్న మన్నారు. దశల వారీగా కార్మిక అడ్డాలలో విస్తృతంగా ప్రచారం ఉద్యమం నిర్వహిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో టియుసిఐ రాష్ట్ర కోశాధికారి సి.వెంకటేశ్, టిఎన్‌టియుసి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ ధన్వాడ రాములు, టియుసిఐ జిల్లా అధ్యక్షుడు సాంబశివుడు, సంఘాల నేతలు తదితరులు పాల్గొన్నారు.



# స్థానికం

REGIONAL NEWS

నల్లగొండ, సూర్యాపేట యాదాద్రి, గద్వాల

## విధుల పట్ల అలసత్వం వహించిన ముగ్గురు సస్పెన్షన్



**ప్రజాపక్షం/ జోగులాంబ గద్వాల ప్రతినిధి:** పోలీస్ ఉన్నతాధికారుల సూచనలు పాటించకుండా విధులు పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన ముగ్గురు అధికారులను సస్పెండ్ చేస్తూ పోలీస్ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. రాజోలి పోలీస్ స్టేషన్ కు సంబంధించిన ఇథనాల్ కేసులోని వ్యక్తులను పోలీస్ అధికారులు మహబూబ్ నగర్ జైలు నుండి అలంపూర్ కోర్టు కు తీసుకవచ్చే క్రమంలో పోలీస్ ఉన్నతాధికారుల సూచనలు పాటించకుండా విధుల పట్ల అజాగ్రత్తగా, నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఘటనలో ఒక ఆర్ఎస్ఐ, ఇద్దరు ఏఆర్ఎస్ ఐ లను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చెయ్యడం జరిగిందని జిల్లా ఎస్పీ శ్రీనివాస్ రావు తెలిపారు.



## రైతులకు బేడీలు హేయమైన చర్య

ప్రజాసంఘాల నాయకులు, అఖిలపక్ష కమిటీ నాయకులు

**ప్రజాపక్షం/ జోగులాంబ గద్వాల ప్రతినిధి:** ఇథనాల్ బాధిత రైతులకు బేడీలతో అల్లంపూర్ కోర్టుకు హాజరు పరచడం సిగ్గుచేటని అఖిలపక్ష నాయకులు పేర్కొన్నారు. జోగులాంబ గద్వాల జిల్లా రాజోలి మండలం పెద్ద ధన్వాడ గ్రామంలో నిర్మిస్తున్న ఇత్తనాలు ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా ఈనెల నాలువ తేదీన ప్రజలు పెద్ద ఎత్తున చేయబడిన 12 మంది రైతులను 14 రోజుల రిమాండ్ తర్వాత బుధవారం అల్లంపూర్ రెండవ క్లాసు మెజిస్ట్రేట్ ముందర హాజరు పరిచారు. హాజరు పరిచే ముందు రైతులను బేడీలు వేసి హాజరు పరచడం కలకలం రేగింది. ఈ దారుణాన్ని మేము తీవ్రంగా ఖండిస్తున్నామని ప్రజాసంఘాల నాయకులు, అఖిలపక్ష కమిటీ నాయకులు బుధవారం గద్వాలలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పేర్కొన్నారు. రైతులకు గతంలో లగచర్లలో బేడీలు వేసిన విషయాన్ని హైకోర్టు తీవ్రంగా మందలించినా పోలీసుల తీరు మారకపోవడం దారుణమన్నారు. తీవ్రమైన నేరాలు చేసిన వారికి వేసిన విధంగా బేడీలు వేయడం సరైనది కాదన్నారు. నడిగడ్డలో పోలీసు రాజ్యం ఏలుతున్నదా అనే విధంగా బాధిత గ్రామాలను సందర్శించకుండగా గత వారం రోజుల క్రీతం అఖిలపక్ష కమిటీ నాయకులను అరెస్టు చేసి అడ్డుకున్నారన్నారు. రాష్ట్ర పౌర హక్కుల సంఘం నేతలు బాధిత గ్రామాలను సందర్శించడానికి వెళుతున్న సందర్భంగా వారిని ఎర్రవల్లిలో అరెస్టు చేసి ఇటిక్యాల పోలస్ స్టేషన్లో ఉంచడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నాగ్ దొడ్డి వెంకటరాములు సీనియర్ సిటిజన్ ఫోరం నాయకులు మోహన్ రావు టీపీఎఫ్ రాష్ట్ర నాయకులు శంకర్ ప్రభాకర్ సిపిఐ జిల్లా కార్యదర్శి ఆంజనేయులు టిఆర్ఎస్వీ జిల్లా కోఆర్డినేటర్ కురువపల్లయ్య రైతాంగ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపాల్ యాదవ్ సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఉప్పేర్ నరసింహ బహుజన రాజ్యసమితి నాయకులు వాల్మీకి వినోద్ కుమార్ , టిఆర్ఎస్ నాయకులు, టవర్ మబ్బుల్, పౌర హక్కుల సంఘం నాయకులు మహేష్ ,సామాజిక సంఘాల నాయకులు సాధతుల్లా కృష్ణ పాల్గొన్నారు.

## విద్యార్థులు ఇష్టంతో చదవాలి




**ప్రజాపక్షం/ నల్లగొండ టౌన్ :** విద్యార్థులు కష్టంతో కాదు ఇష్టంతో చదివి ఉన్నత శిఖరాలను అవరోధించాలని నల్లగొండ డిఎస్పి శివరాం రెడ్డి సూచించారు.ఇటీవల విడుదలైన నీట్ ఫలితాల్లో నల్లగొండ ఎస్ ఆర్ బ్రాంచ్‌కు చెందిన విద్యార్థిని బచ్చు ప్రియాంక ఆలిండియా స్థాయిలో 100వ ర్యాంకు సాధించగా బుధవారం డీఎస్పీ శివరాంరెడ్డి, కళాశాల జోనల్ ఇన్‌చార్జి దోనాల శ్రీనివాస్‌రెడ్డితో కలిసి విద్యార్థినిని శాలువాతో సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ విద్యార్థులు పట్టుదలతో చదివి తల్లిదండ్రులకు కళాశాలకు పేరు ప్రతిష్టలు తీసుకు రావాలన్నారు . అనంతరం నీట్ ఫలితాల్లో ఆలిండియా స్థాయిలో 100వ ర్యాంకు సాధించిన విద్యార్థిని బచ్చు ప్రియాంకకు డీఎస్ఆర్ ఫౌండేషన్ చైర్మన్, కళాశాల జోనల్ ఇన్‌చార్జి దోనాల శ్రీనివాస్‌రెడ్డి, డి.ఎస్.పి కె.శివరాంరెడ్డితో కలిసి రూ.10వేలు ఆర్థికసాయం అందించారు. ఈ కార్యక్రమంలో రూరల్ ఎస్ఐ సైదా బాబు, కళాశాల అసిస్టెంట్ జోనల్ సతీశ్‌రెడ్డి, ప్రిన్సిపాళ్లు మనోజ్ రెడ్డి, డీన్ కిశోర్ బాబు, ఏఓ సరితారెడ్డి, అధ్యాపకులు వర్ధన్, ప్రసన్న కుమార్, శ్రీనివాస్, శోభ ఉన్నారు.

## సిపిఐ గుండాల మండల 13వ మహాసభల కరపత్రాల ఆవిష్కరణ



**ప్రజాపక్షం/గుండాల :** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం సుద్దాల గ్రామంలో సిపిఐ మండల 13వ మహాసభల కరపత్రాలను సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కుసుమాని హరిచంద్ర నాయకులతో కలిసి బుధవారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 30వ తేదిన గుండాల మండల పరిధిలోని మాజీ ఎంఎల్ఏ కామ్రేడ్ గుర్రం యాదగిరిరెడ్డి సభా ప్రాంగణం శ్రీ వాసవి గార్డెన్‌లో నిర్వహించడం జరుగుతుందని ఈ మండల మహాసభలను సిపిఐ శ్రేణులు తరలివచ్చి విజయవంతం చేయాలని ఆయన కోరారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ఇచ్చిన ప్రతి ఒక్క హామీని అమలు చేయాలని, ఇందిరమ్మ ఇండ్లను అర్హులైన పేద లబ్దిదారులకు అందజేయాలని, కుల, మతాలకు తేడా లేకుండా ఇందిరమ్మ ఇండ్లు లబ్దిదారులకు అందే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన అన్నారు. రైతులకు పూర్తి స్థాయిలో రుణమాఫీ చేయాలని, సన్నాలకు 500 బోనస్ అందజేయాలని, రేషన్ కార్డులు త్వరితగతిన లబ్దిదారులకు అందజేయాలని ఆయన కోరారు. ఈకార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి అనంతుల రామచంద్రయ్య, కార్యదర్శి పడకంటి సత్యనారాయణ, ఏఐవైఎఫ్ మండల కన్వీనర్ బద్దుల శ్రీను, కృష్ణహరి తదితరులు ఉన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి



**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి;** తెలంగాణలో ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రభుత్వం కృషి చేస్తుందని దేవరకొండ ఎంఎల్ఏ నేనావత్ బాలునాయక్ అన్నారు. బుధవారం ఎంఎల్ఏ మండల పరిధిలోని కొల్‌ముంతల్‌పహాడ్ గ్రామ పంచాయతీ పరిధిలో రైతు వేదిక సమీపంలో నూతనంగా నిర్మించిన కేజిబివి పాఠశాల భవనాన్ని ప్రజా ప్రతినిధులతో కలిసి రిబ్బన్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఏ మాట్లాడుతూ ప్రభుత్వం దేవరకొండకు ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌కు అనుమతినిచ్చిందని అన్నారు. 200 కోట్లతో 25 ఎకరాల్లో సువిశాలంగా ఈ పాఠశాలను నిర్మించి అన్ని వర్గాల విద్యార్థులకు సమానత్వంతో బోధన చేయడంతో పాటు నాణ్యమైన భోజన వసతులు కల్పించనుందని తెలిపారు. ఈకార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ నాయిని జమున మాధవరెడ్డి, మాజీ ఎంపిపి దూదిపాల రేఖ శ్రీధర్‌రెడ్డి, మాజీ మునిసిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహా, పిఏసిఎస్ చైర్మన్ డా. వేణుధర్‌రెడ్డి, పార్లమెంట్ కో ఆర్డినేటర్ సిరాజ్‌ఖాన్ పాల్గొన్నారు.

# ఆయిల్‌పామ్‌తో అత్యధిక లాభాలు

వరికి ప్రత్యామ్నాయ పంటలపై రైతులు శ్రద్ధ పెట్టాలి

సమీకృత వ్యవసాయ సాగు పద్ధతిని పరిశీలన

కలెక్టర్ తేజస్‌నంద్‌లాల్ పవార్



**ప్రజాపక్షం/చివ్వెంల:** ఆయిల్‌ఫామ్ సాగు చేయడం ద్వారా అత్యధిక లాభాలు పొందవచ్చు అని జిల్లా కలెక్టర్ తేజస్‌నంద్‌లాల్ పవార్ అన్నారు. బుధవారం చివ్వెంల మండలంలో బి.చందుపట్ల గ్రామంలో గల మార్కల వెంకటరెడ్డి ఆయిల్‌ఫామ్ తోటను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయిల్‌ఫామ్ సాగు వివరాలను, వారి క్షేత్రంలో ఆయిల్‌ఫామ్‌తో పాటు మామిడి, కొబ్బరి అన్ని రకాల పండ్లు, నాటుకోళ్లు, గొర్రెలను సమీకృత పద్ధతిలో సాగు విధానంను రైతు నుండి కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయిల్‌ఫామ్ సాగులో తీసుకోవాల్సిన యాజమాన్యంపై పలు సూచనలు చేశారు. జిల్లాలో ఆయిల్‌ఫామ్ గెలల కోతలు ప్రారంభమైనందున ప్రభుత్వం ఆయిల్‌ఫామ్ సాగుకై అందిస్తున్న ప్రోత్సహకాలు రైతులు సద్వినియోగం చేసుకోవాలని, ఆయిల్‌ఫామ్‌ను సాగు చేయాల్సిందిగా జిల్లా రైతులకు కలెక్టర్ సూచించారు. సూర్యాపేట జిల్లాలో నాలుగేండ్ల క్రితం సాగు చేసిన ఆయిల్‌ఫామ్ పంట చేతికి వస్తుండటం అలాగే గెలల ధర భారీగా పెరగడంతో రైతుల్లో నూతన ఉత్సాహం నెలకొంటుందని, ఇన్నాళ్లు ఎప్పుడో నాలుగేళ్లకు వచ్చే పంటకోసం ఇప్పటి నుండే కష్టపడి సాగు చేయాలనుకున్న రైతులు ఇప్పుడు ఆయిల్‌ఫామ్‌ను సాగు చేసేందుకు మొగ్గు చూపుతున్నారని, దీంతో జిలాలలో సాగు పెరుగుతుందని తెలిపారు. జిల్లాలో ప్రస్తుతం 4885 ఎకరాల్లో ఆయిల్‌ఫామ్ పథకంలో పెట్టిన టార్గెట్‌లో ఇప్పటి వరకు సుమారు 400 ఎకరాల్లో తాజాగా పంట చేతికి వస్తుండటంతో పంటను చూసిన ఇతర రైతులు ఆయిల్‌ఫామ్ సాగుకు ఆకర్షితులవుతున్నారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆయిల్‌ఫామ్ సాగును ప్రోత్సహించేందుకు పలు చర్యలు తీసుకుంటోందని దిగుబడి వచ్చేంత వరకు అంతర్ పంటల సాగుతో అదనపు ఆదాయం పొందవచ్చని తెలిపారు. వరి, పత్తి పంటలతో పోల్చితే రైతులు తక్కువ పెట్టుబడి, తక్కువ శ్రమతో మంచి లాభాలు సాధించే అవకాశం ఉందని అన్నారు. ఆయిల్‌ఫామ్ మొక్కలను ఒకసారి నాటితే 30 ఏండ్ల వరకు దిగుబడి వస్తుందని, నాటిని నాలుగో సంవత్సరం నుండి దిగుబడి వస్తుందని మొదటి నాలుగేండ్ల వరకు ప్రభుత్వమే ఖర్చులు భరిస్తుందని అన్నారు. మొదటి మూడేండ్లు మొక్కజొన్న, పత్తి, వేరుశనగ లాంటి పంటలను అంతరపంట సాగు చేసుకోవచ్చని తెలిపారు. నాలుగోయేడు నుండి పంట ఎకరాకు కనీసం 8 నుండి 10 టన్నులకు తక్కువ కాకుండా దిగుబడి వస్తుందని చెట్టు పెరిగే కొద్ది మెలకువలు పాటిస్తూ 15 నుంచి 20 టన్నుల వరకు దిగుబడి రాబట్టవచ్చని తెలిపారు. ప్రభుత్వం ఎకరానికి 4200 ఆర్థికసాయం చేయడం, మొక్క మార్కెట్‌లో 193 నుండి 200 రూపాయల మొక్కను సబ్సీడీతో రైతుకు 20 రూపాయలకే అందిస్తుందని తెలిపారు. డ్రిప్ సౌకర్యం కల్పించేందుకు యూనిట్ ఖర్చులో ఎస్సీ, ఎస్టీలకు 100 శాతం బిసిలకు 90 శాతం,ఇతరులకు 80 శాతం సబ్సీడిగా అందిస్తోందని, ఒక ఎకరానికి మొత్తం రాయితీగా 50918 రూపాయలు ప్రభుత్వం అందిస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిడివో సంతోష్‌కుమార్, ఉద్యానవన డివిజన్ అధికారి స్వాతి, మండల ఉద్యానవన అధికారి మహేష్, వ్యవసాయ అధికారి వెంకటేశ్వర్లు, పతంజలి కంపెని ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.



## మోతెలో అసాంఘిక కార్యకలాపాలను అరికట్టాలి

జిల్లా ఎస్‌పి కె.నర్సింహ్మా

**ప్రజాపక్షం/మోతె:** మండలంలో అసాంఘిక కార్యకలాపలను అరికట్టాలని జిల్లా ఎస్‌పి కె.నర్సింహా అన్నారు. బుధవారం మండల కేంద్రంలో పోలీస్‌స్టేషన్‌లో తనిఖీలలో భాగంగా బుధవారం జిల్లా ఎస్‌పి మోతె పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసి పరిసరాలను పరిశీలించారు. పోలీస్ స్టేషన్ డైరీ, రిసెప్షన్ రిజిస్టర్‌ను తనిఖీచేసి మండల పరిధిలో తరుచుగా నమోదవుతున్న నేరాలు, ఫిర్యాదుల తీరుతెన్నులను, కేసుల స్థితిగతులు, పలు అంశాలను పరిశీలించారు. పోలీస్ సిబ్బంది ఎల్లప్పుడు ప్రజలకు అందుబాటులో ఉండాలని, పారదర్శకంగా పనిచేయాలని, బాధితులకు సత్వర సేవలించాలని అదేశించారు. నాణ్యమైన వేగవంతమైన దర్యాప్తు చేయాలని, బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలని, ప్రణాళిక ప్రకారం ముందుకు వెళ్లాలని సూచించారు. గ్రామ రిజిస్టర్లు, హిస్టరి షీట్స్, రౌడి షీట్స్, సస్పెక్ట్ షీట్స్‌ను ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలన్నారు. బ్లాకోట్ విధులు, పెట్రోకార్ విధులు ప్రధానమైనవని సంఘటన స్థలాన్ని త్వరగా చేరుకుని ప్రాథమికంగా బాధితులకు బరోసా కల్పించాలని సూచించారు. కేసులు పెండింగ్ ఉండకుండా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి తెలిపారు. మునగాల సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణారెడ్డి, మోతె పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఆగమైన వాసాలమర్రిని ఆదుకుంటాం

ఇందిరమ్మ ఇండ్ల పట్టాలను పంపిణీ చేయనున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య



**ప్రజాపక్షం/తుర్కపల్లి :** గత ప్రభుత్వం, స్వయానా వాసాలమర్రి గ్రామాన్ని దత్తత తీసుకొని బంగారు వాసాలమర్రి చేస్తానని హామీలు గుప్పించిన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆగం చేసిన వాసాలమర్రి గ్రామాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని, ఎక్కడికక్కడ నిలిచిపోయిన పనులకు రాష్ట్ర ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుడుతామని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య హామీనిచ్చారు. మాజీ సీఎం కేసీఆర్ హయంలో ఆగమై, ఇండ్లను కూల్చి మొండి గోడలుగా మిగిలిపోయిన బాధితులకు అండగా ఇందిరమ్మ ఇండ్లు కట్టించి ఇవ్వాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశించారని, అందులో భాగంగా గ్రామంలో సర్వే చేసి అధికారులు గుర్తించిన 227 మంది లబ్ధిదారులకు గురువారం రాష్ట్ర సమాచార, ప్రజాసంబంధాల శాఖ, ఆదాయ గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఇందిరమ్మ ఇండ్ల ఉత్తర్వులను పంపిణీ చేయనున్నారని తెలిపారు. ఆకుల ఆగవ్వ పరిస్థితి ఆగమైందని, ఆమెకే మొదటి ఇందిరమ్మ ఇళ్ళు ప్రొసీడింగ్ కాపీ ఇవ్వనున్నట్లు తెలిపారు. రాజకీయ కోణంతో కాకుండా, ప్రజా శ్రేయస్సును కోరే ప్రభుత్వంగా వాసాలమర్రిని అన్నివిధాలుగా అభివృద్ధి చేస్తామని, గ్రామస్థులెవరుకూడా అధైర్యపడొద్దని హామీనిచ్చారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసే సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ హనుమంతరావు, అడిషనల్ కలెక్టర్, ఆలేరు మార్కెట్ కమిటీ చైర్మన్, మండల అధికారులు, కాంగ్రెస్ నాయకులు, వాసాలమర్రి గ్రామస్థులు పాల్గొన్నారు.



## మండల కేంద్రంలో సొంత ప్రభుత్వ కార్యాలయాల భవనాలను నిర్మించాలి

సిపిఐ యాదాద్రి జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు

**ప్రజాపక్షం/మోటకొండూర్ :** 2016లో నూతనంగా ఏర్పడిన మోటకొండూర్ మండల కేంద్రానికి నేటికీ సొంత ప్రభుత్వ కార్యాలయాలు నిర్మించలేకపోవడం విచారకరమని వెంటనే సొంత భవనాలు నిర్మించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆయన బుధవారం భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ మోటకొండూర్ మండల పార్టీ 4వ మహాసభ మండల కేంద్రంలోని మహాలక్ష్మి ఫంక్షన్ హాల్లో ఆలేటి బాల్ రాజు అధ్యక్షతన జరిగింది. ముందుగా మోటకొండూరు మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా నుండి ఫంక్షన్ హాల్ వరకు భారీ ప్రదర్శన ర్యాలీ నిర్వహించి మహాసభల సందర్భంగా ఏర్పాటు చేసిన సిపిఐ జెండాను సీనియర్ నాయకులు మాజీ సర్పంచ్ రేగు సిద్దయ్య ఆవిష్కరించారు. ప్రజానాట్య మండలి కళాకారులు పాడిన విప్లవ గేయాలు అందర్నీ అలరించాయి. అనంతరం ఏర్పాటు చేసిన మహాసభలో గోద శ్రీరాములు మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ ఈ దేశంలో ఆవిర్భవించి వంద సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా ప్రజా సమస్యలే ఎజెండగా తీసుకొని రాజీ లేని పోరాటాలు నిర్వహిస్తున్న చరిత్ర సిపిఐ పార్టీకే ఉందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని అన్నారు. సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి బోలగాని సత్యనారాయణ మాట్లాడుతూ బునాదిగాని కాలువకు మంజూరైన నిధులతో వెంటనే పూర్తి చేసి ఈ ప్రాంత రైతాంగానికి సాగునీరు అందించాలని, స్థానిక సంస్థ ఎన్నికల్లో సిపిఐ అన్ని గ్రామాలలో సర్పంచులు, ఎంపిటిసిలుగా పోటీ చేసి అత్యధిక స్థానాలను కైవసం చేసుకోవాలని ఆయన పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి మాట్లాడుతూ నరేంద్ర మోడీ ప్రభుత్వం ఆపరేషన్ కాగార్ పేరుతో వందలాది మంది నక్సలైట్లను హత్య చేస్తుందని ఆయన ఆరోపించారు. ఈ మహాసభలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శులు యానాల దామోదర్ రెడ్డి, బోలగాని సత్యనారాయణ సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కళ్లెం కృష్ణ, బండి జంగమ్మ, చెక్క వెంకటేష్, ముస్కు పెంటారెడ్డి, మంచాల రాదమ్మ, ఎండీ ఇమ్రాన్, రైతు సంఘం జిల్లా నాయకులు జక్క దయాకర్ రెడ్డి, సిపిఐ మండల కార్యదర్శి గాదెగాని మాణిక్యం, జిల్లా కౌన్సిల్ సభ్యులు ఇంజా హేమలత, అన్నెమైన వెంకటేష్, ప్రజానాట్యమండలి కళాకారులు పోతు ప్రవీణ్, రేణుక మండల కార్యవర్గ సభ్యులు పశుల నరసింహ, బోళ్ల శ్రీను, పల్లె వెంకన్న, బీరకాయల మల్లేష్, ఏనుగు వెంకట్ రెడ్డి, మండల కౌన్సిల్ సభ్యులు జీవిలకపల్లి పాండు, బోలగాని అశోక్ పాల్గొన్నారు.

# పేదోళ్లకు న్యాయం సహా అభివృద్ధి చేస్తా


బంగారిగడ్డ రోడ్డు విస్తరణలో కోల్పోతున్న ఇండ్లను పరిశీలించిన ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి



**ప్రజాపక్షం/చండూరు:** కనగల్లు నుండి మాల్ ఆర్ అండ్ బి రోడ్డు విస్తరణలో భాగంగా చండూరు మండలం బంగారిగడ్డ గ్రామంలో రోడ్డు విస్తరణలో కోల్పోతున్న ఇండ్లను బుధవారం మునుగోడు ఎంఎల్ఏ కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామ పరిధిలో రోడ్డుకు ఇరువైపుల డ్రైనేజీ నిర్మాణం తో కలుపుకొని 66 ఫీట్ల వెడల్పు తో రోడ్డును అభివృద్ధి చేస్తున్న సందర్భంగా రోడ్డు వెడల్పులో పూర్తిగా ఎన్ని ఇండ్లు పోతున్నాయి ,సాక్షికంగా ఎన్ని ఇండ్లకు ఇబ్బంది కలుగుతుందని క్షేత్రస్థాయిలో ఇంటిటింటికి తిరుగుతూ పరిశీలించారు. అంతకు ముందు ఇండ్లు కోల్పోతున్న బాధితులు మునుగోడులోని ఎంఎల్ఏ క్యాంపు కార్యాలయంలో రాజగోపాల్‌రెడ్డిని కలిసి తమ సమస్యలను వినిపిస్తూ తమకు న్యాయం చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఎంఎల్ఏ రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ పేదోళ్ళకు అన్యాయం జరిగితే అభివృద్ధి చేయమని ,పేదలకు న్యాయం చేస్తూనే అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. ఇరువైపుల అండర్ డ్రైనేజీ నిర్మాణంతో పాటు 66 ఫీట్ల రోడ్డు వెడల్పుతో రోడ్డు నిర్మాణ పనులు జరగబోతున్న పేపథ్యంలో ఇండ్లు కోల్పోతున్న నిరుపేదలకు ఏదో ఒక రకంగా న్యాయం చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి చైర్మన్ కుభం శ్రీనివాస్‌రెడ్డి , కాంగ్రెస్ నాయకులు దోటి వెంకటేశ్ యాదవ్ , ట్రస్మా జిల్లా అధ్యక్షుడు కోడి శ్రీనివాసులు , ఇరిగి రాజు, సాపిడి రాములు , కావలి ఆంజనేయులు , సుంకరి నర్సింహ్మా, బొడ్డు ముత్తయ్య ,బోయపల్లి రాములు ,బోయపల్లి సైదులు , పంతంగి గిరిగౌడ్ ,ఇరిగి వెంకటేశం పాల్గొన్నారు.

## అబద్ధాలతో కాంగ్రెస్ పాలన

మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య



**ప్రజాపక్షం /నల్లగొండ ప్రతినిధి :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలను మోసం చేస్తూ అబద్దాలతో పాలన సాగిస్తుందనీ నకిరేకల్ మాజీ శాసనసభ్యులు చిరుమర్తి లింగయ్య ఆరోపించారు. బుధవారం పట్టణంలోని బిఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ఎన్నికల సమయంలో రైతుభరోసా 15 వేలు ఇస్తా అని చెప్పి అధికారంలోకి రాగానే మోసం చేసిందనీ కానీ కెసిఆర్ ఏ హామీ లేకుండనే ఎకరానికి 12 వేల రైతుబంధు ఇచ్చారనీ తెలిపారు.రేవంత్ సర్కార్ ఇచ్చిన హామీలను ఏ ఒక్కటి అమలు చేయకుండా ఇటు రైతులను అటు ప్రజలను అన్ని విధాలుగా మోసం చేస్తుందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే కెసిఆర్ జమ చేసిన డబ్బులను కూడా రైతులకు ఇవ్వకుండా కాంట్రాక్టర్ల వద్ద కమిషన్లు తీసుకుని బిల్లులు ఇచ్చారనీ ఇపుడు స్థానిక సంస్థల ఎన్నికలు వస్తున్నాయని రైతు భరోసా ఇస్తానని మాయమాటలు చెబుతున్నాడనీ ఒక్కొక్క రైతుకు కాంగ్రెస్ సర్కార్ 30 వేలు బాకీ పడ్డదన్నారు.కుప్పలు కుప్పలుగా అప్పులు తెస్తూ కమిషన్ల కోసం బిల్లులు చెల్లెస్తు ఉమ్మడి జిల్లా రైతులకే యాసంగిలో 800 కోట్లు బాకీ పడ్డారనీ జిల్లాకు చెందిన ఇద్దరు చేతగాని మంత్రులుగా మిగిలిపోయారని. జిల్లా కు ఏమి చేయలేక పోతున్నారని ఆరోపించారు. ఈ ఫార్ములా కేసులో నూ జరిగిన తప్పేమి లేదని కానీ కక్ష్య సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని కేటీఆర్ కు పదే పదే విచారణ పేరుతో నోటీసులు ఇవ్వడాన్ని ఖండిస్తున్నామన్నారు.

# కేసు నమోదుతోనే సరి...?

ప్రధాన నిందితుల అరెస్టు ఏదీ?

భ్రూణహత్య కేసులో కనిపించని పురోగతి

రాజకీయ ఒత్తిడే ఇందుకు కారణామా...?



**ప్రజాపక్షం/సూర్యాపేటప్రతినిధి:** సూర్యాపేట జిల్లా కేంద్రంలో గత నెల 20వ తేదీన ఓమేగ ప్రైవేట్ ఆసుపత్రి వైద్యులు చేసిన వచ్చిరాని వైద్యంతో అబార్షన్ వికటించి ఓ నిండు గర్భిణి ప్రాణాలుపోయిన సంఘటన కలకలం రేపింది. అబార్షన్ చేస్తున్న సమయంలో అధిక రక్త స్రావం కావడంతో ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి ఆమెను హుటాహుటిన తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న గర్భిణి మృతి చెందింది. దీనిపై స్పందించిన వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ఆసుపత్రిని సీజ్ చేయడంతో పాటు పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఆసుపత్రి నిర్వాహకులతో పాటు దీనికి సంబంధం ఉన్న మరికొంతమందిపై ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసిన పోలీసులు కేవలం ఓ గ్రామీణ వైద్యుడిని, అతనికి సహాయకులుగా ఉన్న మరో ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపి చేతులు దులుపుకున్నారు. ఈకేసులో ప్రధాన నిందితులను మాత్రం పోలీసులు నేటికి అరెస్టు చేయలేదు. దీంతో ఈ భ్రూణహత్య కేసులో నేటికి ఏలాంటి పురోగతి లేకపోవడం పోలీసుల తీరుపై విమర్శలు వెలువెత్తుతున్నాయి. ఈ కేసులో ప్రధాన నిందితులుగా ఉన్న వారిని పోలీసులు నేటికి అరెస్టు చేయకపోవడం గమనార్హం. జిల్లా కేంద్రంలోని ఓ మేగ ఆస్పటల్ నిర్వహిస్తున్న ఓ ప్రధాన రాజకీయ పార్టీకి చెందిన మాజీ కౌన్సిలర్ కుమారుడు, పట్టణానికి చెందిన మరో రాజకీయ నాయకుడితో పాటు ఆసుపత్రి వైద్యుడు, సర్వారం, గ్రామాలకు చెందిన గ్రామీణ వైద్యులను, నకిరేకల్ స్కానింగ్ సెంటర్ నిర్వాహకున్ని నేటికి పోలీసులు అరెస్టు చేయకపోవడంపై విమర్శలు వెలువెత్తుతున్నాయి. వారిపై కేసు నమోదై నెల రోజులవుతున్నా పోలీసులు అరెస్టు చేయకపోవడంపై ప్రజలు తప్పుబడుతున్నారు. భ్రూణహత్య కేసులో ప్రధాన నిందితులను పోలీసులు అరెస్టు చేయకపోవడం వెనుక ప్రధాన కారణం రాజకీయ ఒత్తిడేనని తెలుస్తోంది. అందుకే వారిని పోలీసులు నేటికి అదుపులోకి తీసుకోవడంలేదని ప్రజలు చర్చించుకుంటున్నారు. నిందితులు ప్రధా న రాజకీయ పార్టీలో కొనసాగడంతో వారిని నియోజకవర్గ స్థాయి కీలక నాయకులు పోలీసులు అరెస్టు చేయకుండా అడ్డుకుంటున్నట్లు సమాచారం.

**నిందితులను పట్టుకుంటాం : పట్టణ ఇన్‌ఛార్జి సిఐ రాజశేఖర్**

భ్రూణ హత్య కేసులో ప్రధాన నిందితులను పట్టుకుంటామని సూర్యాపేట పట్టణ ఇన్‌ఛార్జి సిఐ రాజశేఖర్ చెప్పారు. ప్రధాన నిందితులను అరెస్టు చేయకపోవడంపై ప్రజాపక్షం వివరణ కొరగా ఇప్పటికే ముగ్గురు నిందితులను అరెస్టు చేసి కోర్టుకు రిమాండ్ చేశామని తెలిపారు. ఈ కేసులో మరో ఐదుగురు అరెస్టు చేయాల్సి ఉందని, వారిని పట్టుకునేందుకు గాలింపు చర్యలు చేపట్టామన్నారు.

# లీల

## ట్రైన్‌లో 'పెద్ది' స్టంట్



గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ హీరోగా తెరకెక్కుతున్న పాన్‌ఇండియా సినిమా 'పెద్ది'. నేషనల్ అవార్డ్ విన్నింగ్ డైరెక్టర్ బుచ్చి బాబు సానా దర్శకత్వం వహిస్తున్నారు. మైత్రి మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో వెంకట సతీష్ కిలారు తన ప్రతిష్ఠాత్మక బ్యానర్ వృద్ధి సినిమాస్ బ్యానర్ పై భారీ స్కేల్‌లో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఇటీవలే చిత్రం యూనిట్, విలేజ్ బ్యాక్ డ్రాప్‌లో ప్రత్యేకంగా నిర్మించిన భారీ సెట్‌లో కీలక సన్నివేశాలతో పాటు ఓ భారీ యాక్షన్ బ్లాక్‌ను పూర్తి చేసింది. ప్రస్తుతం హైదరాబాద్‌లో నిర్మించిన మ్యాసివ్ సెట్‌లో యాక్షన్ సన్నివేశం చిత్రీకరణ జరుగుతోంది. ఇండియన్ యాక్షన్ సినిమాల ప్రమాణాలను పెంచేలా ఉన్న హై ఆక్టేన్, హై బడ్జెట్‌తో రూపొందిన స్టన్నింగ్ ట్రైన్ ఎపిసోడ్ ప్రముఖ ప్రొడక్షన్ డిజైనర్ అవినాష్ కొల్లా అద్భుతంగా ట్రైన్ సెట్‌ని డిజైన్ చేశారు. ఈ ట్రైన్ స్టంట్ కోసం రూపొందించిన సెట్ కన్నులకు పండుగగా ఉండబోతున్నాయి. ఈ ఎపిసోడ్‌లో రామ్ చరణ్ తన కెరీర్‌లోనే అత్యంత రిస్కీ స్టంట్స్ చేస్తున్నారు. ఈ యాక్షన్ ఎపిసోడ్ షూటింగ్ నేటి వరకు కొనసాగనుంది. పుష్ప 2కు పని చేసిన ఫైట్ మాస్టర్ నబా కాంత్ మాస్టర్ ఈ యాక్షన్ సీక్వెన్స్‌కు కొరియోగ్రఫీ వహిస్తున్నారు. మైండ్‌బ్లోయింగ్ యాక్షన్ సీక్వెన్స్ సినిమాలో మేజర్ హైలైట్‌గా ఉండబోతోంది. చిత్రంలో జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, శివరాజ్ కుమార్, జగపతి బాబు, దివ్యేంద్రు శర్మ ఇతర కీలక పాత్రల్లో కనిపించనున్నారు. రత్నవేలు సినిమాటోగ్రఫీ అందిస్తుండగా, ఆస్కార్ అవార్డు విజేత ఏఆర్ రెహ్మాన్ సంగీతం అందిస్తున్నారు. జాతీయ అవార్డు గెలుచుకున్న నవీన్ నూలి ఎడిటర్. వినాష్ కొల్లా ప్రొడక్షన్ డిజైన్ చేశారు. ఈ చిత్రం 2026 మార్చి 27న రామ్ చరణ్ పుట్టినరోజున ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.

## 'రాజా సాబ్' కోసం భారీ హారర్ సెట్



రెబల్ స్టార్ ప్రభాస్, టాలెంటెడ్ డైరెక్టర్ మారుతి, ప్రెస్టీజియస్ ప్రొడక్షన్ హౌస్ పీపుల్ మీడియా ఫ్యాక్టరీ కాంబినేషన్‌లో రూపొందుతున్న క్రేజీ మూవీ 'రాజా సాబ్'. ఈ సినిమా డిసెంబర్ 5న హిందీ, తెలుగు, తమిళ, కన్నడ, మలయాళం.. ఐదు భాషల్లో ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది. 'రాజా సాబ్' సినిమా కోసం వేసిన భారీ హవేలీ సెట్ ప్రధాన ఆకర్షణ కాబోతోంది. 41,256 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఈ సెట్ వేశారు. ప్రముఖ ఆర్ట్ డైరెక్టర్ రాజీవన్ నంబియార్ ఈ రికార్డ్ స్థాయి హవేలీ సెట్‌ను రూపొందించారు. ఇండియన్ ఫిల్మ్ హిస్టరీలో హారర్ మూవీకి ఇంత భారీ సెట్ వేయడం ఇదే ప్రథమం. 'రాజా సాబ్ హవేలీ సెట్ గురించి ఆర్ట్ డైరెక్టర్ రాజీవన్ నంబియార్ మాట్లాడుతూ హవేలీలోని ప్రతి అడుగు ఒక ఎమోషన్ ను వ్యక్తీకరిస్తుంది. చూసేందుకు మాత్రమే హాంటెడ్ హౌస్‌లా ఉండటం కాదు. హాంటెడ్ హౌస్‌లో మనమంతా ఉన్న ఫీల్ కలిగిస్తుంది. ఈ హవేలీ చూస్తుంటే మీకు కథలోకి వెళ్లిన అనుభూతి కలుగుతుంటుంది. హారర్ కామెడీ జానర్‌లో ఎవర్ గ్రీన్ మూవీగా నిలిచిపోయేలా 'రాజా సాబ్'ను సెట్ వేశామని చెప్పారు. ఈ సెట్ లోనే సినిమాకు సంబంధించిన కీలకమైన సన్నివేశాలను చిత్రీకరించామని తెలిపారు. ప్రభాస్ ఇప్పటి దాకా చేయని రొమాంటిక్ హారర్ జానర్‌లో నటిస్తుండటంతో 'రాజా సాబ్' సినిమా మీద భారీ అంచనాలు ఏర్పడుతున్నాయని నిర్మాత టిజి విశ్వప్రసాద్ అన్నారు.

## చిరుతో నయన స్టెప్పులు






మెగాస్టార్ చిరంజీవి హీరోగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న మెగా 157 చిత్రంలో హీరోయిన్‌గా నయన తార ఎంట్రీ ఇచ్చారు. ప్రస్తుతం ముస్సోరిలో షూటింగ్ జరుగుతోంది. చిరంజీవి, నయన తారలపై కీలకమైన సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. సన్నివేశాలతో పాటు చిరంజీవి, నయన తారలపై ఒక పాటను కూడా చిత్రీకరిస్తున్నారు. అనిల్ రావిపూడి తనదైన శైలిలో ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. చిరంజీవి కెరీర్‌లో బ్లాక్ బస్టర్ అయిన ఘరానా మొగుడులో ఉన్నటువంటి షేడ్స్ ఈ సినిమాలో ఉంటాయి. హిలేరియస్ ఎంటర్‌టైన్మెంట్‌తో పాటు ఎమోషన్స్ నేపథ్యంలో సాగే ఫ్యామిలీ డ్రామాగా ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. సాహు గారపాటి, సుస్మిత కొణిదెల నిర్మిస్తున్న ఈ సినిమాకు అర్చన సమర్పకురాలిగా వ్యవహరిస్తున్నారు. ధమాకా, సంక్రాంతికి వస్తున్నాం వంటి సూపర్ డూపర్ హిట్ సినిమాలకు సంగీతం అందించిన భీమ్స్ ఈ సినిమాకు మ్యూజిక్ డైరెక్టర్‌గా పని చేస్తున్నారు. చిరంజీవి మాస్ అప్పీల్‌కు తగినట్టుగా మాస్‌తో పాటు క్లాస్ ఆడియన్స్‌ను ఆకట్టుకునేలా పాటలు కంపోజ్ చేస్తున్నారు. శరవేగంగా షూటింగ్ పూర్తి చేసి వచ్చే యేడాది సంక్రాంతికి ఈ సినిమాను విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు.



## తొలిసారిగా మా బ్యానర్‌లో అన్నా చెల్లెళ్ళ కథ : దిల్ రాజు

శ్రీవేంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై సంక్రాంతికి వస్తున్నాం వంటి బ్లాక్ బస్టర్ తర్వాత తమ్ముడు చిత్రాన్ని మీ ముందుకు తీసుకొస్తున్నాం. ఇప్పటిదాకా మా బ్యానర్‌లో తండ్రీ కొడుకుల సెంటిమెంట్‌తో బొమ్మరిల్లు, అన్నదమ్ముల కథతో సీతమ్మ వాకిట్లో.. వంటి చిత్రాలు రూపొందాయి. ఫస్ట్ టైమ్ బ్రదర్, సిస్టర్ సెంటిమెంట్‌తో తమ్ముడు చిత్రాన్ని రూపొందిస్తున్నాం అని నిర్మాత దిల్ రాజు తెలిపారు. ఈ సినిమా కోసం 80 రోజుల వరకు అడవిలో షూటింగ్ చేశారు. ఆ సీన్స్ అన్నీ స్క్రీన్ మీద కొత్త ఎక్స్‌పీరియన్స్ ఇస్తాయి. సినిమాలో ఏదో వావ్ ఎలిమెంట్ ఉంటే తప్ప మీరు థియేటర్స్‌కు రారు అని తెలుసు. అందుకే ఈ సినిమాను ఎన్నో వావ్ మూవ్ మెంట్స్‌తో రూపొందించాం. నేను మాట ఇస్తున్నా తమ్ముడు సినిమా మీ అందరికీ నచ్చుతుంది. మీకు ఫస్ట్ హాఫ్ ఇచ్చేయండి ఇప్పుడు కూడా దర్శకుడు శ్రీరామ్ వేణు వర్క్ చేస్తున్నాడు అందుకే ఈ ఈవెంట్‌లో షూటింగ్ చేశాం. సెకండ్ ఫ్లో 45 నుంచి 50 మినిట్స్ మరో కొత్త ప్రపంచంలోకి ప్రేక్షకులు వెళ్తారు. అలా మా డైరెక్టర్ డిజైన్ చేశారు. సంక్రాంతికి వస్తున్నాం తర్వాత ఫ్యామిలీస్, యూత్, మాస్, కిడ్స్ అందరూ కలిసి ఎంజాయ్ చేసేలా తమ్ముడు థియేటర్స్ నుంచి బయటకు వచ్చేప్పుడు ఒక మంచి సినిమా చూశామనే ఫీల్ కలుగుతుంది. నితిన్ మా సంస్థలో దిల్, శ్రీనివాస కళ్యాణం తర్వాత చేస్తున్న మూడో చిత్రమిది. నితిన్ హార్డ్ వర్క్ ఈ మూవీలో మరోసారి చూస్తారు. తమ్ముడు ట్రైలర్ వ్యూస్ జెన్యూన్‌గా ఉండాలని చెప్పాను. మా ట్రైలర్‌కు 40 లక్షల జెన్యూన్ వ్యూస్ వచ్చాయి. ఈ మెలోడీ సాంగ్ సినిమాలో మంచి మూవ్ మెంట్‌లో వస్తుంది. ఇది కాకుండా మరో మూడు పాటలు కూడా మీరంతా ఎంజాయ్ చేస్తారు. జూలై 4న ఆడియెన్స్ నుంచి మా మూవీకి వావ్ రియాక్షన్ వస్తుందని ఆశిస్తున్నాం. తమ్ముడు మా బ్యానర్‌కు వ్యాల్యూ పెంచే మరో సినిమా అవుతుంది. ఈ సినిమాను జూలై 4న చేస్తున్నాం అని ఆయన అన్నారు.


## 'తెలుసుకదా' చివరి షెడ్యూల్



సిద్ధు జొన్నలగడ్డ రొమాంటిక్ డ్రామా 'తెలుసు కదా'తో అలరించబోతున్నారు. ఈ మూవీతో ప్రముఖ స్టైలిస్ట్ నీరజా కోన దర్శకురాలిగా పరిచయం అవుతున్నారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టిజి విశ్వ ప్రసాద్, టిజి కృతి ప్రసాద్ నిర్మిస్తున్నారు. సిద్ధు జొన్నలగడ్డ సరసన రాశి ఖన్నా, శ్రీనిధి శెట్టి కథానాయికలుగా నటిస్తున్నారు.ఈ మూవీ చివరి షూటింగ్ షెడ్యూల్ బుధవారం ప్రారంభమైంది. హైదరాబాద్‌లో ప్రత్యేకంగా నిర్మించిన సెట్‌లో చివరి షెడ్యూల్ జరుగుతోంది. సిద్ధు జొన్నలగడ్డ, రాశి ఖన్నా, శ్రీనిధి శెట్టిలపై కొన్ని కీలకమైన సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. దీనితో సినిమా మొత్తం షూటింగ్ పూర్తవుతుంది. మరోవైపు సినిమాకు సంబంధించిన డబ్బింగ్ పనులు కూడా జరుగుతున్నాయి. ఈ నెలలో ఈ సినిమా మొదటి పాటను విడుదల చేసి మ్యూజిక్ ప్రమోషన్స్ ప్రారంభించనున్నారు. ఈ సినిమా ఈ ఏడాది దీపావళి పండుగ సందర్భంగా అక్టోబర్ 17న విడుదల కావడానికి సన్నాహాలు చేస్తున్నారు.

సిద్ధార్థ్ హీరోగా తమిళంలో నిర్మించిన 3బిహెచ్‌కే సినిమాను తెలుగులో విడుదల చేయనున్నారు. ఈ సినిమా కోసం సిద్ధార్థ్ తెలుగులో డబ్బింగ్ చెప్తున్నారు. అన్ని పనులు పూర్తి చేసి జూలై 4వ తేదీన సినిమా విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు.

## డబ్బింగ్‌లో 3బిహెచ్‌కె



శరత్ కుమార్, దేవయాని కీలకమైన పాత్రను పోషిస్తున్నారు. సిద్ధార్థ్ సరసన క్రితిక నటిస్తున్నారు. ఇప్పటి వరకు తాను చేసిన సినిమాలకు ఈ సినిమా భిన్నంగా ఉంటుందని సిద్దార్థ్ చెప్పారు. క్రైం నేపథ్యంలో సాగే కథాంశమని సిద్దార్థ్ తెలిపారు.

## కాంతారావు కుమారుడికి ఆర్థిక సహాయం



తెలంగాణ గద్దర్ ఫిలిం అవార్డులో భాగంగా తెలంగాణ ప్రభుత్వం రఘుపతి వెంకయ్య అవార్డు యండమూరి వీరేంద్రనాథ్‌కు ఇచ్చిన సంగతి తెలిసిందే. తెలంగాణ ప్రభుత్వం తొలిసారిగా సినిమా అవార్డులతో పాటు సినిమా ప్రముఖుల పేరిట ఆరు అవార్డులను ఇచ్చింది. రఘుపతి వెంకయ్య ఫిలిం అవార్డుతో రచయిత యండమూరి వీరేంద్రనాథ్‌ను ప్రభుత్వం సత్కరించింది. అయితే ఈ అవార్డుతో ప్రభుత్వం ఇచ్చిన నగదు లోంచి లక్ష రూపాయలను కాంతారావు కుమారుడు రాజాకు ఆర్థిక సహాయం చేశారు. లక్ష రూపాయల చెక్‌ను రాజాకు అందజేశారు.

## కుబేరకు 'యుఏ' సర్టిఫికెట్




ధనుష్, నాగార్జున ప్రధాన పాత్రలో శేఖర్ కమ్ముల దర్శకత్వంలో తెరకెక్కిన కుబేర సినిమా సెన్సార్ కార్యక్రమాలు పూర్తి చేసుకుంది. ఈ సినిమాకు యుఏ సర్టిఫికెట్ లభించింది. లవ్, ఎమోషన్ డ్రామాగా ఈ సినిమాను తెరకెక్కించారు పేదవాడైనా, కుబేరుడైనా ఎవరి స్థాయిలో వారికి అప్పులు, సమస్యలు ఉంటాయి. వాటిని ఎలా అధిగమిస్తారు. ఎలాంటి సమస్యలను ఎదుర్కొంటారు వంటి అంశాలను ఇతివృత్తంగా తీసుకుని నిర్మించిన సినిమా అని దర్శకుడు శేఖర్ కమ్ముల తెలిపారు. 181నిమిషాల నిడివి గల ఈ సినిమాలో సమాజంలో కనిపించే పాత్రలు ఇందులో కనిపిస్తాయని అన్నారు. ప్రతి పాత్రకు ఒక గుర్తింపు ఉంటుందన్నారు. ఇంతవరకు తాను చేసిన సినిమాలకు ఇది వైవిధ్యమైన కథ అని అన్నారు. అయితే ఎమోషన్ డ్రామాగా తెరకెక్కించామన్నారు. సెన్సార్ పూర్తయిన ఈ సినిమాను 20వ తేదీన విడుదల చేయనున్నారు. ధనుష్ సరసన రష్మిక మందాన హీరోయిన్‌గా నటిస్తోంది. ఎస్‌విసిఎల్ఎల్‌పి బ్యానర్‌పై ఏషియన్ సునీల్, పుష్కర్ రామ్మోహన్ రావు ఈ సినిమాను నిర్మించారు.

## ఎపిలో ఎన్‌కౌంటర్

(మొదటి పేజీ తరువాయి)

ఉరఫ్ రూపి విశాఖ జిల్లా దెందుర్తి మండలం కరకవానిపాలెం గ్రామానికి చెందినది. ఈమె కూడా ఆంధ్రా, ఒడిశా బోర్డర్ స్పెషల్ జోన్ సభ్యులుగా కొనసాగుతున్నారు. ఈమెపై రూ.20 లక్షల రివార్డు ఉంది. గతంలో చంద్రబాబుపై అలిపిరి వద్ద జరిగిన ఘటనలో కీలక భూమిక పోషించిన చలపతిరావు అరుణ భర్త. ఆయన శ్రీకాకుళం వద్ద జరిగిన ఎదురు కాల్పుల్లో గతంలో మరణించాడు. అరుణ తమ్ముడు కూడా పాల సముద్రం ఎన్‌కౌంటర్‌లో మరణించాడు. అరుణ తల్లి కూడా మావోయిస్టు నేత కావడం గమనార్హం. అరుణ గతంలో విశాఖ జిల్లాకు చెందిన శాసనసభ్యుడు కె.సర్వేశ్వరరావు హత్యతో పాటు మరికొన్ని హింసాత్మక ఘటనల్లో పాలుపంచుకున్నట్లు పోలీసులు తెలిపారు. మరోక మృతదేహాన్ని గుర్తించాల్సి ఉంది. మావోయిస్టు అగ్ర నేత గాజర్ల రవి అలియాస్ గణేశ్.. మృతి చెందాడన్న విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు, బంధుమిత్రులు శోకసంద్రంలో మునిగారు.

**ఉత్తర తెలంగాణ స్పెషల్ జోనల్ కమిటీ కార్యదర్శి హోదాలో శాంతి చర్చలకు**

గాజర్ల రవి అలియాస్ గణేశ్ స్వస్థలం భూపాలపల్లి జిల్లా వెలిశాల. ఆయన సోదరులు ఆజాద్, అశోక్ (ఐతు) కూడా మావోయిస్టు పార్టీలో పని చేశారు. సోదరుడు ఆజాద్ గతంలో జరిగిన ఓ ఎన్‌కౌంటర్‌లో మృతి చెందగా.. మరో సోదరుడు అశోక్ కొన్నాళ్ల క్రితం పోలీసుల ఎదుట సరెండర్ అయ్యాడు. ప్రస్తుతం అధికార కాంగ్రెస్ పార్టీలో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నాడు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2004, అక్టోబర్‌లో జరిపిన శాంతి చర్చల్లో మావోయిస్టు పార్టీ తరపున ప్రతినిధిగా ఉత్తర తెలంగాణ స్పెషల్ జోనల్ కమిటీ కార్యదర్శి హోదాలో గాజర్ల రవి అలియాస్ గణేశ్ అలియాస్ ఉదయ్ పాల్గొన్నారు. ఆ శాంతి చర్చల ఎజెండాను తయారు చేయడంలో కామ్రేడ్ గాజర్ల రవి కీలక పాత్ర పోషించారు.

**ముగిసిన 35 ఏళ్ల మావోయిస్ట్ ఉద్యమ ప్రస్థానం**

గాజార్ల రవి గత 35 సంవత్సరాల క్రితం తన అన్న సారయ్య, అలియాస్ ఆజాద్‌తో కలిసి పార్టీలో చేరాడు. కాగా, అన్నల బాటలోనే తన చిన్న తమ్ముడు అశోక్ సైతం మావోయిస్టు పార్టీలో చేరారు. అన్న ఆజాద్ ఎన్‌కౌంటర్‌లో అమృతి చెందగా తమ్ముడు అశోక్ లొంగిపోయాడు. ప్రస్తుతం ప్రజాక్షేత్రంలో ఎన్నికల రాజకీయల్లో ప్రజల పక్షపాతిగా ముందుకు సాగుతున్నారు. బుధవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో గాజర్ల రవి మృతి చెందటంతో భూపాలపల్లి జిల్లా ఉమ్మడి చిట్యాల మండలం ప్రస్తుతం టెకుమట్ల మండలంలోని వెలిశాలలో విషాద ఛాయలు అమలుకున్నాయి. దీంతో గాజర్ల రవి నాలుగు దశాబ్దాల మావోయిస్ట్ ఉద్యమ ప్రస్థానం ముగిసిందని పలువురు చర్చించుకుంటున్నారు. మావోయిస్టు ఉద్యమానికి బలమైన నాయకత్వాన్ని అందించిన గాజర్ల కుటుంబమని ప్రజల వ్యాఖ్యానిస్తున్నారు.

## లొంగిపోయే మనస్తత్వం కాదు

(మొదటి పేజీ తరువాయి)

వ్యతిరేకంగా అమెరికా ప్రత్యక్షంగా రంగంలోకి దిగితే సంపూర్ణయుద్ధానికి తెరలేస్తుందని హెచ్చరించారు. ఇరాన్ విదేశాంగ మంత్రిత్వశాఖ అధికార ప్రతినిధి ఎస్మాయిల్ బాఘాయీ ఒక ప్రకటన చేస్తూ, ఇరాన్ ఆయుధాలకు అందుబాటులో ఉన్న పొరుగుదేశాలలో వేలాదిమంది అమెరికా సైన్యం స్థావరాల్లో సిద్ధంగా ఉందని చెప్పారు.

**ఇజ్రాయెల్ దాడులు ఆపేస్తే దౌత్య చర్యలు : ఇరాన్**

ఇజ్రాయెల్ చేస్తున్న మెరుపుదాడులు, దురాక్రమణ చర్యలు మానవాళిచేస్తున్న యుద్ధమేనని ఐక్యరాజ్యసమితిలో ఇరాన్ దౌత్యవేత్త అలీ బహ్రైనీ జెనీవాలో విమర్శించారు. ఇజ్రాయెల్‌–అమెరికా సైన్యాలు చేసే ఎలాటి దురాక్రమణ చర్యలకైనా బలమైన సమాధానం చెబుతామన్నారు. ఇజ్రాయెల్ గనుక దాడులు ఆపేస్తే తమదేశం దౌత్య చర్యలకు సిద్ధపడగలదని చెప్పారు. ఇరాన్ అణుకేంద్రాల గురించి ఇజ్రాయెల్ చేస్తున్న ప్రచారాన్ని ఆయన కొట్టిపారేశారు. తమ అణుకేంద్రాలకు ఎలాంటి నష్టం వాటిల్లలేదనీ, ఎందుకంటే వాటి రక్షణకు కావాల్సిన ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నామని చెప్పారు. అణ్వాయుధాన్ని తయారుచేయాలనే ఉద్దేశం ఇరాన్‌కు లేదని ఆయన స్పష్టం చేశారు. ఐతే శాంతియుత ప్రయోజనాలకోసం ఎంతకాలం అవసరమైతే అంతకాలం కూడా యురేనియంను శుద్ధిచేస్తూనే ఉంటామని స్పష్టం చేశారు. ఐక్యరాజ్యసమితి మానవహక్కుల మండలి సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఉద్దేశపూర్వకంగా ఇరాన్ అణుకేంద్రాలను లక్ష్యంగా చేసుకుని ఇజ్రాయెల్ దాడులు చేయడం అంతర్జాతీయ చట్టాలకు, ఐక్యరాజ్యసమితి ఛార్టర్ నిబంధనలకు పూర్తి విరుద్ధమన్నారు. ప్రజలను ప్రమాదంలో పడేస్తున్న ఈ దాడులు అంతర్జాతీయ చట్టాల ఉల్లంఘన చర్యేనన్నారు. పొరుగుదేశాకు కూడా ఈ దాడులు నష్టం చేస్తాయన్నారు. ఈవిషయంలో ఏ దేశం పెదవి విప్పడంలేదని ఆయన విమర్శించారు. మానవహక్కుల పరిరక్షణలో తమను మించినవారు లేరని భుజాలు చరుచుకునే దేశాలు ఇప్పుడు ఎందుకు నోరు మెదపడంలేదని ఆయన ప్రశ్నించారు. ప్రపంచంలో ముఖ్యంగా పశ్చిమ దేశాల్లో 'ఇస్లామాఫోబియా విపరీతంగా పెరుగుతోందని ఆయన గతం నుండీ పలుప్రకటనలు చేశారు. జెనీవాలో గడచిన మార్చి 25వ తేదీన జరిగిన ఇస్లామాఫోబియా వ్యతిరేక దినం సందర్భంగా కూడా ఆయన ఒక ప్రకటన చేశారు. ముస్లిమేతర సమాజాలలో చాలా బలంగా ఇస్లాం వ్యాప్తి చెందుతుంటే సహించలేక పోతున్నారని ఆయన అన్నారు. ఈ వ్యతిరేకత ఇదేవిధంగా కొనసాగితే అది చివరకు ద్వేషంగా, దీర్ఘకాల శత్రుత్వంగా మారుతుందన్నారు.

## 28న పిజెఆర్ ఫ్లైఓవర్ ప్రారంభం

### మేయర్ గద్వాల్ విజయలక్ష్మి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కొండాపూర్ నుండి గచ్చిబౌలి రహదారిని అనుసంధానం చేసేందుకు నిర్మించిన పిజెఆర్ (పి.జనార్ధన్ రెడ్డి) ఫ్లైఓవర్‌ను 28న సాయంత్రం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించనున్నారు. ప్రముఖ రాజకీయ నాయకుడు, ప్రజా సేవకుడు దివంగత పి.జనార్ధన్ రెడ్డి జ్ఞాపకార్థంగా, ముఖ్యమంత్రి ఫ్లైఓవర్‌కు పిజెఆర్ ఫ్లైఓవర్ అని పేరు పెట్టాలని సూచించారు. ప్రారంభోత్సవానికి ముందే పెయింటింగ్, సుందరీకరణతో సహా అన్ని పనులను పూర్తి చేయాలని మేయర్ గద్వాల్ విజయలక్ష్మి జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్‌ను ఆదేశించారు. ఈ కీలకమైన మౌలిక సదుపాయాల ప్రాజెక్ట్ ట్రాఫిక్ రద్దీని గణనీయంగా తగ్గిస్తుందన్నారు. ప్రయాణికులకు వేగవంతమైన ప్రయాణ సౌకర్యాన్ని అందిస్తుందన్నారు. హైదరాబాద్ పౌరులకు ప్రయోజనం చేకూర్చే నాణ్యమైన మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను అందించడానికి జిహెచ్‌ఎంసి కట్టుబడి ఉందని మేయర్ తెలిపారు.

## సైనికచర్య ఆపేశాం

(మొదటి పేజీ తరువాయి)

ఫోన్ సంభాషణలో ప్రధానంగా చోటుచేసుకున్నాయని మిస్రి చెప్పారు. 'భారత్–పాకిస్థాన్‌కు సంబంధించిన ఈ మొత్తం పరిణామాలలో ఏ సందర్భంలోనూ భారత్–అమెరికా వాణిజ్య ఒప్పందం గురించి ఏ స్థాయిలోనూ, ఎ చర్చల్లోనూ ప్రస్తావన రాలేదని, తమ రెండు దేశాల మధ్యా అమెరికా మధ్యవర్తిత్వం గురించిన ఎలాంటి ప్రతిపాదన కూడా రాలేదని ట్రంప్‌కు మోదీ ఫోన్ సంభాషణలో చాలా స్పష్టంగా తెలియజేశారని మిస్రి చెప్పారు. 'సైనిక చర్యలు ముగించాలన్న చర్చ నేరుగా భారత్–పాకిస్థాన్‌లమధ్య రెండు దేశాల సాయుధబలగాల ఉన్నతాధికారుల ద్వారా జరిగింది, పాకిస్థాన్ వైపునుండే ఈ ప్రతిపాదన వచ్చింది, ఆ దేశమే చొరవ తీసుకుని కాల్పుల విరమణకు ప్రతిపాదించింది, ఆ దేశం విజ్ఞప్తి మేరకు సంప్రదింపులు జరిగాయి' అని మోదీ చెప్పారన్నారు. వారిద్దరిమధ్య సంభాషణలో కీలక విషయాలను మిస్రి తన ప్రకటనలో తెలియజేశారు. పహల్గామ్‌లో దాడి తర్వాత భారతదేశం యావత్ ప్రపంచానికీ ఉగ్రవాదంపై చేపట్టే కార్యాచరణ ఏమిటో తెలియజేయాలని నిశ్చయించుకుందని ఆ మేరకు చర్యలు తీసుకుందని ట్రంప్‌కు చెప్పారన్నారు. పాకిస్థాన్,లో పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీరు భూభాగంలో ఉన్న ఉగ్రవాదుల రక్షణ కేంద్రాలపై భారతసైన్యం లక్ష్యంగా చేసుకుని దాడులు చేసిందని మోదీ ఆయనకు తెలియజేశారన్నారు. ఇకమీదట పాకిస్థాన్ వైపు నుండి ఎలాంటి దురాక్రమణ చర్యలు జరిగినాగానీ చాలా బలమైన, కఠినమైన ప్రతిస్పందన తమదేశం నుండి ఉంటుందని చెప్పారన్నారు. మే తొమ్మిదో తేదీన రాత్రి అమెరికా ఉపాధ్యక్షుడు జె.డి.వాన్స్ నరేంద్రమోదీకి ఒక ఫోన్‌కాల్ చేశారు. భారత్‌పై పాకిస్థాన్ భారీదాడి చేసే అవకాశం ఉందని ఆయన చెప్పారని మిస్రి అన్నారు. అలాంటి దాడి ఏదైనా జరిగితే భారతదేశం ఇంకా చాలా బలంగా ఎదురుదాడి చేస్తుందని జె.డి.వాన్స్‌కు తెలియజేశారని అన్నారు. పాకిస్థాన్ దాడికి ప్రతిగా మే 9,10 తేదీలలో రాత్రిపూట భారతదేశం చాలా నిర్ణయాత్మకమైన దాడులు చేసిందని, పాకిస్థాన్ సైన్యానికి తీవ్రనష్టం కలిగించిందని ట్రంప్‌కు చెప్పారన్నారు. భారత్ చర్యలవల్ల పాకిస్థాన్ సైనికస్థావరాలు ఎందుకూ పనికిరాకుండాపోయాయన్నారు. కెనడా వెళ్ళే మార్గంలో అమెరికాలో ఆగే అవకాశం ఉందా? అని ట్రంప్ అడిగారని, కానీ ముందస్తు కార్యక్రమాల రీత్యా తాను అమెరికాలో ఆగడంలేదని మోదీ ఆయనకు తెలియజేశారని మిస్రి చెప్పారు. అదేవిధంగా ఇరాన్–ఇజ్రాయెల్ మధ్య యుద్ధ పరిణామాల గురించి కూడా వారిద్దరూ మాట్లాడుకున్నారని చెప్పారు. అదేవిధంగా రష్యా–ఉక్రేన్ యుద్ధంలో శాంతిసాధనకు రెండు దేశాల నాయకులూ అంగీకరించారని మిస్రి చెప్పారు. ఆ రెండు దేశాలూ చర్చలు చేసేందుకు వీలైన వాతావరణం కల్పించాల్సిన అవసరం ఉందని నాయకులిద్దరూ భావించారన్నారు. ఇండో–పసిఫిక్ రీజియన్‌కు సంబంధించి అభిప్రాయాలను పరస్పరం మార్పిడి చేసుకున్నారు. రాబోయే క్వాడ్ శిఖరాగ్ర సదస్సు సందర్భంగా భారత్‌లో పర్యటించాలని ట్రంప్‌ను మోదీ ఆహ్వానించారని మిస్రి చెప్పారు.

భారత్ చేసిన ఈ ప్రకటనపై వైట్‌హౌస్ నుండి ఎలాంటి ప్రతిస్పందనా రాలేదు. భారత్–పాకిస్థాన్ దేశాలమధ్య సమస్యల పరిష్కారానికి మధ్యవర్తిత్వాన్ని భారతదేశం ఎన్నటికీ, ఎప్పటికీ అంగీకరించబోదని ట్రంప్‌కు నరేంద్రమోదీ టెలిఫోన్ సంభాషణ సందర్భంగా నిర్ద్వంద్వంగా తెలియజేశారని విక్రమ్ మిస్రీ ప్రకటించారు. ఆపరేషన్ సింధూర్ తర్వాత నాలుగురోజులపాటు రెండు దేశాలమధ్యా సైనిక చర్యలు జరిగాయని, ఐతే తర్వాత పాకిస్థాన్ తనంతటతానుగా స్వయంగా చేసిన విజ్ఞప్తి మేరకు, ఆ దేశం చూపించిన చొరవ మేరకు రెండు దేశాల డిజిఎంఒలమధ్య సంభాషణల ప్రకారం కాల్పుల విరమణ అవగాహన కుదిరిందని ట్రంప్‌కు మోదీ తెలియజేశారని మిస్రీ చెప్పారు. ఉగ్రవాదాన్ని ఇకమీదట భారతదేశం ప్రచ్ఛన్నయుద్ధంగా పరిగణించబోదనీ, సరిహద్దులలోంచి ఎగదోసే ఉగ్రవాదాన్ని ఒకమీదట యుద్ధంగానే భారతదేశం పరిగణిస్తుందని, భారత ప్రభుత్వం ఆపరేషన్ సింధూర్‌ను ఇప్పటికీ ఇంకా కొనసాగిస్తోందని ట్రంప్‌కు ప్రధానమంత్రి తెలియజేశారని మిస్రీ ఆ ప్రకటనలో చెప్పారు. భారత్–పాకిస్థాన్ మధ్య మే ఏడో తేదీ నుండి పదో తేదీ వరకూ సైనిక చర్యలు కొనసాగాయి. మే 10వ తేదీ మధ్యాహ్నం 3.35 గంటలకు రెండు దేశాల డిజిఎంఒలమధ్యా ఫోన్ సంభాషణ జరిగింది. కానీ కాల్పుల విరమణకు భారత్–పాకిస్థాన్ దేశాలు అంగీకరించాయని డోనాల్డ్ ట్రంప్ అందరికంటే ముందుగా ప్రకటించారు.

ఈ ఏడాది ఏప్రిల్‌నెల 22వ తేదీన దక్షిణ కశ్మీర్ పహల్గామ్‌లో పాకిస్థానీ ఉగ్రవాదుల కాల్పుల్లో 26 మంది భారత పర్యాటకులు మరణించిన తర్వాత మే ఏడవతేదీన తెల్లారకముందుగానే పాకిస్థాన్, పాకిస్థాన్ ఆక్రమిత భూభాగాలలో ఉన్న ఉగ్రవాదులకు చెందిన లక్ష్యాలపై భారతసైన్యం దాడులు చేసింది. 100మంది పైగా ఉగ్రవాదులు ఈ దాడుల్లో మరణించారు. తర్వాత రెండు దేశాల మధ్యా నాలుగురోజులపాటు సైనిక దాడులు జరిగాయి. ఈ రెండు దేశాలూ యుద్ధం విరమించడానికి తానే మధ్యవర్తిత్వం చేశాననీ, రెండు దేశాలూ యుద్ధం విరమించాయనీ డోనాల్డ్ ట్రంప్ మొట్టమొదట తన ట్రూత్ సోషల్ మీడియా వేదికపై ప్రకటించారు. ఆ తర్వాతే భారత విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రి పత్రికాగోష్ఠిలో సైనికచర్య విరమణకు ఒప్పందం కుదిరినట్లు ప్రకటించారు. కాల్పుల విరమణకు అంగీకరించకపోతే ఈ రెండు దేశాలతో వాణిజ్యాన్ని నిలిపివేస్తానని బెదిరించి మధ్యవర్తిత్వంతో అంగీకారం కుదిర్చామని ట్రంప్ తన సోషల్ మీడియా వేదిక ద్వారా ప్రచారం చేసుకున్నారు. ఆయన ప్రపంచవేదికలపై అనేకచోట్ల అనేకసార్లు ఈ విషయం ప్రస్తావించారు. దీంతో దేశంలో మోదీ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చెలరేగాయి. భారత విదేశాంగ విధానాన్ని మోదీ అమెరికాకు తాకట్టుపెట్టారని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి. ఈ వ్యతిరేక పరిణామాల మధ్య ట్రంప్‌తో మోదీ ఫోన్ సంభాషణ గురించి మిస్త్రీ ప్రకటించారు. అదేవిధంగా జి–7 సదస్సుకు కెనడా వెళుతూ మార్గమధ్యలో అమెరికాలో ఆగాలని ట్రంప్ చేసిన విజ్ఞప్తిని కూడా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తిరస్కరించారు.

### ట్రంప్ మళ్ళీ అదేపాట

మోదీతో టెలిఫోన్ సంభాషణ అనంతరం కూడా డోనాల్డ్ ట్రంప్ వైఖరి మారలేదు. ఆయన మళ్ళీ అదేపాట అందుకున్నారు. తన మధ్యవర్తిత్వం ద్వారానే భారత్–పాకిస్థాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం జరిగిందని బుధవారంనాడు మరోసారి ప్రకటించారు. 35 నిమిషాలసేపు ట్రంప్‌తో ఫోన్ సంభాషణలో ఎలాంటి మధ్యవర్తిత్వం లేకుండానే భారత్–పాకిస్థాన్‌లు కాల్పుల విరమణ అవగాహనకు వచ్చాయని మోదీ చెప్పారు. 'మోదీ ఒక అద్భుతమైన మనిషి' అని ట్రంప్ పునరుద్ఘాటించారు. పాత్రికేయులతో ట్రంప్ మాట్లాడుతూ, రెండు దేశాలమధ్యా వాణిజ్య ఒప్పందం జరుగుతుందన్నారు. 'నేను యుద్ధాన్ని ఆపాను, నేను పాకిస్థాన్‌ను ప్రేమిస్తాను, నా ఉద్దేశం ప్రకారం మోదీ ఒక అద్భుతమైన మనిషి, గత రాత్రి నేను ఆయనతో మాట్లాడాను, మోదీ ఆఫ్ ఇండియాతో మేం ఒక వాణిజ్య ఒప్పంద చేసుకోబోతున్నాం, కానీ భారత్–పాకిస్థాన్ మ ధ్య మే నెల రెండో వారంలో యుద్ధాన్ని నేనే ఆపాను' అని చెప్పా రు. పాకిస్థాన్ ఆర్మీ ఛీఫ్ మునీర్‌కు బుధవారం మధ్యాహ్న విందు ఇవ్వడానికి ముందు ఆయన మాట్లాడారు. మునీర్ గురించి మా ట్లాడుతూ, 'ఈ వ్యక్తి పాకిస్థాన్ వైపు నుండి యుద్ధాన్ని ఆపారు, ఆ యన చాలా ప్రభావవంతమైన మనిషి' అని చెప్పారు. 'భారత్‌వైపు నుండి మోదీ, ఇతరులు ప్రభావం చూపించారు. ఈ రెండు దేశా లూ అణుశక్తి సామర్థ్యాలుగల దేశాలు, నేను వారిని అడ్డుకున్నాను, నేను కథలు చెప్పడం లేదు, రాయడానికి నా దగ్గర కథ లేదు, ఈ రెండు ప్రధాన అణ్వస్త్ర దేశాలమధ్య యుద్ధాన్ని నేను ఆపాను, దీనికి సంబంధించి నేనేమీ కథ రాశానని అనుకోవడం లేదు, అందరికీ ఈ విషయం తెలుసు' అని ట్రంప్ అన్నారు.

**పాకిస్థాన్ సైన్యాధిపతి ఆసిఫ్ మునీర్‌కు ట్రంప్ లంచ్**

పాకిస్థాన్ సైన్యం ప్రధానాధిపతి ఫీల్డ్ మార్షల్ ఆసిఫ్ మునీర్‌కు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ విందు ఇచ్చారు! బుధవారం మధ్యాహ్నం మునీర్‌ను ట్రంప్ మధ్యాహ్న భోజనవిందుకు ఆహ్వానించారు. భారతకాలమాన ప్రకారం బుధవారం రాత్రి 10.30 గంటలకు ట్రంప్ ఆయనతో లంచ్ సమావేశం జరిపారు. వైట్‌హౌస్‌లోని క్యాబినెట్ రూమ్‌లో ఈ మధ్యాహ్న విందు ఏర్పాటు చేశారని వార్తలు వెలువడ్డాయి. ఐతే ఈ సందర్భంగా వారిద్దరిమధ్య ఎలాంటి సంభాషణ జరిగిందన్న సమాచారం ఇంకా పూర్తిగా తెలియవలసి ఉంది. 'ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ పాకిస్థాన్ ఆర్మీస్టాఫ్ ఛీఫ్‌తో అధ్యక్షుడు లంచ్ చేస్తారు' అని లంచ్‌కు గంటన్నర ముందుగా వైట్‌హౌస్ ప్రకటన విడుదల చేసింది. జి–7 సదస్సుకు వెళ్ళిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మధ్యప్రాచ్యంలో పరిణామాలు, ఉద్రిక్తతల నేపథ్యంలో తన పర్యటనను కుదించుకుని ఒకరోజు ముందుగానే మంగళవారం ఉదయానికల్లా వాషింగ్టన్‌కు చేరుకున్నారు. కాగా పాకిస్థాన్‌లో ఉన్నతాధికారులు ఈ లంచ్ సమావేశాన్ని అతిపెద్ద దౌత్యపరమైన విజయంగా ప్రకటించుకుంటున్నారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at D.No 1- 6-75, Suravaram Venkataram Reddy Bhavan, Subhashnagar, Mahabubnagar - 509001, Telangana State, RNI TELTEL /2018/76758 **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com